ఈనాడు Epratibha
టార్గెట్ ఏపీపీఎస్సీ
ప్రణాళికతో పఠనం.. ఉద్యోగానికి సోపానం!
■ వీడియో పాఠాలు ■ ఈ-బుక్స్ ■ ప్రాక్టీస్ టెస్ట్స్
■ కరెంట్ అఫైర్స్ ■ రియల్ టైం ఆన్‌లైన్ గ్రాండ్ టెస్ట్స్
SCAN HERE
www.epratibha.net 8008001640

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 22-1-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 162

రూ. 6-50 పేజీలు 12

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

Land your DREAM JOB
ఈనాడు APPOINTMENTS
ప్రతీ మంగళవారం & శుక్రవారం

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే రాజధాని అమరావతి బిల్లు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే ప్రక్రియ ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సంబంధిత బిల్లును పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ కసరత్తు చేస్తోంది. ముసాయిదా క్యాబినెట్ నోట్‌ను కేంద్ర గృహ నిర్మాణ-పట్టణాభివృద్ధి, న్యాయ, వ్యయ శాఖలతో పాటు, నీతి ఆయోగ్‌లకు పంపి, అభిప్రాయం కోరింది. న్యాయశాఖ ఇప్పటికే అభిప్రాయం తెలియజేసిందని సమాచారం. ముసాయిదా నోట్‌పై త్వరగా అభిప్రాయం తెలియజేయాలని మిగతా శాఖలకూ హోం మంత్రిత్వశాఖ సూచించినట్లు తెలిసింది. కేంద్ర మంత్రివర్గం ఆమోదం తర్వాత... న్యాయశాఖ బిల్లు సిద్ధం చేస్తుంది. మళ్లీ దాన్ని క్యాబినెట్ ఆమోదించాక, పార్లమెంటులో ప్రవేశపెడతారు. విభజన చట్టం ప్రకారం (మిగతా 3లో)

నాసా నుంచి పదవీ విరమణ చేసిన సునీతా విలియమ్స్

కేప్ కెనావెరల్: భారతీయ సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ (60) పదవీ విరమణ చేసినట్లు అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించింది. గత డిసెంబరు 27న ఆమె పదవీ విరమణ చేసినట్లు సంస్థ అధికారికంగా వెల్లడించింది. 27 సంవత్సరాలకు పైగా నాసా కోసం పనిచేసిన సునీత మూడు సార్లు అంతరిక్ష యాత్ర చేశారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న ఆమె తన సుదీర్ఘ వృత్తి జీవితంలో 608 రోజుల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో బసచేసి అత్యధిక కాలం అంతరిక్షయానం చేసిన వ్యోమగాముల జాబితాలో చేరారు. దాదాపు మూడు దశాబ్దాలు పనిచేసి పదవీ విరమణ చేసిన సునీతకు నాసా కొత్త పరిపాలనాధికారి జారెడ్ ఇసాక్‌మన్ శుభాకాంక్షలు తెలిపారు. (మిగతా 3లో)

పట్టణప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువల పెంపు

● ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి

ఈనాడు, అమరావతి: పట్టణ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సవరించిన మార్కెట్ విలువల్ని ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి తేవాలని ఆదేశించింది. నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో ఏటా, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకోసారి, నిర్మాణ విలువలైతే ఏటా పెంచుకునే వీలుంది. కూటమి అధికారంలోకి వచ్చాక గతేడాది ఫిబ్రవరిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూముల విలువలు సవరించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా పెంచగా.. వాటిని కొన్నిచోట్ల తగ్గించారు. మరికొన్నిచోట్ల యథాతథస్థితిని కొనసాగించారు. (మిగతా 3లో)

పారిశ్రామికవేత్తలకు రియల్‌టైంలో అనుమతులు

ఆర్సెలార్ మిత్తల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిత్తల్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి లోకేశ్, సంస్థ సీఈవో ఆదిత్య మిత్తల్

ఏపీకి బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చాం

పెట్టుబడులతో అభివృద్ధి.. దాంతోనే సంక్షేమం సాధ్యం

జాతీయ, అంతర్జాతీయ మీడియాతో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే సంస్థలకు అనుమతుల నుంచి పరిశ్రమల స్థాపన వరకూ ప్రతి అంశాన్నీ రియల్‌టైంలో పర్యవేక్షిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో పెట్టుబడుల ప్రతిపాదనలకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలకు ఎస్క్రో ఖాతా ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తున్నామని అన్నారు. దావోస్‌లో మూడోరోజు వివిధ జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. సీఎం మాట్లాడుతూ.. "ఏపీలో అమలుచేస్తున్న విధానాలు.. ఆలోచనలు.. వేగంగా తీసుకుంటున్న నిర్ణయాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తోంది. రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ వస్తే పెట్టుబడులు వస్తాయి. వాటిద్వారా అభివృద్ధి సాధ్యం అవుతుంది. అభివృద్ధి జరిగితే పేదలకు సంక్షేమం అందించొచ్చు. రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ తెచ్చేందుకు ప్రపంచ ఆర్థిక సదస్సును ఉపయోగించుకుంటున్నాను. పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు వివిధ రంగాల్లో వస్తున్న వినూత్న పరిణామాలను గమనించడానికి ఈ సదస్సు అద్భుత వేదిక. గతంలో డబుల్ డిజిట్ గ్రోత్ అంటే నమ్మలేదు. ఇప్పుడు అదే నిజమైంది' అని పేర్కొన్నారు.

భారీ లక్ష్యాలు.. సాధనకు యత్నాలు

'విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ రావడం రాష్ట్రాభివృద్ధిలో గొప్ప ముందడుగు. ఐటీ మంత్రి లోకేశ్ చొరవ, (మిగతా 3లో)

15 తర్వాత ఆర్సెలార్ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన

దావోస్‌లో సంస్థ ప్రతినిధులతో సీఎం భేటీ

ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతులపై అధికారులతో సమీక్ష

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమకు ఫిబ్రవరి 15 తర్వాత శంకుస్థాపన చేయాలని నిర్ణయించినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ, అనుమతులు అప్పటిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దావోస్‌లో ఏపీ లాంజ్‌లో సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ (మిగతా 3లో)

విశాఖలో స్కిల్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేయండి

రాయలసీమలో సౌర, పవన హైబ్రిడ్ ప్రాజెక్టులు పెట్టండి 12లో

దావోస్ భేటీల్లో ఆయా కంపెనీల ప్రతినిధులను కోరిన మంత్రి లోకేశ్

అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలను రీ కాల్ చేయాలి

ఆ హక్కును ప్రజలకు కల్పించాలి

విధులు నిర్వర్తించని వారికి వేతనాల్లో కోత పెట్టాలి

చట్టసభల సభాపతుల 86వ అఖిలభారత మహాసభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

స్పీకర్ల మహాసభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు. చిత్రంలో ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

ఈనాడు, అమరావతి: 'అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు 'నో వర్క్.. నో పే' నిబంధనను వర్తింపజేయాలి. విధులకు హాజరుకాని ఉద్యోగుల్లాగే.. సభకు రాని సభ్యుల వేతనాల్లో కోత విధించాలి. అప్పటికీ వారు గుణపాఠం నేర్చుకోకపోతే వారిని రీ కాల్ చేసే హక్కును ప్రజలకు కల్పించాలి. ఇందుకోసం ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించాలి' అని స్పీకర్ (మిగతా 3లో)

ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర

అప్పటి నుంచి వచ్చే ఎన్నికల వరకు రోడ్లపైనే ఉంటా

ఏలూరు నియోజకవర్గ వైకాపా కార్యకర్తలతో భేటీలో జగన్

ఈనాడు, అమరావతి: ఏడాదిన్నర కాలం తర్వాత పాదయాత్ర ప్రారంభించనున్నట్లు మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధ్యక్షుడు జగన్ ప్రకటించారు. 'ఫిబ్రవరిలోనో, ఆ పై నెలలోనో ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఇక ప్రభుత్వానికి మిగిలింది మూడేళ్లు. అందులో ఒకటిన్నర సంవత్సరం తర్వాత నా పాదయాత్ర మొదలవుతుంది. అక్కడ నుంచి ఒకటిన్నర సంవత్సరం (మిగతా 12లో)

గ్రామ సభల నిర్వహణపై... 12లో

రాష్ట్రానికి తెలుగులో కేంద్రం లేఖ

మొదటిసారి ప్రాంతీయ భాషల్లో సమాచారం

ఐసుముక్క అడుగుతున్నాం

అది కూడా ఖనిజాల కోసం కాదు.. రక్షణకే ● బలప్రయోగం చేయం

గ్రీన్‌లాండ్ విషయంలో నాటో అంగీకరించాల్సిందే ● దావోస్ సదస్సులో ట్రంప్

వాషింగ్టన్, దావోస్: అమెరికా భద్రత కోసం గ్రీన్‌లాండ్‌ను యాజమాన్య హక్కుతో సహా తీసుకోవాలనుకుంటున్నామని, దానికి బలప్రయోగం మాత్రం చేయబోమని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. డెన్మార్క్ నుంచి దీనిని తాము తీసుకునేందుకు నాటో అనుమతించాలని, విస్తరణవాదాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయాలని తేల్చిచెప్పారు. రెండోవిడత అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా శ్వేతసౌధంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ తర్వాత దావోస్‌కు పయనమై 'ప్రపంచ ఆర్థిక వేదిక'ను ఉద్దేశించి ప్రత్యేకంగా ప్రసంగించారు. అది 70 నిమిషాలసేపు కొనసాగింది. రెండుచోట్లా గ్రీన్‌లాండ్ అంశం ప్రస్తావనకు వచ్చింది. నాటోను చాలా ఆనందింపజేసేలా, తాము కూడా ఎంతో సంతోషపడేలా ఈ వ్యవహారాన్ని కొలిక్కి తీసుకురమ్మని ఆయన అన్నారు.

సరేనంటే సంతోషిస్తాం

"ప్రపంచాన్ని రక్షించేందుకు మేం 'ఒక ఐస్ ముక్క'ను అడుగుతున్నాం. (నాటో) వాళ్లు దానిని వదిలిపెట్టరట. వాళ్లు సరేనంటే మేం ఎంతో సంతోషిస్తాం. ఒకవేళ వాళ్లు నో చెబితే మేం దానిని గుర్తుపెట్టుకుంటాం. బలాన్ని ప్రయోగించనిదే మాకు ఏదీ దొరక్కపోవచ్చు. అలాచేస్తే మమ్మల్ని ఎవరూ ఆపలేరు. కానీ నేను అది చేయను. సరేనా.? గ్రీన్‌లాండ్ అంటే భూమి కాదు. అదొక భారీ మంచుముక్క. అమెరికా, చైనా, రష్యా మధ్య ఉండటం వల్ల వ్యూహాత్మకంగా మాకు అదెంతో కీలకం. అంతేగానీ ఆ మంచుకింద భారీగా ఉన్న అరుదైన ఖనిజాల కోసం కాదు. దశాబ్దాలుగా మేం ఇచ్చినదానితో పోలిస్తే ఇప్పుడు (మిగతా 3లో)

ఐరాస ఘోరంగా విఫలమైంది

అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడటంలో ఐక్యరాజ్యసమితి ఘోరంగా విఫలమైందని ట్రంప్ విమర్శించారు. అందుకే గాజాలో యుద్ధాన్ని అంతం చేయడానికి, పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పడానికి ఒక మండలి అవసరమైందని చెప్పారు. సామర్థ్యానికి తగ్గట్టుగా ఐరాస ఎప్పుడూ పనిచేయలేదని విమర్శించారు. తాను ఎప్పుడూ ఐరాసను ఆశ్రయించలేదని, అలాంటి ఆలోచన కూడా రాలేదని చెప్పారు. ఎలాంటి ఉపయోగం లేకపోయినా ఐరాస కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. సుంకాల కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో తనకు తెలియదని చెప్పారు. ఒకవేళ తాము ఓడిపోతే దానికి తగ్గట్టుగా ఏదో ఒకటి చేయాల్సి ఉంటుందన్నారు. ట్రంప్ పాలనలో 365 రోజులు.. 365 విజయాలు అంటూ శ్వేతసౌధం ఒక నివేదిక విడుదల చేసింది.

ప్రపంచం నెత్తిన కుంపటి!

ఏడాది పాలనలో ట్రంప్ అంటించిన మంటలెన్నో.. 8లో

శత్రువులపై, మిత్రులపై ఒకటే విధానం

సొంత దేశంలోనూ అల్లకల్లోలమే..



పోలవరంపై వారం రోజుల్లో నిర్ణయాలు వెల్లడిస్తాం

● విదేశీ నిపుణులు 8లో

ఇదీసంగతి!



ఇక్కడేమో నీరు తీసుకోమంటారు.. సుప్రీంకోర్టులో అడ్డుకుంటారు

తెలంగాణకు నిర్దిష్ట విధానాలు లేవు

గోదావరి నుంచి 240 టీఎంసీలను ఆ రాష్ట్రం మళ్లిస్తోంది

కృష్ణా నుంచి ఏపీ నీటి మళ్లింపు తప్పదు ● ఇందుకు చట్టబద్ధ రక్షణలున్నాయి

బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు

ఈనాడు, అమరావతి: 'గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయని, ఇతర బేసిన్లకు ఏపీ మళ్లించుకోవచ్చని ట్రైబ్యునల్‌లో తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. మరోవైపు పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుకు అడ్డుపడుతోంది. డీపీఆర్‌ను తయారు చేయకుండా నిలువరించాలంటూ సుప్రీంకోర్టులో కేసు వేసింది. తెలంగాణ ప్రభుత్వానికి నిర్దిష్ట విధానాలంటూ లేవు' అని దిల్లీలో బుధవారం బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ తరపున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా వాదించారు. 'ఉమ్మడి ఏపీకి కృష్ణా ట్రైబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలకు సంబంధించి ఇప్పటికే అన్ని ప్రాజెక్టులూ ఉన్నాయి. (మిగతా 3లో)

(c) eenadu

రేపటి నుంచి తిరుపతిలో మూడు రోజులు సర్వదర్శన టోకెన్ల జారీ నిలిపివేత

రథసప్తమి నేపథ్యంలో తితిదే నిర్ణయం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుమలలో ఈ నెల 25న రథసప్తమి పర్వదినం పురస్కరించుకొని మూడురోజుల పాటు సర్వదర్శన టోకెన్ల జారీని తితిదే నిలిపివేయనుంది. తిరుపతిలోని మూడు కేంద్రాల్లో మరుసటి రోజు దర్శనాలకు జారీ చేసే ఈ టోకెన్లను ఈ నెల 23, 24, 25 తేదీల్లో జారీ చేయరు. ఈ నెల 23వ తేదీ దర్శనానికి సంబంధించిన టోకెన్లు గురువారం జారీ చేయనున్నారు. తిరిగి 26వ తేదీన మరుసటి రోజు దర్శనానికి సంబంధించిన టోకెన్లను ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి ఆయా టోకెన్ల జారీ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ముప్పవరం నుంచి కాజ వరకు యాక్సెస్ కంట్రోల్ కారిడార్

- డీపీఆర్ తయారీకి గుత్తేదారు సంస్థ ఎంపిక
- 100 కి.మీ.కు ఏడాదిలో సిద్ధం కానున్న డీపీఆర్
- ఇరువైపులా పూర్తిగా సర్వీస్ రోడ్ల నిర్మాణం

ఈనాడు-అమరావతి: చెన్నై-కోల్‌కతా హైవేలో ప్రకాశం జిల్లా ముప్పవరం నుంచి గుంటూరు జిల్లాలోని కాజ వరకు 100 కి.మీ. మేర యాక్సెస్ కంట్రోల్ కారిడార్‌గా మార్చే ప్రాజెక్ట్‌లో ముందడుగు పడింది. దీనికి సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) తయారీకి టెండర్లు పిలవగా, భోపాల్‌కు చెందిన ఎల్.ఎన్.మాలవ్య సంస్థ బిడ్ దక్కించుకుంది. డీపీఆర్ ఏడాదిలో సిద్ధం కానుంది. శ్రీసత్యసాయి జిల్లాలోని కోడూరు నుంచి ప్రకాశం జిల్లాలో ముప్పవరం వరకు నిర్మిస్తున్న యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే (బెంగళూరు-అమరావతి హైవే)లోని వాహనాలు.. ముప్పవరం వద్ద చెన్నై-కోల్‌కతా హైవే (ఎన్‌హెచ్-16)లో చేరతాయి. వీటితోపాటు, అటు చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా కలిపి మున్ముందు.. ముప్పవరం నుంచి గుంటూరు, విజయవాడ వైపు రద్దీ పెరగనుంది. దీంతో సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా ముప్పవరం నుంచి కాజ దాటిన తర్వాత విజయవాడ బైపాస్ వరకు ఇప్పుడున్న హైవేని యాక్సెస్ కంట్రోల్‌గా కారిడార్‌గా మార్చాలని నిర్ణయించారు.

7-8 గంటల్లో బెంగళూరు నుంచి అమరావతికి..

◆ ముప్పవరం నుంచి కాజ వరకు 100 కి.మీ. మేర ఆరు వరుసలుగా ఇప్పటికే హైవే ఉన్నప్పటికీ.. దీనికి పూర్తిగా సర్వీస్ రోడ్లు లేవు. గ్రామాలు, పట్టణాలు ఉన్న చోట్లే సర్వీస్ రోడ్లు ఉన్నాయి.

◆ యాక్సెస్ కంట్రోల్ కారిడార్‌లో భాగంగా.. 100 కి.మీ. పొడవునా ఇరువైపులా రెండేసి వరుసలతో సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు. అంటే హైవేకి ఆనుకొని ఉన్న గ్రామాలు, పట్టణాలకు చెందిన వాళ్లు హైవేలోకి వెళ్లాల్సిన అవసరం లేకుండా సర్వీస్ రోడ్ల మీద ప్రయాణించవచ్చు.

◆ ఇలా 100 కి.మీ. పొడవునా.. ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ఎక్కడైనా భూసేకరణ చేయాల్సి ఉంటుందా.. అనేది డీపీఆర్‌లో తేలనుంది.

◆ ముప్పవరం వద్ద, అమరావతి అవుటర్ రింగ్ క్రాస్ అయ్యేచోట, కాజ సమీపంలోని విజయవాడ బైపాస్‌లో కలిసే చోట.. కలిపి మొత్తం మూడుచోట్ల యాక్సెస్ కంట్రోల్ కారిడార్‌లోకి వెళ్లేందుకు (ఎంట్రీ), దాని నుంచి బయటకు వచ్చేందుకు (ఎగ్జిట్)లకు వాహనాలకు అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. అయితే మధ్యలో చిలకలూరిపేట వంటి కీలక ప్రాంతాల వద్ద కూడా అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంటుంది.

◆ ఇప్పటికే కోడూరు నుంచి ముప్పవరం వరకు హైవే (బెంగళూరు-అమరావతి హైవే)ని 343 కి.మీ. మేర ఆరు వరుసల యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మిస్తున్నారు. ఇప్పుడు ముప్పవరం నుంచి కూడా 100 కి.మీ. యాక్సెస్ కంట్రోల్‌గా మారితే.. బెంగళూరు నుంచి రాజధాని అమరావతికి రోడ్డు మార్గంలో కేవలం 7-8 గంటల్లోనే చేరుకునేందుకు అవకాశం కలగనుంది.

యాక్సెస్ కంట్రోల్ అంటే..

యాక్సెస్ కంట్రోల్ హైవే అంటే.. ఎక్కడా అవాంతరాలు లేకుండా వేగంగా ప్రయాణించవచ్చు. సాధారణంగా హైవేకి ఆనుకొని ఉన్న గ్రామాలు, పట్టణాల వద్ద వాహనాలు నేరుగా హైవేలోకి వచ్చి చేరుతుంటాయి. కొన్ని కూడళ్ల వద్ద ఆకస్మికంగా మలుపు తీసుకుంటూ ఉంటాయి. యాక్సెస్ కంట్రోల్ హైవేలో.. ఇటువంటివి ఉండవు. దీనికి ఆనుకొని సర్వీస్ రోడ్లు ఉండటంతో.. స్థానికంగా తిరిగే వాహనాలు హైవే మీదకు రావు. అలాగే ఈ హైవేలోకి ప్రవేశించే చోట, దాని నుంచి బయటకు వచ్చేచోట మాత్రమే టోల్‌గేట్లు ఉంటాయి. ప్రయాణించిన దూరానికి టోల్ చెల్లిస్తే సరిపోతుంది.

శ్రీవాణి టికెట్ల జారీలో ఎదురవుతున్న సమస్యకు తాత్కాలిక పరిష్కారం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవాణి దర్శన టికెట్ల కరెంట్ బుకింగ్ జారీలో తలెత్తిన సాంకేతిక లోపాలను తాత్కాలికంగా పరిష్కరించేందుకు తితిదే ఐటీ విభాగం చర్యలు చేపట్టింది. తిరుమలలో ఇచ్చే 800 శ్రీవాణి ఆఫ్‌లైన్ దర్శన టికెట్లను ఈ నెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో కరెంట్ బుకింగ్ కింద తితిదే జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ విధానంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10,000 విరాళం చెల్లించాక రూ.500 వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ కొనుగోలు చేసేలా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సేవలను తితిదే అందుబాటులోకి తెచ్చింది. అయితే ఈ విధానంలో భక్తులు శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేల విరాళం అందించాక రూ.500తో వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఈలోగా గతంలో శ్రీవాణికి విరాళం ఇచ్చిన భక్తులు సదరు టికెట్లను కొనుగోలు చేయడంతో.. ప్రస్తుతం విరాళం ఇచ్చినవారికి ఎదురవుతున్న ఇబ్బందులపై తితిదేకు పలు ఫిర్యాదులు అందాయి. స్పందించిన అదనపు ఈవో వెంకయ్యచౌదరి, ఐటీ విభాగం, సంబంధిత బ్యాంక్ అధికారులతో ఇటీవల సమీక్షించారు. హెచ్‌డీఎఫ్‌సీ స్థానంలో ఫెడరల్ బ్యాంక్, పేటీఎం సంస్థల సమన్వయంతో తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. రెండుమూడు రోజుల్లో యూనియన్ బ్యాంక్, పేటీఎం సంస్థతో తితిదే ఒప్పందం చేసుకున్నాక పూర్తిస్థాయిలో ఒకరికి రూ.10,500, ఇద్దరికి రూ.21,000, ముగ్గురికి రూ.31,500, నలుగురికి రూ.42,000 చొప్పున టికెట్లు కొనుగోలు చేసేలా మార్పులు చేయనున్నారు. గతంలో కరెంట్ బుకింగ్ కింద శ్రీవాణి ట్రస్టుకు విరాళం ఇచ్చి రూ.500 టికెట్ పొందలేకపోయిన దాతలకు సదరు విరాళం మొత్తాన్ని తిరిగిచ్చేందుకు సంబంధిత బ్యాంక్ చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

మద్యం కేసు నిందితులకు సుప్రీంలో చుక్కెదురు

- బెయిల్ రద్దుపై హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా బాలాజీ గోవిందప్ప, కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి పిటిషన్లు
- కొట్టేసిన సర్వోన్నత న్యాయస్థానం
- రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్‌కోర్టుకే వెళ్లాలని ఆదేశం
- అంతవరకూ మధ్యంతర రక్షణ కొనసాగింపు

గోవిందప్ప ★ కృష్ణమోహన్ ★ ధనుంజయ

ఈనాడు, దిల్లీ: వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితులుగా ఉన్న బాలాజీ గోవిందప్ప, పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి, కె.ధనుంజయరెడ్డిలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో విజయవాడ ఏసీబీ కోర్టు ఇచ్చిన డీఫాల్ట్ బెయిల్‌ను ఏపీ హైకోర్టు కొట్టేయడాన్ని సవాల్ చేస్తూ వారు ముగ్గురూ వేసిన ఎస్‌ఎల్‌పీలను సర్వోన్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. రెగ్యులర్ బెయిల్ కోసం మళ్లీ ట్రయల్‌కోర్టుకే వెళ్లాలని ఆదేశించింది. అంతవరకూ వారికి గతంలో ఇచ్చిన మధ్యంతర రక్షణను పొడిగిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వీఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 'దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన ఛార్జిషీట్లు అసంపూర్తిగా ఉన్నాయంటూ విజయవాడ ఏసీబీ కోర్టు గత ఏడాది సెప్టెంబర్ 6న బాలాజీ గోవిందప్ప, పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి, కె.ధనుంజయరెడ్డిలకు ఇచ్చిన డీఫాల్ట్ బెయిల్‌ను రద్దు చేస్తున్నాం. ఈ నేపథ్యంలో నిందితులు ముగ్గురూ నవంబర్ 26లోపు ఏసీబీ కోర్టు ముందు లొంగిపోయి రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.. అని హైకోర్టు గత ఏడాది నవంబరు 19న తీర్పిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఇరువర్గాల వాదనలూ విన్నాం. ఈ కేసు పూర్వాపరాలను దృష్టిలో ఉంచుకొని ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తున్నాం. ఆ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తిరస్కరిస్తున్నాం. అయితే పిటిషనర్లు రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించేందుకు వీలుగా.. ఈ కోర్టు వారికి ఇప్పటికే కల్పించిన మధ్యంతర రక్షణ ఉత్తర్వులను పొడిగిస్తున్నాం. రెగ్యులర్ బెయిల్‌పై ట్రయల్‌కోర్టు ప్రతికూల ఉత్తర్వులు ఇస్తే హైకోర్టుకు వెళ్లడానికి వీలుగా మధ్యంతర రక్షణను మరో రెండు వారాలు పొడిగిస్తున్నాం. ఈ బెయిల్‌పై మేం ఎలాంటి అభిప్రాయాలూ వ్యక్తం చేయడం లేదు. దానిపై సంబంధిత కోర్టు మెరిట్స్ ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చు' అని సీజేఐ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హైకోర్టులో కూడా ప్రతికూలంగా తీర్పు వస్తే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు వీలుగా మధ్యంతర రక్షణను మరో వారం పొడిగించాలని పిటిషనర్ల తరపు న్యాయవాది అర్యామా సుందరం చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది.

ఛార్జిషీట్ సంపూర్ణంగానే ఉంది: రోహత్గీ

ధర్మాసనం ముందు ఈ కేసు విచారణ ప్రారంభమైన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. 'ట్రయల్ కోర్టులో దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన ఛార్జిషీట్ పిటిషనర్లు చెప్పినట్లు అసంపూర్తిగా లేదని, సంపూర్ణంగానే ఉందని హైకోర్టు పేర్కొంది. హైకోర్టు ఉత్తర్వులను ఖరారు చేయడానికి మీరు కూడా ఇదివరకు అంగీకరించారు. అందువల్ల హైకోర్టు ఉత్తర్వులకు ఆమోదముద్ర వేయండి. ముగ్గురు నిందితులూ మధ్యంతర బెయిల్‌పై బయటే ఉన్నందున వారిని రెగ్యులర్ బెయిల్ కోసం మళ్లీ ట్రయల్‌కోర్టుకు వెళ్లమని చెప్పండి' అని విన్నవించారు. మరో న్యాయవాది సిద్ధార్థ దవే వాదిస్తూ 'ఈ అంశం ఎన్‌డీపీఎస్ నుంచి అసంపూర్ణ ఛార్జిషీట్ల వరకూ చాలా చట్టాలతో ముడిపడి ఉంది. అందువల్ల ఈ ధర్మాసనమే దీనిపై నిర్ణయం తీసుకోవాలి' అని కోరారు. సుందరం, దవేల వాదనలతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి విభేదించారు.

దుఃఖంలో ఉండి.. ఐదుగురికి ప్రాణదానం

- వసంతరాయలు కుటుంబానికి చేతులెత్తి మొక్కుతున్నా
- ప్రభుత్వం తరపున వారిని ఆదుకుంటాం
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

చందు వీరవెంకట వసంతరాయలు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బాధిత కుటుంబ సభ్యులు

ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: 'రోడ్డు ప్రమాదంలో ఇంటి పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా.. అవయవదానంతో మరో ఐదుగురికి ప్రాణదానం చేశారు. ఇది మామూలు విషయం కాదు. చందు వీరవెంకట వసంత రాయలు కుటుంబానికి మనస్ఫూర్తిగా చేతులెత్తి మొక్కుతున్నా. వారి స్ఫూర్తిని అభినందిస్తున్నా. ఆయన భార్య, కుమారుడికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన..కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం గరిశపూడి పంచాయతీ పరిధి పెదచందాలకు చెందిన జనసేన క్రియాశీల సభ్యుడు చందు వీరవెంకట వసంతరాయలు కుటుంబాన్ని పవన్ కల్యాణ్ బుధవారం పరామర్శించారు. వసంతరాయలు భార్య నాగ పుష్పవతి, కుమారుడు, కుమార్తెలను ఓదార్చారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కుమారుడు, కుమార్తెకు ఉద్యోగాలు ఇప్పించాలంటూ బాధిత కుటుంబం విజ్ఞప్తి చేసింది. గ్రామానికి సరిగా రహదారి లేదని, తాగునీటి సమస్య ఉందంటూ పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చింది. అన్ని సమస్యలను పరిశీలించి పరిష్కరించాలంటూ.. కలెక్టర్ బాలాజీని పవన్‌కల్యాణ్ ఆదేశించారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న వసంతరాయలు కుమారుడు ఇక్కడ స్థిరపడేందుకు అవసరమైన సాయం ప్రభుత్వం తరపున చేస్తామన్నారు. బధిరురాలైన బాధపడుతున్న కుమార్తెకు.. తితిదే శ్రవణం కార్యక్రమం ద్వారా చికిత్స అందజేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, కలెక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా కీలక నేత పనులపై కొరడా!

- ఆర్‌అండ్‌బీలో మరో 12 మంది అధికారులకు నోటీసులు
- ఎన్‌డీడీబీ రోడ్ల విస్తరణలో అవకతవకలపై చర్యలు

ఈనాడు- చిత్తూరు, న్యూస్‌టుడే- చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా కీలక నేత.. వైకాపా హయాంలో అడ్డగోలుగా చేసిన పనులపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్‌డీబీ నిధులతో చేపట్టిన పనులు నాణ్యంగా లేకపోయినా బిల్లులు చేసుకునేందుకు సహకరించిన 12 మంది ఆర్‌అండ్‌బీ అధికారులపై కొరడా ఝుళిపించాలని నిర్ణయించారు. బాధ్యులైన ఆరుగురు ఏఈలు, నలుగురు డీఈఈలు, ఇద్దరు ఈఈలకు సంజాయిషీ నోటీసులు జారీ చేయాలని, వారి వివరణ పరిశీలించి తదుపరి చర్యలకు ఉపక్రమించాలని బుధవారం ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. పుంగనూరు, పలమనేరు, పీలేరు నియోజకవర్గాల్లో నాణ్యత లేకుండా, నిబంధనలు ఉల్లంఘించి చేసిన పనులకు సంబంధించి గత నెల 18న 11 మంది ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బందిపై చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే.

రాఘవ సంస్థతో కలిసి జాయింట్ వెంచర్‌గా..

గత ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని దేవదొడ్డి- లక్కసపల్లె, పూతలపట్టు - కొండేపల్లి, పూతలపట్టు- రామాపురం, చౌడేపల్లె- బోయకొండ, నాగలాపురం- చిన్న పాండూరు, దామలచెరువు- నేండ్రగుంట, శ్రీకాళహస్తి- ముసలిపేడు, సూళూరుపేట- సంతవేలూరు (బెంగళూరు-అమరావతి హైవే)ని 343 కి.మీ. మేర ఆరు వరుసల యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మిస్తున్నారు. ఇప్పుడు ముప్పవరం నుంచి కూడా 100 కి.మీ. యాక్సెస్ కంట్రోల్‌గా మారితే.. బెంగళూరు నుంచి రాజధాని అమరావతికి రోడ్డు మార్గంలో కేవలం 7-8 గంటల్లోనే చేరుకునేందుకు అవకాశం కలగనుంది.

అసంపూర్తిగా ఉన్న దేవదొడ్డి-లక్కసపల్లె రోడ్డు

రోడ్ల విస్తరణ, వంతెనల నిర్మాణానికి రూ.126.10 కోట్లతో ఒప్పందం చేసుకున్నారు. మాజీ సీఎం జగన్‌కు సన్నిహితుడు, తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థతో కలిపి పుంగనూరు వైకాపా నేత కుటుంబ సంస్థ జాయింట్ వెంచర్‌గా పనులు చేపట్టింది. అధిక అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించారని విమర్శలు వచ్చినా ఆ నేత సంస్థకే కాంట్రాక్టు దక్కేలా సామదానబేధ దండోపాయాలన్నీ ప్రయోగించి, పనులు దక్కించుకున్నారు.

రూ.38.95 లక్షల రికవరీకి సిఫార్సు

ఈ పనుల నాణ్యతపై విమర్శల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. నాణ్యత లేని కాంక్రీట్ వినియోగించారని, ఎక్కువ బిల్లులు చేసుకోవడానికి అనవసరమైన మెటీరియల్ వాడారని విజిలెన్స్ నిర్ధారించింది. గుత్తేదారుల నుంచి రూ.38.95 లక్షలు రికవరీ చేయాలని సూచించింది. 12 మంది అధికారులను బాధ్యులుగా తేల్చింది. ఇందులో నాణ్యతా విభాగం (క్యూసీ)లో పనిచేసిన ఉద్యోగులు సైతం ఉండటం గమనార్హం. వీరికి సంజాయిషీ నోటీసులిచ్చి, వివరణ తీసుకున్నాక తదుపరి చర్యలకు ఉపక్రమించనున్నారు.

కోర్టులో అరెస్టు.. పోలీసులపై చర్యలకు ఆదేశించండి

హైకోర్టులో వ్యాజ్యం దాఖలు

ఈనాడు, అమరావతి: మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా కర్నూలు జిల్లా పత్తికొండ కోర్టులోకి ప్రవేశించి ఓ కేసులో నిందితుడ్ని మఫ్టీలో అరెస్టు చేసిన ఘటనలో బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ పత్తికొండ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్ బుధవారం హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయించాలని కోరారు. ఈ ఘటనపై డీజీపీ, డీఐజీలకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. చిప్పగిరి మండలం డేగలపాడుకు చెందిన శివయ్య గంజాయి సాగు చేస్తున్నారనే ఆరోపణతో చిప్పగిరి పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో కోర్టులో లొంగిపోయేందుకు ఆయన గత ఏడాది డిసెంబరు 24న పత్తికొండ కోర్టుకొస్తే పోలీసులు మఫ్టీలో వచ్చి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.

భూముల విలువల పెంపు వాయిదా వేయాలని క్రెడాయ్ విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: పట్టణాల్లో భూముల విలువల పెంపు నిర్ణయాన్ని వాయిదా వేయాలని క్రెడాయ్ రాష్ట్ర ఛాప్టర్ ప్రభుత్వాన్ని కోరింది. స్థిరాస్తి వ్యాపార రంగం ఒత్తిడితో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో భూముల విలువల పెంపుదలతో అమ్మకాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ అంబేడ్కర్‌కు క్రెడాయ్ రాష్ట్ర ఛైర్మన్ బి.శ్రీనివాసు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, డి.రాంబాబు బుధవారం వేర్వేరుగా లేఖలు రాశారు.

గ్రహం అనుగ్రహం

22-1-2026 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘమాసం, శుక్లపక్షం

చవితి: రా. 1-36 తదుపరి పంచమి

శతభిష: మ. 2-16 తదుపరి పూర్వాభాద్ర

వర్జ్యం: రా. 8-36 నుంచి 10-10 వరకు

అమృత ఘడియలు: ఉ. 7-01 నుంచి 8-38 వరకు తిరిగి తె. 6-05 నుంచి

దుర్ముహూర్తం: ఉ. 10-20 నుంచి 11-04 వరకు తిరిగి మ.2-47 నుంచి 3-31 వరకు

రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు

సూర్యోదయం: ఉ.6.38; సూర్యాస్తమయం: సా.5.45

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	29.0
అనంతపురం	16.2	33.7
రాజమహేంద్రవరం	16.5	34.0
విశాఖపట్నం	16.8	29.8
కడప	17.0	29.0
కర్నూలు	17.2	32.0
శ్రీకాకుళం	18.0	29.0
తాడేపల్లిగూడెం	18.0	31.0
విజయవాడ	18.6	30.0
నరసాపురం	19.0	32.1
గుంటూరు	20.0	30.0
ఒంగోలు	20.5	30.1
నెల్లూరు	20.9	31.2

ఓటీసీలకు అవకాశమున్న ప్రభుత్వాసుపత్రుల వివరాలివ్వండి

- వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం
- తొమ్మిది ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఓటీసీలుండటంపై విస్మయం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో తొమ్మిది ప్రభుత్వాసుపత్రుల్లోనే అవయవ మార్పిడి శస్త్రచికిత్సల కేంద్రాలు (ఓటీసీ) ఉండటంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. నిపుణులైన వైద్యులు, మౌలిక సదుపాయాలున్నా మరిన్ని ప్రభుత్వాసుపత్రులను ఓటీసీలుగా ఎందుకు మార్చట్లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. జిల్లా కేంద్రాల్లో ఉంటే రోగులకు సౌకర్యవంతంగా ఉంటుందని వ్యాఖ్యానించింది. రాష్ట్రంలో ప్రైవేటు ఆసుపత్రులు పోటాపోటీగా ఓటీసీ గుర్తింపు పొందుతుంటే ప్రభుత్వాసుపత్రులు ఎందుకు పొందలేకపోతున్నాయని ప్రశ్నించింది. అలా ప్రకటించేందుకు అవకాశం ఉన్న ప్రభుత్వాసుపత్రుల వివరాలను కోర్టు ముందు ఉంచాలని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. అవయవ సేకరణ కేంద్రాలను (ఓహెచ్‌సీ) ఓటీసీలుగా మార్చే ప్రతిపాదన ఏ దశలో ఉందో స్పష్టత ఇవ్వాలంది. విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

◆ రాష్ట్రంలో ప్రభుత్వ బోధన ఆసుపత్రులకు అవయవ మార్పిడి చికిత్సలు అందించే కేంద్రాలుగా హోదా కల్పించాలని కోరుతూ.. స్వచ్ఛంద సంస్థ గరీబ్ గైడ్ అధ్యక్షురాలు జి.భార్గవి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఓటీసీలుగా స్థాయి పొందేందుకు రాష్ట్రంలో 80 అర్హమైన ప్రభుత్వాసుపత్రులు ఉన్నాయన్నారు.

భాజపా సదస్సుకు పవన్‌కల్యాణ్‌కు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: జనసంఘ్ జాతీయ మహాసభలు జరిగి 60 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని భాజపా నిర్వహిస్తున్న సదస్సుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు ఆహ్వానించారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వాన పత్రికను అందించారు.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు

రెండో విడత రూ.60.21 కోట్ల విడుదల

ఈనాడు, అమరావతి: ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రెండో విడత రూ.60.21 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దీని వల్ల 3,122 మంది ఎస్సీ, 495 మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. 'ఈ ఏడాది ఇప్పటి వరకు 11,451 మంది ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.269.90 కోట్లు ప్రభుత్వం ప్రోత్సాహకాల కింద చెల్లించింది. గత ఏడాది అక్టోబరులో 6,675 మంది ఎస్సీ, 1,159 మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 209.69 కోట్లు ప్రోత్సాహకాల కింద చెల్లించాం. అనేక ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ మేరకు ప్రోత్సాహకాలు చెల్లించాం' అని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం
దూరవిద్యాకేంద్రం, హైదరాబాద్
మొబైల్ నెం: 7330623411

2025-26 సంవత్సరానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం దూరవిద్యాకేంద్రం ద్వారా నిర్వహించే పి.జి.డిప్లమా/ డిప్లమా/ సర్టిఫికేట్ కోర్సులలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరడమైనది. పూర్తి వివరాలకోసం sprtu.softelsolutions.in మరియు www.teluguuniversity.ac.in వెబ్‌సైట్స్‌లను వీక్షించగలరు. దరఖాస్తులను సాధారణ రుసుముతో తేది: 31-03-2026 వరకు, ఆలస్య రుసుముతో 30-04-2026 వరకు స్వీకరించబడును.

ఆచార్యకోట్ల హనుమంతరావు
రిజిస్ట్రార్
తేది: 22-01-2026

Department of Agriculture, Government of Andhra Pradesh
REQUEST FOR PROPOSAL (RFP)
Department of Agriculture, AP invites bids for selection of Agencies for Procurement of Equipment for DNA-Based Seed and Seed Health Testing at Center of Excellence, Amaravati, Procurement of Fertilizer and Pesticide Testing Equipment for DIALs, and Automation of Quality Control Laboratories in Andhra Pradesh. For other details please visit www.agriculture.ap.gov.in or www.tender.apeprocurement.gov.in
Sd/- Dr. Manazir Jeelani Samoon, IAS
Director of Agriculture
DIPR No. 4759PP/CL/Advt/1/1/2021-22

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 104 to 113/TO/2025-26, తేది: 19.01.2026
కృష్ణా జిల్లాలో వివిధ గ్రాంట్ల క్రింద రూ.1634.79 లక్షల అంచనా వ్యయంతో 08 రోడ్ పనులు, 04 కల్వర్టులు మరియు 12 భవన పనులకి ఇ-ప్రొక్యూర్‌మెంట్ షాటాపామ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. బిడ్ అప్‌లోడ్ మరియు డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 27.01.

గిరిజన ప్రాంతాల్లో ఎకో టూరిజం ప్రాజెక్టులు

- ఏర్పాటుపై ఆసక్తి వ్యక్తం చేసిన తమారా లీజర్
- దావోస్‌లో సంస్థ ప్రతినిధులతో సీఎం భేటీ
- గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు అంగీకారం

తమారా లీజర్ సీఈఓ సృష్టి శిబులాల్‌ను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో ఎకోటూరిజం పార్కుల ఏర్పాటుకు తమారా లీజర్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా ఉందని, ఈ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న విస్తృత అవకాశాలు వినియోగించుకోవాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. దావోస్ పర్యటనలో భాగంగా తమారా లీజర్ సీఈఓ సృష్టి శిబులాల్‌తో సీఎం సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల ఏర్పాటుపై సంస్థ ప్రతినిధులతో చర్చించారు. సీఎం మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. పోలవరం నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో అద్భుతమైన పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ఆస్కారం ఉంది. కోనసీమ, గండికోట, అరకు, లంబసింగి లాంటి ప్రాంతాల్లో ప్రాజెక్టులు ఏర్పాటుచేయండి. ప్రస్తుతం ప్రతి పర్యాటక ప్రాంతానికీ రోడ్డు, విమానాశ్రయాలు అందుబాటులో ఉన్నాయి. హోటల్ రంగానికి మేం ప్రోత్సాహం ఇస్తున్నాం. ఏపీలో ప్రాజెక్టులు పెట్టేందుకు వస్తే ప్రభుత్వం సహకరిస్తుంది' అని సీఎం పేర్కొన్నారు. విశాఖ సహా వివిధ ప్రాంతాల్లో హోమ్ స్టే ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆసక్తి ఉన్నట్లు శిబులాల్ తెలిపారు. కమ్యూనిటీ ఫస్ట్ అనే నినాదంతో గిరిజన యువతకు నైపుణ్యాలు కల్పించేందుకు సిద్ధమని సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు.

స్పేస్.. డ్రోన్ సిటీల్లో భాగస్వామ్యం వహించండి

- యూఏఈ వాణిజ్య మంత్రితో భేటీలో సీఎం ప్రతిపాదన

దావోస్‌లో యూఏఈ మంత్రి ధాని బిన్ అహ్మద్‌తో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఏపీలో ఏర్పాటుచేస్తున్న స్పేస్, డ్రోన్ సిటీల్లో యూఏఈ భాగస్వామ్యం వహించాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. దుబాయ్‌లో యూఏఈ వాణిజ్య మంత్రి ధాని బిన్ అహ్మద్ అల్ జయేదీతో సీఎం భేటీ అయ్యారు. ఏపీలో దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు ప్రతిపాదన.. అగ్రిటెక్, ఫుడ్‌టెక్, ఆక్వాటెక్‌తో పాటు ఫుడ్ పార్కుల అభివృద్ధి, ఆహార భద్రత అంశాలపై చర్చించారు. సీఎం మాట్లాడుతూ.. 'ఏపీలో ఆహార ఉత్పత్తులు వేగంగా రవాణా చేసేందుకు వీలుగా పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్డు, రైల్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేశాం. వాటితో పాటు జాతీయ పారిశ్రామిక కారిడార్లూ రాష్ట్రంతో అనుసంధానమయ్యాయి. ఏపీలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటుచేసేలా యూఏఈకి చెందిన డీపీ వరల్డ్, షరాఫ్ గ్రూప్, ట్రాన్స్ వరల్డ్, ఏడీ పోర్ట్స్ గ్రూప్ లాంటి కంపెనీలను ప్రోత్సహించాలి. ఏపీ నుంచి ఉద్యాన, ఆక్వా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలి. యూఏఈ కంపెనీలు ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయి. పునరుత్పాదక విద్యుత్ రంగంలో 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. యూఏఈకి చెందిన టాక్వా, మజ్దార్ కంపెనీలతో పాటు అబుధాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), ముబాద్లా, ఏడీక్యూ వంటి ఫండింగ్ సంస్థల ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలున్నాయి' అని సీఎం పేర్కొన్నారు. సీఎం ప్రతిపాదనలపై యూఏఈ మంత్రి ధాని బిన్ సానుకూలంగా స్పందించారు.

అయోధ్య మ్యూజియానికి..
233 ఏళ్ల కిందటి రామాయణం

నృపేంద్ర మిశ్రకు గ్రంథం అందిస్తున్న శ్రీనివాస వరఖేడీ

వాల్మీకి రామాయణం రాతప్రతి

దిల్లీ: అయోధ్యలోని అంతర్జాతీయ 'రామకథ' గ్రంథాలయానికి 233 ఏళ్ల కిందటి అరుదైన వాల్మీకి రామాయణం (తత్వదీపికతో) సంస్కృత రాతప్రతులను కానుకగా అందజేసినట్లు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ తెలిపింది. కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయ ఉప కులపతి శ్రీనివాస వరఖేడీ చేతుల మీదుగా ప్రధానమంత్రుల సంగ్రహాలయం, గ్రంథాలయ కార్యనిర్వాహక మండలి ఛైర్మన్ నృపేంద్ర మిశ్రకు మైలురాయిలాంటి ఈ సాంస్కృతిక అప్పగింత జరిగినట్లు పేర్కొంది. మహేశ్వర తీర్థ శాస్త్రీయ వ్యాఖ్యానం (టీకా)తో ఉన్న 1792 నాటి ఈ వాల్మీకి రామాయణాన్ని సంస్కృతం (దేవనాగరి లిపి)లో రాసి ఉన్నట్లు ప్రకటనలో వివరించింది. తాత్వికత లోతును ప్రతిబింబించే ఈ ఇతిహాసం బాలకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండ అనే ఐదు విభాగాలుగా ఉంది. గతంలో రాష్ట్రపతి భవన్‌కు అందజేసిన ఈ కావ్యాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లోని 'రామకథ' మ్యూజియానికి శాశ్వత బహుమతిగా ఇస్తున్నట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పండితులు, భక్తులు, సందర్శకులకు ఈ గ్రంథం అయోధ్య నగరంలో అందుబాటులో ఉంటుందని శ్రీనివాస వరఖేడీ అన్నారు.

నాసా నుంచి పదవీ విరమణ చేసిన సునీతా విలియమ్స్

(మొదటి పేజీ తరువాయి)

గుజరాత్‌లోని మెహసానా జిల్లాకు చెందిన దీపక్ పాండ్యా, స్లోవేనియాకు చెందిన ఉర్సులిన్ బోనీ పాండ్యాల కుమార్తె అయిన సునీత 1965 సెప్టెంబరు 19న అమెరికాలోని ఓహాయో రాష్ట్రంలో జన్మించారు. 2024లో సునీతా విలియమ్స్ తన సహచర వ్యోమగామి బుచ్ విల్మోర్‌తో కలిసి బోయింగ్ సంస్థ రూపొందించిన కొత్త స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పయనమయ్యారు. అక్కడి నుంచి ఆ ఇరువురూ వారం రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా 9 నెలలు అక్కడే చిక్కుకుపోయిన ఘటన ప్రపంచ వ్యాప్తంగా ఉత్కంఠ రేపింది. చివరికి స్పేస్ ఎక్స్ సాయంతో వారు భూమికి చేరారు.

వాదనలు, విభేదాలు మూర్ఖత్వమే

మంగళవారం దిల్లీలోని అమెరికన్ సెంటర్‌లో జరిగిన 'ఐస్ ఆన్ స్టార్స్, ఫీట్ ఆన్ ది గ్రౌండ్' (కళ్లు తారలపై, కాళ్లు భూమిపై) కార్యక్రమంలో సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతరిక్ష యానం జీవితం పట్ల తన దృక్పథాన్ని మార్చేసిందని పేర్కొన్నారు. అంతరిక్షం నుంచి భూమండలాన్ని చూసినప్పుడు ఒకే గ్రహంపై సహవాసులైన మనుషులు ఏవేవో విషయాలపై వాదులాడుకోవడం, విభేదించుకోవడం మూర్ఖత్వమే అనిపిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఖగోళ విషయాల్లో ప్రపంచ దేశాలన్నీ కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ "మనందరం భూలోక వాసులం. ఇక్కడే కలిసి ఉన్నాం" అని ఆమె అన్నారు. ప్రేక్షకులు అనేక విషయాలపై అడిగిన ప్రశ్నలకు సునీత ఓపికగా సమాధానం చెప్పారు.

విశాఖలో సీఓఈ ఏర్పాటు చేయండి

- కాలిబో ఏఐ అకాడమీకి సీఎం చంద్రబాబు ప్రతిపాదన
- దావోస్‌లో సంస్థ ప్రతినిధులతో సమావేశం

దావోస్‌లో కాలిబో ఏఐ అకాడెమీ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రాజ్ వట్టికూటితో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో సంస్థ సీఈవో స్కాట్ శాండ్‌షాఫర్, మంత్రి టీజీ భరత్

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలోని మధుర వాడ ఐటీ సెజ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) కేంద్రాన్ని ఏర్పాటుచేసే అంశంపై కాలిబో ఏఐ అకాడమీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు చర్చించారు. దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో సంస్థ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రాజ్ వట్టికూటి, సీఈఓ స్కాట్ శాండ్‌షాఫర్‌తో సీఎం సమావేశమయ్యారు. రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో యువతకు ఏఐలో నైపుణ్య శిక్షణ అందించే అంశాన్ని పరిశీలించాలని వారికి సీఎం ప్రతిపాదించారు. అమరావతిలో వట్టికూటి ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఇప్పటికే ఏఐ అకాడమీ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే
రాజధాని అమరావతి బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

మొదటి పదేళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం 2016లోనే రాజధాని అమరావతి కేంద్రంగా పరిపాలన ప్రారంభించింది. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ పదేళ్లు ఉంటుందని విభజన చట్టంలో పేర్కొనడంతో ఇప్పటి వరకు సాంకేతికంగా అమరావతికి చట్టబద్ధత కల్పించలేదు. ఆ గడువు ముగియడంతో అమరావతిని రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. రాజధానిగా అమరావతిని ఎంపిక చేసిన విధానం, అక్కడి నుంచి జరుగుతున్న కార్యకలాపాలు, రాజధాని నిర్మాణ పురోగతి వంటి అంశాలపై నివేదిక సమర్పించింది. దీంతో ఏ తేదీ నుంచి అమరావతిని రాజధానిగా ప్రకటించాలో చెప్పాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర హోం శాఖ కోరింది. ఉమ్మడి రాజధాని గడువు 2024 జూన్ 2న ముగిసినందున.. అప్పటి నుంచే అమరావతిని రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

పట్టణ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

కొన్నిచోట్ల విలువలు పెంచారు. ఈ ఏడాది పట్టణ ప్రాంతాల్లో మాత్రమే భూముల మార్కెట్ విలువలు సవరించాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. సవరించిన మార్కెట్ విలువల్ని ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలు చేసేందుకు అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ విలువల సవరణను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా జిల్లాస్థాయిలో జేసీ ఆధ్వర్యంలోని కమిటీ నిర్ణయిస్తుంది. మార్కెట్ విలువల వ్యవస్థ ఆధునికీకరణలో భాగంగా రెండు నెలల్లో సమగ్ర విధానం రూపొందించాలని ఆదేశించారు.

జనవరి వరకు రూ.8,391 కోట్లు

2024-25 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ రుసుముల రూపంలో రూ.8,843 కోట్లు వసూలయ్యాయి. 2025-26 సంవత్సరానికి రూ.11,221 కోట్ల లక్ష్యం నిర్దేశించగా.. జనవరి 9 నాటికి రూ.8,391 కోట్లు వచ్చాయి. సగటు వృద్ధి రేటు 27.98 శాతం కాగా స్టాంపు రుసుము మినహాయింపు రూ.714 కోట్లుగా ఉంది.

పెట్టుబడులు తేవడమంటే కథలు చెప్పడం కాదు

వైకాపా నేత అమర్‌నాథ్‌పై శ్రీనివాస్‌రెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను ప్రశ్నించే నైతిక హక్కు.. అవినీతి కేసుల్లో విచారణలు ఎదుర్కొంటున్న వైకాపా నాయకులకు లేదని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డెప్పగారి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వాటాలు, ముడుపుల కోసం పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన ఆ పార్టీ నాయకులకు చంద్రబాబు దావోస్ పర్యటనపై వ్యాఖ్యలు చేసే అర్హత ఎక్కడుందని బుధవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ ధ్వజమెత్తారు. పెట్టుబడులు తేవడమంటే కోడిగుడ్డు కథలు చెప్పడం కాదని వైకాపా నాయకుడు గుడివాడ అమర్‌నాథ్ గుర్తు పెట్టుకోవాలన్నారు.

Admission Guidence
M.D/ M.S
76600 33344

ఇక్కడేమో నీరు తీసుకోమంటారు... సుప్రీంకోర్టులో అడ్డుకుంటారు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ వాదిస్తున్నట్లుగా కృష్ణా నది నుంచి ఇతర బేసిన్లకు నీటి మళ్లింపును నిలిపివేయడం సాధ్యం కాదు. ఈ మళ్లింపునకు రెండు ట్రైబ్యునళ్లు, రాష్ట్ర విభజన చట్టం రక్షణలు ఉన్నాయి' అని ఆయన స్పష్టంచేశారు. 'బయటి పరీవాహకానికి మళ్లించే నీటికి.. అంతర్గత పరీవాహక కేటాయింపులతో సమంగా రక్షణ కల్పించాలి' అని అన్నారు. తెలంగాణ వాదనల్లో నిజాలు లేవంటూ ఒక్కో అంశాన్నీ ప్రస్తావిస్తూ... జస్టిస్ బ్రిజేష్ కుమార్, సభ్యులు జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్రల ఎదుట వాదనలు కొనసాగించారు. జయదీప్ గుప్తాకు సీనియర్ న్యాయవాది ఉమాపతి, న్యాయవాదులు ఎస్.సంజయ్, జె.శరత్‌చంద్ర సహకరించారు.

'పెన్నా పరీవాహకంలో తలసరి నీటి లభ్యత తక్కువ. మరే ఇతర పరీవాహకంలోనూ లేనంత కరవు ఉంది. ఆ కరవు ప్రాంతాలకు నీటిని మళ్లిస్తే తప్పేమిటి? కృష్ణా నుంచి మళ్లించవద్దని గోదావరి నుంచి తీసుకోవాలని ట్రైబ్యునల్‌లో తెలంగాణ వాదిస్తోంది. పెన్నాకు గోదావరి ప్రత్యామ్నాయ ఆధారమంటోంది. మరోవైపు ప్రాజెక్ట డీపీఆర్ తయారు చేయడాన్ని అడ్డుకుంటోంది' అని జయదీప్ వాదించగా... 'ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులను ట్రైబ్యునల్ ఖరారు చేస్తుంది. తెలంగాణ వాదించినట్లు ఆయా ప్రాజెక్టుల్లో నీరు ఆడా అవుతోందా.. అది నిజమేనా?' అని ట్రైబ్యునల్ ప్రశ్నించింది. జయదీప్ స్పందిస్తూ... 'ప్రతి ప్రాజెక్టుకూ సంబంధించి తెలంగాణ చేసిన వాదనలు ఏ రకంగా తప్పో స్పష్టంగా వివరిస్తాం. అందుకు అవసరమైన డాక్యుమెంట్లు సిద్ధం చేస్తున్నాం' అని బదులిచ్చారు. తర్వాత ఆయన వాదనలను కొనసాగించారు. అందులోని ముఖ్యాంశాలివీ...

- పరీవాహకం బయటకు నీటి ప్రవాహాల మళ్లింపును కావేరి జల వివాద ట్రైబ్యునల్ నిషేధించిందని తెలంగాణ వాదించింది. కావేరి ట్రైబ్యునల్ అలాంటి నిర్ణయాలు వెలువరించలేదు.
- బేసిన్ బయటకు నీటి మళ్లింపులను సుప్రీంకోర్టు సమర్థించింది. 1987, 2002, 2012 జాతీయ నీటి విధానాలు.. ఇతర బేసిన్లకు నీటి బదిలీలను అనుమతిస్తున్నాయి. 2016 మార్గదర్శకాలదీ ఇదే మాట.
- కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధానాన్ని ప్రతిపాదించింది. పెనెన్సులర్ నదీ అభివృద్ధి కింద అనుసంధానించాలని భావిస్తోంది. నదుల అనుసంధానం కోసం కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సైతం ఆదేశించింది.
- బచావత్ ట్రైబ్యునల్, బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌లూ నీటి మళ్లింపులను చట్టబద్ధంగా అనుమతించాయి. ట్రైబ్యునళ్ల తీర్పులను తిరగదోడే అస్కారం ఎంతమాత్రమూ లేదు. పరీవాహకం బయటకు ఆంధ్రప్రదేశ్ మళ్లిస్తున్న నీటిని పరిమితం చేయాలని బచావత్ ట్రైబ్యునల్‌ను కర్ణాటక కోరగా ఆ వాదనను ట్రైబ్యునల్ తిరస్కరించింది.

తాను నీటిని మళ్లిస్తూ.. ఏపీని వద్దంటే ఎలా?

- గోదావరి నుంచి 240 టీఎంసీల నీటిని బయటి పరీవాహకానికి తెలంగాణ మళ్లిస్తోంది. ఇందుకు కేంద్ర జలసంఘం అనుమతులు ఉన్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతలను 6 టీఎంసీలకు తెలంగాణ పెంచింది. తుపాకులగూడెం ఎత్తిపోతల 21 టీఎంసీలను దీనికి జత చేసింది. ఒక వైపు తెలంగాణ.. గోదావరి జలాలను బయటి పరీవాహకాలకు మళ్లిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు అభ్యంతరం చెప్పడం ఏమిటి?
- బయటి పరీవాహక ప్రాంతాలకు ఆంధ్రప్రదేశ్ నీటి మళ్లింపు.. 323 టీఎంసీల నుంచి 310.02కు తగ్గింది. ఇందులో 140.78 టీఎంసీల నీరు కృష్ణా డెల్టా వ్యవస్థలోనే ఉంది. ఇది సాంకేతికంగా బయటి పరీవాహకమే తప్ప చారిత్రకంగా ఆ ప్రాంతం కృష్ణా పరీవాహకంలో భాగంగా పరిగణించిందే. కృష్ణా డెల్టా, సాగర్ కుడి కాలువ, కేసీ కాలువ, తుంగభద్ర ఎగువ కాలువ, గుంటూరు చానల్ వంటి ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఎంతో కీలకం. నికరంగా ఏపీ బయటి పరీవాహకానికి మళ్లించేది 157 టీఎంసీలు మాత్రమే.

పారిశ్రామికవేత్తలకు రియల్‌టైంలో అనుమతులు

(మొదటి పేజీ తరువాయి)

నిరంతర పర్యవేక్షణతోనే అది సాధ్యమైంది. కూటమి ప్రభుత్వం రాగానే గూగుల్ పెట్టుబడిపై సంప్రదింపులు మొదలుపెట్టింది. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా గురించి అంతా చర్చిస్తున్నప్పుడే ఏపీలో ఉత్పత్తికి అడుగులు వేశాం. విదేశాలకు గ్రీన్ అమ్మోనియా ఎగుమతికి ఇప్పటికే ఒప్పందాలు కుదిరాయి. భారీ లక్ష్యాలు నిర్దేశించుకోవడం.. వాటి సాధనకు నిరంతరం పనిచేయడం నాకు అలవాటు. వినూత్న ఆలోచన, ముందుచూపుతో కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధ్యం. ఇదే విషయాన్ని యువతకు చెబుతుంటా' అన్నారు.

అమరావతి నిర్మాణం ఒక అవకాశం

'రాజధాని అమరావతి నిర్మాణం ఒక అవకాశం. ప్రపంచ ప్రమాణాలు.. అద్భుత ప్రణాళికతో రాజధాని నిర్మాణం జరుగుతోంది. అమరావతి భవిష్యత్తు నగరంగా ఉండబోతోంది. గ్రీన్, బ్లూ సిటీగా నిర్మిస్తున్నాం. పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం. మా రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక రంగం ఏపీ గురించి చర్చించుకుంటోంది. సింగపూర్ మాజీ అధ్యక్షుడు లీ క్వాన్యూ, మలేషియా మాజీ అధ్యక్షుడు మహతీర్ నాకు స్ఫూర్తి' అని పేర్కొన్నారు.

యువ జనాభా.. మా బలం

'చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. భారత్‌లో యువ జనాభా ఎక్కువ. సమర్థ మానవవనరులు, సాంకేతికత భారతదేశ అదనపు బలం. ఒకప్పుడు ఎలక్ట్రానిక్ వస్తువులను భారత్ దిగుమతి చేసుకునేది. ఇప్పుడు ఆ రంగంలో ఎగుమతులు చేసే స్థాయికి చేరుకుంది' అని తెలిపారు.

15 తర్వాత ఆర్సెలార్ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్మీ మిత్తల్, సీఈవో ఆదిత్య మిత్తల్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు వివిధ దశల్లో అవసరమైన అనుమతులకు సంబంధించి మిత్తల్ సమక్షంలో అధికారులతో సమీక్షించారు. సమావేశంలో మంత్రులు లోకేశ్, టీజీ భరత్ పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ.. 'సాధ్యమైనంత త్వరగా ప్లాంటు నిర్మాణాన్ని పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలి. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, ప్రభుత్వం నుంచి సహకారం విషయంలో ఎలాంటి జాప్యం ఉండదు. అవసరమైతే దిల్లీ వెళ్లి కేంద్రం నుంచి త్వరితగతిన అనుమతులు తీసుకొచ్చే విషయంలో మంత్రులు లోకేశ్, భరత్‌లు బాధ్యత తీసుకుంటారు. తొలి దశలో సంస్థ రూ.60 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది' అని పేర్కొన్నారు. ప్లాంటు నిర్మాణం విషయంలో మంత్రి లోకేశ్ ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నట్లు ఆదిత్య మిత్తల్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు గురించి సీఎం చంద్రబాబు వారికి వివరించారు.

అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలను రీ కాల్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో జరుగుతున్న చట్టసభల సభాపతుల 86వ అఖిలభారత మహాసభలో ఆయన పాల్గొని 'ప్రజల పట్ల శాసనవ్యవస్థ జవాబుదారీతనం' అనే అంశంపై ప్రసంగించారు.

సభకు రానివారిపై చర్యలకు మార్గం చూపండి

'ఆంధ్రప్రదేశ్‌లో 2024 జూన్‌లో కొత్త ప్రభుత్వం వచ్చినప్పట్నుంచి ఇప్పటివరకూ కొందరు శాసనసభ్యులు ఒక్కరోజూ శాసనసభ సమావేశాలకు హాజరవలేదు, ఒక్క చర్చలోనూ పాల్గొనలేదు. కానీ, క్రమం తప్పక వేతనాలు తీసుకుంటున్నారు. ఈ అనైతిక ప్రవర్తనను ఎలా సమర్థించగలం? ఈ విషయంలో మాకొక మార్గం చూపించాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరుతున్నా. నా సహ సభాపతుల సలహాలనూ కోరుతున్నా. ఇది కేవలం ఆంధ్రప్రదేశ్ సమస్యే కాదు.. అన్నిచోట్లా ఉండొచ్చు' అని తెలిపారు. చట్టసభలు ఏడాదికి కనీసం 60 రోజులు పనిచేయాలని చెప్పారు.

కప్పం కట్టలేదనే కాల్చేశారు

- అనంతపురం ఎమ్మెల్యేపై వైన్‌షాపు నిర్వాహకుడి ఫిర్యాదు

ఎమ్మెల్యే దగ్గుపాటిపై మంత్రి సవితకు ఫిర్యాదు చేస్తున్న నంబూరి రమణ

ఈనాడు, అనంతపురం: మద్యం దుకాణం నడపాలంటే మామూళ్లు ఇవ్వాల్సిందేనని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ బెదిరిస్తున్నారని నంబూరి వైన్స్ నిర్వాహకుడు నంబూరి రమణ విజయవాడలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బుధవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మంత్రి సవితకు ఫిర్యాదు అందించారు. తాను ఎన్నో ఏళ్లుగా తెదేపా కోసం పనిచేస్తున్నానని.. ఫ్యాక్షన్‌లో సర్వం కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన అదృష్టం బాగుండి నగరంలో ఒక వైన్‌షాపు దక్కగా నిర్వహణకు ఎంతో కష్టపడాల్సి వస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పదేపదే కమీషన్ల కోసం బెదిరిస్తున్నారని ఫిర్యాదులో వాపోయారు. తాను కప్పం కట్టడానికి ఒప్పుకోకపోవడంతోనే అనుచరుల ద్వారా మద్యం దుకాణానికి నిప్పు పెట్టించారని ఆరోపించారు. మంత్రి స్పందించి ఘటనపై విచారణ జరిపించి, తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు రమణ తెలిపారు.

ఐసుముక్క అడుగుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

అడుగుతున్నది చాలాచిన్నది" అని దావోస్‌లో చెప్పారు. డెన్మార్క్ నుంచి గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు వెంటనే సంప్రదింపులు మొదలుపెట్టాలన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో డెన్మార్క్‌ను అమెరికా కాపాడినా ఆ దేశంలో తమపట్ల కృతజ్ఞత లేదని విమర్శించారు. ఐరోపా బాగుండాలనే తాను కోరుకుంటానని, అయితే అది సరైన దిశలో వెళ్లడం లేదని చెప్పారు.

భద్రత కోసమే నియంత్రణ

రక్షణ కొరవడిన గ్రీన్‌లాండ్ నిజానికి ఉత్తర అమెరికా భూభాగమేనని ట్రంప్ చెప్పారు. ఆర్కిటిక్ భూభాగంలో తవ్వకాలు చేయడం కష్టమని, కొన్ని వందల అడుగులకొద్దీ మంచును తవ్వాల్సి ఉంటుందని తెలిపారు. 'చాలామంది మిత్రులకు, కొందరు శత్రువులకు అభివాదం' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అతి చేరువగా ఉన్నామని చెప్పారు. తన బదులు కమలాహారిస్, జో బైడెన్‌లాంటివాళ్లు నెగ్గి ఉంటే ఇప్పటికే మూడో ప్రపంచ యుద్ధం వచ్చి ఉండేదన్నారు. చైనాలో ఎక్కడా గాలిమరలు కనిపించవని, ఐరోపాలో అవివేకులకు మాత్రం వాటిని అమ్మి ఆ దేశం సొమ్ము చేసుకుంటుందని విమర్శించారు. తాను ప్రతి దేశంతో కలిసి పనిచేయాలని అనుకుంటున్నానని, ఏ దేశాన్నీ నాశనం చేయాలనుకోవడం లేదని స్పష్టంచేశారు. ట్రంప్ ప్రసంగాన్ని వినేందుకు ప్రతినిధులు పెద్దఎత్తున ఉత్సాహం చూపించారు. రెండు గంటల ముందే వారంతా బారులు తీరారు. కొన్ని వందలమంది బయటే ఉండిపోయి తెరలపై వీక్షించాల్సి వచ్చింది. మరోపక్క ఆయన్ని వ్యతిరేకిస్తూ పలువురు ప్రదర్శనలు చేశారు.

మరే అధ్యక్షుడూ ఇంతమందిని రక్షించలేరు

తాను చేస్తున్న పనులతో దేవుడు కూడా ఎంతో గర్విస్తుంటాడని ట్రంప్ శ్వేతసౌధంలో చెప్పారు. 'క్రైస్తవులు, యూదులు సహా అనేక మంది ప్రాణాలను మేం కాపాడుతున్నాం. మరో అధ్యక్షుడెవరూ ఇంతమందిని రక్షించలేరు' అని విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. "నేను జోక్యం చేసుకుని ఆపకపోయి ఉంటే భారత్, పాకిస్థాన్‌లు అణుయుద్ధానికి వెళ్లేవి. దానిని ఆపడం ద్వారా కొన్ని మిలియన్ల మంది ప్రాణాలను రక్షించాను. అంతూపొంతూ లేని ఎనిమిది యుద్ధాలను పది నెలల్లో ఆపాను" అని పునరుద్ఘాటించారు. నోబెల్ బహుమతుల ఎంపికలో నార్వే ప్రభుత్వానిదే కీలక పాత్ర అని, వారికి నియంత్రణ లేదని ఎవరు చెప్పినా నమ్మవద్దని అన్నారు. వారు ఉద్దేశపూర్వకంగానే తనకు బహుమతి దక్కకుండా చేస్తున్నారని ఆరోపించారు.

నాటోకు నేను చేసినంతగా ఎవరూ చేయలేదు

ఫ్రాన్

ఈనాడు

ప్రగతి సాధనంగా విమానయానం

విమాన ప్రయాణాన్ని విలాసంగా పరిగణించడం కాలంచెల్లిన భావన. సమయాన్ని అమూల్య పెట్టుబడిగా భావించే ఆధునిక ప్రపంచంలో ఆర్థికాభివృద్ధి వేగవంతం కావాలంటే పౌరవిమానయాన రంగాన్ని పటిష్ఠంగా విస్తరించాల్సిందే. భారత్ వంటి సువిశాల దేశాల్లో రైలు, రోడ్డు ప్రయాణాలతో పోలిస్తే, గగనతల పయనాలతో 40-70శాతం సమయం ఆదా అవుతుంది. అది ఉత్పాదకతను బాగా ఇనుమడింపజేస్తుంది. విమానాశ్రయాల అనుసంధానతను పదిశాతం పెంచగలిగితే జీడీపీలో ఒక శాతం వరకు వృద్ధిని సాధించవచ్చు. అంతర్జాతీయ అధ్యయనాల ప్రకారం- ఈ రంగంలో వెచ్చించే ప్రతి రూపాయికి ఆర్థికంగా మూడు రెట్లు, ఉపాధికల్పన పరంగా ఆరు రెట్లు లాభమొస్తుంది. అందుకే మోదీ ప్రభుత్వం పదేళ్ల కిందట ప్రత్యేకంగా సమీకృత జాతీయ విధానం తీసుకొచ్చి పౌరవిమానయాన రంగాన్ని ప్రగతి బాట పట్టించింది. ఈ క్రమంలోనే, 2014 నాటికి ఉన్న 74 ఎయిర్‌పోర్టులు నిరుటికి 163కు చేరాయి. 2011లో 7.1కోట్ల మంది దేశీయంగా విమాన ప్రయాణాలు చేస్తే, 2024లో అటువంటివారు 17కోట్లకు పైబడ్డారు. ముఖ్యంగా మధ్యాదాయ వర్గాల విద్య, ఉద్యోగ, వ్యాపార, వైద్య, పర్యాటక అవసరాలను బట్టి చూస్తే విమాన ప్రయాణికుల సంఖ్య ఇంకెంతో పెరగడానికి అవకాశముంది. కానీ, ఆకాశాన్ని తాకుతున్న టికెట్ ధరలు దానికి గండికొడుతున్నాయి!

మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా ఇండియా ఎదిగింది. అయినప్పటికీ, 2024లో అమెరికాలో తలసరి విమాన ప్రయాణాలు 3.3 అయితే, భారతావనిలో 0.12 మాత్రమే. 'మధ్యతరగతి భారతీయులు సంవత్సరానికి ఒక్కసారి విమానమెక్కినా ఏడాదికి 35కోట్ల టికెట్లు తెగుతాయి. అది సాధ్యపడాలంటే వాటి రేట్లు తగ్గాలి. ప్రధానంగా ప్రాంతీయ మార్గాల్లో విమానయానం అందరికీ అందుబాటులోకి రావాలి. ఆ మేరకు ఖర్చులు తగ్గడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విమానాశ్రయ నిర్వాహకులు రాయితీలు ఇవ్వాలి' అని 2016 సివిల్ ఏవియేషన్ విధానం స్పష్టీకరిస్తోంది. కానీ- విమాన ఇంధనం(ఏటీఎఫ్)పై వ్యాట్, కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాల బాదుడుకు రకరకాల రుసుములు తోడు కావడంతో టికెట్ ధరలు కొండెక్కుతున్నాయి. 2019 నుంచి 2024 ప్రథమార్ధం మధ్యకాలంలో ఇండియాలో విమాన టికెట్ల రేట్లు చాలా దేశాల్లో కంటే ఎక్కువగా 43శాతం పెరిగాయి. అవి అలాగే ఎగబాకుతుంటే- విమానయాన రంగ ప్రగతి దీర్ఘకాలంలో కుంటుపడుతుంది. ఆ దుస్థితి దాపురించకూడదంటే, ఏటీఎఫ్‌పై పన్నులను హేతుబద్ధీకరించాలి!

అంతర్జాతీయ ఉద్రిక్తతలు, డాలర్‌తో రూపాయి మారకం రేటు, పన్నులు వంటివి ఏటీఎఫ్ ధరవరలను ఒకపక్క ప్రభావితం చేస్తుంటే- గిరాకీని సొమ్ము చేసుకోవాలన్న విమానయాన సంస్థల పెడపోకడలు మరోపక్క ప్రయాణికుల జేబులకు కత్తెరేస్తున్నాయి. డీజీసీఏ ఆదేశాలకు భిన్నంగా ఇటీవల దీపావళి రోజుల్లో విమాన టికెట్ల రేట్లు దాదాపు రెట్టింపయ్యాయి. ఇక ఇండిగో సంక్షోభ కాలంలోనైతే కేంద్రం రంగంలోకి దిగేవరకు మిగిలిన సంస్థలు విపరీతంగా దండుకున్నాయి. పండుగలూ ఇతర విశేష సందర్భాల్లో విమాన ఛార్జీలను ఇష్టారాజ్యంగా పెంచేయడాన్ని సుప్రీంకోర్టు తాజాగా 'దోపిడి'గా అభివర్ణించింది. ధరల్లో అనూహ్య మార్పులకు అనుమతిస్తున్న ప్రస్తుత విధానాన్ని సంస్కరించాలని, టికెట్ల రేట్లపై ప్రభుత్వ నియంత్రణకు వీలుగా చట్టబద్ధమైన ఏర్పాట్లు ఉండాలని పార్లమెంటరీ కమిటీలు కొన్నేళ్లుగా సిఫార్సు చేస్తున్నాయి. అభివృద్ధి సాధనంగా విమానయానం అందరికీ చేరువ కావాలంటే- ఆ రంగంలో కొన్ని సంస్థల గుత్తాధిపత్యాన్ని నివారించడంతో పాటు దూరాభారాలను బట్టి టికెట్లకు గరిష్ఠ ధరలను నిర్ణయించి స్థిరంగా అమలుచేయడం అత్యావశ్యకం!



కొంతమంది చెడ్డవారి వల్ల అణచివేతలూ, అకృత్యాలూ జరుగుతుంటాయి. వాటిని ఎదిరించకుండా మంచి వాళ్లయిన అధిక సంఖ్యాకులు మౌనంగా ఉండటం అంతకన్నా ప్రమాదకరం, విచారకరం.

– రతన్ తియ్యం, నాటక రచయిత, దర్శకులు

దక్షిణామూర్తి తత్వం

ఒక చెట్టు కింద ప్రశాంతంగా, నిశ్చలంగా కూర్చుని ఉన్నాడు ఒక యువకుడు. ఆయన చుట్టూ వృద్ధులైన సనక సనందనాది మహామునులు కూర్చుని ఉంటారు. యువకుడైన గురువు, వృద్ధులైన శిష్యులు. ఇది వయసుకూ, జ్ఞానానికీ సంబంధం లేదని చెప్పే గొప్ప సంకేతం. అయినా బోధించేది ఆయనే. పేరు లేకుండా, పుస్తకాలు లేకుండా ఆఖరికి మాట కూడా లేకుండా! ఇది ఊహ కాదు. మానవ చైతన్యానికి దోహదపడిన సనాతన సత్యం. ఇదే పరమశివుడి జ్ఞాన స్వరూపమైన శ్రీ దక్షిణామూర్తి తత్వం.

శబ్దం లేకుండా బోధ చేయగల ఏకైక గురువు.. శ్రీ దక్షిణామూర్తి. గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని కీర్తిస్తాం. కానీ, ఆ త్రిమూర్తులకు గురువెవరు? సకల సృష్టికి, సమస్త జ్ఞానానికి ఆది గురువు ఎవరు? ఈ ప్రశ్నలకు శాస్త్రాలు చెప్పే సమాధానమే దక్షిణామూర్తి స్వరూపం. మౌనంతోనే మహాజ్ఞానాన్ని బోధించిన దక్షిణామూర్తి పరమశివుడి అత్యంత విశిష్టమైన రూపం. ఆయన స్వరూపం అద్భుతం. దక్షిణామూర్తి తన కుడి చేతితో 'చిన్ముద్ర'(జ్ఞాన ముద్ర)ను ప్రదర్శిస్తాడు. ఇది ఆయన తత్వానికి వ్యాఖ్యానం. బొటనవేలు పరమాత్మకు, చూపుడువేలు జీవాత్మకు సంకేతం. మిగిలిన మూడు వేళ్లు... సత్వ, రజో, తమో గుణాలకు లేదా జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలకు ప్రతీకలు.

చిన్ముద్రలో, చూపుడువేలు వంగి బొటనవేలును తాకుతుంది. మిగిలిన మూడు వేళ్లు వేరుగా ఉంటాయి. దీని అర్థం, జీవాత్మ తన అహంకారాన్ని వీడి, త్రిగుణాల ప్రభావం నుంచి బయటపడి పరమాత్మలో ఐక్యం కావడమే. అదే మోక్షం, అదే నిజమైన జ్ఞానం. అదే అద్వైత సిద్ధి. యవ్వన ప్రాయంలో కనిపించడం వెనక పరమార్థం జ్ఞానానికి వయసుండదు అని చెప్పడం. వటవృక్షం కింద ఆసీనుడు అవడం... ప్రతి విద్య ప్రకృతిలోనే మొదలవుతుందని చెప్పడానికి. దక్షిణామూర్తి పాదాల కింద అణచివేసిన అపస్మారుడు అజ్ఞానానికి, మూర్ఖత్వానికి ప్రతీక. అజ్ఞానాన్ని తొలగించుకుంటేనే సత్యాసత్యాలు తెలుస్తాయన్నది దాని భావం. చేతిలోని అగ్ని సంశయాలను దహించే జ్ఞానాగ్నికి, గ్రంథాలూ సకల శాస్త్రాలపై ఆయనకు ఉన్న అధికారానికి నిదర్శనం. ఆశించేదేమీ లేదు. ఆశ్రయించాల్సింది మాత్రమే ఉంది. శబ్దాలకు, వాక్యాలకు అందని ఆ పరమ సత్యాన్ని అనుభవంలోకి తీసుకురావడమే దక్షిణామూర్తి బోధనలోని సారాంశం.

దక్షిణామూర్తి సమక్షంలో మనసు ప్రశ్నించడం మానేస్తుంది, ఎందుకంటే సమాధానం మనసు గడప దాటి ఆత్మలో అప్పటికే విరాజిల్లుతుంది. ఆయనకు వందనం చేయడం అంటే మనలోని శివత్వాన్ని గుర్తించడం, మనలోని మౌనాన్ని ఆలింగనం చేసుకోవడం. ఆ మౌనమే పరమ శాంతి, ఆ మౌనమే పరబ్రహ్మం. శబ్దంలో మత్తు ఉంది. మౌనంలో ముక్తి ఉంది. శబ్దం కన్నా లోతుగా వినగలిగితే... 'మౌనమే' మహోన్నతమైన ఉపనిషత్తు. ఇది గురు దక్షిణామూర్తి బోధనా మహత్తు. అదే ఆయన దివ్యతత్వం.

– యర్రాప్రగడ ప్రసాద్

కాలుష్య కట్టడికి నవ్యావిష్కరణలు

శీతాకాలం రాగానే ఉత్తర భారతాన్ని వాయు కాలుష్యం వణికిస్తోంది. పంట వ్యర్థాల దహనం మొదలు మోటారు వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే దట్టమైన పొగలదాకా అన్నీ కలిసి జనానికి ఊపిరాడనివ్వడం లేదు. ఈ బెడదను తొలగించడానికి ప్రభుత్వాలు ఎన్నో ఏళ్లుగా ఎన్నిరకాల ప్రణాళికలను అమలు చేసినా ఫలితం లేకుండా పోతోంది. ఈ క్రమంలో కాలుష్యంపై పోరుకు యువ ఆవిష్కర్తలు మరింతగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. అలాంటి పరిశోధనలకు అండదండలు దక్కడం ముఖ్యం.

భారతదేశ గాలిలో కాలుష్యకారక పీఎం2.5 సూక్ష్మకణాల పాళ్లు అధికం. ఇవి ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాలకన్నా పదింతలు ఎక్కువగా ఉన్నట్లు ప్రపంచ వాయు నాణ్యతపై ఐక్యూఎయిర్ సంస్థ నివేదిక-2024 వెల్లడించింది. నిరుడు ప్రపంచంలో అత్యంత కలుషిత దేశాల జాబితాలో భారత్ అయిదో స్థానంలో నిలిచింది. దేశంలో ఉద్గారాలు ప్రధానంగా వ్యవసాయ, పారిశ్రామిక, థర్మల్ విద్యుత్కేంద్రాలు, మోటారు వాహనాలు, నిర్మాణ రంగాల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. శిలాజ ఇంధనాల వినియోగం నుంచి హరిత ఇంధనాలకు మారడం ద్వారానే వీటికి స్వస్తి పలకవచ్చు. వాయు కాలుష్య నివారణకు చేపట్టే దీర్ఘకాలిక ప్రణాళికల్లో యువతకు క్రియాశీల భాగస్వామ్యం కల్పించాలి.

దేశంలోని స్టార్టప్‌ల్లో సగానికి పైగా సంస్థలను యువజనులే నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయాలు, ఇంక్యుబేటర్లలో పరిశోధనలను వారే ఎక్కువగా చేపడుతున్నారు. హరిత ఇంధనాలు, గాలి నాణ్యతను నిర్ధరించే ఉపకరణాల తయారీలోనూ ముందడుగు వేస్తున్నారు. ప్రపంచంలో అత్యధిక స్టార్టప్‌లు ఉన్న దేశాల్లో ఇండియాది మూడో స్థానం. ఈ ఆధిక్యాన్ని వాయు కాలుష్య నివారణపై పరిశోధన, అభివృద్ధికి వాడుకోవాలి. యువ ప్రతిభావంతులు తమ శాస్త్ర పరిజ్ఞానాన్ని వాయు కాలుష్య నిర్మూలనకు, సరికొత్త ఇంధనాల రూపకల్పనకు ఉపయోగించాలి. భారీస్థాయిలో, అందుబాటు ధరలకే శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలను, సాధనాలను వినియోగంలోకి తీసుకురాలేకపోవడం భారత్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. అన్నిరకాల కాలుష్యాలను నిక్కచ్చిగా అంచనా వేయగల పర్యవేక్షణ వ్యవస్థ కూడా కొరవడింది. ఈ రెండు సమస్యల పరిష్కారంపై యువ పరిశోధకులు దృష్టి సారించాలి.

పరిష్కారం చూపిస్తున్న స్టార్టప్‌లు

ఉత్తర భారతంలో చలికాలంలో పంట వ్యర్థాలను దహనంచేయగా వచ్చే పొగ మేఘాలతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. పంజాబ్, హరియాణాలలో పెద్ద వ్యవసాయ క్షేత్రాల్లో పంట వ్యర్థాల దహనాల ఘటనల్లో 90 శాతందాకా అధికార యంత్రాంగానికి తెలియడం లేదు. ఉపగ్రహాల నిఘా నుంచి తప్పించుకోవడానికి మధ్యాహ్నం పూట తగులబెడుతున్నారు. గట్టి చర్యలు లేకపోతే ఇదిలాగే కొనసాగుతూ, కాలుష్యం పెరుగుతూనే ఉంటుంది. ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి ప్రభుత్వం, యువ నవీకరణ సాధకులతో కలిసి కృషి చేయాలి. ఉదాహరణకు దిల్లీ విశ్వవిద్యాలయం పట్టభద్రులు స్థాపించిన ఆర్.వై.ఎనర్జీస్ అనే స్టార్టప్ వరి పంట వ్యర్థాల నుంచి తీసిన బయోమాస్ ఇంధనాన్ని ఏడాది పొడవునా పరిశ్రమలకు సరఫరా చేస్తోంది. వ్యర్థాల దహనంకన్నా వాటి నుంచి బయోమాస్ ఇంధనం తయారీయే రైతులకు లాభసాటి. ఇలాంటి యువ ఆవిష్కర్తల సర్వాంగీణ పరిష్కార ప్రయత్నాలకు ప్రభుత్వం అండగా నిలవాలి. బయోమాస్ సేకరణ, దాని నుంచి తయారయ్యే బయో ఇంధనాన్ని కొంటామని హామీ ఇవ్వడం, సబ్సిడీలను అందించడం ద్వారా ప్రభుత్వం సాయపడవచ్చు. తద్వారా యువజనుల నవీకరణలను వేగంగా వినియోగంలోకి తీసుకెళ్లవచ్చు. పంట వ్యర్థాలు, ఎరువులు, పురుగుమందులతోపాటు శిలాజ ఇంధనాల వాడకమూ అమిత వాయు కాలుష్యాన్ని తెచ్చిపెడుతోంది. ఇలాంటి సమస్యకు ఐఐటీ పట్టభద్రులు పరిష్కారాన్ని ప్రతిపాదిస్తున్నారు. వారు నెలకొల్పిన వాంకెల్ ఎనర్జీ సిస్టమ్స్ వంటి కొన్ని స్టార్టప్‌లు పరిశ్రమల్లో బొగ్గు, చమురును మండించగా వచ్చే ఉష్ణం, ఆవిరిలను వృథా కానివ్వకుండా, పునర్వినియోగం ద్వారా మళ్లీ విద్యుచ్ఛక్తిని తయారు చేస్తున్నారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణ, వాణిజ్య ప్రయోజనాలు రెండూ నెరవేరతాయి. అయితే యువజనుల నవీకరణలను ఆచరణలోకి తీసుకురావడానికి ప్రభుత్వం, పరిశ్రమలు నిధులు, వసతులతో గట్టి మద్దతును ఇవ్వాలి. లేకపోతే, ఇలాంటి నవీకరణలు ప్రయోగాత్మక దశ నుంచి వాణిజ్య దశకు చేరకముందే కనుమరుగయ్యే ముప్పుంది.

ఉద్గారాలపై నిఘా కోసం...

భారతదేశంలో వాయు కాలుష్యాన్ని పకడ్బందీగా గణించే ఏర్పాట్లు లేకపోవడం పెద్ద సమస్య. ఇది కాలుష్య నివారణలో సమర్థ విధానాలను అవలంబించడానికి అడ్డంకిగా మారుతోంది. దేశంలో అయిదువేల మందికన్నా ఎక్కువ జనాభా ఉన్న నాలుగువేలకుపైగా పట్టణాల్లో 12 శాతానికి మాత్రమే నిరంతర వాయు నాణ్యతా నిర్ధరణ కేంద్రాలున్నాయి. ఈ సంఖ్యను బాగా విస్తరించాలని సైన్స్, పర్యావరణ సంస్థ (సీఎస్ఈ) సిఫార్సు చేస్తోంది. గాలిలో కాలుష్య కణాలు తదితర ఉద్గారాల గురించి సమాచారాన్ని సేకరించి నివారణ చర్యలు తీసుకోవడానికి వీలుగా వేలాది పర్యవేక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. వాయు కాలుష్యంపై నిఘాకోసం తక్కువ ఖర్చుతో సెన్సర్లు, మొబైల్ యాప్‌లు, డేటా వేదికల రూపకల్పన చేపట్టేలా యువ నవీకరణ సాధకులను ప్రోత్సహించాలి. హైదరాబాద్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు రూపొందించిన క్యాన్‌శాట్ అనే మినీ శాటిలైట్‌లోని సెన్సర్లు గాలిలోని అమోనియా, కార్బన్‌డయాక్సైడ్, ఓజోన్, నైట్రోజన్ డయాక్సైడ్, ఉష్ణోగ్రత, హ్యూమిడిటీ గురించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు భూతల కేంద్రానికి చేరవేయగలవు. గాలిలోని సూక్ష్మ కాలుష్య కణాలను పసిగట్టే పీఎం సెన్సర్లను శివనాడార్ విశ్వవిద్యాలయం విద్యార్థులు రూపొందించారు. వాటిని కదిలే బస్సుల మీద అమర్చవచ్చు. విద్యార్థులు రూపొందించిన ఇలాంటి ఎన్నో నవీన పరికరాలకు సరైన అండదండలు లభించక ప్రయోగశాలకే పరిమితమైపోతున్నాయి. వారు ఆవిష్కరించిన సాధనాలను జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం, స్మార్ట్ సిటీస్ పథకం, రాష్ట్రాల్లో కాలుష్య నియంత్రణ కార్యక్రమాల్లో ఉపయోగించాలి. విద్యార్థుల పాఠ్య ప్రణాళికల్లో మార్పులతోపాటు, ల్యాబుల్లో ప్రయోగాలు, పరిశోధనలు చేయించాలి. వారి ఆవిష్కరణలను ఆచరణలోకి తీసుకొచ్చి ప్రోత్సాహం అందించాలి.

అపర్ణా రాయ్
పర్యావరణ, ఇంధన రంగ నిపుణులు, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్

ఎమోషనల్ బడ్జెట్ వేసుకున్నారా!

డబ్బు, ఆస్తులు, ఆదాయం ఇవన్నీ భౌతిక సంపదలు. భావోద్వేగాలు, శక్తి, సమయం ఇవన్నీ మనకున్న అదృశ్య ఆస్తులు. ఆర్థిక జీవితాన్ని క్రమబద్ధం చేసుకోవడానికి ఆదాయ- వ్యయాల బడ్జెట్ ఎంత అవసరమో, అదృశ్య సంపదను ప్రభావవంతంగా వినియోగించుకోవడానికి భావోద్వేగాల బడ్జెట్ (ఎమోషనల్ బడ్జెట్) అంతకన్నా ఎక్కువ అవసరం. అది ఆ అదృశ్య వనరుల్ని క్రమబద్ధం చేసి, మంచి జీవనశైలికి దిశానిర్దేశం చేస్తుంది.



ఆర్థిక బడ్జెట్ లేకపోతే జీవితం గందరగోళంగా మారినట్లే- ఎమోషనల్ బడ్జెట్ లేకపోతే మనసు అలసట, అసహనం, నిరాశలతో నిండిపోయి, ఆందోళనను పెంచుతుంది. ఏ పనికి ఎంత సమయం కేటాయించాలి, ఏ ఆలోచనకు ఎంత విలువివ్వాలి అనేవి ఎవరికివారు నిర్ణయించుకోవాలి. ఆర్థిక బడ్జెట్ మనకు సౌకర్యాలనిస్తే, ఎమోషనల్ బడ్జెట్ సంతృప్తినిస్తుంది.

సంతోషం, ప్రశాంతత, కృతజ్ఞత, ప్రేమ, అర్థవంతమైన పని, ధ్యానం, కుటుంబ సమయం ఇలాంటివన్నీ అదృశ్య ఆదాయ వనరులు. కోపం, అసూయ, ఆందోళన, నిరాశ, పోచుకోలు కబుర్లు, అనవసర వాదనలు.. లాంటివన్నీ వ్యయాలు. నిద్ర, విశ్రాంతి, ఏకాంత సమయం, సెల్ఫ్‌కేర్... ఇవన్నీ భవిష్యత్తుకు భద్రతనిచ్చే నిధులు. వీటి మధ్య సమతుల్యత లేకపోతే ఎమోషనల్ బ్యాంక్‌రప్టసీ తలెత్తుతుంది. నిత్యజీవితంలో ఎమోషనల్ బడ్జెట్ అమలు చేయాలంటే ఆదాయాలకు ప్రాధాన్యమివ్వాలి, వ్యయాలు పరిమితం చేసుకోవాలి, నిల్వలు తప్పనిసరిగా ఉంచుకోవాలి. ఆర్థిక బడ్జెట్‌లో అనూహ్య ఖర్చుల కోసం కంటింజెన్సీ ఫండ్ ఉంటుంది. అలాగే ఎమోషనల్ బడ్జెట్లో కూడా అనూహ్యమైన భావోద్వేగ సవాళ్లకు సిద్ధంగా ఉండేందుకు అదనపు ఆత్మవిశ్వాసం, సహనం, ఆశ రూపంలో కొంత ఎమర్జెన్సీ ఫండ్ ఉంచుకోవడం ముఖ్యం. ఇది తీవ్ర కష్ట సమయాల్లో పరోక్షంగా సాయపడుతుంది.

ఉదయం ఆఫీసుకు వెళ్లే లోపల ధ్యానం, ప్రార్థన, వ్యాయామం లాంటివి చేయడం వల్ల ఆదాయం పెరుగుతుంది. సోషల్ మీడియాకి, ఫోన్‌కి దూరంగా ఉండడం వల్ల వ్యయం తగ్గుతుంది. 10 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య పూర్తిగా వృత్తి ఉద్యోగాలమీద దృష్టి కేంద్రీకరించడం వల్ల ఎదుగుదల ఉంటుంది. అనవసర సమావేశాలు, వ్యర్థ ప్రసంగాలు తగ్గించడం వల్ల వ్యయం నియంత్రణలో ఉంటుంది. సాయంత్రం కుటుంబసభ్యులతో గడపడం, స్నేహితులతో అర్థవంతమైన సంభాషణ, రాత్రి భోజనం తరవాత కాసేపు నడక... నిల్వలను పెంచుతాయి. సోషల్ మీడియాలాంటి కాలక్షేపాలకు పరిమిత సమయం కేటాయిస్తే వ్యయం నియంత్రణలో ఉంటుంది. టీవీ బదులు పుస్తకం చదవడం, గ్రాటిట్యూడ్ డైరీ రాయడం వల్ల మానసిక ప్రశాంతతా నిధి పెరుగుతుంది. కనీసం 7-8 గంటల మంచినిద్ర మొత్తం బడ్జెట్‌పై సానుకూల ప్రభావాన్ని చూపిస్తుంది.

మరెందుకింకా అలస్యం? రోజువారీ జీవితంలో అమలు చేయడానికి ఇదొక ఆదర్శ నమూనా. వ్యక్తిగత పరిమితులు, ఉద్యోగ వేళలూ బాధ్యతలు, శక్తి స్థాయిలను బట్టి దీన్ని ఎవరికి వారు సర్దుబాటు చేసుకోవచ్చు. మానసిక వనరులను అత్యంత ప్రభావవంతంగా వినియోగించే కళ.. ఈ ఎమోషనల్ బడ్జెటింగ్.

– పున్నమరాజు

కాంక్రీట్ ప్రపంచం

జనాభా ఆహార అవసరాలు తీర్చే క్రమంలో వ్యవసాయ విస్తరణ అనివార్యమైంది. ఈ క్రమంలో విశ్వవ్యాప్తంగా అటవీ భూమి తరిగిపోయి సాగుభూమి, పచ్చిక బయళ్లు పెద్దమొత్తంలో అందుబాటులోకి వచ్చాయి. అదే సమయంలో నిర్మాణ ప్రాంతమూ భారీగా పెరిగింది. ముఖ్యంగా 1900-2000 మధ్య పెద్ద మొత్తంలో భూమి నివాస అవసరాలు, మౌలిక వసతుల కల్పనకు మరలిపోయింది. 2000 సంవత్సరం తరవాత పచ్చిక బయళ్ల విస్తీర్ణంలో క్షీణత మొదలైంది. ఆయా కాలాల్లో ప్రపంచ వ్యాప్తంగా పంట భూమి, పచ్చిక బయళ్లు, నిర్మాణాల పరంగా భూ వినియోగం... (కోట్ల హెక్టార్లలో)

సంవత్సరం	సాగు భూమి	పచ్చిక బయళ్లు	నిర్మాణ ప్రాంతం
1600	29.90	5.54	0.12
1700	32.85	59.94	0.13
1800	47.70	86.10	0.26
1900	90.03	157	1.24
2000	149	332	5.28
2023	163	320	8.31

(ఆధారం: హిస్టరీ డేటాబేస్ ఆఫ్ ద గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్)

అరిస్తే అరవనీ... కరిస్తే కరవనీ..!

మన దేశంలో ఎక్కడ చూసినా వీధుల్లో శునకాలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ అందరినీ బెంబేలెత్తిస్తున్నాయి. సంవత్సరానికి సగటున 30 లక్షల మందికిపైగా కుక్క కాట్లకు గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా సంభవిస్తున్న రేబీస్ మరణాల్లో భారత్‌లోనే 36శాతం జరుగుతున్నాయి. కేంద్ర ఆరోగ్యశాఖ సమాచారం ప్రకారం 2022లో 21.89 లక్షలు, 2023లో 30.52 లక్షలు, 2024లో 37.15 లక్షల మందిపై వీధి కుక్కలు దాడి చేశాయి. మూడేళ్లలో మొత్తం 126 మంది రేబీస్‌తో మరణించారు. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

'వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అయిదేళ్లుగా చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయి. కుక్క కాట్లతో ఏ ఒక్కరు గాయపడినా, ప్రాణాలు కోల్పోయినా భారీ పరిహారం చెల్లించాలని రాష్ట్రాలను ఆదేశిస్తాం'- ఇటీవల సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలివి. శునకాల దాడి ఘటనల్లో వాటికి ఆహారం పెట్టేవారిని కూడా జవాబుదారీగా చేస్తామని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం నిర్లక్ష్య వైఖరి చర్చనీయాంశంగా మారింది.

అమలుకు నోచుకోని నిబంధనలు

శునకాల సంఖ్యను నియంత్రించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2023లో జంతు జనన నియంత్రణ(ఏబీసీ) నిబంధనలను సవరించింది. ఆ ప్రకారం శునకాలను పట్టుకుని వాటికి శస్త్ర చికిత్సలు చేసి, టీకాలు వేయాల్సి ఉంటుంది. ఆ తరవాత తిరిగి అవి ఎక్కడ ఉండేవో అక్కడే విడిచిపెట్టాలి. అనారోగ్యకరమైన, తీవ్ర దాడులు చేసేవాటికి ఈ నిబంధనలు వర్తించవని స్పష్టంచేసింది. వీధి కుక్కలకు ఆహారం పెట్టేందుకు మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక స్థలాలు కేటాయించాలని సూచించింది. అయితే, చాలా రాష్ట్రాల్లో ఇవేవీ అమలు కాకపోవడంతో సమస్య మరింత జటిలమవుతోంది. పట్టణాలు, నగరాల్లో తూతూమంత్రంగా శస్త్రచికిత్సలు చేయించి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అసలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు, ఈ విషయంలో పలు దేశాలు పకడ్బందీ ప్రణాళికలు, కట్టుదిట్టమైన చర్యలతో వీధి కుక్కల నియంత్రణలో విజయం సాధించాయి. భూటాన్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. 2023లో దేశవ్యాప్తంగా వందశాతం వీధి శునకాలకు సంతానోత్పత్తి నిరోధక శస్త్ర చికిత్సలు చేపట్టింది. కేవలం రెండేళ్లలో వాలంటీర్లు, ప్రజల భాగస్వామ్యంతో 90శాతం కుక్కలకు టీకాలు వేయించింది. కఠినమైన చట్టాలు, పన్నుల విధింపు వంటి విధానాలతో నెదర్లాండ్స్ ముందడుగు వేసింది. 'పట్టుకోవడం- శస్త్రచికిత్స చేయడం- టీకాలు వేయడం- విడిచిపెట్టడం' అనే విధానాన్ని పక్కాగా అమలు చేసిన బల్గేరియా శునకాల సంఖ్యను గణనీయంగా తగ్గించింది. కొన్ని దేశాల్లో వీధి కుక్కల సామూహిక హననం వంటి పద్ధతులను అనుసరిస్తున్నా, మన దేశంలో అవి పూర్తిగా నిషేధం.

తుర్కియేలో ప్రమాదకరంగా మారిన, తీవ్ర అనారోగ్యంతో బాధపడే కుక్కలను మాత్రమే చంపేలా చట్టం చేశారు. ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, డెన్మార్క్‌లలో కుక్కలకు రిజిస్ట్రేషన్‌తో పాటు మైక్రో చిప్‌లు అమరుస్తారు. వాటిని ఎక్కడ పడితే అక్కడే వదిలేస్తే యాజమానులకు భారీ జరిమానాలతో పాటు జైలుశిక్షలు విధిస్తారు. మన దేశంలో గోవా 2018లో రేబీస్ రహిత రాష్ట్రంగా అవతరించింది. అయిదేళ్లపాటు 'మిషన్ రేబీస్'ను విజయవంతంగా అమలు చేసింది. లక్ష కుక్కలకు టీకాలు వేయించడంతో పాటు పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 5.2 లక్షల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులను చైతన్య పరిచింది.

నిర్లక్ష్యం వీడని రాష్ట్రాలు

రేబీస్ నిర్మూలనకు కేంద్రం ప్రత్యేకంగా కార్యాచరణ ప్రణాళిక (ఎన్ఏపీఆర్ఈ)ను అమలు చేస్తోంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, పశుసంవర్ధక శాఖలు కలిసి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో ఫలితం రావడం లేదు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఎన్ఆర్‌సీపీకి కేటాయిస్తున్న నిధులు వృథాగా మారుతున్నాయి. రాష్ట్రాల్లో రేబీస్ నిర్మూలనకు కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనతో పాటు అమలుకు సంబంధించి గత రెండేళ్లలో దిల్లీతో పాటు ఉత్తర, దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల్లో కార్యశాలలు నిర్వహించారు. ఆ తరవాత రాజస్థాన్, పుదుచ్చేరి, మేఘాలయ, మిజోరం, తమిళనాడు రాష్ట్రాలు మాత్రమే కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేశాయి. మిగిలిన రాష్ట్రాలు ఇంకా చర్యలు చేపట్టే దశలోనే ఉండటం గమనార్హం. ఇప్పటికైనా వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీన వైఖరిని విడనాడాలి. తక్షణమే కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, అమలుకు పూనుకోవాలి. వీధి కుక్కల నియంత్రణ విషయంలో పర్యవేక్షణ పెంచాలి. అప్పుడే రేబీస్ రహిత భారత్ సుసాధ్యమవుతుంది.

– ర్యాలి హేమంత్ కుమార్

అడవిలో జింక దాని బిడ్డతో జీవిస్తోంది. ఆ జింకపిల్ల చాలా అమాయకురాలు. కానీ బాగా అ

ఈనాడు అమరావతి
ఎన్టీఆర్
గురువారం జనవరి 22, 2026

అమ్మ పేరుతో నమ్మకద్రోహం!

ఈనాడు, అమరావతి - ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

- దుర్గమ్మ చీరలిస్తాం.. పూజలు చేస్తాం
- భక్తులకు సైబర్ నేరగాళ్ల ఫోన్‌కాల్స్

విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం పేరుతో.. సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. దేవస్థానం నుంచి ఫోన్ చేసినట్లుగా భక్తులను నమ్మిస్తూ.. డబ్బులను గుంజే ప్రయత్నాలు ఆరంభించారు. అమ్మవారి పట్టు చీరలు ఇంటికి పంపిస్తాం, మీ పేరు, గోత్ర నామాలతో పూజలు చేస్తామని భక్తులకు ఫోన్లు చేస్తున్నారు. వారిని నమ్మించి.. విరాళాల రూపంలో వసూళ్లు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై తాజాగా కొందరు భక్తులు ఫిర్యాదు చేయడంతో ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆలయం పేరుతో ఎవరూ ఫోన్లు చేసి.. విరాళాలు, డబ్బులు అడగరనీ.. ఇలాంటివి నమ్మి మోసపోవద్దని ఈవో శీనానాయక్ వెల్లడించారు.

❖ దేశవిదేశాల్లో ఉండే భక్తులే వారికి అవసరమైన సేవల గురించి.. ఆలయ అధికారిక వెబ్‌సైట్, సమాచార కేంద్రం, మనమిత్ర వాట్సాప్ సేవల ద్వారా నిత్యం తెలుసుకుంటారు. డబ్బులు కడితే.. అమ్మవారి చీరలు పంపిస్తాం. ప్రత్యేక పూజలు చేస్తామని.. దేవస్థానం నుంచి అధికారికంగా ఎవరూ భక్తులను సంప్రదించరు. కొద్దిరోజులుగా అపరిచిత వ్యక్తులు.. దేవస్థానం పేరుతో భక్తులను బురిడీ కొట్టించేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవన్నీ సైబర్ నేరగాళ్లు చేస్తున్న ప్రయత్నాలుగా తాము గుర్తించామని శీనానాయక్ తెలిపారు. వీటిపై భక్తులను అప్రమత్తం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామనీ, ఆలయ ప్రాంగణంలోనూ.. మైక్‌లో ఇలాంటి వాటిపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని పేర్కొన్నారు.

ఏ టికెట్ అయినా...

దేవస్థానం వెబ్‌సైట్‌లో మాత్రమే దర్శనం, ఆర్జిత సేవల టికెట్లను బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఈవో శీనానాయక్ తెలిపారు. ఫోన్ చేసి.. ఓటీపీలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను సైబర్ నేరగాళ్లు అడిగితే ఇవ్వొద్దంటూ సూచించారు.

జిల్లా ప్రగతికి అద్దంపట్టేలా శకటాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఏడాది కాలంలో జిల్లా ప్రగతి, విజయాలకు అద్దంపట్టేలా, ప్రజలను చైతన్యవంతులను చేసేలా శకటాల ప్రదర్శన ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. జిల్లాల విభజన తర్వాత ఇందిరాగాంధీ స్టేడియంలో తొలిసారిగా నిర్వహించనున్న జిల్లా స్థాయి గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047, నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలు, మహిళా సాధికారిత, వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సాంకేతికత, పారిశ్రామిక ప్రగతి ఇలా.. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి శకటాల ప్రదర్శన ఉండాలని సూచించారు. వేదిక ఏర్పాట్లు, పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, భద్రతా చర్యలు, ప్రజలకు సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సమన్వయంతో పని చేసి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఏటా రాష్ట్ర స్థాయి గణతంత్ర వేడుకలను ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించేవారు. ఈ దఫా రాజధాని అమరావతిలో నిర్వహించనున్నారు. దీంతో జిల్లా స్థాయి వేడుకలను ఇందిరాగాంధీ స్టేడియంలో 26న నిర్వహించనున్నారు. జేసీ ఇలక్కియా, డీఆర్వో లక్ష్మీనరసింహం, ఆర్డీవో చైతన్య, అధికారులు హాజరయ్యారు.

నగర కూడలి.. సుందర లోగిలి!

★ 'స్పా' తోడ్పాటుతో రూపు మార్చేలా ప్రణాళిక ★ తొలిగా మూడు ప్రాంతాల ఎంపిక... సర్వే

ఈనాడు, అమరావతి

పెరుగుతున్న జనాభా, వాహనాలకు తగ్గట్టుగా కూడళ్లు లేక నగరం పద్మవ్యూహంలా మారింది. ఈ పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు ట్రాఫిక్ పోలీసు విభాగం స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) సాయం తీసుకుంటోంది. 'టాక్టికల్ అర్బనిజం' ప్రధాన అంశంగా ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. దీనిపై బుధవారం.. ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం, అధికారులతో కలసి స్పాను సందర్శించి.. డైరెక్టర్, బోధన సిబ్బందితో చర్చించారు. నగర అవసరాలకు తగ్గట్టుగా ముఖ్య కూడళ్లలో స్పా సర్వే చేసి డిజైన్లు, ప్రణాళికను అందజేయనుంది.

పంటి 'టాక్టికల్ అర్బనిజం'...

తక్కువ ఖర్చు, స్వల్పకాలిక విధానం, ప్రజల భాగస్వామ్యంతో అర్బన్ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తారు. తక్కువ వ్యయంతో మంచి ఫలితాలు సాధించేందుకు ఈ పద్ధతి ఆచరించనున్నారు.

బెంజిసర్కిల్ పైవంతెన..

సమస్యాత్మక కూడళ్లు గుర్తింపు...

నగరంలో చాలా కూడళ్లు అభివృద్ధికి నోచుకోలేదు. ఎక్కడ చూసినా ఆక్రమణలతో ఇక్కట్లు తప్పడం లేదు. ప్రధానంగా 12 ప్రాంతాలను పోలీసులు గుర్తించారు. అమ్మవారి ఆలయ ప్రాంతం, కేఆర్ మార్కెట్, కేదారేశ్వరపేట, బీసెంట్ రోడ్డు, రాజగోపాలాచారి వీధి, పటమట రైతుబజారు, గుల్జార్ వంతెన, స్వాతి రోడ్డు, ప్రకాశం రోడ్డు, హైటెన్షన్ రోడ్డు, కృష్ణలంక అండర్‌పాస్, పీవీపీ మాల్ రోడ్డు ప్రాంతాలను ఎంపిక చేశారు. ఈ కూడళ్లలో అవరోధాలు తొలగించి, సుందరీకరణ చేయాలనేది లక్ష్యం.

ముఖ్య కూడళ్లలో ఆక్రమణల తొలగింపు, అవరోధాలు లేకుండా ట్రాఫిక్ సాగడం, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ జోన్లను గుర్తించడం, పాదచారుల కోసం జీబ్రా లైన్లను వేయనున్నారు. వీఎంసీ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు తదితరులను భాగస్వాములను చేయాలనేది లక్ష్యం.

నిపుణులతో అధ్యయనం...

ట్రాఫిక్ పోలీసులు గుర్తించిన ప్రధాన కూడళ్లలో తొలి దశ కింద మూడు ప్రాంతాలను ఎంపిక చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంతం, పటమట రైతుబజారు, రామవరప్పాడులోని అంకమ్మ తల్లి ఆలయం ప్రదేశాలపై స్పాలో ఉన్న పట్టణ ప్రణాళిక నిపుణుల బృందం అధ్యయనం చేయనుంది. ఈ ప్రాంతాల్లో ఈ బృందం ప్రస్తుత పరిస్థితులపై సమగ్రంగా అధ్యయనం చేసి, అక్కడ చేయాల్సిన మార్పులకు సంబంధించి రేఖా చిత్రాలు, సూచనలను అందజేయనుంది. తర్వాత నగరపాలిక, ర.భ. శాఖ, సీఆర్డీఏ, తదితర శాఖలు, ఎంపీ నిధులతో అభివృద్ధి చేయనున్నారు.

2,533 టన్నుల యూరియా నిల్వలు

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో రబీ పంటల సాగు నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి రాబోవు 11 రోజులకు 1,304 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ప్రస్తుతం 2,533 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి డి.ఎం.ఎఫ్. విజయకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని ఆమె పేర్కొన్నారు.

రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
07059/07060 సికింద్రాబాద్-అనకాపల్లి (ఫిబ్రవరి 9వ తేదీ నుంచి 24 వరకు). 07035/07036 చర్లపల్లి-అనకాపలి (14 నుంచి మార్చి 1వరకు).

బోర్డు లేని ఆయుష్ శాఖ కార్యాలయ భవనం

ష్.. ఇది ఆయుష్!

ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య సేవలను పర్యవేక్షించే ఆయుష్ శాఖ ప్రధాన కార్యాలయం విజయవాడ గొల్లపూడి సాయిపురం కాలనీలో ఉంది. గూగుల్‌లో వెతుక్కుంటే దారి చూపిస్తుంది కానీ అక్కడకు వెళితే మాత్రం కనీసం భవనంపై బోర్డు కూడా కనిపించదు. సరికదా శిథిలావస్థకు చేరి గోడలు మొదలు స్లాబు వరకు పెచ్చులూడిపోతూ అధ్వాన స్థితిలో దర్శనమిస్తోంది. నిత్యం ఆయుర్వేద, హోమియో మొదలు ఎంతోమంది డాక్టర్లు సైతం ఇక్కడకు తమ ద్రువపత్రాల రెన్యువల్‌కు వస్తుంటారు. సెల్లార్‌లో కుక్కలు, పశువులు దర్శనమిస్తుండగా.. 4వ ఫ్లోర్‌లో ఆయుష్ కార్యాలయంలో మహిళలకు మరుగుదొడ్లు అని ఉన్నా నిర్వహణ కొరవడి చెత్తతో నిరుపయోగంగా మారాయి. మిగిలిన అంతస్తుల్లో ఎక్కడ చూసినా మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. స్విచ్ బోర్డులు పగిలిపోయాయి. ఆయుష్ శాఖ, అర్థ గణాంక శాఖ కార్యాలయం ఉన్న భవనంలో ఉన్న దుస్థితి చూసి పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

- ఈనాడు, అమరావతి

మహిళల మరుగుదొడ్ల గదుల లోపల ఇలా..

కరెంటు స్విచ్‌లు, ప్లగ్‌లు ఇలా..

జేఈఈ మెయిన్ ప్రారంభం

విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కానూరు కేంద్రం వద్ద రద్దీ

విద్యార్థిని తలకు కట్టుకున్న స్కార్ఫ్ తీయిస్తున్న పోలీసులు

కానూరు, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా జిల్లాలో జేఈఈ మెయిన్-2026 మొదటి విడత ప్రవేశ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం జిల్లాలోని 9 పరీక్షా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లోకి రెండు గంటల ముందు నుంచే అభ్యర్థులను అనుమతించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో 98 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. నగర పరిధిలో అయాన్ సెంటర్లు 4 వరకు ఉండడంతో కొందరు విద్యార్థులు తికమకపడి మరో సెంటర్‌కు వెళ్లి ఇబ్బందులు పడ్డారు. కండ్రిక అయాన్ సెంటర్ పరీక్షా కేంద్రాలు కేటాయించిన పలువురు విద్యార్థులు కానూరు అయాన్ సెంటర్‌కు వచ్చారు. తిరిగి అక్కడికి పరుగు తీశారు. పరీక్ష రోజు ముందే పరీక్షా కేంద్రాలు ఎక్కడో తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



ఎర్రబంగారం మెరిసిందోచ్..

యార్డులో మిర్చి విక్రయాలు

ప్రధాన మార్కెట్లలో మిరప ధరలు అమాంతంగా పెరిగాయి. రెండు రోజుల వ్యవధిలోనే ఎర్రబంగారం క్వింటాల్‌కు రూ.4 వేలు పెరిగింది. ఖమ్మం, మధిర, గుంటూరు మార్కెట్లలో బుధవారం క్వింటాల్ మిరపకాయలు (తేజ రకం) జెండా పాట రూ.20 వేలు పలికింది. సోమవారం రూ.16 వేలు, మంగళవారం రూ.17,600 ధర లభించగా బుధవారం రూ.20 వేలకు చేరింది. వారం రోజుల కిందట వరకు రూ.13 నుంచి రూ.14 వేల వరకు ధర ఉండగా సాగుదారులు డీలాపడ్డారు. పెట్టుబడి వ్యయం కూడా రాదని దిగులు చెందుతుండగా బుధవారం విపణిలో లభించిన ధర మళ్లీ ఆశలు రేకెత్తిస్తున్నాయి.

క్వింటాల్‌కు రూ.20 వేలు..

✦ జిల్లాలోని తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 2025 ఖరీఫ్ సీజన్‌లో 21 వేల ఎకరాల్లో మిరప సాగు చేశారు. ధర బాగుంటేనే దిగుబడి తగ్గినా పెట్టుబడి ఖర్చులు దక్కుతాయని రైతులు ఆశతో ఉన్నారు. మార్కెట్లో లావు రకం కాయలు కూడా రూ.20 వేలకు పైగా ధర పలుకుతున్నాయి. పసుపు రకం మిరపకు రూ.40 వేల వరకు ఉందని వ్యాపారులు చెబుతున్నారు. శీతల గిడ్డంగిలో నిల్వ ఉన్న తేజ రకం తాలు కాయల క్వింటాల్ ధర రూ.8 నుంచి రూ.9 వేల వరకు ఉంది. బుధవారం వాటి ధర కూడా పెరిగి రూ.11 వేలకు చేరింది. ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు కొత్త మిరపకాయలను విక్రయించేందుకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. తాజాగా మిరప ధరలు పెరగడంతో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన రైతులు వాటిని విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- గంపలగూడెం, న్యూస్‌టుడే

అధ్యయనంతోనే పాఠ్యాంశాలు గుర్తుంటాయి

విద్యార్థినులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : చదివిన పాఠాన్ని పూర్తి స్థాయిలో 360 డిగ్రీల్లో అధ్యయనం చేస్తే.. పరీక్షల వరకే కాకుండా జీవితాంతం అవి గుర్తుంటాయని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూలును ఆయన సందర్శించారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాల సాధనకు అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళిక అమలును పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. సాంఘికశాస్త్రంపై పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పిల్లల జవాబులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న అనేక మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తుచేశారు. తపనతో.. తమ మేధస్సుతో ప్రశ్నిస్తూ, నేర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని రెట్టింపు చేసేలా ఫలితాల సాధనకు కృషి చేయాలని కోరారు. సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా నిర్వహించాలని, పచ్చదనం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంకు సూచించారు.

లావాదేవీల్లో సూర్యకు 0.5% కమీషన్!

★ ప్రైవేటు బ్యాంకు మాజీ ఉద్యోగి మౌలాలి ప్రధాన పాత్ర
★ అద్దె ఖాతాల కేసులో వెలుగుచూస్తున్న కీలక అంశాలు..

ఈనాడు, అమరావతి: చట్ట విరుద్ధ కార్యకలాపాల కోసం సేకరించిన అద్దె ఖాతాల ద్వారా సాగే లావాదేవీల్లో ప్రధాన నిందితుడు సూర్యకు 0.5 శాతం కమీషన్... మిగిలిన వారికి ఖాతాకు రూ.20 వేలు వరకు అందేది. గతంలో ఆగ్రా పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించినా, కమీషన్ల కోసమే... సూర్య తిరిగి ఇందులోకి వచ్చాడు. అద్దె ఖాతాల కేసులో నిందితుల విచారణలో పలు కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితులు సూర్య (ఏ1), సౌభాగ్యలక్ష్మి (ఏ4)లను లోతుగా విచారించేందుకు పోలీసులు మూడు రోజుల కస్టడీకి తీసుకుని.. పలు వివరాలను రాబట్టారు.

మౌలాలి సహకారం... ప్రధానంగా బ్యాంకు ఖాతాలను ఎలా సమకూర్చుకునే వారు? ఈ వ్యవహారంలో ఎవరెవరు సహకరించారన్న కోణంలో ప్రధానంగా ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. ముఖ్యంగా పల్నాడు జిల్లాకు చెందిన ముగ్గురు సహకరించినట్లు తెలిసింది. వేణుగోపాల్, గుంజి గోపీకృష్ణ సాయం చేశారు. వీరిద్దరు... ఏ1 సూర్యకు డిగ్రీలో క్లాస్‌మేట్స్. వీరితోపాటు పల్నాడు జిల్లాకు చెందిన ప్రైవేటు బ్యాంకు మాజీ ఉద్యోగి మౌలాలి కూడా సహకరించాడు. సూర్యతోపాటు ఆగ్రా పోలీసులు మౌలాలిని కూడా గతంలో అరెస్టు చేశారు. నిందితులు సేకరించిన ఖాతాలను పార్వతికి ఇచ్చేవారు. ఆమె తిరిగి వాటిని ఫిలిప్పీన్స్‌లో ఉన్న స్రవంతికి అందజేసేది. కొన్నిసార్లు సూర్య నేరుగా ఫిలిప్పీన్స్‌కు చేరవేసేవాడని తేలింది.

చెక్కులు కొట్టేసి డబ్బులు డ్రా.. ఈ కేసులో నిందితుడైన కృష్ణారెడ్డి (ఏ3).. సూర్యకు తెలియకుండా చెక్కుల ద్వారా ఖాతాల నుంచి సొమ్ము డ్రా చేసేవాడు. అమాయకులతో తెరిపించిన, సొంత ఖాతాలకు సంబంధించి ఆన్‌లైన్ బ్యాంకింగ్ క్రెడెన్షియల్స్‌ను మాత్రమే ఫిలిప్పీన్స్ పంపేవాడు. పాస్‌పుస్తకాలను కృష్ణారెడ్డి, అతని భార్య సౌభాగ్యలక్ష్మిలు సూర్యకు పంపేవారు. ఆ సమయంలో ప్రతి దాంట్లో కొన్ని చెక్కులు మాయం చేసేవాడు. వీటితో సొంతంగా డ్రా చేసుకునేవాడు. ఇలా పలు మార్లు డ్రా చేసినట్లు సౌభాగ్యలక్ష్మి విచారణలో వెల్లడించింది.

కానిస్తే సరి.. కాదంటే కొర్రీ!

ఈనాడు, అమరావతి

కార్యదర్శి పదోన్నతుల్లో వసూళ్లు...
విధుల్లో చేరాలంటే ఇవ్వాల్సిందేనట

పదోన్నతి పొందిన పంచాయతీ కార్యదర్శుల బదిలీ, నియామక ప్రక్రియలో కొందరు అధికారులు కాసులు పోగేసుకుంటున్నారు. బదిలీ అయినచోట కొలువులో చేరాలంటే మామూళ్లు ఇవ్వాల్సిందేనని అనధికారిక రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. ఉద్యోగులు సైతం చేసేది లేక అడిగింది ఇచ్చి విధుల్లో చేరుతున్నారు.

ఒక్కొక్కరి నుంచి రూ.30 వేలు..

★ జోన్-2 పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో అర్హత ఉన్న గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-1 పదోన్నతులు ఇస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాకు 52 మంది కార్యదర్శులకు బదిలీ అయ్యారు. ★ కేటాయించిన పంచాయతీల్లో విధుల్లో చేరాలంటే కార్యాలయం ఖర్చులకు ఒక్కో ఉద్యోగి రూ.30 వేలు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. ఇదేంటని అడిగితే 'పదోన్నతి వచ్చింది. జిల్లా కాని జిల్లాకు వచ్చారు. భవిష్యత్తు బాగుండాలంటే చెప్పింది చేయండని' సున్నితంగా బెదిరిస్తున్నారు. ★ ఎన్టీఆర్‌తో పోలిస్తే కృష్ణాలో దందా శ్రుతి మించింది. డీపీవో కార్యాలయంలో ఓ అధికారి వసూళ్ల వ్యవహారం మొత్తం చక్కబెడుతున్నారు. ★ ఏలూరు నుంచి పదోన్నతులు పొంది కృష్ణా జిల్లాకు బదిలీ అయిన నలుగురు కార్యదర్శులు సదరు అధికారిని కలిసి ఒక్కొక్కరు రూ.30 వేలు ఇవ్వలేమని మొత్తం కలిపి రూ.లక్ష ఇచ్చి విధుల్లో చేరారు. చాలా మంది ఇలా సొమ్ము చెల్లించి విధుల్లో చేరారు. మామూళ్లు ఇచ్చేందుకు తటపటాయించే వారిని విధుల్లో చేరకుండా కొర్రీలు పెడుతున్నారు.

సిఫార్సు లేఖలుంటేనే..?

★ మామూళ్లు ముట్టజెప్పినా కొందరి విషయంలో స్థానిక నాయకులు అడ్డుపడుతున్నారు. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తీసుకుంటేనే విధుల్లో చేరాలంటున్నారు. వేరే జిల్లాల నుంచి వచ్చామని తమకు ఏ నాయకులు తెలియదని వారు వాపోతున్నారు. ★ మచిలీపట్నం సమీప నియోజకవర్గంలోని పంచాయతీకి ఏలూరు నుంచి పదోన్నతిపై వచ్చిన ఓ కార్యదర్శి అధికారులు అడిగినంతా ఇచ్చారు. విధుల్లో చేరేందుకు వెళ్లినా ఎమ్మెల్యే సిఫార్సు లేనిదే చేర్చుకునేదే లేదని ఎంపీడీవో తెగేసి చెప్పారు. ★ దీనిపై కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు బాలాజీ, లక్ష్మీశ మాట్లాడుతూ.. 'విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. విధుల్లో చేరేందుకు ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు'. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విధుల్లో చేరొచ్చు. ఎవరైనా ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామన్నారు.

(c) eenadu

ఎస్సీల హక్కుల సాధనే లక్ష్యం

సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జవహర్. పక్కన ఎమ్మెల్యేలు రాజు, బ్రహ్మానందరెడ్డి తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : షెడ్యూల్డ్ కులాల హక్కుల సాధన, వివక్ష లేని కుల రహిత సమాజమే లక్ష్యంగా పని చేస్తామని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ అన్నారు. బుధవారం విజయవాడలోని కందుకూరి కల్యాణ మండపంలో ఎస్సీ కమిషన్ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సభ్యులు మేకల భిక్షం(బాబు), ఎస్టీ రామాంజినమ్మ, రావాడ సీతారామ్, పి.గౌతమ్ రాజ్, డాక్టర్ శ్రీపతి బాబులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, అణగారిన కులాల గొంతుకగా ఎస్సీ కమిషన్ పనిచేయాలని పేర్కొన్నారు. దళితులు రాజకీయంగా ఎదగాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి, వినియోగదారుల రక్షణ మండలి ఛైర్‌పర్సన్ పీతల సుజాత మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు తమ కోసం కాకుండా సమాజంలోని అసమానతలను తొలగించడానికి పోరాడితే చరిత్రలో నిలిచిపోతారన్నారు. మడకశిర ఎమ్మెల్యే, తితిదే బోర్డు సభ్యుడు ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ.. దళితులకు రక్షణ, ఆత్మగౌరవం, సంక్షేమం కూటమి పాలనలోనే దక్కాయన్నారు. గత వైకాపా పాలనలో అఘాయిత్యాలు, దాడులు పెరిగిపోయాయని గుర్తుచేశారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం బలహీనవర్గాల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. బాలయోగి, ప్రతిభా భారతిలను పార్లమెంట్, శాసనసభ స్పీకర్‌లుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పల్నాడు జిల్లా పిన్నెల్లి ఘటనపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్‌ను కోరారు. కమిషన్ సభ్యుడు మేకల భిక్షం మాట్లాడుతూ.. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఛైర్మన్, సభ్యులను నాయకులు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. కూటమి పార్టీల నాయకులు, దళిత కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలకు పెద్దపీట

సమావేశంలో ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దేవస్థానం వైదిక కమిటీ, ఆస్థాన సిద్ధాంతి సమన్వయంతో భక్తుల మనోభావాలకు పెద్ద పీట వేయాలని దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ సూచించారు. ఆస్థాన సిద్ధాంతిగా బాధ్యతలు స్వీకరించిన చల్లా శ్రీనివాస శర్మ, దేవస్థానం అధికారులు, వైదిక కమిటీ సభ్యులతో కలిసి మొదటిసారి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల వైదిక కార్యక్రమాలు, మహా కుంభాభిషేకం ముహూర్తం విషయంలో భక్తులకు తలెత్తుతున్న అనుమానాలను నివృత్తి చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, అర్చకులు, వేదపండితులు, ఇంజినీరింగ్ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ప్రతి నెల వైదిక కమిటీ, ఆస్థాన సిద్ధాంతి దుర్గగుడిలో చేపట్టనున్న వైదిక కార్యక్రమాలు, ఆగమ విషయాలపై సమావేశం నిర్వహించడంతోపాటు నివేదిక అందజేయాలని కోరారు. స్థానాచార్య శివప్రసాద శర్మ మాట్లాడుతూ.. ఈనెల 23న నిర్వహించనున్న శ్రీపంచమి వేడుకలు ప్రతిష్ఠాత్మకంగా భావించి విద్యార్థులకు దుర్గమ్మ దర్శనం చేయించేందుకు సమష్టిగా నిర్ణయించామన్నారు. ఆస్థాన సిద్ధాంతి శ్రీనివాసశర్మ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచే విధంగా వైదిక, ఆగమ కార్యక్రమాలను నిర్వహించేందుకు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, ఈఈ కోటేశ్వరరావు, ఏసీ రంగారావు, అర్చకులు శంకరశాండిల్య, శ్రీనివాసశాస్త్రి, శ్రీధర్ శర్మ, వేదపండితులు షణ్ముఖశాస్త్రి, ఆంజనేయ ఘనపాఠి తదితరులు పాల్గొన్నారు.

'మహిళా చట్టాల అమలులో వివక్ష తగదు'

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యవతి, లక్ష్మి, పద్మ, మణి, భారతి తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : దేశంలో మహిళల చట్టాలను అమలు చేయడంలో కుల వివక్ష, వర్గ పక్షపాతంతో నిండిపోయి ఉండడంతో న్యాయం అందడం లేదని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి పి.సత్యవతి ఆవేదన వ్యక్తం చేశారు. పీవోడబ్ల్యూ (ప్రగతిశీల మహిళా సంఘం) రూపొందించిన 'మహిళా చట్టాల అనుభవాలు, న్యాయం కోసం సుదీర్ఘ ప్రయాణం' అనే పుస్తకాన్ని బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. వరకట్న వేధింపులు, బాల్య వివాహం, అత్యాచారం, లైంగిక హింస, కస్టడీ హింస, పని ప్రదేశాల్లో వేధింపులు వంటి చట్టాలన్నీ ప్రభుత్వం తానంతట తాను ఇవ్వలేదని. సంఘటిత పోరాటాలతోనే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయడానికి వెళ్లే మహిళలకు.. అవి భయంకరమైన ప్రదేశాలుగా ఉంటున్నాయన్నారు. దర్యాప్తులు నిర్లక్ష్యంగా జరుగుతున్నాయని ఆరోపించారు. అనేక కేసుల్లో ఆర్థిక శక్తిమంతులు, కార్పొరేట్ వర్గాలు, భూస్వాములు శిక్షలు లేకుండా తప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. చట్టాలు మార్చడం వల్ల మహిళలకు న్యాయం జరగదని.. అమలు చేసే సంస్థలు, వాటిని నడిపించే సామాజిక ఆలోచనలు మారాలని సూచించారు. ఈ పుస్తకం.. క్రిమినల్ న్యాయ వ్యవస్థలోని కొన్ని చట్టాలు, మహిళల కోసం చేసిన సవరణలు.., మౌలిక హక్కులు, సౌకర్యాలు కల్పించడంలో రాజ్యం ఎలా విఫలమవుతుంతో స్పష్టంగా వివరించిందన్నారు. మహిళలు ప్రజా ఉద్యమాల్లో సంఘటితంగా కొనసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ప్రధాన కార్యదర్శి బి.పద్మ, పి.పద్మ, జి.మణి, భారతి, ఎస్.జయలక్ష్మి, కె.లత, కె.దుర్గ, బి.శ్రీదేవి, బి.మంజుల, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్స్ కృష్ణా.. సీనియర్స్ నెల్లూరు

ఈఎస్ఎల్ ప్రాంతీయ స్థాయి పోటీల్లో విజేతలు వీరే

గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని హిల్‌వ్యూ స్టేడియంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ప్రజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) సెంట్రల్ ఆంధ్రా ప్రాంతీయ స్థాయి క్రికెట్ పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లోని జట్లు బుధవారం జరిగిన ఫైనల్స్‌లో నువ్వా.. నేనా అన్న రీతిలో పోటీ పడ్డాయి. జూనియర్స్ విభాగంలో కృష్ణా-పశ్చిమ గోదావరి, సీనియర్స్ విభాగంలో ప్రకాశం, నెల్లూరు జట్ల మధ్య ఉత్కంఠ పోరు సాగింది. జూనియర్స్‌లో కృష్ణా, సీనియర్స్‌లో నెల్లూరు జట్లు విజయబావుటా ఎగురవేసి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీకి అర్హత సాధించాయి. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథులుగా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి బండ్లమూడి శ్రీనివాసరావు, చలపతి విద్యాసంస్థల ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు, 'ఈనాడు' గుంటూరు యూనిట్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభ వెలికితీయాలనే ఆలోచనతో 'ఈనాడు' క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. క్రీడల్లో చురుగ్గా పాల్గొంటే శారీరక ఆరోగ్యంతో పాటు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వాగతించాలని తెలిపారు. 'ఈనాడు' పత్రిక సమాజంలో చెరగని ముద్ర వేసుకుందని, వార్తల్లో నవ్యత, ఆసక్తి ఉంటాయని, పిల్లల నుంచి పెద్దల వరకు జీవితానికి ఉపయోగపడే ఎన్నో అంశాలుంటాయని తెలిపారు. పత్రికను చదివి జీవితంలో గొప్పవారైనవారు ఎందరో ఉన్నారన్నారు.

★ ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ప్రతినిధి బండ్ల మూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలంటే క్రీడల్లో రాణించాలని కోరారు. 'ఈనాడు' యాజమాన్యం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల విద్యార్థులకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ.. స్పాన్సర్స్‌గా అవకాశం ఇవ్వడం గర్వంగా భావిస్తున్నామన్నారు. ★ చలపతి విద్యాసంస్థల ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకు 'ఈనాడు' చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. 15 ఏళ్లుగా క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారని, అందుకు వేదికగా చలపతి ప్రాంగణాన్ని ఎంచుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

★ 'ఈనాడు' గుంటూరు యూనిట్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్‌కు సహకరించిన ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్, చలపతి విద్యాసంస్థల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. యువతలో క్రీడా ప్రతిభ వెలికితీసేందుకు ఇటువంటి టోర్నీలు మంచి వేదికగా నిలుస్తాయన్నారు. అనంతరం ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

గౌతమ్ (జూనియర్స్) కమల్ (సీనియర్స్)

జూనియర్స్ విన్నర్స్ కృష్ణా జట్టుకు కప్పు అందజేస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

జూనియర్స్ రన్నర్స్ ట్రోఫీ అందుకుంటున్న పశ్చిమ గోదావరి జట్టు

కృష్ణా జట్టు విజయదుందుభి.. జూనియర్స్ విభాగంలో ఎన్నారై జూనియర్ కళాశాల (కృష్ణా)-ఆర్‌జీయూకేటీ (పశ్చిమ గోదావరి) జట్ల మధ్య ఫైనల్స్ జరిగింది. టాస్ గెలిచిన పశ్చిమ గోదావరి జట్టు మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. 17.3 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌటైంది. అనంతరం కృష్ణా జిల్లా జట్టు 14.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి సునాయాసంగా గెలుపొందింది. కృష్ణా జట్టులో గౌతమ్ అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు కీలకమైన వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. చేదనలో సంజయ్ వరుసగా నాలుగు ఫోర్లు కొట్టి 21 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు.

ఉత్కంఠ పోరులో నెల్లూరుదే విజయం.. సీనియర్స్ విభాగంలో రాయుస్ డిగ్రీ, పీజీ కళాశాల(నెల్లూరు)-ఆర్‌జీయూకేటీ(ప్రకాశం) జట్ల మధ్య ఫైనల్స్ తీవ్ర ఉత్కంఠతో సాగింది. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. కమల్ 22 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 28 పరుగులు చేశాడు. బరిలోకి దిగిన ప్రకాశం జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 131 పరుగులకే పరిమితమైంది. చివరి ఓవర్‌లో 26 పరుగులు అవసరం కాగా.. 22 పరుగులే చేయగలిగారు. స్టాలిన్ మ్యాచ్‌లో 5 క్యాచ్‌లు పట్టినా.. చివరి ఓవర్‌లో ప్రకాశం జట్టు బ్యాట్స్‌మెన్ ఉమామహేశ్వరరెడ్డి వరుసగా రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లు కొట్టినా.. జట్టును గెలిపించలేకపోయారు.

సీనియర్స్ విన్నర్స్ నెల్లూరు జట్టుకు కప్పు అందజేస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

సీనియర్స్ రన్నర్స్ ట్రోఫీ అందుకుంటున్న ప్రకాశం జట్టు

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor
Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner
KL UNIVERSITY (DEEMED TO BE)
Beverage Partner
CMR SHOPPING MALL The joy of life
Digital Partner
ఈనాడు.నెట
TV Partner
ETV BHARAT ETV ఆంధ్రప్రదేశ్
Organised by
ఈనాడు మహిళ

మధ్యవర్తిత్వంతో ఉత్తమ తీర్పు

ప్రసంగిస్తున్న సత్యారావు. వేదికపై బాషా, భూపాల్‌రెడ్డి, సత్యానంద్, సునీల్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మధ్యవర్తిత్వం అనేది ప్రతి కేసుకు ముఖ్యమని, 90 శాతం కేసులు మధ్యవర్తిత్వం ద్వారా ఉత్తమ తీర్పు పొందవచ్చని తమిళనాడు బార్ అసోసియేషన్ సభ్యురాలు, శిక్షకురాలు సత్యారావు పేర్కొన్నారు. ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు న్యాయవాదులకు బీబీఏ హాల్లో జరుగుతున్న 40 గంటల శిక్షణా తరగతుల్లో ఆమె బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మధ్యవర్తిత్వం ప్రాధాన్యత వివరించారు. విదేశాల్లో ఇది ఖరీదైన అంశమని, అక్కడ కక్షిదారులు దీని కోసం న్యాయస్థానాలకు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. మన దేశంలో భారత సర్వోన్నత న్యాయస్థానం ఉచితంగా అందచేస్తోందన్నారు. న్యాయవాదులంతా శిక్షణ పొంది, కేసులను సత్వరం పరిష్కరించి కక్షిదారులకు మేలు చేయాలని కోరారు. రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ మాట్లాడుతూ.. సత్యారావు 2005 నుంచి పలు దేశాల్లో మధ్యవర్తిత్వం చేస్తున్నారని చెప్పారు. జిల్లా న్యాయవాదులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా విజయవాడకు వచ్చారని వివరించారు. బీబీఏ అధ్యక్షుడు ఎ.కె.బాషా మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది వివాద పరిష్కారానికి గొప్ప సదవకాశమని చెప్పారు. ఇరువైపులా కక్షిదారులకు సమయం ఆదా అవుతుందన్నారు. న్యాయవాదులు నరహరిశెట్టి నరసింహారావు, వీరప్రతాప్ తదితరులు అడిగిన ప్రశ్నలకు 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ పరిష్కార మార్గాలు చూపారు. కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కమర్షియల్ కోర్టుల్లో వేసే దావాలను పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం చేసుకోవాలంటే రూ.10వేలు న్యాయస్థానానికి డిపాజిట్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీబీఏ సంయుక్త కార్యదర్శి వరహలక్ష్మి, న్యాయవాదులు బాలబాస్కర్, సుంకర శ్రీనివాసరావు, ఐ.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎన్నిక

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ నూతన కమిటీని బుధవారం విజయవాడ, హనుమాన్‌పేటలోని ఒక హోటల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా అరవ పార్వతమ్మ (తిరుపతి జిల్లా), అధ్యక్షుడిగా పాలకుంట శ్రీనివాసులు(అన్నమయ్య) ఉపాధ్యక్షులుగా ములకవల్లి రాజు(అనకాపల్లి), ఎన్.యల్లన్న(అనంతపురం), ప్రధాన కార్యదర్శిగా వి.రాజ్‌కుమార్(చిత్తూరు), కార్యదర్శిగా బాణావతు మునేంద్రనాయక్(చిత్తూరు), అధికార ప్రతినిధులుగా బి.మనోహర్(అన్నమయ్య), రెడ్డి రమణమ్మ(గుంటూరు), ప్రచార కార్యదర్శిగా కృష్ణమూర్తి(సత్యసాయి), సంయుక్త కార్యదర్శులుగా వై.వెంకటేశ్వర్లు, వేము భగవాన్‌దాస్(బాపట్ల), కోశాధికారిగా తాతపూడి జయశ్రీ ఎన్నికయ్యారు. పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా సభ్యులు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీనివాసులు కోరారు.

వ్యాధుల నియంత్రణలో శాఖల సమన్వయం ముఖ్యం

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: వ్యాధుల వ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అవసరమని, ఆ దిశగా అధికారులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి పేర్కొన్నారు. బుధవారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల అధికారులతో భవానీపురంలోని హరిత సమావేశ మందిరంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన వన్ హెల్త్ కార్యక్రమం నిర్దేశించిన మార్గదర్శకాలు అనుసరించి వ్యాధుల నివారణలో సంబంధిత శాఖల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని సెంటర్ ఫర్ డీసీజ్ కంట్రోల్ రాష్ట్రాలకు తెలియజేస్తుందని తెలిపారు. బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్, స్క్రబ్ టైఫస్, లెప్టోస్పైరాసిస్, ర్యాబిస్ వంటి కేసులు నిరోధానికి పశుసంవర్ధక శాఖ, ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్య శాఖ వంటి శాఖలు సమష్టిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీని విధానాలపై అధికారులకు మూడు నెలల్లో నెలకు మూడు రోజుల చొప్పున తొమ్మిది రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గతంలో మూకుమ్మడిగా కేసుల నమోదు జరిగినప్పుడు తలెత్తిన సమస్యలు, ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం ఏవిధంగా ఉందనే విషయమై చర్చించారు. ఫిబ్రవరి, మార్చి నెలలో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ డీసీజ్ కంట్రోల్ రెసిడెంట్ సలహాదారు డాక్టర్ సుకర్మతన్వర్, నేషనల్ సెంటర్ ఫర్ డీసీజ్ కంట్రోల్ ముఖ్యప్రతినిధి డాక్టర్ ప్రియాంక, వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లీశ్వరి, పశుసంవర్ధక శాఖ జేడీ చంద్రమౌళీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, వేదికపై ఇతర అధికారులు

బ్రాయిలర్ ధరలు (కేజీలో కి.రూ.లలో)
వెస్టెండ్: బ్రాయిలర్ పారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267 చికెన్ స్కిన్‌లెస్ - 304.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ పారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

రాజ్‌కెసిరెడ్డికి వైద్య పరీక్షలు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన రాజ్‌కెసిరెడ్డిని పోలీసులు విజయవాడ జిల్లా జైలు నుంచి బుధవారం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. మోకాళ్ల నొప్పితో ఇబ్బంది పడుతున్నట్లు ఐదు రోజుల కిందట ఆయన పోలీసులకు తెలిపారు. మోకాళ్ల నొప్పికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫిజియోథెరపీ చేశారు. అనంతరం మందులు ఇచ్చి తిరిగి జైలుకు పంపారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ అభ్యర్థుల నియామక తేదీల ఖరారు

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీలో ఐటీఐ అప్రెంటిస్‌షిప్ చేయడానికి అంతర్జాలంలో దరఖాస్తు చేసి ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థుల వివరాలను apsrtc.ap.gov.in వెబ్‌సైట్‌లో రిక్రూట్‌మెంట్ ట్యాబ్‌లో అందుబాటులో ఉంచారని జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ వి.నీలిమ బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో జిల్లాల వారీగా వారికి కేటాయించిన తేదీల్లో విజయవాడలోని విద్యాధరపురం పరిధి చెరువు సెంటర్‌లో ఉన్న జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

జిల్లాల వారీగా అభ్యర్థులు హాజరు కావలసిన తేదీలు..: ఈనెల 23న ఏలూరు, 24న పశ్చిమ గోదావరి, 27న బాపట్ల, 28న గుంటూరు, 29న పల్నాడు, 30 కృష్ణా, 31న ఎన్టీఆర్.

తీసుకు రావాల్సిన ధ్రువపత్రాలు: ఎస్ఎస్సీ, ఐటీఐ, ఎన్సీటీవీ, క్యాస్ట్, ఆధార్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, దివ్యాంగులు వారికి సంబంధిత ధ్రువపత్రం, పాన్‌కార్డు/డ్రైవింగ్ లైసెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్

● ఎంపికైన అభ్యర్థులు ఫైన తెలిపిన తేదీల నుంచి 15 రోజుల్లో హాజరుకాకుంటే వారికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7382900591, 7382900299, 7989790054, 7382899018, 8142188168 సంప్రదించాలని చెప్పారు. కార్యాలయంలో అయితే పని వేళల్లో మాత్రమే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 లోపు సంప్రదించాలని కోరారు.

ప్రకటన
నా క్లయింటు అయిన అడుసుమిల్లి శ్రీరామ్, S/o. అడుసుమిల్లి లోక సత్య రత్న కుమార్ గారి తరపున తెలియచేయునది ఏమనగా, M/s. దుర్గా కమర్షియల్ కార్పొరేషన్, అన్నపూర్ణ మరియు శకుంతల థియేటర్, విజయవాడ-2 తరపున పార్టనర్స్ శ్రీ అడుసుమిల్లి పవనకుమార్, S/o కృష్ణమోహనరావు గారు మరియు శ్రీమతి అడుసుమిల్లి వెంకట సీతామహాలక్ష్మి, భర్త (టీటు) మోహన్ రామదాస్ (భర్త హెచ్.యు.ఎఫ్) గార్ల తరపున ఫీడరు గారైన కె. వెంకటరాములు మరియు ఎస్. వియలక్ష్మి గార్లు ది.20.01.2026వ తేదీన ఇచ్చిన పత్రికా ప్రకటన అసత్యములతో కూడి వక్రవిరుద్ధముగా ఇవ్వబడిన ప్రకటన అయి ఉన్నది.
సంస్థ రిజిస్టరు నెం.3390/1981ఎం, డోర్ నెం. 27-6-179/1ఏ ప్రకారం సదరు ఆఫీసు అడుసుమిల్లి లోక సత్య రత్న కుమార్ (కర్త హెచ్.యు.ఎఫ్) గారు మేనేజింగ్ పార్టనర్ అయివున్నారు. సదరు అన్నపూర్ణ మరియు శకుంతల థియేటర్లతో కూడిన స్థలము అంతా పూర్వార్జితపు ఆస్తి అయి ఉన్నది. సదరు ఆస్తి పార్టీషన్ నిమిత్తం అడుసుమిల్లి శ్రీరామ్, S/o అడుసుమిల్లి లోక సత్య రత్న కుమార్ గారు విజయవాడ-7వ అదనపు జిల్లా కోర్టు వారి వద్ద ఓ.ఎస్.నెం. 107/2025రుగా దాఖలు చేయబడి ఉన్నది. సదరు దావా మేరకు ఆస్తి యండు నా క్లయింటు వాటాను మోసపూరితముగా పొందగల దురుద్దేశంతో తప్పుడు ప్రకటన ఇచ్చియున్నారు.
సదరు ప్రకటనలో తెలియరుచిని అంశములు యావత్తు అసత్యములు అని తెలియచేయుటకు ఈ ప్రకటన ఇవ్వబడినది.
ఇట్లు: కె. సాయిమోహన్ రావు, కె.వి. ఆదిత్య చౌదరి, అడ్వకేట్స్
డోర్ నెం. 48-11/1-6ఎ, 4వ వీధి, కొండ్రనగర్, విజయవాడ టౌన్, యస్.బి.ఆర్. జిల్లా- 520 008
సెల్ నెం. 98490 58459

బంగ్లాదేశ్‌తో ఫోన్ కాల్స్ గుర్తింపు

కౌంటర్ ఇంటిలిజెన్స్ విచారణ
వ్యభిచార గృహం నిర్వహిస్తూ పట్టుబడిన నిందితుడు

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే: వ్యభిచార గృహం నిర్వహించడమే కాకుండా బంగ్లాదేశ్ దేశానికి సంబంధించిన వారితో తరచూ ఫోనులో మాట్లాడుతున్నట్లు గుర్తించడంతో ఓ వ్యక్తిని కొత్తపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన మొహ్మద్ అబుతాలిబ్(37) కొత్తపేట వించిపేట, టెట్రాపిళ్లై స్వామి వీధిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని పదేళ్లుగా ఉంటున్నాడు. కోల్‌కతాకు చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు సంతానం. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఇతను ఒక్కడే ఉంటున్నాడు. బ్యాగులు, చరవాణుల పౌచ్‌లు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కోల్‌కతా వెళ్లినప్పుడు అక్కడి మహిళలతో పరిచయం పెంచుకుని, వారి ద్వారా యువతులు, మహిళలను ఇక్కడికి రప్పిస్తున్నాడు. వారితో వ్యభిచారం చేయిస్తూ డబ్బు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్షణ

జి.కొండూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ శిరస్త్రాణం తప్పక ధరించాలని జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్ సూచించారు. మండలంలోని కుంటముక్కల అడ్డరోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనదారులకు ఆయన బుధవారం అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని.. పరిమిత వేగంతో ప్రయాణిస్తూ గమ్యాన్ని సురక్షితంగా చేరుకోవాలని తెలిపారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీష్‌కుమార్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? మైలవరంలోని పలు ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది. - **రజని, శాంతినగర్, మైలవరం**
✔ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి ఉంది. చర్చిస్తున్నాం. **- ఎండీ రఫీ, కార్యదర్శి – న్యూస్‌టుడే, మైలవరం**

? చెవుటూరు ఎస్సీ ఏరియాలో వీధి దీపాలు వెలగడం లేదు. ప్రజాప్రతినిధులకు తెలిపిన ప్రయోజనం లేకుండా పోయింది. తక్షణమే వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.- **జయరాజు స్థానికుడు**
✔ సమస్య మా దృష్టికి వచ్చింది. పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **రమాదేవి పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, జి.కొండూరు**

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

గొల్లపూడిలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

గొల్లపూడి, న్యూస్‌టుడే: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ సూచించారు. గొల్లపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పక్కాగా నిర్వహించాలని సూచించారు. 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు చదవడం, రాయడం, గణితంలో ఎక్కాలు, తదితర అంశాలు నేర్పించాలన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి సూచనలు చేశారు.

50 శాతం రాయితీపై ఫ్రూట్ కవర్లు

అవగాహన కార్యక్రమంలో అధికారులు..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మామిడి రైతులకు 50 శాతం రాయితీపై ఫ్రూట్ కవర్లు అందిస్తున్నట్లు ఉద్యాన అధికారి నరేంద్రకుమార్ తెలిపారు. బుధవారం రంగాపురం, నాగులూరు, రెడ్డికుంట గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక్కో రైతు 2 హెక్టార్లకు రాయితీపై కవర్లు పొందవచ్చని తెలిపారు. వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 20 వరకు రైతులు పంటల సాగు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తీరిన భారం.. విద్యార్థినుల మోములో ఆనందం

కేజీబీవీ బాలికలకు కాస్మోటిక్, రవాణా ఛార్జీల చెల్లింపు

ఎ.కొండూరులోని పాఠశాలలో విద్యార్థినులు

గంపలగూడెం, న్యూస్‌టుడే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినుల సమస్యలు పరిష్కారానికి అధిక ప్రాధాన్యం కల్పించింది. వైకాపా పాలనలో నిర్లక్ష్యం చేసిన సదుపాయాలను గుర్తించి తిరిగి అవన్నీ విద్యార్థినులకు అందేలా పునరుద్ధరిస్తోంది. దీంతో జిల్లాలోని గంపలగూడెం, ఎ.కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లోని కేజీబీవీ విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సదరు బాలికలకు ప్రతి నెలా రూ.100 కాస్మోటిక్స్ ఛార్జీలు అందించాల్సి ఉంది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లపాటు ఛార్జీలు ఇవ్వకుండా అటకెక్కించింది. దీంతో బాలికలు తమ కుటుంబ సభ్యులు జేబు ఖర్చులకు అందించే సొమ్ముతో సొంతగా కొనుగోలు చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక్కో విద్యార్థినికి నెలకు రూ.100 చొప్పున పది నెలలకు చెందిన రూ.వెయ్యి ఇటీవల తల్లిదండ్రులు బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.

పరీక్షలు రాసేందుకు వెళ్లేవారికి చేయూత...

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థినులు పబ్లిక్ పరీక్షలు రాసేందుకు ఇతర కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. సదరు బాలికలకు పరీక్ష రాసేందుకు సమీప కేంద్రాలకు వెళ్లేందుకు ప్రభుత్వం రవాణా ఛార్జీలు చెల్లిస్తుంది. ఒక్కో విద్యార్థినికి రూ.350 చొప్పున ఇవ్వాల్సి ఉంది. గత వైకాపా ప్రభుత్వం రవాణా ఖర్చులు చెల్లించడంలో నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం 2024-25లో తుది పరీక్ష రాసిన బాలికలకు కేటాయించిన కేంద్రాలకు వాహనాల్లో రాకపోకలు సాగించేందుకు రవాణా ఖర్చులు చెల్లించింది. 2025-26 విద్యా సంవత్సరానికి కూడా తల్లిదండ్రుల ఖాతాల్లో రవాణా సొమ్ము జమ చేసేందుకు ఏర్పాట్లు చేసింది.

మండలాల వారీగా కేజీబీవీల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుతున్న వారి వివరాలు

మండలం	విద్యార్థినులు
గంపలగూడెం	277
ఎ.కొండూరు	240
రెడ్డిగూడెం	280

☛ ఎ.కొండూరు, గంపలగూడెం మండలం పెదకొమిర, రెడ్డిగూడెం మండలం రంగాపురం కేజీబీవీల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుతున్న బాలికలు 797 మంది ఉన్నారు. సదరు బాలికలకు ఇటీవల కాస్మోటిక్స్ ఛార్జీలు పది నెలలకు సంబంధించి రూ.7.97 లక్షలు జమ చేశారు. ఇక పది ఇంటర్ విద్యార్థులు 226 మంది ఉండగా రూ.350 చొప్పున రూ.79,100 జమ చేశారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మాట్లాడుతున్న ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మైనర్లు వాహనాలు నడపడం నేరమని.. నిర్దేశిత వయస్సు వచ్చిన తరవాత డ్రైవింగ్ లైసెన్సు తీసుకుని వాహనాలను నడపాలని ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ సూచించారు. నగర ట్రాఫిక్ పోలీసులు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు సంయుక్తంగా బుధవారం మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆర్ఐ కృష్ణ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన పలు రోడ్డు ప్రమాదాలను వివరించి.. నిబంధనలు ఉల్లంఘించడం వల్లనే అవి జరిగినట్లు వారికి వివరించారు. ఎస్సై లక్ష్మణరావు ట్రాఫిక్ అవగాహనకు సంబంధించిన సైన్ బోర్డులను ప్రదర్శించి వాటి గురించి తెలిపారు. విద్యార్థులు రహదారి నియమాలను పాటించాలని పేర్కొన్నారు. జాతీయ రహదారుల సంస్థ అధికారులు శ్రీనివాసరావు, ఉమామహేశ్వరావు, పాఠశాల హెచ్ఎం డెవిడ్ రాక్‌ఫెల్లర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేయాలి

రైతులకు జింక్ సంచులు అందిస్తున్న అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వేయాలని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం భూసార పరీక్షల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించిన రైతులకు జింక్ తదితరులు పాల్గొన్నారు. సంచులు అందజేశారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. జడ్పీటీసీ సభ్యుడు పి.విజయభాస్కరరెడ్డి, ఉద్యాన అధికారి నరేంద్రకుమార్, ఏఈవో ఎం.బిజిలి, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రేమ్‌చంద్, దివ్య, ఝాన్సీ

తొలిరోజు సజావుగా జేఈఈ మెయిన్

మైలవరం: పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

మైలవరం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలైన ఎన్ఐటీలో ప్రవేశాల నిమిత్తం నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్ తొలి రోజు బుధవారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్రాన్ని కేటాయించగా, ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 207 మందికి గానూ 201 మంది, మధ్యాహ్నం 183 మందికి గానూ 180 మంది హాజరైనట్లు కేంద్ర నిర్వాహకులు తెలిపారు. మంచు భయంతో విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.20 లక్షలు మంజూరు

అధికారులతో చర్చిస్తున్న జోత్స్న

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: దామూలూరులో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మండల పరిషత్తు అధ్యక్షురాలు పాలడుగు జోత్స్న గ్రామస్థులకు వివరించారు. ఆమె అధికారులతో కలిసి బుధవారం దామూలూరులో పర్యటించారు. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్ ట్యాంకులకు మిగిలిన పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు చేశారని.. వాటిని కూడా సకాలంలో పూర్తి చేయించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకముందు కొటికలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి అసంపూర్తిగా నిలిచిన తరగతి గదుల నిర్మాణాలను పూర్తిచేయడం, మిగిలిన అభివృద్ధి పనులకు కూడా మండల పరిషత్తు నిధులు కేటాయిస్తామన్నారు. ఎంపీడీవో శకుంతల, గ్రామీణ నీటి సరఫరా సహాయక ఇంజినీరు సునీత, గ్రామ కార్యదర్శి గణేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

చట్టం గురించి వివరిస్తున్న సుధాకర్

మైలవరం, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అదే పేరుతో పునరుద్ధరించాలని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో పుల్లూరు, చంద్రగూడెంలో పథకంపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. గాంధీ పేరును తొలగించి జీ రామ్‌జీ పేరిట నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పథకం అమలులో రాష్ట్ర వాటాలను పెంచడం ద్వారా ఉపాధికి తీవ్ర విఘాతం కలుగుతుందని అన్నారు. అదనపు పనిదినాలు కల్పించాల్సిందిపోయి, ఇబ్బందులు పెట్టడం మంచి పద్ధతి కాదని తెలిపారు. నాయకులు వెంకటరెడ్డి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాజశ్యామల దేవి నవరాత్రులు

అలంకరణలో అమ్మవారు

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కంభంపాడు గంగా విజయదుర్గ సమేత నాగమల్లేశ్వరస్వామి ఆలయంలో రాజశ్యామలాదేవి గుప్త నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి నుంచి ప్రారంభమైన వేడుకలు ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. బుధవారం అర్చకుల విజయ దుర్గాంబిక అమ్మవారిని శ్యామలదేవిగా అలంకరించి కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నితిన్ నబిన్ ఎన్నికపై భాజపా నాయకుల సంబరాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: భాజపా జాతీయ అధ్యక్షునిగా నితిన్ నబిన్ ఎన్నికైన నేపథ్యంలో బుధవారం గంపలగూడెంలో ఆ పార్టీ నాయకులు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఆయన ఎన్నికతో దేశంలో భాజపా మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు ఎ.క్రాంతికుమార్, వి.సుజాత, ఎ.సూర్యప్రకాశ్, కె.గోపాలకృష్ణ, వి.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు కాదు.. అంగన్‌వాడీ

చెవుటూరు ఎస్సీ ఏరియాలో అంగన్‌వాడీ కేంద్రం పరిసర ప్రాంతమంతా చెత్త పేరుకపోయి డంపింగ్ యార్డును తలపిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిసర ప్రాంతంలోని స్థానికులు కొందరు ఇళ్లలోని చెత్తను తీసుకొచ్చి అంగన్‌వాడీ పక్కనే పడేస్తున్నారని.. దీంతో చుట్టు పక్కల ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తుందని వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు వ్యాధుల బారినపడే అవకాశం ఉందని .. కేంద్రానికి ప్రహరీ కట్టాలని స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

అదుపు తప్పితే అంతే సంగతులు..!

ఒక్క అడుగు పక్కకు పడినా ప్రమాదమే.. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వంతెనపై ప్రయాణిస్తున్నారు. కొండపల్లి పురపాలిక సంఘం శివారు ప్రాంతం ఈలప్రోలు వద్ద ఈ పరిస్థితి నెలకొంది. బుడమేరు కాలువ కొండపల్లి నుంచి ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. కొండపల్లి నుంచి ఈలప్రోలు, గుంటుపల్లి వెళ్లాలంటే ఈ వంతెన దాటాల్సిందే. నాలుగు దశాబ్దాల కిందట బుడమేరు కాలువపై వంతెనను నిర్మించారు. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకొంది. వంతెన రెయిలింగ్ సైతం ఎక్కడికక్కడే ఊడిపోయింది. అయితే జలవనరుల శాఖ నిధులతో రెండు సంత్సరాల కిందట నూతన వంతెనను నిర్మించారు. నిర్మాణదారునికి ఆర్థిక లావాదేవీల్లో ఏర్పడిన జాప్యం వల్ల వంతెనను నేటికీ ప్రారంభించలేదు. **- న్యూస్‌టుడే, కొండపల్లి**

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ లక్ష్మీనారాయణ, సీఐ గిరిబాబు, ఎస్సై అనిల్

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామిని విజయవాడ గ్రామీణ డీసీపీ లక్ష్మీనారాయణ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మరో నెల రోజుల్లో ఆలయంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరం గ్రామస్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ కేటుగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండడం తప్పనిసరి అని తెలిపారు. స్థానిక పోలీస్ అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

బోరు పంపు వితరణ

తిరువూరు న్యూస్‌టుడే: తిరువూరు మండల భవన కార్మికుల భవనానికి అవసరమైన బోరు పంపును దాతలు మాజీ జడ్పీటీసీ సభ్యుడు గద్దె రమణ వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను కార్మికులు అభినందించారు. కార్మికులకు నీటి సమస్య రావద్దనే ఉద్దేశంతో బోరు పంపును అందించినట్లు రమణ తెలిపారు.

ఈకేవైసీ ప్రక్రియ పరిశీలన

భూముల పత్రాలు పరిశీలిస్తున్న ఆర్డీవో మాధురి, పక్కన తహసీల్దార్ రాజకుమారి

గుళ్లపూడి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని గుళ్లపూడిలో బుధవారం పర్యటించిన ఆర్డీవో కె.మాధురి రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల మంజూరుకు అవసరమైన ముందస్తు ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. గ్రామంలో రీ సర్వే ప్రక్రియ పూర్తికాగా సదరు భూ యజమానులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ముందుగానే రైతులతో సమావేశమై వారి భూములకు సంబంధించి సర్వే, ఖాతా నంబర్లు, విస్తీర్ణం, సరిహద్దులు సరిచూసుకునే కార్యక్రమం నిర్వహించారు. రీ సర్వేపై అభ్యంతరం వ్యక్తం చేయని రైతులకు భూ యజమాన్య హక్కు పుస్తకాల జారీకి ముందుగానే ఈకేవైసీ నమోదు చేయాలని సూచించారు. తహసీల్దార్ వి.రాజకుమారి, ఆర్ఐ ఎం.వీరభద్రరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నరసాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గోదా కోటయ్య, సూరమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు రామారావు ఆర్థిక సహాయంతో కూన పరాజుపర్వ, కుదప జిల్లా పరిషత్తు పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు డెమోక్రటిక్ పీఆర్టీయూ వారు తయారు చేసిన

మెటీరియల్ అందిస్తున్న డెమోక్రటిక్ పీఆర్టీయూ నాయకులు, ఎంఈవో

మెటీరియల్‌ను ఎంఈవో పి.రమేష్‌బాబు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ.. స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డెమోక్రటిక్ పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్ కుమార్, ఎన్.నాగేశ్వరరావు, డి.లక్ష్మీపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: డెమోక్రటిక్ పీఆర్టీయూ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను నరసాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు తహసీల్దార్ లక్ష్మీకల్యాణి ఉచితంగా అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం శోభలత, పీడీ రమేష్, సంఘం నాయకులు పాల్గొన్నారు. వేమిరెడ్డి హైస్కూల్‌లోనూ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.

ఆర్టీసీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

మాట్లాడుతున్న జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం

తిరువూరు న్యూస్‌టుడే: తిరువూరు ఆర్టీసీ డిపోను జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయరత్నం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. డిపోలో బస్సుల నిర్వహణ, సమయపాలన, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలపై ఉద్యోగులతో చర్చించారు. బస్సుల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, సాంకేతిక లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రయాణికులు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని ఆదేశించారు. సంస్థ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు రాజకీయంగా బలోపేతం కావాలి

రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పార్వతమ్మ, నాయకులు

భవానీపురం, న్యూస్‌టుడే: విశ్వబ్రాహ్మణులు రాజకీయంగా మరింత బలోపేతం కావాలని ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కమ్మరి పార్వతమ్మ పేర్కొన్నారు. మాజీ శాసనమండలి సభ్యుడు గానాల రామ్మూర్తి జయంతిని గొల్లపూడిలోని బీసీభవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతమ్మ మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందు ఉండడానికి గానాల రామ్మూర్తి చేసిన కృషి అభినందనీయమని చెప్పారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మండలి సభ్యుడిగా ఉన్న సమయంలో విశ్వబ్రాహ్మణులను బీసీ జాబితాలో చేర్చేందుకు ఎంతో పోరాటం చేశారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రాజకీయ అవకాశాలు దక్కించుకుని శాసనసభలో తమ గళాన్ని వినిపించాలని ఆకాంక్షించారు. అనంతరం గానాల రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జి.శ్రీనివాస్ చక్రవర్తి, కార్పొరేషన్ డైరెక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి అభినందన

దానుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తెదేపా ఎస్సీ సెల్ నాయకులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యునిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన మేకల దానును ఎ.కొండూరు మండలానికి చెందిన తెదేపా ఎస్సీ సెల్ నాయకులు కలిసి అభినందించారు. ఎం.ఏలియాబాబు, కె.కృష్ణ, బి.వెంకటరత్నం, ఎం.దుర్గ, కె.కృష్ణ, మల్లయ్య తదితరులు విజయవాడలోని ఎస్సీ కమిషన్ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విస్సన్నపేట ఎస్సైగా అర్జున్‌రాజు బాధ్యతల స్వీకరణ

సీఐను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సై అర్జున్‌రాజు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ఎం.అర్జున్‌రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఐ గిరిబాబును సర్కిల్ కార్యాలయం తిరువూరులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఐ మాట్లాడుతూ.. విధుల పట్ల అంకితభావంతో పని చేస్తూ మంచి అధికారిగా గుర్తింపు పొందాలన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు

బాల్య వివాహాల వల్ల సమాజంలో అనేక అనర్థాలు తలెత్తుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. బాల్య వివాహాల నియంత్రణపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పశ్చిమ ఇబ్రహీంపట్నం మసీదు ప్రాంతంలో బుధవారం అవగాహన కల్పించారు. మాధవి మాట్లాడుతూ.. బాల్య వివాహాల రహిత రాష్ట్రమే లక్ష్యంగా.. ప్రభుత్వాలు చర్యలు చేపడుతూ ప్రజల సహకారాన్ని కోరుతున్నాయని పేర్కొన్నారు.అందులో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విజ్ఞానవంతమైన భవిష్యత్ తరాన్ని సిద్ధం చేయడానికి నేటి తరం వారు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. తెదేపా పట్టణ కార్యదర్శి ఫణి, స్థానికులు అహ్మద్, దావుద్, రాణి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**

యథేచ్ఛగా ఇసుక దందా

గానుగపాడు కట్టలేరు వాగులో ట్రాక్టర్లలో నింపుతూ..

తిరువూరు న్యూస్‌టుడే: తిరువూరు మండలం పరిధిలోని గానుగపాడు కట్టలేరు వాగులో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గానుగపాడు కట్టలేరు ఇసుక అక్రమ తవ్వకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్జాతీయ యోగాలో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు పుదుచ్చేరిలోని బీచ్ రోడ్డులో జరిగిన అంతర్జాతీయ యోగా పోటీలో నగరానికి చెందిన పారుపల్లి షాలెంరాజు పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. పురుషుల 19-27 వయసు కేటగిరీలో తలపడిన షాలెంరాజు ట్రెడిషనల్ యోగా వ్యక్తిగత విభాగంలో ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఐజీఎంసీ స్టేడియంలోని అమరావతి యోగా, ఏరోబిక్స్ కేంద్రంలో బుధవారం యోగాచార్యుడు అంకాల సత్యనారాయణ, యోగా సాధకులు షాలెంరాజును అభినందించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

జనసంఘ్‌ను స్మరించుకుంటూ జాతీయ మహాసభలు

భవానీపురం, న్యూస్‌టుడే: జనసంఘ్‌ను స్మరించుకుంటూ జాతీయ మహాసభలను ఈనెల 23, 24 తేదీల్లో విజయవాడ వేదికగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్ల కిందట జనసంఘ్ జాతీయ సభలను విజయవాడలో నిర్వహించారని.. తిరిగి ఇప్పుడు విజయవాడ వేదికగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని చెప్పారు. అప్పుడు నిర్

ప్రపంచం నెత్తిన కుంపటి!

● ఏడాది పాలనలో ట్రంప్ అంటించిన మంటలెన్నో..

డొనాల్డ్ జాన్ ట్రంప్.. నోరు తెరిస్తే అగ్గిరాజుకుంటుంది. ఆయన నిర్ణయం వెను వివాదాలు రేపుతుంది.. ఆయన పావులు కదిపితే ప్రపంచం ఉక్కిరిబిక్కిరి అవుతుంది. అంతా తానే.. సర్వస్వం అమెరికాయే అనే ధృడమైన విశ్వాసి. ఓ వైపు శాంతి మంత్రం జపిస్తుంటారు.. మరోవైపు దేశాలపై యుద్ధాలకు కాలు దువ్వుతుంటారు. ఆయన మాటలు ప్రత్యర్థులనే కాదు.. మిత్రులనూ కలవరపాటుకు గురి చేస్తుంటాయి. రెండోసారి అమెరికా అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచే ఆయన ఈ ప్రపంచంపై సవాళ్లు విసరడం ప్రారంభించారు. వాణిజ్య యుద్ధాలు ప్రారంభించి.. అనేక దేశాలను ఉక్కిరిబిక్కిరి చేశారు. స్వదేశంలో వలసదారులపై యుద్ధాన్ని ప్రారంభించి.. వేలమంది గుండెల్లో గుబులు రేపారు. రెండోసారి అధికారాన్ని చేపట్టి ఏడాది పాలనను పూర్తిచేసుకున్న డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలెన్నో అత్యంత వివాదాస్పదంగా మారాయి. ఆధునిక రాజకీయాల్లో అత్యంత వివాదాస్పద నేతగా ఉన్న ట్రంప్.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచాన్ని ఆ స్థాయిలో వణికిస్తున్నారు.

నాడు పనామా.. నేడు గ్రీన్‌లాండ్..

గత ఏడాది అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా 'మా దారికి ఏదీ అడ్డురాదు' అని ట్రంప్ ప్రకటించారు. ఆ సమయంలో ఆయన దృష్టిలో ఒక్క పనామా కాలువే ఉంది. దానిని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పుడు అదే విధానాన్ని గ్రీన్‌లాండ్‌పై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. 'మనం దానిని పొందాలి' అనే కొత్త మంత్రాన్ని ఆయన జపిస్తున్నారు.

- అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కెనడాను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించి వివాదానికి తెర లేపారు. అది తమ 51వ రాష్ట్రమంటూ పలుమార్లు ప్రకటించారు.
- డ్రగ్స్ సరఫరా చేస్తున్నాయన్న పేరుతో మెక్సికో, కొలంబియాలపైనా కన్నేశారు. వాటిపైనా దాడులకు దిగుతామని హెచ్చరించారు.

నాటో భవితవ్యానికి పరీక్ష

అమెరికా కమాండర్ ఇన్-చీఫ్‌గా ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి సర్వశక్తులొడ్డుతున్నారు. ఇందుకోసం ఐరోపా దేశాలతో కయ్యానికి సిద్ధపడుతున్నారు. గ్రీన్‌లాండ్ విషయంలో తమను వ్యతిరేకించే దేశాలపై సుంకాలు వేస్తున్నట్లు ప్రకటించారు. ట్రంప్ చర్యలతో 76 ఏళ్ల నాటో భవితవ్యం ప్రమాదంలో పడుతోంది. గత శతాబ్ద కాలంలో ఏ అమెరికా అధ్యక్షుడూ.. మిత్ర దేశాన్ని కబళించాలని చూడలేదు. అంతేకాకుండా ప్రజాబీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించలేదు. ఇప్పుడు గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ అదే చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏ అమెరికా నేతా.. రాజకీయ సిద్ధాంతాలను పక్కనబెట్టి ఇలా వ్యవహరించలేదు.

ఇరాన్, వెనెజువెలాపై దాడులు..

- ఓ వైపు 'శాంతి కోసం కృషి చేస్తున్నా.. నాకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వండని' అంటూనే.. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌పై అతి పెద్ద బాంబర్లతో దాడులు చేశారు. అణు స్థావరాలను ధ్వంసం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత రాజేశారు.
- గత ఏడాది జూన్‌లో ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసినప్పుడు.. సైనిక చర్యలతో తన దౌత్య మార్గానికి అడ్డంకులు సృష్టించవద్దని నెతన్యాహును ట్రంప్ హెచ్చరించారు. వారం తిరిగే సరికి ఇరాన్‌లోని అణు శాస్త్రవేత్తలను ఇజ్రాయెల్ అంతమొందించడంతో అద్భుతంగా పని చేశారని ప్రశంసించారు.
- గాజాలో శాంతి స్థాపనకు కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదర్చడమే ఆయన చేసిన గొప్ప పని. ఇందుకోసం ఆయన తన దౌత్య బలాన్ని వినియోగించారు. ఇజ్రాయెల్‌ను, హమాస్‌ను దారికి తెచ్చారు.
- వెనెజువెలా విషయంలో మాత్రం ట్రంప్ తన కండబలాన్ని ఉపయోగించారు. ఓ సార్వభౌమాధికార దేశంపైకి సైన్యాన్ని పంపి.. బాంబులేసి. ఏకంగా దేశాధ్యక్షుడు మదురోను చెరబట్టారు.
- శాంతి కోసం ప్రయత్నించి 8 యుద్ధాలను ఆపానని, అయినా నోబెల్ శాంతి బహుమతి తనకు రాలేదని, ఇక నుంచీ బల ప్రయోగంతోనే అమెరికాను గొప్పగా మారుస్తానని ఇటీవల ట్రంప్ ప్రకటించారు.
- రష్యా, ఉక్రెయిన్ విషయంలో ఒక వారం రష్యా తరపున మాట్లాడతారు. మరో వారం ఉక్రెయిన్‌కు ఆయుధాలిస్తారు.

వలసలపై ఉక్కుపాదం

అమెరికాలో నివసిస్తున్న వేల మంది అక్రమ వలసదారులను ట్రంప్ బలవంతంగా స్వదేశాలకు పంపారు. ఇందుకోసం ఏకంగా పలు నగరాల్లో ఫెడరల్ ఏజెంట్లను వినియోగించి.. ఊళ్లను ఖాళీ చేయించారు. సైనిక విమానాల్లో తరలించారు. వారికి న్యాయపరమైన సాయం అందకుండా చేశారు. అక్రమ వలసలను అడ్డుకునే పేరుతో, ప్రత్యర్థి పార్టీని ఇబ్బంది పెట్టడానికి కేంద్ర బలగాలను నగరాల్లో అడుగడుగునా మోహరిస్తున్నారు. వీధుల్లో కేంద్ర బలగాల కవాతులు నిత్యకృత్యంగా మారాయి.

- మినియాపొలిస్‌లో 1,500 మంది సైనికులను మోహరించడం ద్వారా ఉద్రిక్తతలకు ట్రంప్ కారణమయ్యారు. ఏకంగా తిరుగుబాటు నిరోధక చట్టాన్ని అమలు చేస్తానని బెదిరించారు.
- అమెరికాలోని మధ్యతరగతికి ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా మాజీ అధ్యక్షుడు ఒబామా తెచ్చిన చట్టాన్ని నిలిపేశారు. మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో రిపబ్లికన్ల నుంచి ఒత్తిడి వచ్చినా ఆయన ససేమిరా అన్నారు. చివరకు ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా దిగివచ్చారు. అయితే అందులోనూ మార్పులు చేశారు.

భారత్ విషయంలోనూ వివాదమే

మన్మోహన్ హయాంలో అణు ఒప్పందం కుదిరిన నాటి నుంచి భారత్, అమెరికా సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైంది. ఆ తర్వాత ప్రధాని మోదీ దానిని మరింత ముందుకు తీసుకెళ్లారు. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయనతో మోదీ అత్యంత సన్నిహిత సంబంధాలను కలిగి ఉన్నారు. పలు రంగాల్లో రెండు దేశాలు సహకరించుకున్నాయి. అందుకే ఎన్నికల్లో ట్రంప్‌కు మోదీ మద్దతు పలికారు. కానీ అధికారంలోకి వచ్చాక అమెరికా అధ్యక్షుడి ధోరణి పూర్తిగా మారిపోయింది. రష్యా నుంచి ఇంధనం కొంటున్నామనే సాకుతో భారత్‌పై ఆంక్షలను విధిస్తూ వస్తున్నారు. ప్రపంచంలో ఏ దేశానైనా విధించనంత సుంకాలను విధించారు. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టాయి. వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అటు పాకిస్థాన్‌తో ట్రంప్ అంటకాగుతున్నారు. ఏకంగా సైన్యాధ్యక్షుడిని పిలిచి మరీ శ్వేతసౌధంలో విందు ఇచ్చారు. భారత్‌కు కోపం తెప్పించారు. అంతేకాకుండా భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపానని పదే పదే చెబుతున్నారు. భారత్ ఎన్నిసార్లు ఖండించినా ఆయన వెనక్కి తగ్గడం లేదు. తన మాటే నెగ్గిందని అవకాశం దొరికినప్పుడల్లా ప్రచారం చేసుకుంటున్నారు.

వీసాలపై వెట్టింగ్..

- ఏడాదిలో దాదాపు లక్ష వీసాలను రద్దు చేశారు.
- భారతీయ వృత్తి నిపుణుల కారణంగా విలసిల్లుతున్న అమెరికా టెక్నాలజీ రంగంలో హెచ్1బీ వీసాలపై ఆంక్షల కత్తిని దూసి అల్లకల్లోలం చేశారు. హెచ్1బీ వీసా కావాలంటే లక్ష డాలర్లు చెల్లించాలంటూ బాంబు పేల్చారు.
- వెట్టింగ్ పేరుతో వీసాల రెన్యువల్‌కూ అడ్డంకులు సృష్టించారు.
- విద్యార్థి వీసాలపైనా నిమ్మ పెట్టి తనకు వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడినా తిరస్కరించేలా చేశారు.

వాణిజ్య యుద్ధాలు

అనేక దేశాలపై ప్రతీకార సుంకాల పేరుతో సునామీనే సృష్టించారు. ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేశారు. భారత్‌లాంటి దేశాల్లో వ్యవసాయ ఉత్పత్తులపైనా సుంకాలు విధించి రైతుల పొట్ట కొట్టారు.

- రష్యా నుంచి చమురు కొంటుందనే కారణంతో భారత్‌పై అదిక సుంకాలను విధించి కయ్యం పెట్టుకున్నారు.

ట్రంప్‌ను ఆపేదెవరో అర్థం కావడం లేదు. ఈ విషయం పైనా ఆయనే స్పందించారు. 'నా సొంత నైతికత. నా మనసు మాత్రమే నన్ను ఆపగలవు' అని ఆయన ప్రకటించుకున్నారు.

ఆపేదెవరు?

- ట్రంప్ అత్యంత ప్రభావశీల అధ్యక్షుడని దేశ, విదేశాల్లో ఆయనను అభిమానించేవారు చెబుతున్నారు. కానీ ఇతర దేశాల రాజధానుల్లో ఆయన అలజడి రేపుతున్నారు. చైనా, రష్యా మౌనంగా ఈ పరిణామాలను గమనిస్తున్నాయి.

- నేషనల్ డెస్క్

విజయవాడ రూరల్ కానూరు అయాన్ సెంటర్ వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న జేఈఈ మెయిన్ అభ్యర్థులు, తల్లిదండ్రులు

జేఈఈ మెయిన్‌లో గణితం కఠినం

కాలిక్యులేషన్‌కు ఎక్కువ సమయం

కానూరులో పరీక్ష కేంద్రానికి పరుగులు తీస్తూ..

ఈనాడు, హైదరాబాద్, అమరావతి: జేఈఈ మెయిన్ పేపర్-1 తొలిరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల పరీక్షల్లోనూ గణితం కఠినంగా, సుదీర్ఘమైన ప్రశ్నలు వచ్చాయి. 3డీ జామెట్రీ, వెక్టర్స్, ఆల్జీబ్రా లాంటి పాఠ్యాంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని నిపుణులు తెలిపారు. కాలిక్యులేషన్‌కు ఎక్కువ సమయం పట్టిందని విద్యార్థులు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా బుధవారం నుంచి జేఈఈ మెయిన్ పేపర్-1 ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రసాయన శాస్త్రంలో ఈసారి ఇన్‌ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి ఎక్కువ ప్రశ్నలు ఇచ్చారు. వాటికి ఎక్కువ సమయం పట్టింది. భౌతికశాస్త్రం ప్రశ్నలు సులభం నుంచి మధ్యస్థంగా ఉన్నాయి. 'టాపర్లు సైతం 300కి 300 మార్కులు సాధించడం చాలా కష్టం' అని శ్రీచైతన్య విద్యాసంస్థల ఐఐటీ జాతీయ కోఆర్డినేటర్ ఎం.ఉమాశంకర్ అభిప్రాయపడ్డారు. మొత్తంగా ప్రశ్నలు మధ్యస్థం నుంచి కఠినంగా ఉన్నాయని, ఏ ఒక్క ప్రశ్నలోనూ సందిగ్ధత లేదని ఆయన చెప్పారు. విజయవాడ శారద విద్యా సంస్థల గణిత నిపుణుడు విష్ణేశ్వరరావు మాట్లాడుతూ మోడ్రన్ ఫిజిక్స్, ఎలక్ట్రిసిటీ, ఆప్టిక్స్, థర్మోడైనమిక్స్ విభాగాల నుంచి డైరెక్ట్ ఫార్ములా ఆధారిత ప్రశ్నలతో పాటు కొన్ని సంక్లిష్టమైన ప్రశ్నలు ఇచ్చారని తెలిపారు.

సనాతన ధర్మంపై ఉదయనిధి వ్యాఖ్యలు విద్వేష ప్రసంగమే: మద్రాసు హైకోర్టు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: సనాతన ధర్మంపై తమిళనాడు ఉప ముఖ్య మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు విద్వేషపూరిత ప్రసంగమేనని మద్రాసు హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సనాతన ధర్మంపై ఉదయనిధి వ్యాఖ్యలను విమర్శిస్తూ భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంపై దాఖలైన కేసును మదురై ధర్మాసనం కొట్టేసింది. ఉదయనిధి 2023లో చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ.. మాలవీయ చేసిన పోస్టు నేరం కిందకు రాదని పేర్కొంది. ఉదయనిధి ఉపయోగించిన పదజాలంపై అసహనం వ్యక్తం చేస్తూ.. ఆయన చేసిన వ్యాఖ్యలు విద్వేషపూరిత ప్రసంగం కిందకే వస్తాయని పేర్కొంది. తమిళనాడులో మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఎలాంటి కేసూ నమోదు కాలేదని, ఇతర రాష్ట్రాల్లో కొన్ని కేసులు నమోదైన విషయాన్ని ప్రస్తావించింది. ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలు దేశంలో 80 శాతం మంది హిందువులకు వ్యతిరేకమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమిళనాడులో హిందువులపై దాడి జరుగుతోందని జస్టిస్ శ్రీమతి అన్నారు. హిందూ దేవుళ్లయిన రాముడు, వినాయకుడు తదితరులపై చెప్పుల దండ వేశారని, పలు వినాయక విగ్రహాలను ధ్వంసం చేశారని, వాటిపై కొన్ని ఫిర్యాదులు మాత్రమే అందాయని, చాలావరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు.

విద్యార్థిని అదృశ్యం.. ముక్కలుగా మృతదేహం

కర్ణాటకలో దారుణ ఘటన

ధార్వాడ, న్యూస్‌టుడే: ఆమె మంచి భవిష్యత్తు ఉన్న యువతి. పారామెడికల్ శిక్షణ పూర్తిచేసుకుని ఉద్యోగాన్వేషణలో ఉంది. ల్యాబ్‌కు వెళ్లి వస్తానని మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయల్దేరిన ఆమె.. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గాలించగా.. శివార్లలో ఆమె మృతదేహం ముక్కలుగా కనిపించింది. ఈ దారుణ ఘటన మధ్య కర్ణాటకలోని ధార్వాడలో చోటుచేసుకుంది. రుకియా ముల్లా (19) అనే ఆ పారా మెడికల్ విద్యార్థిని ధార్వాడ గాంధీ చౌక్ లేఅవుట్‌లో ఉంటారు. ఆమె ఇంటికి రాకపోవడంతో పోలీసులు గాలించగా.. నగర శివార్లలోని వినయ్ డెయిరీ సమీపంలో ఉన్న ఓ ఖాళీ స్థలంలో ముక్కలైన మృతదేహం కనిపించింది. ఆమెను ఎక్కడో మరోచోట హత్య చేసి, ముక్కలు చేసి, మృతదేహాన్ని ఇక్కడ పడేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ధార్వాడ గ్రామీణం, విద్యాగిరి ఠాణా పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు.

భర్తను చంపేసి.. రాత్రంతా పోర్న్ వీడియోలు చూస్తూ..

గుంటూరు జిల్లాలో ప్రియుడితో కలిసి భార్య ఘాతుకం

మృతుడు శివనాగరాజుతో భార్య లక్ష్మీమాధురి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ప్రియుడితో కలిసి భర్తను చంపేసింది. తర్వాత ఒంటరిగా కూర్చుని రాత్రంతా పోర్న్ వీడియోలు చూస్తూ గడిపింది. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరులో జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. మంగళగిరి గ్రామీణ సీఐ వెంకటబ్రహ్మం, దుగ్గిరాల ఎస్సై వెంకటరవి ఈ వివరాలు తెలిపారు. చిలువూరుకు చెందిన ఉల్లిపాయల వ్యాపారి లోకం శివనాగరాజు రెండు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఆయనకు లక్ష్మీమాధురితో 2007లో వివాహమైంది. వీరికి ఇద్దరు మగపిల్లలు. భార్య విజయవాడలో సినిమాహాల్లో టికెట్ కౌంటర్‌లో పనిచేసేది. ఆ సమయంలో సత్తెనపల్లికి చెందిన గోపితో పరిచయం అయ్యింది. అది వివాహేతర సంబంధానికి దారితీసింది. భర్త వ్యాపారాన్ని నామోషీగా భావించిన ఆమె ఆ వ్యాపారం మాన్పించేసింది. గోపి హైదరాబాద్‌లో కారు ట్రావెల్స్ నిర్వహిస్తుండడంతో అక్కడికి ఉద్యోగానికి పంపింది. కొంతకాలం తర్వాత నాగరాజు హైదరాబాద్ నుంచి చిలువూరు వచ్చేశారు. దీంతో భార్యాభర్తల మధ్య వివాదాలు ఏర్పడ్డాయి. నాగరాజు ఎక్కువగా ఇంటివద్ద నుంచే వ్యాపారం చేస్తుండడంతో ప్రియుడితో సంబంధానికి అడ్డుగా మారింది. ఎలాగైనా అడ్డు తప్పించుకోవాలని లక్ష్మీమాధురి భావించింది. ఈ నెల 18న రాత్రి ఆమె బిర్యానీ చేసింది. భర్తకు పెట్టే బిర్యానీలో 20 నిద్రమాత్రలు పొడిగా చేసి కలిపింది. బిర్యానీ తిన్న నాగరాజు గాఢంగా నిద్రపోయారు. రాత్రి 11.30 సమయంలో ప్రియుడు వచ్చాడు. నిద్రపోతున్న నాగరాజు ఛాతీపై గోపి కూర్చోగా మాధురి దిండుతో ముక్కుపై అదిమి నొక్కిపట్టింది. అతడు మృతిచెందాడని నిర్ధారించుకున్నాక గోపి వెళ్లిపోయాడు. ఆ తర్వాత రాత్రంతా మాధురి పోర్న్ వీడియోలు చూస్తూ గడిపింది. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఇరుగుపొరుగును పిలిచి.. గుండెనొప్పితో తన భర్త చనిపోయాడని హడావుడి చేసింది. భార్యాభర్తల మధ్య వివాదాలు, ఆమె వివాహేతర సంబంధం గురించి తెలిసిన ఇరుగుపొరుగువారు అనుమానించారు. అరగంటలో మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తారనగా నాగరాజు స్నేహితులు వచ్చారు. అతని చెవిలో నుంచి రక్తం రావడం, చెవి వద్ద గాయం కనిపించడంతో తండ్రితో పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఎస్సై వెంకటరవి కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపారు. నివేదికలో మృతుని ఛాతీ వద్ద ఎముకలు విరిగి ఉండడం, గాలి ఆడకుండా చేయడంతో చనిపోయాడని తేలడంతో పోలీసులు మాధురిని విచారించగా అసలు విషయాలు బయటపడ్డాయి.

చర్మం చెప్పేది వినండి

కొన్ని అనారోగ్య లక్షణాలను చర్మం ద్వారా చెప్పడానికి శరీరం ప్రయత్నిస్తుంటుంది. చర్మంలో వచ్చే మార్పులు, మరీ ముఖ్యంగా రోజులపాటు దురద లేదా ఇన్ఫెక్షన్లు వస్తుంటే, అది రక్తంలో అధిక చక్కెర స్థాయిలకు తొలి సంకేతం కావొచ్చు. వాటిని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిది.

– వి.మోహన్, వైద్య నిపుణులు

జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ బెంచ్ ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వేమిరెడ్డి భాస్కరరెడ్డి. చిత్రంలో జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (జీస్టాట్) బెంచ్ ఏర్పాటుతో జీఎస్టీ వివాదాలకు సరైన పరిష్కార వేదిక లభించిందని జీస్టాట్ జ్యుడీషియల్ సభ్యుడు వేమిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. బుధవారం విజయవాడలో జీస్టాట్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బెంచ్ తాత్కాలికంగా విజయవాడ నుంచే పనిచేస్తుందని తెలిపారు. జీఎస్టీ అధికారులు జారీచేసిన ఆదేశాలపై పన్ను చెల్లింపుదారులు అప్పీల్ చేసుకునేందుకు బెంచ్ సరైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. అప్పీళ్ల దాఖలు పత్రాల సమర్పణ, కేసుల ట్రాకింగ్‌కు ఆన్‌లైన్ సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్ మాట్లాడుతూ.. సివిల్ కోర్టు తరహాలోనే జీస్టాట్ బెంచ్ కూడా పనిచేస్తుందని తెలిపారు. కేసుల ధ్రువీకరణ, సవరణ, రద్దు, రిమాండ్ చేసే అధికారాలు ఉంటాయని చెప్పారు. జరిమానాలు, రిఫండ్‌ల కేసులను బెంచ్ విచారించడం వల్ల హైకోర్టులపై భారం తగ్గుతుందన్నారు.

వారం రోజుల్లో నిర్ణయాలు వెల్లడిస్తాం

- పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన విదేశీ నిపుణులు
- గ్యాప్-2 ఆకృతులపై కూలంకష చర్చలు
- గ్యాప్-1 ప్రధాన డ్యాం పనుల పరిశీలన

పోలవరం ప్రాజెక్టులోని ప్రయోగశాల వద్ద మట్టి పరీక్షలకు సంబంధించిన దస్త్రాలు పరిశీలిస్తున్న విదేశీ నిపుణులు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు గ్యాప్-2 ప్రధాన డ్యాం ఆకృతులతోపాటు మూడు రోజుల పాటు చర్చించిన వివిధ అంశాలపై తమ నిర్ణయాలు వారంలో వెల్లడిస్తామని విదేశీ నిపుణుల బృందం స్పష్టం చేసింది. గ్యాప్-2 ప్రధాన డ్యాం డిజైన్లకు సంబంధించి ఆఫ్రి డిజైన్ కన్సల్టెన్సీ ఇచ్చిన నివేదికలోని అంశాలపై కూలంకషంగా చర్చించారు. కేంద్ర జల సంఘం ఆకృతుల చీఫ్ ఇంజినీర్, పోలవరం అథారిటీ ముఖ్యులు, ఇతర కేంద్ర సంస్థల ప్రతినిధుల సమక్షంలో ఈ చర్చలు కొనసాగాయి. గతంలో ప్రతిపాదించిన గ్యాప్-2 ప్రధాన డ్యాం ఆకృతులపై కేంద్ర జలసంఘం 23 కీలకాంశాలను, అభ్యంతరాలను ఆఫ్రి సంస్థకు తెలియజేసింది. వాటికి సమాధానాలు ఇస్తూ రూపొందించిన ఆకృతులపై చర్చలు జరిగాయి. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్య కార్యదర్శి ఎం.రఘురామ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మూడో రోజు సమావేశంలో విదేశీ నిపుణులు హించ్‌బెర్గర్, డేవిడ్ బి పాల్, ఫ్రాంకో డి సిస్కోలు ఎన్నో ప్రశ్నలు సంధించారు. పోలవరం ప్రాజెక్టుకు, ఇతర డ్యాంలకు ఉన్న తేడాలను ఇక్కడి అధికారులు వివరించారు. పోలవరం వద్ద నిరంతరం బ్యాక్ వాటర్ ఉంటుందన్న అంశం ప్రస్తావించారు. గ్యాప్-2 ఆకృతులకు సంబంధించి తమ దేశానికి వెళ్లిన తర్వాత డాక్యుమెంట్లు పరిశీలించి తుది నిర్ణయాలు వెల్లడిస్తామన్నారు. ఆ తర్వాత కేంద్ర జల సంఘం ఈ ఆకృతులకు సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేయాల్సి ఉంటుంది.

◆ పోలవరం ప్రధాన డ్యాంలో బంక మన్ను ఉన్న ప్రాంతంలో 650 మీటర్ల మేర డయాఫ్రం వాల్‌కు అటూ, ఇటూ డీప్ సాయిల్ మిక్సింగ్ కోసం పైల్సు వేసి సిమెంటు, రసాయనాలతో గట్టి పర్చాలని గతంలో భావించారు. ప్రస్తుత చర్చల్లో ఆ అవసరం లేదని విదేశీ నిపుణులు అభిప్రాయపడ్డారు.

◆ స్పిల్ వేకు ఆనుకుని జి హిల్ ఉన్న ప్రాంతంలో ప్రధాన డ్యాం నిర్మాణం అవసరం లేదని విదేశీ నిపుణులు గతంలో అభిప్రాయపడ్డారు. అంతకుముందు ఎప్పుడో ఈ అంశాన్ని పరిశీలించి పరీక్షలు చేసి ఆ ప్రాంతంలోనూ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని తేల్చారు. ఇందుకు విదేశీ నిపుణులు అంగీకరించారు.

◆ భూకంపాలను తట్టుకునేలా చేపట్టాల్సిన నిర్మాణాల ఆకృతులపైనా అధ్యయనం చేసి వారంలో అభిప్రాయం వెల్లడిస్తామన్నారు.

◆ డ్యాం కుడి, ఎడమ గట్ల గట్టిదనం, కోత నివారణకు బ్రహ్మపుత్ర డ్యాంపై రూపొందించిన ఆకృతులు పరిశీలించాలని కేంద్ర జలసంఘం నిపుణులు సూచించారు. విదేశీ నిపుణులూ ఇదే తరహా డ్యాంలలో అనుసరించిన విధానాలు చేపట్టడమే మంచిదని అభిప్రాయపడ్డారు.

◆ పోలవరంలో డాక్యుమెంటేషన్ మరింత పక్కాగా ఉండాలని సూచించారు. నాణ్యత నియంత్రణ పరీక్షలు ఎలా చేస్తున్నారు? ఎన్ని సమయాల్లో చేస్తున్నారు? నిర్దేశించుకున్న విధానాల ప్రకారమే చేస్తున్నారా అని విదేశీ నిపుణులు పరిశీలించారు.

3 గంటలపాటు పనుల పరిశీలన

విదేశీ నిపుణులు గ్యాప్-1 ప్రధాన డ్యాంలో నిర్మాణ లేయర్లు, ఇతర పనులను 3 గంటలపాటు పరిశీలించారు. ప్రతి రికార్డునూ క్షుణ్నంగా చూశారు. మెటీరియల్స్‌ను, పనుల పురోగతిని స్వయంగా పరిశీలించి.. అంతా బాగుందన్నారు. సమావేశంలో జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, పోలవరం ఎస్ఈ రామచంద్ర రావు, కేంద్ర జలసంఘం డైరెక్టర్ మనీష్ రాథోడ్, సీఎస్ఎంఆర్ఎస్ సంస్థ నుంచి మనీష్ గుప్తా, రవి అగర్వాల్, సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి రామారావు, పోలవరం అథారిటీ డైరెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారయ్య హత్యకేసులో.. 12 మంది వైకాపా కార్యకర్తల అరెస్టు

- నిందితులను రోడ్డుపై నడిపిస్తూ కోర్టుకు తీసుకువెళ్లిన పోలీసులు

నిందితులను న్యాయస్థానానికి తీసుకువెళుతున్న పోలీసులు ● హత్యకేసులో ఏ1 చినబాబు(పూర్తిలో)

హత్యకు గురైన బంగారయ్య

తుని, తుని పట్టణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడిలో ఈనెల 16న జరిగిన తెదేపా కార్యకర్త లాలం బంగారయ్య హత్యకేసులో వైకాపాకు చెందిన 12 మందిని మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్టుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు చింతకాయల సన్యాసిరాజా విశ్వనాథ్ అలియాస్ చినబాబు(ఏ1), చింతకాయల నారాయణ మహేష్(యేసుబాబు), చిటికెల నారాయణమూర్తి, పెదపాత్రుని సతీష్, గొంప వీరబాబు, అంకంరెడ్డి సాయికుమార్, చింతకాయల సత్యనారాయణమూర్తి, రుత్తల సాయి భానుప్రకాష్, కాళ్ల రమేష్, రుత్తల కిషోర్, రుత్తల సాయికిరణ్, అంకంరెడ్డి నారాయణమూర్తిలను పోలీసులు బుధవారం తుని రూరల్ సర్కిల్ కార్యాలయం నుంచి న్యాయస్థానానికి రోడ్డుపై నడిపిస్తూ తీసుకెళ్లారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐలు జి.చెన్నకేశవరావు, ఎం.గీతారామకృష్ణ, ఎస్సైలు రామకృష్ణ, కృష్ణ మాచార్యులు, ప్రత్యేక బలగాల నడుమ నిందితులను కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించడంతో వారిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు. మినీ బస్సు మొరాయించిందని, మిగిలిన వాహనాలు సరిపోలేదని అందుకే నిందితులను నడిపిస్తూ కోర్టుకు తీసుకువెళ్లినట్లు డీఎస్పీ చెప్పారు.

రాజకీయ కక్షలతో: రాజకీయ కక్షలతో వైకాపా, తెదేపా వర్గాల మధ్య శత్రుత్వం పెరిగిందని డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. ఈనెల 16న అల్లిపూడి తెదేపా నాయకుడు అంకంరెడ్డి ఎర్రపాత్రుడు(బుల్లిబాబు) జన్మదిన వేడుకల అనంతరం ఆ పార్టీకి చెందినవారు రామాలయం వద్దకు వెళుతుండగా రా

వసుంధర

vasundhara@eenadu.in

అబ్బా... మళ్లీ మర్చిపోయా!

● పాప చెవి దిద్దు విరగ్గొట్టుకుంది. రేపు తప్పక మార్చాలి. లాకర్‌లో పెట్టడమెందుకు? గుర్తుగా పెట్టుకుంటే తీసుకోవడం తేలిక అని దాచింది రవళి. తీరా మరుసటిరోజు ఆ చోటేంటో మర్చిపోయింది.

● వారం రోజుల్లో మీటింగ్... బాగా సిద్ధమవ్వండి అన్నారు బాస్. ఎందుకైనా మంచిదని ముందే ప్రణాళికను సిద్ధం చేసుకుంది మాధవి. ఆరోజు రానే వచ్చాక మీటింగ్ సంగతే మర్చిపోయింది. ఆరోజు ఏం రాశానబ్బా అనుకుంటూ హడావుడిగా చదవడం మొదలు పెట్టింది.

ఇవేనా... పిల్లలు పాడుచేస్తారనో, తరవాత ఎప్పుడైనా పని కొస్తాయనో ఎన్నెన్నో జాగ్రత్త చేస్తుంటాం. తీరా అవసరానికి అన్నీ మర్చిపోతుంటాం. ఇల్లంతా తీసి సర్దుతుంటాం. ఆ సమయంలో గుర్తు తెచ్చుకోవడానికి పడే ఇబ్బందులూ తక్కువేమీ కాదు. ఈ పరిస్థితి పద్దంటే చేయండిలా...

వల్లె వేయండి

పరీక్షలు, ఇంటర్వ్యూలప్పుడు ఏం చేసేవాళ్లం? జవాబులను తెగ చదివేవాళ్లం కదూ! ఒక్కసారికే గుర్తుంటాయా? లేదు కదా! అందుకే పదే పదే వల్లె వేస్తుంటాం. ఇప్పుడూ అదే చేయండి. గంటలకొద్దీ అవసరం లేదు. 40 సెకన్లపాటు గుర్తుంచుకోవాలనుకున్న దాన్ని మెదడులో మ్యాపింగ్ చేసుకోండి. ఉదాహరణకు మీటింగే అనుకోండి. మీటింగ్ మొదలైనప్పట్నుంచీ ఎవరెవరు మాట్లాడారు? ఏం మాట్లాడారు? తరవాత మీరేం చేయాలి వంటివన్నీ గుర్తు తెచ్చుకోండి. ఈ రిహార్సల్... చాలాకాలం జ్ఞాపకాలను బంధించి ఉంచుతుంది అంటోంది జర్నల్ ఆఫ్ న్యూరోసైన్స్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం.

విశ్రాంతి తీసుకోండి

నిద్ర మన శరీరాన్ని రిపేర్ చేయడమే కాదు జ్ఞాపకాలను భద్రపరచడంలోనూ సాయపడుతుంది. మనం సాధారణంగా ఎందుకు మర్చిపోతుంటామో తెలుసా? నిద్రలేమి ఒక కారణమైతే... ఒకదాని తరవాత ఒకటి విశ్రాంతి లేకుండా పనులు చేయడం మరో కారణం. ఏదైనా ముఖ్యమైన విషయం మర్చిపోకూడదు అనుకున్నప్పుడు రెండు నిమిషాలు కళ్లు మూసుకోండి. శ్వాస మీద ధ్యాస పెట్టండి. ఆ తరవాతే మరో పనిలోకి వెళ్లండి. ఈ ప్రక్రియ మెరుగ్గా గుర్తుంచుకునేలా చేయగలదట.

కాబట్టి, ఈసారి నుంచి మర్చిపోతున్నా అనిపిస్తే... ఒక్క క్షణం ఆగండి. వీటిని ప్రయత్నించండి. తీసుకునేది తక్కువ సమయమే... కానీ మెరుగైన ఫలితాలు ఇస్తాయంటున్నాయి అధ్యయనాలు. మరి ప్రయత్నిస్తారా?

పెద్దగా చెప్పండి

చిన్నపిల్లల్ని పెద్దగా చదవమంటాం. అది వాళ్లు చదువుతున్నారో లేదో చెక్ చేయడానికే కాదు... వేరే ధ్యాసలో పడకుండా కొనసాగిస్తారనీ అలా చేయమంటాం. మనమూ అంతే! లోలోపల మర్చిపోవద్దు అనుకుంటాం కానీ... వేరే ఆలోచనల్లో అదీ కొట్టుకుపోతుంది. కాబట్టి, బయటికి అనేయండి. అప్పుడు మెదడులో భద్రమవుతుందట. నలుగురిలో, ఆఫీసు లాంటి చోట కుదరదు అనిపిస్తే మాట పెదాలను దాటిస్తే సరిపోతుంది.

పందెం వేద్దాం

మనకి ఇంట్లో బోలెడు పనులు. ఒకదాని తరవాత ఒకటి ఎన్నెన్నో చేసుకుంటూ వెళతాం. ఈ క్రమంలో మరిన్ని ముఖ్యమైన విషయాలు వచ్చిపడుతుంటాయి. ఈలోగా నగలు, తాళాలు వంటి సంగతులు పక్కకి వెళ్లిపోతాయి. ఈ భయం వేస్తే... నేను దీన్ని గుర్తుంచుకోగలనా అని మీకు మీరే పందెం వేసుకోండి. ఇది 50 శాతం మెరుగ్గా గుర్తుంచుకునేలా చేయగలదట. పరిశోధనలు చెబుతున్న మాట ఇది.

ఈ టీచర్... ఆత్మవిశ్వాసానికి మారుపేరు!

విద్యార్థులనే కాదు... వాళ్లకు బోధించే ఉపాధ్యాయులనూ నడిపించాల్సిన ప్రధానోపాధ్యాయురాలు. కానీ ఆమెకి చూపే లేదు. అయితేనేం, ఎవరి సాయమూ లేకుండానే స్కూలంతా తిరిగేయగలరు. పాఠాలూ బోధించగలరు. స్కూలునీ చక్కగా నిర్వహిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగానూ నిలుస్తున్నారు లక్ష్మీ సూర్యకాంతం.

సూర్యకాంతం స్వస్థలం తూర్పుగోదావరి జిల్లాలోని మండపేట. చిన్నప్పుడు అందరు పిల్లల్లాగే ఉండేవారామె. 8వ ఏట వేసవి సెలవులకు తాతగారి ఇంటికి వెళ్లొచ్చాకే మార్పు మొదలైంది. సూటిగా చూడలేకపోయేవారు, పుస్తకాన్ని కళ్లకు దగ్గరగా పెట్టుకుని చదివేవారు. అది గమనించి, తల్లిదండ్రులు వైద్యులకు చూపించారు. అయినా చూపు మందగిస్తుండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో ప్రముఖ ఆసుపత్రులకీ తిప్పారు. 'కంటి రెటీనా వెనకున్న నరాలకు రక్తప్రసరణ జరగట్లేదు. చికిత్స కష్ట'మన్నారు వైద్యులు. దీంతో చేసేదేమీలేక ఇంటికి వచ్చేశారు. మరో ఏడాదికి పూర్తిగా చూపు పోయింది. తోటిపిల్లలు ఆటపట్టిస్తున్నారని చదువు మాన్పించారు ఇంట్లోవాళ్లు. కానీ సూర్యకాంతం మారాం చేయడంతో తిరిగి స్కూల్లో చేర్చారు. అందత్వం తనకో అడ్డని భావించలేదామె. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినేవారు. ఇంటర్ వరకూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

తన 18వ ఏట సమీప బంధువు శ్రీరామ్మూర్తితో సూర్యకాంతానికి వివాహమైంది. భర్త ప్రోత్సాహంతో దూరవిద్యలో డిగ్రీ, ఆపై కాకినాడలో బీఈడీ పూర్తిచేశారు. 1997లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. 12 ఏళ్లపాటు సాంఘిక శాస్త్రం బోధించి, ప్రధానోపాధ్యాయురాలిగా పదోన్నతి పొందారు. ఈ క్రమంలో పీజీ పూర్తిచేశారు. గ్రూప్స్, సివిల్స్ కూడా రాశారు. సివిల్స్ ఇంటర్వ్యూలో వెనుదిరిగారు. గ్రూప్-2 ఉద్యోగం వచ్చినా... బోధనపై మక్కువతో దాన్ని వదులుకున్నారు సూర్యకాంతం. పిల్లలకు బోధించడంలోనే తనకు సంతృప్తి దొరుకుతుంది అంటారామె. ప్రస్తుతం విశాఖలోని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా 430 మంది విద్యార్థులు, 22 మంది సిబ్బందిని ముందుకు నడిపిస్తున్నారు. పిల్లలకు సాంఘిక శాస్త్ర పాఠాలు బోధిస్తారు. 'టీచర్ పాఠం చెబితే విషయం వెంటనే అర్థమైపోతుంది' అంటారామె విద్యార్థులు. సూర్యకాంతం నిత్య విద్యార్థిని. మారిన సిలబస్, జీఓలనే కాదు, కొత్త అంశాలనూ ఎప్పటికప్పుడు ఆడియోలు విని నేర్చుకుంటారు. ఇంటి బాధ్యతనీ సమర్థంగా నిర్వర్తిస్తున్నారు. ఎవరి సాయం లేకుండానే అన్నిరకాల వంటలూ చేస్తారు. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు. వివాహాలు అయ్యాయి. భర్త ఉక్కు ఫ్యాక్టరీలో ఉద్యోగి.

'ఒకసారి తరగతి గదులను పరిచయం చేస్తే చాలు. తరవాత నేనే వెళ్లిపోతా. ఒక్కసారి మాట్లాడితే వాళ్లని పేర్లతోసహా గుర్తు పెట్టేసుకుంటా. ఇంట్లోనైనా ఏయే సామాన్లు ఎక్కడున్నాయో చెబితే చాలు. అన్ని పనులూ చేసుకోగలను. వైకల్యం శరీరానికే, ఆత్మవిశ్వాసానికి కాదు. అందుకే లోపాన్నే తలచుకుని బాధపడొద్దు. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి. అప్పుడు ఎవరైనా ఏదైనా సాధించొచ్చు. కాబట్టి, సవాళ్లను చూసి కుంగిపోవద్దు. సానుకూల ఆలోచనలు అలవాటు చేసుకోండి' అన్న సలహానీ అందరికీ ఇస్తుంటారు సూర్యకాంతం.

– సాయి సత్యనారాయణ కందుల, అక్కిరెడ్డిపాలెం

నిరంతరం శ్రమిస్తే విజయం మనదే...

నా అనుభవం...

నేను ఐటీ, హెచ్‌ఆర్ కన్సల్టింగ్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చా. ఎలక్ట్రిక్ వెహికల్స్ తయారీ రంగంలోకి అడుగుపెట్టే సమయానికి మాన్యుఫాక్చరింగ్ గురించి నాకేమీ తెలియదు. మరో పక్క మార్కెట్‌లోనూ ఈవీల గురించి అవగాహన తక్కువ. నిపుణుల కొరత వేధించింది. వీటిని అధిగమించడానికి తాత్కాలిక పరిష్కారాలు సరిపోవని అర్థమైంది. అందుకే, కోయంబత్తూరులో పరిశ్రమను నెలకొల్పుతూనే నెట్‌వర్క్‌నూ ఏర్పరచుకోగలిగా. ఇతరదేశాల సాంకేతికతపై ఆధారపడకుండా స్వదేశీ టెక్నాలజీని ఉపయోగించడంపై దృష్టిపెట్టాం. ఈ ప్రయత్నాలన్నీ మమ్మల్ని తక్కువ కాలంలోనే దేశీయ ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్‌లో అగ్రస్థానంలో నిలబెట్టాయి. 2018లో మా సంస్థను గ్రీవ్స్ కాటన్ దక్కించుకుంది. ఇది నా జీవితాన్ని మలుపుతిప్పిన నిర్ణయాల్లో ఒకటి. తర్వాత ఆ సంస్థకు కొన్నాళ్లు సీఈఓగానూ పనిచేశా. ప్రస్తుతం గ్రీన్ కాలర్ అగ్రిటెక్ సొల్యూషన్స్‌కి కోఫౌండర్‌గా, మహిళా ఆంత్రప్రెన్యూర్లకు మార్గదర్శకత్వం వహిస్తూ, కొత్త వెంచర్లకు పెట్టుబడులు అందిస్తున్నా. ధైర్యంగా ముందడుగు వేయడం, నిరంతరం ప్రయత్నించడం, సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకోవడం... ఇవే నన్ను విజయానికి దగ్గర చేశాయి.

– హేమలత అన్నామలై, వ్యవస్థాపకురాలు ఆంపియర్ ఎలక్ట్రిక్ వెహికల్స్

ఆ నైపుణ్యాలు ఉన్నాయా?

ఆత్మవిశ్వాసం లేకపోవడం అంటే పోటీలో నిలపకుండానే ఓటమిని అంగీకరించడం. నేర్చుకోవడం, సలుగురిలో కలపడం, ఇతరులతో పోటీపడడం... వీటిద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇది ఉంటే రెట్టింపు ఉత్సాహంతో జీవితంలో ముందుకు వెళ్లొచ్చు.

చాలా పాఠశాలల్లో పరీక్షలు, మార్కులంటూ పిల్లల్ని క్రీడలు, ఇతర అభిరుచులవైపు ప్రోత్సహించడం మానేస్తున్నారు. పిల్లలు నాటకాలు, క్రీడలు, వక్తృత్వ పోటీల్లో భాగమైనప్పుడు... తమలో నిగూఢమైన నైపుణ్యాల్ని బయట పెట్టగలరు. ఈ అనుభవాలు వాళ్లకి అపరోధాల్ని ఎదుర్కోవడం, విజయాల్ని ఆస్వాదించడం, బృందంలో ఒకరిగా కలిసి ముందుకు వెళ్లడం వంటి జీవన నైపుణ్యాలను నేర్పుతాయి.

● నాటకాల్లో భాగమైతే... జ్ఞాపకశక్తి పెరుగుతుంది. విభిన్న భావోద్వేగాలను పలకడం తెలుస్తుంది. దీనివల్ల సిగ్గు, బిడియం పోతాయి. సలుగురిలో సులభంగా కలిసిపోతారు.

● క్రీడల్లో భాగమైతే... స్థిరమైన సాధన, ప్రయత్నంతో లక్ష్యాన్ని చేరొచ్చని గ్రహిస్తారు. ప్రతి చిన్న పురోగతి వాళ్ల సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. పట్టుదల, పోటీతత్వం పెరుగుతాయి. ఓటమి నుంచి కూడా భావోద్వేగ నియంత్రణ, సమస్యల్ని పరిష్కరించుకోవడం నేర్చుకుంటారు. బృందంలో ఉండటంతో నాయకత్వ లక్షణాలు అలవడతాయి. సామాజిక నైపుణ్యాలు మెరుగవుతాయి. ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్ వంటివి శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచుతాయి.

● వక్తృత్వ విభాగంలో చేరితే... స్కూల్లో జరిగే చర్చలు, పబ్లిక్ స్పీకింగ్ వంటి కృత్యాల్లో భాగమయ్యేలా ప్రోత్సహించాలి. వీటివల్ల ఆత్మవిశ్వాసం, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు మెరుగవుతాయి. అయిష్టంగా చేరినా క్రమంగా వాళ్లకు ఇటుగా శ్రద్ధాసక్తులు పెరుగుతాయి.

మీకు తెలుసా!

పిల్లలు పుట్టినప్పటి నుంచి తల్లి గొంతుని గుర్తించగలరు. ఆమె నవ్వుకీ, మాటలకీ, ఆడించేటప్పుడు ముద్దుగా చేసే చిన్న చిన్న శబ్దాలకూ స్పందిస్తారట. అందుకే గర్భంలో ఉన్నప్పటి నుంచే వారితో కబుర్లు చెబుతుండాలి అంటున్నాయి అధ్యయనాలు.

ఆ పట్టుచీర కోసమే ఈ నిరీక్షణ!

'బెంగళూరులోని కర్ణాటక సోవియట్ (క్షమించండి సిల్క్) ఇండస్ట్రీస్ కార్పొరేషన్ షోరూమ్ వెలుపల రూ.23,000 నుంచి రూ.2,50,000 ఖరీదు చేసే మైసూర్ సిల్క్ చీరల్ని కొనడానికి ఉదయం 4 గం. నుంచి మహిళలు క్యూ కట్టారు. పైగా ఈ వరసలో ఉండటానికి టోకెన్ తీసుకోవాలి. ఆపై ఒక్కొక్కరికీ ఒక చీర మాత్రమే విక్రయిస్తారు' అంటూ ఎక్స్‌లో చేసిన ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా అంతటా ఈ చీరల పట్ల ఆసక్తి నెలకొంది.

'కర్ణాటక సిల్క్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (కేఎస్ఐసీ) రూపొందించిన వాటినే నిఖార్సయిన మైసూర్ సిల్క్‌గా భావిస్తారు. దీనికి జీఐ ట్యాగ్ కూడా లభించింది. అయితే ప్రస్తుతం ఈ సంస్థలో నైపుణ్యం ఉన్న నేత కార్మికులు తక్కువగా ఉందట. కొత్తవాళ్లకి శిక్షణ ఇవ్వడానికి ఆరేడు నెలల సమయం పడుతుందట. దాంతో డిమాండ్‌కి తగ్గట్లుగా ఉత్పత్తి లేదనీ, ఆ రద్దీని తట్టుకునేందుకే సంస్థ ఈ టోకెన్ వ్యవస్థని ఏర్పాటుచేసిందనీ...' ఆ పోస్టు చెబుతోంది. ఒకప్పుడు సోవియట్ యూనియన్‌లో రొట్టె తప్ప నిత్యావసరాలన్నింటికీ ఇలాంటి కొరత ఏర్పడిందనీ, అందుకే దీన్ని ఆ పరిస్థితితో పోల్చినట్లుగా పోస్ట్ చేసిన రాకేష్ కృష్ణన్ వివరణా ఇచ్చారు.

అసలెందుకీ డిమాండ్?

నిజంగానే మైసూర్ సిల్క్ చీరకి అంత ప్రత్యేకత ఉందా అంటే అవుననే చెప్పాలి. ఈ చీర కథ మైసూర్‌ని పాలించిన మహారాజా కృష్ణరాజ వడయార్ కాలంలో మొదలైంది. ఆయన యూరప్ పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడి స్విస్ పట్టు మృదుత్వానికి ముగ్ధుడై, 1912లో ప్యాలెస్‌లోనే కొందరు నేత నిపుణుల ఆధ్వర్యంలో పట్టు యూనిట్‌ను నెలకొల్పారట. అప్పట్లో రాజకుటుంబీకులు, ప్రత్యేక వేడుకల్లో సైనికులకోసం మాత్రమే ఈ పట్టును నేసేవారు. అదే క్రమంగా మైసూర్ సిల్క్ ఫ్యాక్టరీగా మారి, ఇప్పుడు కేఎస్ఐసీ నిర్వహణలో నడుస్తోంది.

ఇందులో వాడే మల్బరీ సిల్క్‌కోసం పట్టుగూళ్ల నుంచి దారాన్ని తీసి నేయించడం వరకూ కేఎస్ఐసీనే నిర్వహిస్తోంది. ఈ రకంగా పట్టు ఉత్పత్తి ప్రక్రియను పర్యవేక్షించే ఏకైక సంస్థ దేశంలో ఇదొక్కటే. పైగా జకార్డ్ మగ్గాలపై నేయడంతో ఇవి ప్రత్యేకంగా కనిపిస్తాయి. సహజ మెరుపుతో ముడతలు పడకుండానూ ఉంటాయి. ఈ చీరల్లో వాడే పట్టు దారాలతోపాటు బంగారు, వెండి జరీ పోగులన్నీ నూటికి నూరుశాతం స్వచ్ఛమైనవి. అందుకే వీటికంత డిమాండ్. శనివారానికి షోరూమ్‌లో 50 చీరలుంటే సోమవారం ఉదయానికే అన్నీ అమ్ముడైపోతాయట.

అదీగాక, ఒకప్పుడు సాదాగా ఉండే మైసూర్ సిల్క్ ఇప్పుడు చారలు, చెక్స్, బుటీలూ... ఇలా రకరకాల డిజైన్లలోనూ వస్తోంది. చీరలో వాడే సిల్కు, బంగారు జరీ, డిజైన్‌ను బట్టి చీర ధర ఉంటుంది. చీర బరువు (గ్రామ్ పర్ స్క్వేర్‌మీటర్) పెరిగేకొద్దీ ధర పెరుగుతుంది. సాధారణంగా 60 జీఎస్ఎమ్ బరువు నుంచి 120 జీఎస్ఎమ్ బరువు వరకూ చీరలు లభిస్తాయి. వీటి ధర సుమారు రూ.8 వేల నుంచి రూ.40 వేల వరకూ ఉంటుంది. ఇక, చీరలో వాడే బంగారు జరీ లేదా డిజైన్‌ని బట్టి లక్షల రూపాయల విలువ చేసేవీ ఉంటాయి. అయితే ధర ఎంతైనా మైసూర్ సిల్క్‌ని సంస్కృతీ సంప్రదాయం పేరుతో కొందరూ వారసత్వ సంపద అని మరికొందరూ అపురూపంగా భావించి కొంటుంటారు. పట్టుకుంటే జారిపోయే మృదుత్వం, తేలికపాటి బరువు, నిండైన రంగు, రాయల్ డిజైన్‌తో మెరిసే మైసూర్ పట్టు ఒక్కటైనా తమ వార్డ్‌రోబ్‌లో ఉండాలని కోరుకోని అమ్మాయిలు ఉండరంటే అతిశయోక్తి కాదేమో.

ఎలా గుర్తించాలి?

కేఎస్ఐసీ రూపొందించే ఈ పట్టుచీర ప్రామాణికతకి గుర్తుగా ప్రత్యేకమైన సీరియల్ నంబర్(కోడ్), హోలోగ్రామ్‌తో స్టాంప్ ఉంటుంది. సిల్కు దారం స్వచ్ఛమైనదో కాదో తెలుసుకునేందుకు ఓ చిన్న పోగుని తీసి కాల్చితే సహజ పట్టు అయితే జుట్టు కాలుతున్న వాసన వస్తుంది. కాలినదాన్ని వేలితో నలిపితే చూర్ణంలా అయిపోతుంది. అదే కృత్రిమ పట్టు అయితే ప్లాస్టిక్ కాలిన వాసన వస్తుంది.

జాగ్రత్తలు!

ఈ చీరల్ని ఎలా పడితే అలా ఉతకకూడదు. గోరువెచ్చని నీళ్లలో మైల్డ్ సోప్ లేదా షాంపూతో మృదువుగా ఉతికి, కొద్దిగా సిట్రిక్ యాసిడ్ కలిసిన చల్లని నీళ్లతో రెండు మూడుసార్లు శుభ్రం చేయాలి. రంగు పోకుండా ఉంటుంది. లేదా డ్రైక్లీనింగ్‌కి ఇవ్వాలి. మృదువైన మస్లిన్ లేదా కాటన్ వస్త్రంలో చుట్టి ఉంచాలి. ఈ చీరమీద నేరుగా పెర్‌ఫ్యూమ్స్ కొట్టకూడదు. ప్రతి కొన్ని నెలలకే మడతలు మార్చాలి. అప్పుడే ఎన్నేళ్లయినా చెక్కుచెదరకుండా వారసత్వ ఆస్తిలా తరాలపాటు నిలిచి ఉంటుందీ పట్టుచీర!

బంగారం - వెండి

21న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,57,690	1,44,550	3,40,000
విజయవాడ	1,53,500	1,41,900	3,21,900
ప్రొద్దుటూరు	1,57,600	1,44,990	3,25,000
రాజమహేంద్రవరం	1,57,260	1,44,150	3,45,000
విశాఖపట్నం	1,57,250	1,34,150	3,25,000
తమిళనాడు	-----	1,44,150	3,45,000

థైరాయిడ్ తగ్గుతుందా..!

డియర్ వసుంధర

నా వయసు 28. ఈ మధ్య బరువు పెరిగానని పరీక్ష చేయించుకుంటే హైపో థైరాయిడ్ ఉందని తెలిసింది. దీనివల్ల నా పీరియడ్స్ కూడా క్రమ పద్ధతిలో రావడం లేదు. ఈ మధ్యే వచ్చింది కాబట్టి మందులు వాడకుండా పోషకాహారంతో దీన్ని నయం చేసుకోవచ్చా? ఇందుకు ఎలాంటి డైట్ పాటించాలి? – పర్షిత

డాక్టర్ లతాశశి
పోషకాహార నిపుణులు

హైపో థైరాయిడ్ అనేది థైరాయిడ్ హార్మోన్ తక్కువగా విడుదలవడం వల్ల వస్తుంది. దీనివల్ల త్వరగా అలసిపోవడం, బరువు పెరగడం జరుగుతాయి. అయితే, మందులు వాడకుండా దీన్ని నయం చేయలేం. కానీ, థైరాయిడ్ హార్మోన్ నిలకడగా ఉండాలన్నా, మీరు అలసిపోకూడదన్నా మందులతోపాటు ఆహార నియమాలు తప్పక పాటించాలి. ఇందుకు అయోడిన్, జింక్, సెలీనియం ఉండే ఆహార పదార్థాలను రోజువారీ డైట్‌లో భాగం చేసుకోవాలి. ఒమెగా- 3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండే సాల్మన్ చేపలు తినాలి. కోడిగుడ్డులో అయోడిన్, సెలీనియం ఎక్కువ ఉంటాయి కాబట్టి, డైట్‌లో చేర్చుకోవాలి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆకుకూరలను తీసుకోవాలి. క్యాబేజీ, బ్రాకలీని ఉడికించి తినాలి. బ్రౌన్ రైస్, ఓట్స్, క్వినోవాల్లో పీచు పదార్థం ఎక్కువగా ఉండి గట్ హెల్త్‌కి తోడ్పడతాయి. అవిసె, గుమ్మడి, సన్‌ఫ్లవర్ గింజల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, ఆరోగ్యకరమైన కొవ్వులుంటాయి కాబట్టి వీటిని చిరుతిండిగా తీసుకోవాలి. డెయిరీ ఉత్పత్తులు... పాలు, పెరుగు, చీజ్ తీసుకోవాలి. గింజలు, పప్పు దినుసులు రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. వీటితోపాటు తగినన్ని నీళ్లు తాగాలి. మీ బరువుని బట్టి రోజుకు 2-3లీటర్లకు తగ్గకుండా తాగాలి. హెర్బల్ టీ, గ్రీన్ టీ, కొబ్బరి నీళ్లు తాగొచ్చు. ప్రాసెస్ చేసిన, బేకరీ పదార్థాలు, శాచ్యురేటెడ్ కొవ్వులు అధికంగా ఉండే రెడ్ మీట్ వంటి ఆహారాలకి వీలైనంత దూరంగా ఉండాలి. ఇవి మీ జీవక్రియను నెమ్మదించేలా చేస్తాయి.

నక్షత్ర పండు నోరూరిస్తుంది!

ఆకాశంలో మెరిసే నక్షత్రాలను భూమిపైకి తెచ్చినట్లుగా కనిపించే అందమైన పండు స్టార్‌ఫ్రూట్. దీని నిగనిగలాడే పండ్లే కాదు... ఆకులూ, పూదారంగు పూలు కూడా ఆకర్షణ తెచ్చిపెడతాయి. మరి ఈ మొక్కను ఎలా పెంచాలో తెలుసా?







స్టార్ ఫ్రూట్ తీపి, పులుపు కలిసిన రుచిలో నోరూరిస్తుంది. ఆగ్నేయాసియాలోని మలేషియా, ఇండోనేషియా, మనదేశంలోని కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో విరివిగా పండుతుంది. పచ్చళ్లు, జామ్‌లు, జ్యూస్‌ల తయారీకి ఎక్కువగా వినియోగిస్తారు. చిన్న చెట్టుకే పుష్కలంగా కాయలు కాయడం దీని ప్రత్యేకత. పచ్చని ఆకుల మధ్య గుంపులు గుంపులుగా కనిపించే ఈ పండ్లు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటాయి. ఈ మొక్కలో ఎన్నో రకాలున్నాయి. నేలలోనే కాదు... కుండీల్లోనూ సులువుగా పెంచుకోవచ్చు. అయితే, విత్తనం ద్వారా మొలకెత్తిన దాని కంటే గ్రాఫ్ట్ చేసిన వెరైటీలు నాణ్యంగా ఉంటాయి.

జాగ్రత్తలు ఇలా...

బలమైన గాలుల నుంచి మొక్కకు తగిన రక్షణ కల్పించాలి. అలానే దీన్ని నాటేందుకు నీరు నిలవని సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. నీళ్లు ఒకేసారి పోయకుండా... అవసరాన్ని బట్టి కొద్దికొద్దిగా అందించాలి. కనీసం 6-8 గంటల పాటు ప్రత్యక్ష సూర్యకాంతి తగిలేలా చూసుకోవాలి. అంతేకాదు, ఈ మొక్క ఆరోగ్యంగా ఎదుగుతూ, ఎక్కువ పండ్లను ఇవ్వాలంటే... రెండు మూడు నెలలకోసారి ఎన్‌పీకే సమగ్ర ఎరువుని 10:10:10 నిష్పత్తిలో వాడాలి. ఏటా ప్రూనింగ్ తప్పనిసరి. ముఖ్యంగా ఎండిన, బలహీనమైన కొమ్మల్ని కత్తిరించేయాలి. దీనికి పండ్ల ఈగలు, తెల్లదోమ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. వాటిని నివారించడానికి వేపనూనెను పిచికారీ చేస్తే సరి. ఇందులో ఎన్నో రకాలు ఉన్నాయి. నేల మీదే కాదు... కంటైనర్లు, కుండీల్లోనూ అనువుగా పెంచుకోవచ్చు. బోన్సాయ్‌గానూ మలుచుకోవచ్చు.

(c) eenadu

లేటు వయసులో వెయిట్ లిఫ్టింగ్

వియత్నాంలో స్వర్ణాల సాధన

రాజేంద్ర సింగ్, సంజయ్

సాధించాలనే ఆకాంక్ష, పట్టుదల ఉంటే వయసు అడ్డంకి కాబోదని మధ్యప్రదేశ్‌లోని చింద్‌వాడా జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ వెయిట్ లిఫ్టర్లు నిరూపించారు. రిటైర్మెంటు దశ కూడా దాటినా ఉత్సాహంలో యువకుల కన్నా తామేం తక్కువ కాదని చాటారు. వియత్నాంలో జరిగిన ప్రపంచ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో చెరో రెండు స్వర్ణ పతకాలు గెలిచి విదేశాల్లో భారత ఖ్యాతిని ఇనుమడింపజేశారు. హోచిమిన్ నగరంలో వరల్డ్ రా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రాజేంద్ర సింగ్ ఠాకుర్ (70), సంజయ్ చాటే (66) ఈ ఘనత సాధించారు. రాజేంద్ర 83 కిలోల విభాగంలో, సంజయ్ 64 కిలోల విభాగంలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. సీనియర్ సిటిజన్ల కేటగిరీలో బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్ ఈవెంట్లలో వీరిద్దరూ రెండేసి బంగారు పతకాల చొప్పున గెలుచుకున్నారు. "రోజువారీ వ్యాయామం, స్థిరమైన ప్రొటీన్లు, సమతుల ఆహారం, సరైన నిద్ర, ఒత్తిడి లేని జీవనశైలితో ఫిటెనెస్‌ను సాధించవచ్చు. ఫిట్‌గా ఉండటంలో మనసు కీలకపాత్ర పోషిస్తుంది" అని రాజేంద్ర, సంజయ్ తెలిపారు.

ఈటీవీ భారత్ యూపీ వెస్ట్ గ్రూప్ పై ఆధారపడి రాసినది

కిలో పుట్టగొడుగులు రూ.లక్ష

ఇంటిలోనే వ్యవసాయ క్షేత్రం

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన దేవికాసింగ్ తన ఇంట్లో వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణాన్ని పూర్తిస్థాయి ఆధునిక వ్యవసాయ క్షేత్రంగా మార్చేశారు. హిమాలయాల వంటి చల్లటి ప్రాంతాల్లో పండే కీడాజడీ (కార్డిసెప్స్) అనే అరుదైన పుట్టగొడుగుల సాగుతో రూ.లక్షలు గడిస్తున్నారు. ఈ పంటకు అవసరమైన తక్కువ ఉష్ణోగ్రత, తేమ, లైటింగు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన దేవిక బయోటెక్ రంగంలో కొంతకాలం పని చేశారు. ఆ అనుభవంతో ఈ ప్రయోగాన్ని చేపట్టి విజయవంతంగా కొనసాగిస్తున్నారు. "కొవిడ్ కాలంలో కీడాజడీ పుట్టగొడుగులకు పెరిగిన డిమాండును చూసి ఈ ఆలోచన వచ్చింది. ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌ను రూ.14 లక్షల ఖర్చుతో మినీ ల్యాబుగా మార్చా. ఏడాదికాలం పరిశోధన తర్వాత ఈ పుట్టగొడుగుల సాగు ప్రారంభించా" అని దేవిక వివరించారు. సాగు ప్రారంభించిన 70-90 రోజుల్లోనే మొదటిపంట వస్తుంది. ఔషధ గుణాలున్న కీడాజడీ ఫ్రై క్వాలిటీ ధర మార్కెట్లో కిలో రూ.లక్ష వరకు ఉంది.

నాలుగోసారి తల్లిదండ్రులు కాబోతున్న వాన్స్ దంపతులు

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన సతీమణి ఉషా వాన్స్ దంపతులు శుభవార్త చెప్పారు. త్వరలోనే నాలుగో బిడ్డకు జన్మనివ్వనున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. జులై చివరిలో పండంటి మగబిడ్డ తమ జీవితాల్లోకి రానున్నట్లు తెలిపారు. జేడీ- ఉషా వాన్స్‌లకు 2014లో వివాహం జరిగింది. వీరికి ఇప్పటికే ఎవాన్, వివేక్, మిరాబెల్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. తాజా ప్రకటన నేపథ్యంలో మద్దతుదారులు, సన్నిహితులు వాన్స్ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

అక్రమ మైనింగ్‌తో

ఆరావళికి తీవ్ర నష్టం

- సమగ్ర పరిశీలనకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తాం
- సుప్రీంకోర్టు వెల్లడి



దిల్లీ: పర్యావరణం పరంగా, భౌగోళికంగా ఎంతో ప్రాధాన్యమున్న ఆరావళి పర్వత శ్రేణికి అక్రమ మైనింగ్ వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతోందని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఇప్పటివరకు జరిగిన విధ్వంసం, పర్యవసానాలు, దానికి సంబంధించిన ఇతర అంశాలను సమగ్రంగా పరిశీలించేందుకు ఆయా రంగాల నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీతో కూడిన ధర్మాసనం బుధవారం వెల్లడించింది. దీనికి గాను మైనింగ్ వ్యవహారాల్లో నిష్ణాతులైన పర్యావరణ వేత్తలు, శాస్త్రవేత్తల పేర్లను నాలుగు వారాల్లోగా తమకు సూచించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి, కోర్టు సహాయకుడు (అమికస్ క్యూరీ) కె.పరమేశ్వర్‌లను ధర్మాసనం ఆదేశించింది. సుప్రీంకోర్టు నిర్దేశంలో ఆ కమిటీ పనిచేస్తుందని స్పష్టం చేసింది. ఆరావళి కొండలు, పర్వత శ్రేణికి సంబంధించి గత ఏడాది నవంబరు 20న ఆమోదించిన కొత్త నిర్వచనంపై గత నెలలో ఇచ్చిన నిలిపివేత ఉత్తర్వులను పొడిగించింది. ఆరావళి పరిధిలో అక్కడక్కడా అక్రమ మైనింగ్ జరుగుతున్న విషయం ధర్మాసనం దృష్టికి వచ్చింది. ఎలాంటి అక్రమ మైనింగ్ కొనసాగనివ్వబోమని రాజస్థాన్ ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ హామీ ఇవ్వగా దానిని రికార్డు చేసింది.

సభాపతులు నిష్పాక్షికంగా ఉండాలి

స్పీకర్ ఓం బిర్లా

లఖ్‌నవూ: వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చట్టసభల సభాపతులు నిష్పాక్షికంగా పనిచేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో బుధవారం ముగిసిన అఖిల భారత సభాపతుల 86వ జాతీయ సమ్మేళనంలో ఓం బిర్లా ప్రసంగించారు. తామెన్నుకున్న ప్రతినిధులు ప్రజా సమస్యల్ని చట్టసభల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తారన్న ఆశతోనే ప్రజలు ఎన్నికలపై నమ్మకంతో ఉంటారని ఓం బిర్లా అభిప్రాయపడ్డారు. సమాజంలోని చిట్టచివరి వ్యక్తి వాణిని ప్రభుత్వానికి చేర్చే వేదికలు చట్టసభలేనని ఆయన పేర్కొన్నారు. అలాంటి సభల్లో కార్యకలాపాలకు తరచూ విఘాతం కలగడంపై విచారం వ్యక్తం చేశారు. సభ్యులు మేలైన ఉద్దేశంతో సమస్యలు లేవనెత్తడంతో పాటు అర్థవంతమైన చర్చలో పాల్గొంటే శాసన సభలు సరైన ఫలితాలకు వేదికలవుతాయని తెలిపారు. శాసనసభ సమావేశాల కాలం పెరగాల్సిన అవసరాన్ని ఓం బిర్లా నొక్కి చెప్పారు.

మచెల్‌కు ఇందిరాగాంధీ శాంతి పురస్కారం

దిల్లీ: మొజాంబిక్ మానవ హక్కుల కార్యకర్త, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా రెండో భార్య గ్రాసా మచెల్... ఇందిరాగాంధీ శాంతి పురస్కారానికి ఎంపికయ్యారు. 2025 ఏడాదికి గానూ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి విభాగంలో మచెల్‌కు బహుమతిని ప్రదానం చేస్తున్నట్లు ఇందిరాగాంధీ మెమోరియల్ ట్రస్టు బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

విద్యా, ఆరోగ్యం, పోషకాహారం, ఆర్థిక సాధికారత సహా పలు కీలక రంగాల్లో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొని ఆమె చేసిన కృషికిగాను మచెల్‌కు ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. జాతీయ భద్రతా మాజీ సలహాదారు శివశంకర్ మేనన్ నేతృత్వంలోని అంతర్జాతీయ జ్యూరీ ఆమెను ఎంపిక చేసినట్లు ప్రకటనలో తెలిపింది. శాంతి పురస్కారంతో పాటు రూ.కోటి నగదు బహుమతిని అందించనున్నారు.

అమెరికా ఆహ్వానాన్ని అంగీకరించిన నెతన్యాహు

ఇంకా నిర్ణయం తీసుకోని భారత్

దిల్లీ/టెల్ అవీవ్: గాజా శాంతి మండలిలో చేరాల్సిందిగా ప్రధాని మోదీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పంపిన ఆహ్వానంపై భారత్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ మండలి గాజా పునర్నిర్మాణ పనులు, పాలనను పర్యవేక్షించడమే కాకుండా, అంతర్జాతీయ ఘర్షణలూ పరిష్కరిస్తుందని తెలుస్తోంది. విధివిధానాలు పూర్తిగా బయటకు రాలేదు. ఈ అంశంపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని భారత్ భావిస్తోంది. మండలిలో చేరాలంటూ భారత్ సహా పలు దేశాధినేతలకు ట్రంప్ ఆహ్వానాలు పంపిన సంగతి తెలిసిందే. ఇందులో కొన్ని దేశాలు ట్రంప్ విజ్ఞప్తిని అంగీకరిస్తే, మరికొన్ని తిరస్కరించాయి. ట్రంప్ ఆహ్వానాన్ని అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. పాకిస్థాన్, అర్జెంటీనా, ఆర్మేనియా, అజర్‌బైజాన్, బహ్రెయిన్, బెలారస్, ఈజిప్ట్, హంగరీ, కజకస్థాన్, మొరాకో, యూఏఈ, వియత్నాం కూడా మండలిలో చేరేందుకు సుముఖత వ్యక్తంచేశాయి. స్వీడన్, నార్వే తిరస్కరించాయి. రష్యా, చైనా, జర్మనీ, ఇటలీ తుర్కియే, స్లోవేనియా, ఉక్రెయిన్ తదితర దేశాలు ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

త్వరలో భారత్‌తో ఒప్పందం: ట్రంప్

దావోస్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్ల తనకు అమిత గౌరవం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం నాడిక్కడ పేర్కొన్నారు. మిత్రుడు మోదీతో తాము త్వరలో ఒక మంచి వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు ట్రంప్ వెల్లడించారు. "మీ ప్రధానమంత్రి పట్ల నాకు చాలా గౌరవం ఉంది. ఆయన ఓ అద్భుత వ్యక్తి. నాకు మిత్రుడు. మేం ఒక మంచి ఒప్పందం కుదుర్చుకోబోతున్నాం" అని ట్రంప్ పేర్కొన్నట్లు 'మనీ కంట్రోల్' సంస్థ తెలియజేసింది. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదురుతుందా అని తాము అడిగిన ప్రశ్నకు ట్రంప్ ఈ విధంగా సమాధానం ఇచ్చారని ఆ సంస్థ పేర్కొంది.

మరో ఐదేళ్ల పాటు అటల్ పెన్షన్ యోజన

- కొనసాగింపునకు కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా

దిల్లీ: అసంఘటిత రంగ కార్మికులకు పెన్షన్ అందించే ఉద్దేశంతో తీసుకొచ్చిన అటల్ పెన్షన్ యోజన పథకాన్ని (ఏపీవై) మరో ఐదేళ్లపాటు కొనసాగించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు దీన్ని పొడిగించేందుకు బుధవారం పచ్చజెండా ఊపింది. పథకానికి విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు, అభివృద్ధి చేసేందుకు మరింత ఖర్చు చేయాలని ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయించారు. 2015 మే 9 ప్రారంభమైన ఈ పథకంలో 2026 జనవరి 19 నాటికి 8.66 కోట్ల మంది చందాదారులుగా చేరారు.

ఏమిటీ పథకం..?

సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత పెన్షన్ అందుతుంది. దీంతో వారి పదవీ విరమణ తర్వాత జీవితం సాఫీగా సాగుతుంది. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు అటువంటి సౌకర్యాలేవీ ఉండవు. వీరికి కూడా 60 ఏళ్ల దాటాక పెన్షన్ అందాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద నెలకు రూ.1000-5000 వరకు పెన్షన్ అందుతుంది. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తులు ఈ పథకంలో చేరొచ్చు. అందుకు అనుగుణంగా నెలనెలా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) దీన్ని నిర్వహిస్తుంది. ఈ పెన్షన్ పథకంలో పెట్టుబడి పెట్టాలని భావించే వారు తప్పనిసరిగా పోస్టాఫీసులో గానీ, ఏదైనా ప్రభుత్వ రంగ బ్యాంక్‌లో గానీ పొదుపు ఖాతా కలిగి ఉండాలి. నేషనల్ పెన్షన్ స్కీమ్ పరిధిలోకి వచ్చే వారు, ఆదాయ పన్ను చెల్లించేవారికి ఏపీవైలో పెట్టుబడి పెట్టేందుకు అర్హత ఉండదు.

నాకు ప్రాణహాని తలపెడితే మీరు భూమ్మీదే ఉండరు

- ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడి హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఇరాన్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన ప్రాణాలు హరించేందుకు ఇరాన్ యత్నిస్తే.. .ఆ దేశాన్ని అమెరికా భూస్థాపితం చేస్తుందంటూ హెచ్చరించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఏదైనా హత్యాయత్నం జరిగి, దాని వెనక ఇరాన్ హస్తం ఉందని తేలితే.. ఆ దేశాన్ని తుడిచిపెట్టేయాలని సలహాదారులను ఆదేశించినట్లు ట్రంప్ ఇప్పటికే ఓసారి వెల్లడించారు. తాజాగా మరోసారి అదే తరహా హెచ్చరికలు చేశారు. కాగా.. తమ దేశంలో కొనసాగుతున్న నిరసనలకు, నెలకొన్న ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడే కారణమని ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని చెబుతూ ఆ నిరసనకారులకు ట్రంప్ మద్దతిస్తున్నారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఖమేనీ పాలన అంతం కావాలనీ అమెరికా అధ్యక్షుడు పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మా నేత లక్ష్యంగా దాడికి దిగే చేతులు తెగిపడటమే కాకుండా వారి ప్రపంచాన్ని మంటల్లో ముంచెత్తుతామనే విషయం అమెరికా అధ్యక్షుడికి బాగా తెలుసు. దురాక్రమణ జరిగితే.. దానిని దీటుగా ఎదుర్కొంటాం' అని ఇరాన్ సైనిక దళాల అధికార ప్రతినిధి జనరల్ అబుల్‌ఫజల్ హెచ్చరించారు.

మరోవైపు, అమెరికాకు చెందిన యుద్ధ విమానాల వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌తో పాటు మరికొన్ని యుద్ధ నౌకలు దక్షిణ చైనా సముద్రం నుంచి బయలుదేరి మలక్కా జలసంధి మీదుగా హిందూ మహాసముద్రంలోకి ప్రవేశించాయి. అవి కొద్ది రోజుల వ్యవధిలోనే ఇరాన్ సమీపానికి చేరుకునే అవకాశం ఉంది. ఇరాన్‌తో ఉద్రిక్తతలు తీవ్రమైన నేపథ్యంలో అమెరికా యుద్ధ నౌకల మోహరింపు ప్రాధాన్యం సంతరించుకుంది.

మీ లక్ష్యం మిమ్మల్ని భయపెట్టాలి

పదేళ్లలోపు సాధించాలనుకున్న మీ లక్ష్యాన్ని ఆరు నెలల్లోనే పూర్తి చేయడానికి ప్రయత్నించండి. అందులో మీరు విఫలం కావొచ్చు, కానీ మీరే ఆశ్చర్యపోయే స్థాయిలో మీ పురోగతి ఉంటుంది. ఎందుకంటే ప్రయత్నించడానికే భయపడే స్థాయిలో మీరు లక్ష్యాలను పెట్టుకుంటే, దాని కోసం మీరు అసాధారణ స్థాయిలో ఆలోచించడం, విభిన్నంగా పనిచేయడం, భారీ రిస్కులకు సిద్ధపడటం తప్పనిసరి అవుతుంది. అలాంటి పరిస్థితులలోనే అనూహ్య పురోగతి సాధ్యమవుతుంది.

– ఎలాన్ మస్క్, ప్రపంచ కుబేరుడు

ఐఐటీ ఖరగ్‌పుర్ విద్యార్థులకు కొలువుల పంట

- అయిదుగురికి రూ.2 కోట్ల ఆఫర్లు

ఈటీవీ భారత్: పశ్చిమబెంగాల్‌లోని ఐఐటీ ఖరగ్‌పుర్ కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ (సీడీసీ) 2025-26 తొలివిడత ప్లేస్‌మెంట్లలో రికార్డుస్థాయి విజయాలు సాధించింది. మొత్తం 1,501 మంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందగా.. ఇందులో 457 ప్రీ - ప్లేస్‌మెంట్ ఆఫర్లు ఉన్నాయి. అయిదుగురు విద్యార్థులు స్వదేశీ కంపెనీల నుంచి రూ.2 కోట్లు, అంతకంటే ఎక్కువ వార్షిక వేతనాల ఆఫర్లు చేజిక్కించుకున్నారు. ఇందులో అత్యధిక మొత్తం రూ.2.44 కోట్లు. పది మంది విద్యార్థులు రూ.కోటి, అంతకంటే ఎక్కువ మొత్తానికి (రూ.2 కోట్ల లోపు) ఉద్యోగ అవకాశాలు పొందారు. ఈ ఏడాది తమ ప్లేస్‌మెంట్ సీజను గొప్ప విజయాలతో ప్రారంభమైందని సీడీసీ చైర్‌పర్సన్, ప్రొఫెసర్ సంజయ్‌గుప్తా అన్నారు.

కుట్రను ఆపండి

- ఈయూ నేతలకు కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ పిలుపు

దావోస్: గ్రీన్‌లాండ్ విషయంలో తీవ్రంగా స్పందించాల్సిన సమయమిదని, కుట్రకు బలికాకుండా అడ్డుకోవాలని, వెన్నెముక ఉందని నిరూపించుకోవాలని ఐరోపా కూటమి (ఈయూ) నేతలకు కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ పిలుపునిచ్చారు. 'ఈ కుట్రను నేను భరించలేకపోతున్నా. ప్రజలు బలవుతున్నారు. నేను ప్రపంచ నేతలందరికీ మోకాలి ప్యాడ్లు తెచ్చి ఉండాల్సింది (వాళ్లు మోకరిల్లుతున్నారన్న అర్థం వచ్చేలా). ప్రపంచ వేదికపై వారెంత దయనీయంగా ఉన్నారో ప్రజలు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా. అమెరికా కోణం నుంచి చూసినా ఇది ఇబ్బందికరంగానే ఉంది' అని వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వచ్చిన ఈ డెమోక్రాట్ నేత బుధవారం ఫోరం ప్రవేశ మార్గం వద్ద మాట్లాడారు. 'ట్రంప్‌తో దౌత్యమా.. అతడో రాకాసి బల్లి. ఆయనతో జతకడితే సరే. లేదంటే కబళిస్తాడు. మేల్కోండి. అందరూ ఎక్కడున్నారు. ఈ దౌత్యాన్ని ఇక్కడితో ఆపేయండి. మనం ఏదో విధంగా ఈ సమస్యను పరిష్కరించుకుంటాం. ఒక విషయం ప్రైవేటుగా, ఒక విషయం బహిరంగంగా చెబుతాం. వెన్నెముక ఉందని నిరూపించండి' అని గవిన్ పేర్కొన్నారు.

12% వడ్డీతో రూ.కోటి బీమా చెల్లింపునకు 'ఫోరం' ఆదేశాలు

ఈటీవీ భారత్: ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పుర్ జిల్లా వినియోగదారుల కమిషను కీలక తీర్పు వెలువరించింది. వినియోగదారుల సేవలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ బీమా కంపెనీని దోషిగా నిర్ధారించింది. బాధితుడికి పూర్తి బీమా సొమ్ము రూ.కోటి 12% వార్షిక వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. బిలాస్‌పుర్‌కు చెందిన కౌశల్ ప్రసాద్ కౌశిక్ తన భార్య శైల్ కౌశిక్ పేరుతో జీవిత బీమా పాలసీ తీసుకున్నారు. రూ.10 లక్షల వార్షిక రెగ్యులర్ ప్రీమియం చెల్లించారు. 2020 మే 27 నుంచి ఈ పాలసీ అమలులోకి వచ్చింది. నిబంధనల ప్రకారం కంపెనీ ఆమెకు వైద్య పరీక్షలు చేయించినపుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. ఆ తర్వాత కొవిడ్ సోకి బిలాస్‌పుర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2020 అక్టోబరు 11న మృతిచెందారు. కౌశల్ ప్రసాద్ బీమా సొమ్ము కోసం దరఖాస్తు చేశారు. ఆ మహిళకు ముందుగా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని వాదించిన కంపెనీ తగిన రుజువులు చూపలేకపోయింది. బలమైన ఆధారాలు లేకుండా క్లెయిమును తిరస్కరించడం సేవాలోపమే అని పేర్కొన్న కమిషను బీమా సొమ్ము చెల్లింపునకు ఆదేశాలు జారీ చేసింది. మనోవేదనకు గురైన బాధితుడికి వ్యాజ్యం ఖర్చుల కింద రూ.2 లక్షల అదనపు పరిహారం కూడా ఇవ్వాలని తీర్పులో స్పష్టం చేశారు.

సేవా లోపం.. రూ.1.5 లక్షల పరిహారం చెల్లించండి

ఎయిర్ ఇండియాను ఆదేశించిన వినియోగదారుల ఫోరం

దిల్లీ: సేవా లోపం కారణంగా బాధిత ప్రయాణికులకు రూ.1.5 లక్షల పరిహారం చెల్లించాలంటూ ఎయిరిండియాను దిల్లీలోని వినియోగదారుల ఫోరం ఆదేశించింది. 2023లో దిల్లీ-న్యూయార్క్ విమానంలో తన కుమార్తెతో కలిసి ప్రయాణించిన సందర్భంగా విరిగిన సీట్లు, అపరిశుభ్ర మరుగుదొడ్లు, నాసిరకం ఆహార సేవలను ఎయిర్ ఇండియా అందించిందని శైలేంద్ర భట్నాగర్ ఫిర్యాదు చేశారు. ఈ కేసులో బాధితులకు ఎయిర్ ఇండియా రూ.1.5 లక్షల పరిహారం చెల్లించాల్సిందిగా దిల్లీలోని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఇటీవల తీర్పు నిచ్చింది. వారు ఎదుర్కొన్న మానసిక బాధ, వేదింపులకు ప్రతిగా ఈ మొత్తాన్నీ చెల్లించాల్సిందిగా కమిషన్ అధ్యక్షురాలు పూనమ్ చౌధరీ, న్యాయ సభ్యుడు శేఖర్ చంద్రలతో కూడిన ఫోరం తమ తీర్పులో పేర్కొంది. మరోవైపు.. తమ నుంచి అక్రమంగా ప్రయోజనాలు పొందడం కోసమే ఫిర్యాదుదారులు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఎయిర్ ఇండియా పేర్కొంది.

ట్రంప్ ఏడాది పాలనపై నిరసనలు

- అధ్యక్షుడి విధానాలకు వ్యతిరేకంగా అమెరికాలో ఆందోళనలు

వాషింగ్టన్: రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ మంగళవారంతో ఏడాది పాలనను పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో ఆయన తీసుకొచ్చిన విధానాలను వ్యతిరేకిస్తూ అమెరికా వ్యాప్తంగా వివిధ సంఘాల కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. ప్లకార్డులు, దిష్టిబొమ్మలతో ఆందోళనలు నిర్వహించారు. ట్రంప్ పాలన వల్ల అమెరికా అనేక సంవత్సరాలుగా నిర్మించుకున్న అంతర్జాతీయ విశ్వసనీయత పూర్తిగా దెబ్బతిందని ఆరోపించారు.

■ గ్రీన్‌లాండ్ స్వాధీనం కోసం ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను నిరసనకారులు విమర్శించారు. నాటో కూటమిని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

■ 'గతేడాది నుంచి మా దేశం తీవ్ర దాడికి గురవుతోంది. దీనివల్ల మేం పూర్తిగా దారి తప్పుతున్నాం. దీనికి ముగింపు పలకాలి. మన వీధుల్లో నైస్యం తిరుగుతోంది. ప్రజలను అపహరించడం, హత్యలు చూస్తున్నాం. స్వతంత్ర దేశాల భూ భాగాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ నాటో కూటమిని బద్దలు కొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుంది. ఈ ప్రయత్నాలను ఆపేందుకే మేం రోడ్లపైకి వచ్చాం' పేర్కొన్నారు.

■ 'దశాబ్దాలుగా మేం ప్రపంచవ్యాప్తంగా మిత్ర దేశాలను సంపాదించాం. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే ఇప్పుడు ఆ నమ్మకం పూర్తిగా క్షీణిస్తోంది. ఇతర దేశాలు అమెరికాను నమ్మలేని పరిస్థితి వచ్చింది. దీని ప్రభావం రానున్న దశాబ్దాల ప్రపంచ రాజకీయ వ్యవస్థపై పడుతుంది' అని ఆందోళనకారులు వ్యాఖ్యానించారు.

■ 'సుంకాలనేవి అత్యంత దుర్మార్గమైనవి. గత 50 ఏళ్లుగా ఉన్న మిత్ర దేశాలకు ప్రభుత్వం ద్రోహం చేస్తోంది. ఇది అమెరికాను తీవ్రమైన ప్రమాదంలోకి నెడుతోంది. అమెరికన్ ప్రజలు, ప్రపంచం గురించి ట్రంప్ పట్టించుకోరు' అని కొందరు అభిప్రాయపడ్డారు.

ఎయిర్ ఫోర్స్ వన్‌లో సాంకేతిక సమస్య

ఆలస్యంగా దావోస్‌కు..

న్యూయార్క్/వాషింగ్టన్: ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు బయలుదేరిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అపశ్రుతి ఎదురైంది. ఆయన ప్రయాణిస్తున్న 'ఎయిర్ ఫోర్స్ వన్' విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో.. గమ్యం చేరకుండానే వాషింగ్టన్‌లోని ఆండ్రూస్ వైమానిక స్థావరానికి తిరిగి వచ్చింది. ట్రంప్ ఆయన సిబ్బంది మరో విమానంలో దావోస్‌కు ఆలస్యంగా వెళ్లారు.

ఎలుగుల దాడులతో గ్రామాలు ఖాళీ

ఈటీవీ భారత్: పర్వత ప్రాంత రాష్ట్రం ఉత్తరాఖండ్‌లో ఇటీవలి కాలంలో పలుచోట్ల ఎలుగుబంట్ల దాడులు పెరుగుతున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు గాయపడుతున్నారు. గ్రామీణ జనం ఎప్పుడు ఏ ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుందో అని భయంతో వణుకుతున్నారు. పౌడీ గఢవాల్ జిల్లాలో కొందరు గ్రామాలు ఖాళీ చేస్తున్నారు. బస్తంగ్ గ్రామంలో ఇటీవల ఓ మహిళపై ఎలుగు దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో ఆ గ్రామస్థులు పూర్వీకుల ఇళ్లు కూడా వదిలి వెళ్లిపోయారు. జనవరి నెలలో మరో కుటుంబానికి చెందిన ఆరు పశువులను చంపాయి. సాధారణంగా శీతాకాలంలో ఎలుగుబంట్లు మంచు ఎక్కువగా ఉన్నచోట్ల సుప్తావస్థ (హైబర్నేషన్)లో ఉంటాయి. ఈ ఏడాది మంచు తక్కువగా కురవడంతోపాటు ఆహార కొరతతో ఎలుగులు గ్రామాల్లోకి వస్తున్నాయి. మహిళలు గడ్డి, వంటచెరకు కోసం అడవుల్లోకి వెళ్లాలంటే జంకుతున్నారు. ఎలుగుబంట్ల దాడులపై సంబంధిత రేంజర్‌ను నివేదిక కోరామని, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించడంతోపాటు ఎలుగుల పట్టివేతకు ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నట్లు డీఎఫ్‌వో మహాతిమ్ యాదవ్ తెలిపారు.

కూలిన భారత వాయుసేన శిక్షణ విమానం

ఇద్దరు పైలట్లూ సురక్షితం

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో వాయుసేనకు చెందిన శిక్షణ విమానం కూలింది. సాధారణ శిక్షణలో ఉండగా.. బుధవారం స్థానిక కేపీ కళాశాల సమీపంలోని ఓ చెరువులో ఆర్మీ విమానం కూలినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం సమయంలో విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లూ రక్షణ వ్యవస్థ ఆధారంగా సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. పౌరుల ఆస్తులకు ఎలాంటి నష్టం వ

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను కోల్పోయిన టీమ్‌ఇండియా.. అయిదు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసింది. మొదట భారీ స్కోరు చేసి, ఆపై బంతితో కివీస్‌ను నిలువరించిన సూర్యసేన.. ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. అభిషేక్ శర్మ బ్యాటింగ్‌లో అదరగొట్టగా.. బౌలర్లు సమష్టిగా రాణించి కివీస్‌ను కట్టడి చేశారు.

తొలి పంచ్ మనదే

మొదటి టీ20లో కివీస్ చిత్తు

అభిషేక్ మెరుపులు ● రాణించిన రింకు, వరుణ్

నాగ్‌పుర్

ప్రపంచకప్ ముంగిట కీలక సిరీస్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. అయిదు టీ20ల సిరీస్ తొలి మ్యాచ్‌లో 48 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. మొదట భారత్ 7 వికెట్లకు 238 పరుగుల భారీ స్కోరు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్ శర్మ (84; 35 బంతుల్లో 5×4, 8×6) మరోసారి చెలరేగాడు. రింకు సింగ్ (44 నాటౌట్; 20 బంతుల్లో 4×4, 3×6), సూర్యకుమార్ (32; 22 బంతుల్లో 4×4, 1×6), హార్దిక్ పాండ్య (25; 16 బంతుల్లో 3×4, 1×6) కూడా రాణించారు. కివీస్ బౌలర్లలో డఫీ, జేమీసన్ చెరో రెండు వికెట్లు తీశారు. ఛేదనలో కివీస్ పోరాడినా.. 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులే చేయగలిగింది. గ్లెన్ ఫిలిప్స్ (78; 40 బంతుల్లో 4×4, 6×6) మెరుపులు సరిపోలేదు. వరుణ్ చక్రవర్తి (2/37), శివమ్ దూబె (2/28), అర్ష్‌దీప్ (1/31) ప్రత్యర్థికి కళ్లెం వేశారు.

ఆరంభమే తడబాటుతో..: అసలే భారీ ఛేదన.. ఆపై 1 పరుగుకే 2 వికెట్లు! ఇలా మొదలైంది న్యూజిలాండ్ ఇన్నింగ్స్. తొలి ఓవర్ రెండో బంతికే కాన్వే (0)ను సంజు క్యాచ్ ద్వారా అర్ష్‌దీప్ ఔట్ చేశాడు. ఓ మెరుపు డైవ్‌తో సంజు ఈ క్యాచ్ అందుకున్నాడు. హార్దిక్ వేసిన తర్వాత ఓవర్లో రచిన్ రవీంద్ర (1) డగౌట్‌కు వెళ్లిపోయాడు. ఈ స్థితిలో ఫిలిప్స్ నిలిచాడు. టిమ్ రాబిన్సన్ (21)తో కలిసి స్కోరు పెంచాడు. వీళ్లిద్దరూ దూకుడుగా ఆడడంతో 6 ఓవర్లకు 50/2తో కివీస్ కోలుకుంది. ఫిలిప్స్, రాబిన్సన్ బ్యాట్ ఝుళిపించినా.. సాధించాల్సిన రన్‌రేట్ మాత్రం అదుపులోకి రాలేదు. దీనికి తోడు రాబిన్సన్‌ను వరుణ్ ఔట్ చేశాడు. అయినా ఫిలిప్స్ పోరాటం కొనసాగించాడు. చాప్‌మన్ జతగా స్కోరు పెంచాడు. వరుణ్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన ఫిలిప్స్.. 29 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. అయితే ఫిలిప్స్, చాప్‌మన్ (39; 24 బంతుల్లో 4×4, 2×6) వరుస ఓవర్లలో ఔటైపోవడంతో మిణుకుమంటున్న కివీస్ ఆశలు ఆవిరయ్యాయి. ఆ తర్వాత మిచెల్ (28; 18 బంతుల్లో 4×4), శాంట్నర్ (20 నాటౌట్; 13 బంతుల్లో 2×4) పోరాటం పరుగుల అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది.

అభిషేక్ ధనాధన్: ఆరంభంలో తడబాటు.. తర్వాత దూకుడు.. మళ్లీ వికెట్లు.. ఆఖర్లో మెరుపు ముగింపు.. భారత్ ఇన్నింగ్స్ సాగిన తీరిది. మొదట భారత్ భారీ స్కోరు చేసిందంటే అభిషేక్ శర్మ విధ్వంసం వల్లే. తొలి ఓవర్లోనే సిక్స్‌తో మొదలుపెట్టిన అభిషేక్.. దూకుడు పెంచుతూ పోయాడు. అయితే భారత్ ఇన్నింగ్స్ తడబాటుతో మొదలైంది. రెండో ఓవర్లోనే సంజు శాంసన్ (10) ఔటైపోయాడు. రెండేళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న ఇషాన్ కిషన్ (8) కూడా ఎంతోసేపు నిలవలేదు. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీకి తరలించి జోరు మీద కనిపించిన ఇషాన్.. ఇంకో ఫోర్ కొట్టి, డఫీ బౌలింగ్‌లో చాప్‌మన్‌కు చిక్కాడు. ఈ స్థితిలో అభిషేక్, కెప్టెన్ సూర్యకుమార్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. ముఖ్యంగా అభిషేక్ మెరుపు షాట్లతో స్కోరు పెంచాడు. జేమీసన్, క్లార్క్‌లకు చెరో రెండు సిక్స్‌లు వడ్డించిన అతడు.. ఫిలిప్స్ బౌలింగ్‌లో హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. పేలవ ఫామ్‌లో ఉన్న సూర్య ఈ మ్యాచ్‌లో మెరుగ్గా ఆడాడు. దీంతో పవర్‌ప్లే ఆఖరికి భారత్ 68/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. దూకుడును కొనసాగించిన అభిషేక్.. 22 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. 11 ఓవర్లకు 130/3తో టీమ్‌ఇండియా భారీ స్కోరుకు బాటలు వేసుకుంది. అయితే ఓవర్ తేడాతో సూర్య, అభిషేక్ ఔట్ కావడంతో జట్టుకు ఎదురు దెబ్బ తగిలింది. మొదట 11వ ఓవర్లో సూర్యను శాంట్నర్ ఔట్ చేయగా.. తర్వాతి ఓవర్లోనే అభిషేక్ సైతం అతడిని అనుసరించాడు. సోధి వేసిన 12వ ఓవర్లో వరుసగా 4, 6, 6 కొట్టి సెంచరీకి సమీపంగా వచ్చిన అభిషేక్.. అదే ఓవర్లో మరో షాట్‌కు ప్రయత్నించి, ఔటైపోయాడు. శివమ్ దూబె (9) కూడా నిలవలేదు. అయితే హార్దిక్ పాండ్య ఉన్నంతసేపు దూకుడుగా ఆడడంతో మళ్లీ రన్‌రేట్ పెరిగింది. హార్దిక్ వెనుదిరిగాక.. రింకు అందుకున్నాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో అతడు 2 సిక్స్‌లు, 2 ఫోర్లతో 21 పరుగులు రాబట్టాడు.

భారత్ ఇన్నింగ్స్: శాంసన్ (సి) రచిన్ (బి) జేమీసన్ 10; అభిషేక్ శర్మ (సి) జేమీసన్ (బి) సోధి 84; ఇషాన్ కిషన్ (సి) చాప్‌మన్ (బి) డఫీ 8; సూర్యకుమార్ (సి) రాబిన్సన్ (బి) శాంట్నర్ 32; హార్దిక్ (సి) చాప్‌మన్ (బి) డఫీ 25; దూబె (సి) అండ్ (బి) జేమీసన్ 9; రింకు నాటౌట్ 44; అక్షర్ (సి) మిచెల్ (బి) క్లార్క్ 5; అర్ష్‌దీప్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 15 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **238; వికెట్ల పతనం:** 1-18, 2-27, 3-126, 4-149, 5-166, 6-185, 7-209; **బౌలింగ్:** డఫీ 4-0-27-2; జేమీసన్ 4-0-54-2; క్రిస్టియన్ క్లార్క్ 4-0-40-1; సోధి 3-0-38-1; ఫిలిప్స్ 1-0-20-0; శాంట్నర్ 3-0-37-1; మిచెల్ 1-0-21-0

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) శాంసన్ (బి) అర్ష్‌దీప్ 0; రాబిన్సన్ (సి) దూబె (బి) వరుణ్ 21; రచిన్ (సి) అభిషేక్ (బి) హార్దిక్ 1; ఫిలిప్స్ (సి) దూబె (బి) అక్షర్ 78; చాప్‌మన్ (సి) అభిషేక్ (బి) వరుణ్ 39; మిచెల్ (సి) బిష్ణోయ్ (బి) దూబె 28; శాంట్నర్ నాటౌట్ 20; క్లార్క్ (సి) రింకు (బి) దూబె 0; జేమీసన్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **190; వికెట్ల పతనం:** 1-0, 2-1, 3-52, 4-131, 5-143, 6-189, 7-189; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-31-1, హార్దిక్ 2-0-20-1, బుమ్రా 3-0-29-0, అక్షర్ 3.3-0-42-1, వరుణ్ చక్రవర్తి 4-0-37-2, దూబె 3-0-28-2, అభిషేక్ 0.3-0-3-0

అక్షర్‌కు గాయం

న్యూజిలాండ్‌తో తొలి టీ20లో భారత వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ గాయపడ్డాడు. కివీస్ ఇన్నింగ్స్‌లో 16వ ఓవర్లో అతడి చేతి వేళ్లకు గాయమైంది. అప్పటికే మూడు ఓవర్లు వేసిన అక్షర్.. కీలకమైన ఫిలిప్స్ వికెట్ తీశాడు. తన నాలుగో ఓవర్లో మూడో బంతికి బ్యాటర్ మిచెల్.. నేరుగా బలంగా కొట్టాడు. ఆ బంతిని ఆపే ప్రయత్నంలో అక్షర్ చేయి అడ్డుపెట్టగా.. వేళ్లను తాకుతూ బంతి బౌండరీకి వెళ్లింది. బంతి గట్టిగా తగలడంతో అక్షర్ వేళ్లకు గాయమై.. రక్తం కారింది. ఫిజియో సపర్యలు చేసినా.. నొప్పి తగ్గకపోవడంతో అక్షర్ పెవిలియన్ చేరాడు. ఆ ఓవర్లో మిగిలిన మూడు బంతులను అభిషేక్ శర్మ వేశాడు. అక్షర్ గాయం తీవ్రత ఎంతన్నది తెలియలేదు. త్వరలో టీ20 ప్రపంచకప్ ఆరంభం కానున్న నేపథ్యంలో ఈ స్పిన్ ఆల్‌రౌండర్‌కు గాయం కావడం భారత్‌కు ఆందోళన కలిగించేదే.

సింధు, లక్ష్య శుభారంభం

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్ శుభారంభం చేశారు. బుధవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సింధు 22-20, 21-18తో మనామి స్యుజు (జపాన్)పై, అన్మోల్ ఖార్బ్ 21-16, 21-17తో యు పో (చైనీస్ తైపే)పై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. ఆకర్షి కశ్యప్ 21-8, 20-22, 17-21తో జూలీ జాకబ్‌సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-13, 16-21, 21-14తో వాంగ్ పీ (చైనీస్ తైపే)పై, కిదాంబి శ్రీకాంత్ 21-15, 21-23, 24-22తో కొకి వతనబె (జపాన్)పై గెలిచి ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. హెచ్.ఎస్.ప్రణయ్ 19-21, 11-21తో లీ జియా (మలేసియా) చేతిలో, కిరణ్ జార్జ్ 17-21, 14-21తో మహ్మద్ జకి (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో హరిహరన్- అర్జున్ జోడీ 21-19, 21-13తో అలీ రెహాన్- డెవిన్ వాహ్యుది (ఇండోనేసియా) జంటపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో రోహన్ కపూర్- గద్దె రుత్విక శివాని 9-21, 20-22తో టామ్- డెల్ఫైన్ (ఫ్రాన్స్) చేతిలో, ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో 23-21, 20-22, 6-21తో జూలియెన్ మైయో-లియా పాలెర్మో (ఫ్రాన్స్) చేతిలో ఓడారు.

అగ్రస్థానం కోల్పోయిన కోహ్లి

దుబాయ్: వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన జాబితాలో న్యూజిలాండ్ మిడిలార్డర్ బ్యాటర్ డరిల్ మిచెల్ అగ్రస్థానాన్ని చేజిక్కించుకున్నాడు. మిచెల్ భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌లో రెండు శతకాలు, ఒక అర్ధశతకంతో మొత్తంగా 352 పరుగులు సాధించి.. కోహ్లిని రెండో స్థానానికి నెట్టాడు. రోహిత్ శర్మ 4, శుభ్‌మన్ గిల్ 5, కేఎల్ రాహుల్ 10, శ్రేయస్ అయ్యర్ 11వ ర్యాంకులు సాధించారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో కుల్దీప్ యాదవ్ 7, మహ్మద్ సిరాజ్ 14వ స్థానాల్లో నిలిచారు. రషీద్ ఖాన్ (అఫ్గానిస్థాన్) నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు.

భారత్‌కు రావాల్సిందే..

బంగ్లాకు తేల్చి చెప్పిన ఐసీసీ

ప్రపంచకప్ మ్యాచ్‌ల తరలింపునకు నో

దుబాయ్

బంగ్లాదేశ్‌కు పూర్తిగా దారులు మూసుకుపోయాయి. టీ20 ప్రపంచకప్ కోసం ఆ జట్టు భారత్‌కు రాక తప్పదు. లేదంటే టోర్నీ నుంచే తప్పుకోవాల్సి ఉంటుంది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అభ్యర్థనను ఐసీసీ తిరస్కరించింది. భారత్‌లో పొట్టి కప్పు జరిగే ఏ వేదిక లోనూ బంగ్లా ఆటగాళ్లు, అధికారులు, అభిమానులకు ముప్పు వాటిల్లుతుందన్న సంకేతాలేమీ లేనందువల్ల షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్‌లు జరుగుతాయని స్పష్టం చేసింది. షెడ్యూల్‌లో మార్పులు చేయడం సాధ్యం కాదని ఐసీసీ తేల్చిచెప్పింది. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన బోర్డు సమావేశంలో ఐసీసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. "ప్రస్తుత పరిస్థితుల్లో మ్యాచ్‌లను వేరే చోటుకి తరలిస్తే ఐసీసీ టోర్నీల గౌరవానికి ముప్పు వాటిల్లుతుంది. ప్రపంచ క్రికెట్ పాలక మండలి తటస్థతను దెబ్బతీస్తుంది" అని ఐసీసీ పేర్కొంది. బోర్డు సమావేశంలో సభ్య దేశాల్లో బంగ్లాదేశ్, పాకిస్థాన్ మాత్రమే మ్యాచ్‌ల తరలింపునకు అనుకూలంగా ఓటు వేసినట్లు ఐసీసీ వర్గాలు తెలిపాయి. భారత్‌కు వెళ్లాలా? లేదా? అన్నది బుధవారం లోపు తేల్చుకోవాలంటూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి ఐసీసీ అల్టిమేటం జారీచేసిన సంగతి తెలిసిందే. కానీ తమ జట్టు భారత్‌కు వెళ్లదని, ఐసీసీ ఒత్తిడికి తాము తలవంచబోమని బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ స్పష్టం చేశాడు. 20 జట్ల పాల్గొంటున్న ఈ టోర్నీ కోసం బంగ్లాదేశ్.. భారత్‌కు రాని పక్షంలో ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడించాలని ఐసీసీ భావిస్తోంది. అంతే కాక బంగ్లాపై ఐసీసీ చర్యలు కూడా చేపట్టే అవకాశముంది. ఈ టోర్నీ ఆదాయంలో తమ వాటాను కోల్పోవడంతో పాటు జరిమానాను కూడా బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) ఎదుర్కోవాల్సి రావచ్చు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో భారత అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత రాగా, బీసీసీఐ ఆ దేశ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తప్పించడంతో వివాదం రాజుకుంది. ప్రతిగా భారత్‌లో తమ భద్రతకు ముప్పు ఉందనే సాకుతో తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బీసీబీ.. ఐసీసీకి విన్నవించింది. ఐసీసీ ఇందుకు సమ్మతించని నేపథ్యంలో బీసీబీ ఏం చేస్తుందో చూడాలి. వచ్చే నెల 7న ఆరంభమయ్యే టీ20 ప్రపంచకప్‌నకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి.

బంగ్లా మ్యాచ్‌లను మేం నిర్వహిస్తాం... పాక్: భద్రతా కారణాల రీత్యా.. టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు వెళ్లకూడదని బంగ్లాదేశ్ తీసుకున్న నిర్ణయానికి దాయాది దేశం పాకిస్థాన్ మద్దతు పలికింది. బంగ్లా మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించడంలో సమస్యలుంటే.. వాటిని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి పాక్ చెప్పింది. ఐసీసీ బోర్డు సమావేశంలోనూ ఆ దేశం.. బంగ్లాకు మద్దతుగా ఓటేసింది.

ఎక్కడ ఆడతామో.. ఎవరితో ఆడతామో!

ఢాకా: భారత్‌లో జరిగే టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లలో తమ జట్టు ఆడుతుందో లేదో తనకు తెలియదని బంగ్లాదేశ్ కెప్టెన్ లిటన్ దాస్ అన్నాడు. "ప్రపంచకప్‌లో మా గ్రూపు ప్రత్యర్థులు ఎవరో.. ఏ దేశానికి వెళ్తున్నామో ముందుగానే తెలిస్తే బాగుంటుంది. ఇప్పటికే జట్టును ప్రకటించారు. కానీ ఏ దేశానికి వెళ్తున్నామో.. ఎవరితో ఆడతామో ఏ ఒక్క ఆటగాడికి తెలియదు. నాలాగే.. యావత్ బంగ్లా ఇప్పుడు అనిశ్చితిలో ఉంది. మేం ప్రపంచకప్‌నకు వెళ్తున్నామా లేదా అన్నది కచ్చితంగా తెలియదు" అని లిటన్ పేర్కొన్నాడు.

సబలెంకా దూకుడు

● మూడో రౌండ్లోకి ప్రవేశం ● గాఫ్, అల్కరాస్, జ్వెరెవ్ కూడా

మెల్‌బోర్న్

టైటిల్ ఫేవరెట్ అర్యానా సబలెంకా (బెలారస్) ఆస్ట్రేలియన్ ఓపెన్లో దూసుకెళ్తోంది. ఈ టాప్ సీడ్ ప్లేయర్ పెద్దగా కష్టపడకుండానే మూడో రౌండ్లోకి ప్రవేశించింది. బుధవారం మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో సబలెంకా 6-3, 6-1తో జో గ్జువాన్ (చైనా)ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచి సబలెంకా దూకుడుగా ఆడింది. తొలి సెట్లో మొదటి నాలుగు గేమ్‌లలోనే రెండుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన ఆమె 5-0తో ఆధిక్యంలో నిలిచింది. కానీ గ్జువాన్ ఆలస్యంగా పుంజుకుంది. ఏడో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేయడమే కాక.. ఎనిమిదో గేమ్‌ను నిలబెట్టుకుని 3-5తో బెలారస్ స్టార్‌ను సమీపించింది. అయితే తొమ్మిదో గేమ్‌లో సబలెంకా అవకాశం ఇవ్వలేదు. బలమైన సర్వీసులతో విజృంభించిన ఆమె సెట్ గెలిచింది. రెండో సెట్లో సబలెంకా జోరు ముందు చైనా అమ్మాయి నిలవలేకపోయింది. 4-1తో ఆధిక్యంలోకి వెళ్లిన ఆమె.. అదే ఊపులో సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. కొకో గాఫ్ కూడా ముందంజ వేసింది. మూడో సీడ్ గాఫ్ 6-2, 6-2తో డానిలోవిచ్ (సెర్బియా)పై గెలిచింది. ఎనిమిదో సీడ్ ఆండ్రీవా (రష్యా), పన్నెండో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్), ముచోవా (చెక్) ముందంజ వేశారు. ఆండ్రీవా 6-0, 6-4తో సకారి (గ్రీస్)ను ఓడించగా.. స్వితోలినా 7-5, 6-1తో క్లిమోవికోవా (పోలెండ్)పై నెగ్గింది. ముచోవా (చెక్), టొసన్ (డెన్మార్క్), పొటపోవా (ఆస్ట్రియా), బాప్టిస్ట్ (అమెరికా) రెండో రౌండ్ దాటారు.

అల్కరాస్ ముందుకు: కెరీర్ గ్రాండ్‌స్లామ్‌పై గురి పెట్టిన స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాస్ ఆ దిశగా మరో అడుగు వేశాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో టాప్ సీడ్ అల్కరాస్ 7-6 (7-4), 6-3, 6-2తో యానిచ్ హన్ఫ్‌మన్ (జర్మనీ)ను ఓడించాడు. తొలి సెట్లో ప్రత్యర్థి నుంచి అల్కరాస్‌కు గట్టిపోటీ ఎదురైంది. నాలుగో గేమ్‌లో అల్కరాస్ సర్వీస్ బ్రేక్ చేసిన హన్ఫ్‌మన్ 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ అల్కరాస్ వెంటనే పుంజుకున్నాడు. అయిదో గేమ్‌లో బ్రేక్ సాధించి.. ఆపై స్కోరు సమం చేశాడు. టైబ్రేకర్‌కు మళ్లిన ఈ సెట్లో సర్వీసుల్లో విజృంభించిన అల్కరాస్ సెట్ గెలిచాడు. రెండు, మూడో సెట్లలో అల్కరాస్ జోరు ముందు హన్ఫ్‌మన్ తేలిపోయాడు. ఈ రెండు సెట్లలో మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన అల్కరాస్.. తేలిగ్గా విజయాన్ని అందుకున్నాడు. మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ), ఆరోసీడ్ డిమెనార్ (ఆస్ట్రేలియా), పదకొండో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) ముందంజ వేశారు. జ్వెరెవ్ 6-3, 4-6, 6-3, 6-4తో ముల్లర్ (ఫ్రాన్స్)ను ఓడించగా.. డిమెనార్ 6-5 (7-5), 6-2, 6-2, 6-1తో మెజ్డెదోవిచ్ (సెర్బియా)పై నెగ్గాడు. మెద్వెదెవ్ 6-7 (9-11), 6-3, 6-4, 6-2తో హేలీస్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. బబ్లిక్ (కజకిస్థాన్) 7-5, 6-4, 7-5తో ఫ్యుకోవిక్స్ (హంగేరి)పై, డేవిడోవిచ్ (స్పెయిన్) 6-3, 7-6 (7-3), 5-7, 4-6, 6-4తో ఒపెల్కా (అమెరికా)పై, రుబ్లెవ్ (రష్యా) 6-4, 3-6, 6-4, 5-7తో ఫేరియా (పోర్చుగల్)పై విజయం సాధించారు. తియాఫో (అమెరికా), టామీ పాల్ (అమెరికా), బోర్జెస్ (జర్మనీ), తియాన్ (మలేసియా), నోరి (బ్రిటన్) రెండో రౌండ్‌ను అధిగమించారు.



రెండో రౌండ్లో యుకి జోడీ: పురుషుల డబుల్స్‌లో యుకి బాంబ్రి శుభారంభం చేశాడు. యుకి-ఆండ్రి గొరాన్సన్ (స్వీడన్) జంట తొలి రౌండ్లో 6-3, 6-4తో జేమ్స్ డక్‌వర్త్-క్రజ్ హెవిట్ (ఆస్ట్రేలియా) జోడీని ఓడించింది.

రోహిత్‌కు డాక్టరేట్!

పుణె: భారత దిగ్గజ క్రికెటర్, టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గౌరవ డాక్టరేట్ అందుకోనున్నాడు. శనివారం అజింక్య డీవై పాటిల్ యూనివర్సిటీలో జరగబోయే స్నాతకోత్సవ కార్యక్రమంలో రోహిత్‌కు ఈ గౌరవం దక్కనుంది. క్రికెట్‌కు అతను చేసిన సేవకు, ఆదర్శ నాయకత్వానికి గాను డాక్టరేట్ అందజేయనున్నట్లు వర్సిటీ యాజమాన్యం తెలిపింది. అభిమానులు 'హిట్‌మ్యాన్'గా పిలుచుకునే రోహిత్‌కు.. ఈ స్నాతకోత్సవం కెరీర్లో ఓ మైలురాయిగా నిలిచిపోతుందని చెప్పింది.

ఎందుకు పక్కన పెట్టామో చెప్పాలి

దిల్లీ: జట్టు ఎంపికలో కఠిన నిర్ణయాలు తీసుకోవడం కష్టమైన విషయమని, అయితే ఒక ఆటగాడిని ఎందుకు పక్కన పెట్టామో అతడికి వివరించాల్సిన అవసరం ఉందని టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అభిప్రాయపడ్డాడు. వచ్చే నెలలో మొదలయ్యే టీ20 ప్రపంచకప్‌నకు ప్రచార కర్తగా వ్యవహరిస్తున్న రోహిత్.. తొలిసారిగా ఈ టోర్నీని ఇంటి నుంచి చూడబోతుండడం తనకు వింత అనుభవమని అన్నాడు. "నా కెరీర్‌లో ఇప్పటి వరకు జరిగిన ప్రతి టీ20 ప్రపంచకప్‌లో నేను భాగమయ్యా. తొలిసారి ఇంటి నుంచి మ్యాచ్‌లను చూడనుండటం చాలా వింతగా అనిపిస్తుంది. స్టేడియంలో ఉన్నా కూడా అది గతంలో మాదిరిగా ఉండదు. ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది. జట్టు ఎంపికలో కఠిన నిర్ణయాలు తీసుకోవడమే సారథ్యంలో అత్యంత క్లిష్టమైన అంశం. జట్టు ఎంపికలో అందరినీ మెప్పించలేం. కానీ ఎందుకు పక్కన పెట్టామో ఆటగాడికి వివరించడం ముఖ్యం. 2022 ఆసియా కప్, టీ20 ప్రపంచకప్ సమయంలో శ్రేయస్ అయ్యర్‌ను కాదని బౌలింగ్ చేయగలిగే దీపక్ హుడాను తీసుకున్నాం. జట్టు సమతూకం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నేను, చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ స్వయంగా శ్రేయస్‌కు తెలియజేశాం. 2023 వన్డే ప్రపంచకప్ సమయంలో చాహల్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ అప్పుడు మహ్మద్ సిరాజ్‌కు ఇదే తరహాలో వివరించాం. రానున్న పొట్టి కప్పులో భారత్ సత్తాచాటుతుందన్న నమ్మకం ఉంది. జట్టులో 80 నుంచి 90 శాతం మంది ఆటగాళ్లు గత రెండేళ్లుగా కలిసి ఆడుతున్నారు. జట్టు సగటు వయసు 25 ఏళ్లే ఉండటం సానుకూలాంశం" అని రోహిత్ తెలిపాడు.

రెండో స్థానంలో అర్జున్

విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ టోర్నీలో అర్జున్ ఇరిగేశి రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. నాలుగో రౌండ్లో అతను.. అనీష్ గిరితో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. సిందరోవ్, జోర్డెన్ వాన్‌తో కలిసి అర్జున్ (2.5 పాయింట్లు) ఉమ్మడిగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. నీమన్, నాదిర్బెక్ అబ్దుసతారోవ్ చెరో మూడు పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. గుకేశ్ (2 పాయింట్లు) వరుసగా నాలుగో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. డి ఫెండింగ్ ఛాంపియన్ ప్రజ్ఞానందతో పాయింట్ పంచుకున్న అతను.. ఉమ్మడిగా మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. రెండు డ్రాలు, రెండు ఓటములతో.. ప్రజ్ఞానంద (1 పాయింట్) అట్టడుగు స్థానంలో ఉన్నాడు. నీమన్ చేతిలో పరాజయం పాలైన అరవింద్ చిదంబరం (1.5 పాయింట్లు) ఉమ్మడిగా నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

(c) eenadu

దావోస్‌లో ప్రకృతి సేద్యం, ప్రత్యామ్నాయ ఆహార పంటల ఉత్పత్తులపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఏపీలో 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం!

- 18 లక్షల మంది రైతులను సిద్ధం చేశాం
- దావోస్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఏపీలో ప్రకృతి సేద్యాన్ని భారీ ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 18 లక్షల మంది రైతులు.. 20 లక్షల ఎకరాల్లో సంప్రదాయ విధానంలో సేద్యం చేయడానికి ముందుకు వచ్చారని అన్నారు. దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో 'ప్రకృతి సేద్యం.. ప్రత్యామ్నాయ ఆహార పంటల ఉత్పత్తులు'పై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశం, రౌండ్ టేబుల్ సమావేశాల్లో సీఎం పాల్గొన్నారు. ఏపీలో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు తీసుకున్న చర్యలను వివరించారు. 'గ్లోబల్ మార్కెట్‌లో ప్రకృతి సేద్యం ద్వారా వచ్చిన ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకున్నాం. ప్రతి గ్రామంలో ప్రకృతి సేద్యం చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఆయా ఉత్పత్తులకు మార్కెటింగ్ వ్యవస్థ, ధ్రువీకరణను వేగవంతం చేశాం. సాంకేతికత వినియోగించి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రకృతి ఆధారిత సేద్యం విజయవంతం కావాలంటే మెరుగైన ప్రోత్సాహకాలు, వ్యాపార సంస్థల నుంచి సహకారం అవసరం. ఈ రంగంలో అగ్రగామిగా ఎదగడానికి ఏపీ సన్నద్ధంగా ఉంది' అని సీఎం పేర్కొన్నారు.

ఏఐ మా ఊతపదం కాదు..

- సాంకేతికత లాభాలు ప్రతి పౌరుడికీ అందాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కృత్రిమ మేధ (ఏఐ) అనేది కేవలం బజ్‌వర్డ్ కాదని, పరిపాలనను మరింత ప్రభావవంతం చేయడానికి ఏఐని వినియోగించేలా వ్యవస్థల్ని అనుసరిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'నేను ఏఐ ఫర్ ఆల్ అనే సిద్ధాంతాన్ని నమ్ముతా. సాంకేతికత కేవలం టెక్ కంపెనీలకో లేదా పట్టణ కేంద్రాలకో మాత్రమే కాకుండా రైతులు, విద్యార్థులు, సమాజంలోని ప్రతి పౌరుడికి స్పష్టమైన లాభాలు అందించాలి. దీనిపై దావోస్‌లో జరిగిన ది ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్ ఏఐ మూమెంట్- ట్రాన్స్‌ఫార్మింగ్ ది గ్లోబల్ ఎకానమీ అనే సదస్సులో చర్చించా' అని బుధవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

వెస్టాస్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోర్టెన్ థైర్మేమ్‌తో పెట్టుబడులపై చర్చిస్తున్న మంత్రి లోకేశ్

ఏపీలో విండ్ టర్బైన్ బ్లేడ్ ఉత్పత్తి కేంద్రం నెలకొల్పండి

వెస్టాస్ గ్రూప్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ మోర్టెన్‌తో మంత్రి లోకేశ్ భేటీ

ఈనాడు, అమరావతి: ఏపీలో కృష్ణపట్నం సమీపంలోని క్రిస్ సిటీ లేదా ఇఫ్కో సెజ్, కాకినాడ పోర్టు సమీపంలో కేవెస్‌ఈజడ్‌లో భారీ విండ్ టర్బైన్ బ్లేడ్, నాసెల్ల్ యూనిట్ల ఆఫ్‌షోర్ మాన్యుఫ్యాక్చరింగ్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని డెన్మార్క్‌కు చెందిన పవన విద్యుత్తు సంస్థ వెస్టాస్ గ్రూపు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోర్టెన్ థైర్మేమ్‌ను మంత్రి లోకేశ్ కోరారు. దావోస్‌లో మోర్టెన్‌తో భేటీలో మంత్రి మాట్లాడారు. వెస్టాస్ సంస్థ ఏపీలో యూనిట్ నెలకొల్పితే ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. పవన విద్యుత్తు రంగ నైపుణ్యం, వృత్తిపరమైన అవసరాలను తీర్చడానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం లేదా ఐఐటీ తిరుపతిలో పవన విద్యుత్తు సెంటర్ ఏర్పాటులో భాగస్వామ్యం వహించాలని కోరారు. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని మోర్టెన్ చెప్పారు.



ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ శాశ్వత్ గోయెంకాను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న మంత్రి లోకేశ్

క్రీడాభివృద్ధికి సహకరించండి..

శాశ్వత్ గోయెంకాకు వినతి

ఆర్‌పీఎస్‌జీ స్పోర్ట్స్ ఫ్రాంచైజీలను ఉపయోగించి, ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాభివృద్ధికి సహకారం అందించాలని ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూపు వైస్ ప్రెసిడెంట్ శాశ్వత్ గోయెంకాను మంత్రి నారా లోకేశ్ కోరారు. దావోస్‌లో ఆయనతో భేటీలో మంత్రి మాట్లాడుతూ.. ఏపీలో గోయెంకా గ్రూపు తలపెట్టిన 349 మెగావాట్ల పూర్వా గ్రీన్/ సీఈఎస్‌సీ పవన విద్యుత్తు ప్రాజెక్టు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, హైబ్రిడ్ పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఏపీలో ఆర్గానిక్ ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ యూనిట్లు నెలకొల్పాలని, సముద్ర ఉత్పత్తులకు విలువ జోడింపు యూనిట్ల ఏర్పాటుకు ఏపీలోని తీరప్రాంతాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మెగా ఫుడ్ పార్కుల్లో రెడీ టు ఈట్ మీల్స్, హెల్త్ అండ్ వెల్‌నెస్ ఉత్పత్తుల తయారీకి ఆలోచించాలని కోరారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని శాశ్వత్ గోయెంకా తెలిపారు.

భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే బలమైన వ్యవస్థలు అవసరం

- లాజిస్టిక్స్, కనెక్టివిటీ మెరుగుపర్చడం ద్వారా పెట్టుబడుల ఆకర్షణ
- వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే బలమైన వ్యవస్థల నిర్మాణం అవసరమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం కాంగ్రెస్ సెషన్‌లో 'భవిష్యత్తు సవాళ్లు, అవకాశాలను ప్రభుత్వాలు ఎలా ఆవిష్కరించాలి?' అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ''భవిష్యత్తు సవాళ్లను అంచనా వేస్తూ కొత్త అవకాశాలను గుర్తించి, పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తూ స్థిరమైన అభివృద్ధిని అందించే వ్యవస్థలను నిర్మించుకోవడం అత్యవసరం. భౌగోళిక రాజకీయాల్లో వస్తున్న మార్పులు సరఫరా వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్నాయి. మరోవైపు కృత్రిమ మేధ(ఏఐ) వేగంగా పని విధానాన్ని పునర్నిర్మిస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఏకకాలంలో సామాజిక శ్రేయస్సు, సుస్థిరతలను బ్యాలెన్స్ చేయడం సంక్లిష్టంగా మారింది. సమగ్రాభివృద్ధి, పేదరిక నిర్మూలన మా రాష్ట్ర ప్రధాన లక్ష్యాలు. పీ4 మోడల్‌తో టాప్ 10% ధనికులను అట్టడుగు స్థాయిలో ఉన్న 20% పేదల కుటుంబాలతో అనుసంధానించి, కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చే వ్యవస్థను సిద్ధం చేశాం. ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త దృక్పథంతో ఏకీకృతం చేసి, ప్రతి కుటుంబం నుంచి ఒక ఔత్సాహికుని తయారుచేసి పేదరికం నుంచి బయటకు తేవడంపై దృష్టిపెట్టాం'' అని తెలిపారు.

అంతరాలు తగ్గించేందుకు..

''ఓడరేవులు, బ్రాడ్‌బ్యాండ్, విద్యుత్తు, లాజిస్టిక్స్ లాంటి స్మార్ట్ మౌలిక సదుపాయాలు, గ్లోబల్ కనెక్టివిటీ లేని ప్రాంతాలు గ్లోబల్ ఆర్థిక వ్యవస్థతో పోటీ పడలేవు. ఇది దేశ సామాజిక, ఆర్థిక సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది. నగరీకరణతో సామాజిక అసమానతలు పెరుగుతున్నాయి. వీటిని తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం లాజిస్టిక్స్ పాలసీని ప్రకటించింది. ఓడరేవులు, విమానాశ్రయాలు, రోడ్లు, రైలు, అంతర్గత జలమార్గాలు, లాజిస్టిక్స్ పార్కులను మల్టీమోడల్ ఇంటిగ్రేషన్‌తో అనుసంధానం చేస్తున్నాం. భారతదేశ తూర్పుతీర మారిటైం వ్యాపారంలో 40% ఏపీ నుంచే కొనసాగుతోంది. ఏపీలోకి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తుండడంతో స్థానిక ఆర్థికవ్యవస్థ బలోపేతమై, యువతకు ఎక్కడికక్కడే మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయి'' అని పేర్కొన్నారు.

ఉద్యోగ నైపుణ్యాలు మారుతున్నాయి

''భవిష్యత్తు ఉద్యోగాలకు నైపుణ్యాలు మారుతున్నాయి. ప్రభుత్వాలు సంప్రదాయ విద్యావ్యవస్థల కంటే వేగంగా స్పందించాలి. భారత్‌లో ఇందు కోసం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయి. ఏపీలో పరిశ్రమల భాగస్వామ్యంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటుచేశాం. క్వాంటమ్ కంప్యూటింగ్, మోడరన్ ఫిజిక్స్, తదుపరి తరం పరిశోధన నైపుణ్యాలకు విద్యార్థులు, అధ్యాపకులను సిద్ధం చేస్తున్నాం. భారత్‌లో డీప్ టెక్ శరవేగంగా విస్తరిస్తోంది. ఇండియా ఏఐ మిషన్, నేషనల్ క్వాంటమ్ మిషన్, ఏఐ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, సెమీకండక్టర్లు, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మా జాతీయ వృద్ధి ఇంజిన్లు. భారత్‌లో మొట్టమొదటి క్వాంటమ్ ఇన్నోవేషన్ డిస్ట్రిక్ట్ ఏపీలో ఆవిష్కరించబోతున్నాం. ప్రభుత్వాలు, వాణిజ్యం, విద్యావ్యవస్థ సమష్టి కృషి, సమన్వయంతో భవిష్యత్తు సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటూ అభివృద్ధికి బాటలు వేస్తున్నాం' అని తెలిపారు.

యువతలో నైపుణ్యాన్ని పెంచుతున్నాం

- పలు కార్యక్రమాలతో 4 లక్షల మందికి శిక్షణ
- దేశ సాంకేతిక పురోగతి, సామాజిక సమానత్వం'పై చర్చలో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: నైపుణ్యం కలిగిన యువతను తయారు చేయడమే ఏపీ ప్రభుత్వ లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. దావోస్‌లో యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరం, వరల్డ్ ఉమెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. 'దేశ సాంకేతిక పురోగతి, సామాజిక సమానత్వం' అంశంపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడారు. 'సాంకేతిక మార్పులకు తగ్గట్లుగా యువతలో నైపుణ్యాలను పెంపొందించాలి. భవిష్యత్తు అవసరాలను గుర్తించి, ఏపీలో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. దేశంలోనే అత్యంత సమగ్ర ఏఐ ఆధారిత నైపుణ్యాభివృద్ధి, ఉపాధి వేదికల్లో 'నైపుణ్యం' కార్యక్రమం ఒకటి. ఇది శిక్షణకే పరిమితం కాకుండా సర్టిఫికేషన్లు, నియామకాలు, పరిశ్రమల తక్షణ అవసరాలను ట్రాక్ చేస్తుంది. నిరుద్యోగ యువత కోసం ప్రారంభించిన 'కౌశలం' కార్యక్రమం ద్వారా విద్యార్థులు, గ్రామీణ యువత కోసం డిమాండ్ ఆధారిత నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాం. ఈ రెండు కార్యక్రమాలతో ఇప్పటికే 4 లక్షల మందికిపైగా యువత, మహిళలకు శిక్షణ అందించాం' అని వివరించారు.

సిలబస్‌నే కాదు.. విధానాన్నీ సంస్కరిస్తున్నాం

'మేం కేవలం సిలబస్‌నే కాదు.. నేర్చుకునే విధానాన్నే సంస్కరిస్తున్నాం. 45కుపైగా విద్యా యాప్‌లను ఒకే డిజిటల్ వేదికగా ఏకీకృతం చేశాం. భవిష్యత్తు నైపుణ్యాలను అందరికీ అందుబాటులో ఉంచేందుకు పాఠశాలల్లో ఏఐ, రోబోటిక్స్, స్టెమ్‌లను ప్రవేశపెడుతున్నాం. అమెరికా, యూకే, యూరప్, సింగపూర్, ఆస్ట్రేలియాలోని విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాల ద్వారా గ్లోబల్ ఎక్స్‌పోజర్‌ను నిర్మిస్తున్నాం. ఒరాకిల్, సామ్‌సంగ్, సిస్కోలాంటి సంస్థల ద్వారా పరిశ్రమలకు అనుగుణమైన సర్టిఫికేషన్లు అందిస్తున్నాం. ఒరాకిల్ భాగస్వామ్యం ద్వారా ఇప్పటికే దాదాపు 4 లక్షల మంది విద్యార్థులు గ్లోబల్ స్టాండర్డ్ ఏఐ, క్లౌడ్, డేటా సైన్సు విద్యను అభ్యసిస్తున్నారు. విపత్తు నిర్వహణ, వాతావరణ పరిస్థితుల్లో ప్రాణనష్టాన్ని నివారించేందుకు ఆర్టీజీఎస్ తోడ్పాటు అందిస్తోంది. నాలుగోతరం పారిశ్రామిక విప్లవం కోసం ఏపీలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం సెంటర్‌ను ప్రారంభించాం' అని లోకేశ్ వెల్లడించారు.

ఆర్థికవృద్ధికి యువత, మహిళలు చోదకశక్తులు

'ఆర్థికవ్యవస్థలో మార్పు, వృద్ధికి మహిళలు, యువతే చోదక శక్తులు. మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. పాలనలో మార్పులు తీసుకొచ్చాం. మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 36 విభాగాల్లో 700కుపైగా సేవలను అందిస్తున్నాం. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకు డీప్ టెక్, లాజిస్టిక్స్, పునరుత్పాదక శక్తి, సుస్థిరత దోహదపడతాయి' అని మంత్రి వివరించారు.

విశాఖలో స్కేల్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయండి

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో స్కేల్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థ ఎండీ ట్రెవర్ థాంప్సన్‌ను ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. ఏపీకి పెట్టుబడుల కోసం దావోస్‌లో పర్యటిస్తున్న లోకేశ్ పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. దీనిలో భాగంగా థాంప్సన్‌తో భేటీలో మంత్రి మాట్లాడుతూ.. అప్లైడ్ ఏఐ డెలివరీ, ఎడ్వాన్స్‌డ్ టాలెంట్ డెవలప్‌మెంట్‌లో సహకారం అందించాలని, స్కేల్ ఏఐ భాగస్వామ్యంతో ఆర్‌టీఐహెచ్‌లో ఏఐ భద్రత, ఎవాల్యుయేషన్, గవర్నెన్స్ ల్యాబ్ ఏర్పాటులో చేయూతనివ్వాలని కోరారు. పబ్లిక్ డేటాసెట్లు, ప్రభుత్వ ఏఐ అప్లికేషన్ల ఎల్‌ఎల్‌ఎం బెంచ్‌మార్కింగ్, రెడ్-టీమింగ్, ఏఐ గవర్నెన్స్‌పై దృష్టి సారించేందుకు స్కేల్ ఏఐ సీల్ షీట్ ఫామ్ అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఏఐ లిటరసీ, విజన్ టాలెంట్ పైప్‌లైన్‌లను ప్రోత్సహించడంలో భాగస్వామి కావాలని ఆహ్వానించారు. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని థాంప్సన్ చెప్పారు.



దావోస్‌లో మెటా వైస్ ప్రెసిడెంట్ కెల్విన్ మార్టిన్‌తో చర్చిస్తున్న మంత్రి లోకేశ్
★ జెరా గ్లోబల్ సీఈవో యుకియో కానిని సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న లోకేశ్

గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి పెట్టుబడులు పెట్టండి

జపాన్‌తోపాటు ఆసియాలోని ఇతర మార్కెట్లకు లో-కార్బన్ అమ్మోనియాను సరఫరా చేయడానికి ఏపీలోని మూలపేట, కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల మౌలికసదుపాయాలు ఉపయోగించుకొని గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని జపాన్‌కు చెందిన ప్రముఖ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ జెరా గ్లోబల్ సీఈఓ యుకియో కానిని మంత్రి లోకేశ్ కోరారు. పారిశ్రామిక వినియోగదారులకు క్లీన్ ఎనర్జీ సరఫరా కోసం రాయలసీమలో సౌర, పవన హైబ్రిడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. భారత్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వాల్యూ చైన్లను అభివృద్ధి చేస్తున్నామని, ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని యుకియో కాని తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతకు సహకరించండి

విశాఖపట్నంలో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నెలకొల్పాలని ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ జెరోధా ఫౌండర్ నిఖిల్ కామత్‌ను మంత్రి కోరారు. పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత (ఫైనాన్షియల్ లిటరసీ) కార్యక్రమాన్ని రూపొందించి, అమలు చేయడానికి ఏపీ ప్రభుత్వంతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలను పరిశీలిస్తామని నిఖిల్ కామత్ సమాధానమిచ్చారు.

✦ ఏపీ డిజిటల్ ఎకోసిస్టమ్‌కు అనుగుణంగా విశాఖపట్నంలో స్కేలబుల్ డేటా సెంటర్ సామర్థ్యం అభివృద్ధికి దొరువు చూపాలని మెటా వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ పాలసీ హెడ్ కెల్విన్ మార్టిన్‌ను మంత్రి కోరారు. వాట్సప్ ఆధారిత డిజిటల్ గవర్నెన్స్, ఫిర్యాదుల పరిష్కారం, అధికారిక కమ్యూనికేషన్లపై సహకారాన్ని బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సంస్థ ఉన్నత స్థాయి బృందంతో చర్చించి, ఈ ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకుంటామని కెల్విన్ మార్టిన్ చెప్పారు.

జెరోధా వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌తో లోకేశ్
★ స్కేల్ ఏఐ గ్లోబల్ ఎండీ ట్రెవర్ థాంప్సన్‌తో చర్చిస్తూ..

తోబుట్టువు ఉంటే ఒంటరితనం దూరం

ఆటబొమ్మలు ఇచ్చిపుచ్చుకున్నప్పటినుంచే తోబుట్టువులకు పంచుకోవడంలోని ఆనందం అనుభవంలోకి వస్తుంది. ఎదుటివారిపై కోపం వచ్చినా, క్షమాపణతో పని లేకుండానే మన్నించే గుణం అలవడుతుంది. ఎలాంటి కష్టసుఖాల్లోనైనా తోడుగా సొంత మనిషి ఉన్నారనే భరోసా వారికి జీవితాంతం ఉంటుంది. ముఖ్యంగా బాల్యంలో ఒంటరితనమనేది వారి దరి చేరదు. ఈ తరం తల్లిదండ్రులు ఏకైక సంతానం చాలనుకోకుండా తమ బిడ్డకు తోబుట్టువు రూపంలో అరుదైన కానుకను ఇవ్వడం ఉత్తమం.

– శ్రద్ధే కటియార్, వైద్య నిపుణులు

సాల్మన్ మృతిని రాజకీయ హత్యగా చిత్రీకరించడం దారుణం

- 28న గ్రామంలో ఎస్సీ కమిషన్ సభ్యుల పర్యటన
- ఛైర్మన్ కేఎస్ జవహర్

ఈనాడు, అమరావతి: గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామంలో ఇద్దరు ఎస్సీల మధ్య జరిగిన వ్యక్తిగత వివాదంలో సాల్మన్ మృతి చెందడం అత్యంత విచారకరమని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఆరా తీశామని, దీన్ని కొన్ని పార్టీలు రాజకీయ హత్యగా చిత్రీకరించడం దారుణమన్నారు. ఇది రాజకీయానికి, కులానికి, మతానికి సంబంధించినది కాదని స్పష్టం చేశారు. పూర్తిగా వ్యక్తిగత కక్షతో జరిగిన ఘటన మాత్రమేనన్నారు. ఈ నెల 28న ఎస్సీ కమిషన్ సభ్యులు పిన్నెల్లి గ్రామంలో పర్యటించి పూర్తి నివేదిక అందిస్తారని తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఈ ఘటనను ఎస్సీ కమిషన్ తీవ్రంగా ఖండిస్తోంది. ఘటనను వక్రీకరించి కొన్ని పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రచారం చేయడం దురదృష్టకరం. ఇలాంటి వాటిపై ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అందుకే కమిషన్ సభ్యులు గ్రామంలో పర్యటిస్తారు. బాధిత కుటుంబానికి ఎస్సీ కమిషన్ అండగా నిలుస్తుంది. వారికి న్యాయం జరిగేలా సహకరిస్తాం. ఎస్సీలపై జరిగే హత్యలను స్వార్థ రాజకీయాలకు వినియోగించుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని జవహర్ వివరించారు.

ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

రోడ్ల మీదే ప్రజలతో మమేమకవుతూ నా ప్రయాణం కొనసాగుతుంది' అని వెల్లడించారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో బుధవారం క్యాంపు కార్యాలయంలో సమావేశమైనప్పుడు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అన్నీ ప్రైవేట్ అంటే ఇక చంద్రబాబు ఎందుకు?

'ప్రభుత్వ వైద్య కళాశాలలను చంద్రబాబు పీపీపీ పేరుతో కుంభకోణాలు చేస్తూ ప్రైవేటువారికిస్తున్నారు. ఆ కాలేజీలను తీసుకునేవారిని మేం అధికారంలోకి వచ్చాక జైల్లో పెడతామనేసరికి.. ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఇలా అన్నీ ప్రైవేట్ అనేటట్లయితే ఏం చేయడానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కుర్చీలో ఉన్నారు? ఆ కుర్చీని కూడా ప్రైవేటుకు ఇచ్చేయొచ్చు కదా' అని జగన్ వ్యాఖ్యానించారు. 'రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఎక్కడైనా, ఎవరినైనా, ఏమైనా చేయొచ్చన్న కండకావరంతో వ్యవహరిస్తున్నారు. పాలనంతా అబద్ధాలు, మోసాలు. ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారు. ఎప్పుడూ చూడని విధంగా పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. అందువల్లే ప్రభుత్వంపై చాలా వ్యతిరేకత వచ్చింది. జగన్ ఉన్నప్పుడే బాగుండేదని ప్రతి ఇంట్లో అనుకుంటున్నారు. వైకాపా హయాంలో ప్రభుత్వ పాఠశాల్లో పిల్లల్ని చేర్పించాలంటే ఎమ్మెల్యేల సిఫార్సు లేఖ తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉంటే.. ఇప్పుడు అదే ప్రభుత్వ పాఠశాలల నుంచి 9 లక్షల మంది పిల్లలు మానేశారు. ఇలా వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారు. వైకాపా హయాంలో అమలు చేసిన పథకాలన్నీ రద్దయ్యాయి. సూపర్-6 మోసాలయ్యాయి' అని విమర్శించారు.

జగన్‌తో సాల్మన్ కుటుంబ సభ్యుల భేటీ

ఈనాడు-అమరావతి, మాచవరం, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామంలో ఇటీవల గొడవలో మృతిచెందిన మందా సాల్మన్ కుటుంబ సభ్యులు మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. గ్రామంలో పరిస్థితిని సాల్మన్ కుమారులు మరియదాసు, భిక్షం(ప్రవీణ్), కుమార్తె రాహేలు ఆయనకు వివరించారు. తమ తండ్రిని రాజకీయ కక్షతోనే చంపారని జగన్‌కు చెప్పారు. తండ్రి మరణంతో తమ కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు పెట్టిన కేసుల గురించి కూడా వివరించారు. జగన్ వారితో మాట్లాడుతూ.. 'భయపడవద్దు, ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కేసులు, వేధింపులను ఎదుర్కోవడంలో పార్టీ లీగల్‌సెల్ అవసరమైన న్యాయ సహాయం అందిస్తుంది' అని తెలిపారు. బాధితులకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. జగన్‌ను కలిసిన వారిలో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి మురళీధర్ రెడ్డి ఉన్నారు.

సాల్మన్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జగన్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

గుంటూరు-బీబీ నగర్ డబ్లింగ్ కోసం పల్నాడు జిల్లాలో భూసేకరణ

ఈనాడు, దిల్లీ: గుంటూరు-బీబీనగర్ మధ్య ఉన్న రైల్వే లైన్ డబ్లింగ్ పనుల కోసం.. పల్నాడు జిల్లా గురజాల పరిధిలో భూసేకరణకు రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాల్లోని సుమారు 467 సర్వే నెంబర్ల నుంచి 76.80 ఎకరాల భూమిని ఇందుకోసం సేకరించనున్నట్లు పేర్కొంది.

పాదయాత్రంటూ ప్రజల్ని మళ్లీ మోసం చేయలేరు

అధికారంలో లేకే జగన్‌కు దళితులు గుర్తొస్తున్నారు: మంత్రి పార్థసారథి

ఈనాడు, అమరావతి:

'వైకాపా అధినేత జగన్ ఓసారి పాదయాత్ర చేస్తేనే రాష్ట్రానికి అంచనా వేయలేనంత నష్టం జరిగింది. మరోసారి పాదయాత్ర చేస్తే ఈ రాష్ట్రం ఏమైపోతుందో? ప్రజలను ఓసారి మోసం చేయగలరు. ఆయన మళ్లీ మళ్లీ మోసం చేయాలనుకుంటే ప్రజలు అంత అమాయకులు కారు' అని గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన సచివాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామంలో ఇద్దరు దళితుల మధ్య వ్యక్తిగత కక్షలతో జరిగిన ఘర్షణలో సాల్మన్ అనే వైకాపా కార్యకర్త మరణిస్తే దీనిపై జగన్ నీచరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ రంగు పులిమి, కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు చూస్తున్నారని విమర్శించారు. దళితులు మావాళ్లని జగన్ అంటున్నారని, దళిత యువకుణ్ని హత్యచేసి డోర్ డెలివరీ చేసిన చరిత్ర మీ పార్టీదని పార్థసారథి ధ్వజమెత్తారు. ఆ కేసులో నిందితుడిని అందలం ఎక్కించడం, అతను జైలు నుంచి బయటకొస్తే ఊరేగింపుగా తీసుకెళ్లడాన్ని ప్రజలు మరచిపోరన్నారు. మాస్కులు, గ్లౌజులు అడిగిన దళిత డాక్టర్‌ను ఎంతలా క్షోభకు గురిచేశారో గుర్తుచేసుకోవాలన్నారు. అధికారం కోల్పోతేనే దళితులు తమ వాళ్లని జగన్‌కు గుర్తొస్తుందని విమర్శించారు.

ఐదేళ్లలో 8 హత్యలు, 79 దాడులు

పల్నాడు విషయంలో జగన్, వైకాపా నేతలు శాంతి దూతల్లా మాట్లాడుతున్నారని పార్థసారథి విమర్శించారు. అక్కడ వైకాపా హయాంలో 8 హత్యలు, 79 దాడులు జరిగాయనేది జగన్‌కు తెలియదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభ

మకరందం

makarandam@eenadu.in

గురువారం జనవరి 22, 2026

ఈనాడు

13

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

సోదరభావంతో వసుధైక కుటుంబం సాకారం

ఇస్లాం సందేశం

వ్యక్తిగత ప్రవర్తనతోపాటు సామాజిక ప్రవర్తన, బాధ్యతలు వంటి అంశాల్లో ఎలా వ్యవహరించాలో మార్గనిర్దేశం చేసే సమగ్ర జీవన విధానం ఇస్లాం ధర్మం. రంగు, రూపం, జాతి, హోదాలకు అతీతంగా అల్లాహ్‌పై అచంచల విశ్వాసం.. ఈ సువిశాల ప్రపంచంలోని ముస్లింలను ఏకం చేస్తుంది. ఇలాంటి సోదరభావాన్ని ఉఖువా అంటారు. ఇది పరస్పర ప్రేమ, కరుణ, న్యాయం అనే ప్రాథమిక అంశాలపై ఆధారపడి ఉంటుంది. మన తోటివారంతా ఇహ, పరలోకాల్లో ఒకరి శ్రేయస్సు కోసం మరొకరు శ్రద్ధ వహించాల్సిన బంధుసమానులేనని దివ్య ఖురాన్, దైవ ప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు వివరిస్తాయి. పేదలకు సాయం అందించటం, న్యాయం వైపు నిలబడటం, ఇతరులు మనతో ఎలా ఉండాలని అనుకుంటామో.. మనం అలాగే వారితో వ్యవహరించటం వంటివి ఏకీకృత సమాజానికి బాటలు వేస్తాయి.

సోదరభావానికి ఇస్లాం ధర్మంలో అత్యంత ప్రాధాన్యం ఉంది. తోటివారు ఆపదలో ఉంటే.. ఆర్థికంగా, నైతికంగా సాయం అందించాలని, అపార్థాలతో ఒకరికొకరు దూరం కాకూడదని వివరిస్తుంది. జాత్యహంకారం, వర్గవాదం, మతవాదాలను ఇస్లాం తిరస్కరిస్తుంది. ఖురాన్‌లో పేర్కొన్నట్లుగా దైవం ముందు అందరూ సమానులేనని ధ్రువీకరిస్తుంది. విశ్వాసులు ఇతరుల బాధలను అర్థం చేసుకుని తగిన సలహాలు, సహకారం అందివ్వాలి. తోటివారు తప్పుచేస్తే.. క్షమించి వారితో సత్సంబంధాలను కొనసాగించాలి.

'మీరంతా కలిసి అల్లాహ్ అనే తాడును గట్టిగా పట్టుకోండి. ఎట్టి పరిస్థితిలోనూ విడిపోవద్దు. ఎవరినైనా శత్రువుగా భావిస్తే.. అలాంటప్పుడు దైవం చూపిన అనుగ్రహాన్ని గుర్తు తెచ్చుకోండి. అల్లాహ్ ద్వారానే మీరు సోదర సమానులయ్యారు' అని దైవ గ్రంథం పేర్కొంటోంది. 'ఒక ముస్లిం మరో ముస్లింకు సోదరుడు. అతడు అన్యాయం చేయడు, విడిచి పెట్టడు, చిన్నచూపు చూడడు' అని దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచించినట్లు హదీసులు వివరిస్తున్నాయి.

ఇస్లామిక్ సోదరభావం ఒక శక్తిమంతమైన, ప్రేమపూర్వక మైన సమాజాన్ని సృష్టిస్తుంది. ఇక్కడ వ్యక్తులు తామంతా ఒక్కటేనన్నట్టు వ్యవహరిస్తారు. నమ్మకం, బాధ్యత.. ప్రాపంచిక, ఆధ్యాత్మిక సంక్షేమాల విషయంలో పరస్పరం ఐక్యత, నిబద్ధతతో ముందుకుసాగటం ముఖ్యం. సమాజం ఇలాంటి ఉత్తమ కార్యాచరణను అవలంబిస్తే వసుధైక కుటుంబం ఆవిష్కృతం అవుతుందనటంలో సందేహం లేదు.

జనవరి 23 వసంత పంచమి

వాక్కుకు, విద్యకు, కళలకు అధిష్ఠాన దేవతగా, జ్ఞానస్వరూపిణిగా సరస్వతీదేవిని దర్శింపజేశాయి మన పురాణాలు. వేదాలు, ఉపనిషత్తుల్లో చదువులతల్లిని ఒకే తత్వంగా అనేక రూపాల్లో ప్రతిష్ఠించడం జరిగింది.

వాగ్దేవికి అక్షరాంజలి!

సకల విద్యాప్రదాయని, జ్ఞాన స్వరూపిణి అయిన సరస్వతీమాత మాఘ శుక్ల పంచమి నాడు ఆవిర్భవించిందని పురాణాలు తెలియజేస్తున్నాయి. 'జంతూనామ్ నర జన్మ దుర్లభం' అన్నారు ఆదిశంకరాచార్య. మనిషికి మాత్రమే ఆలోచించే, మాట్లాడగలిగే శక్తి ఉంది మరి. అలా మాట్లాడాలంటే విద్యలకు అధిదేవత, వాగ్రూపిణి అయిన సరస్వతీదేవి కటాక్షం మనకెంతో అవసరం. సరస్వతీమాతను పరాశక్తి రూపాల్లో ఒకటిగానే పేర్కొంది దేవీభాగవతం. ఆ తల్లి కరుణాకటాక్ష వీక్షణాలతో మూగవాడైన మూక శంకరుడు, నిరక్షర కుక్షి అయిన కాళిదాసు మహాకవులయ్యారు.

సరస్వతీ అమ్మవారిని అహింసాదేవిగా బ్రహ్మవైవర్త పురాణం వర్ణించింది. ఆమె చేతిలో యుద్ధం చేసే ఆయుధాలు కనిపించవు. ఆ దేవికి రక్తపూరితమైన బలులు సమర్పించరు. పూజించే సందర్భాల్లో పుస్తకాలను, సంగీత వాయిద్యాలను ఆ దేవి ఎదుట ఉంచుతారు. సరస్వతీదేవి చేతుల్లోని వీణ సంగీతానికి, పుస్తకం వేద విజ్ఞానానికి, అక్షమాల తపస్సుకు చిహ్నాలు. హంస వాహనం వివేకానికి గుర్తు. ఈ వర్ణన స్వచ్ఛతకు, సృజనాత్మకతకు సంకేతం.

కంటికి రెప్పలా కాపాడే అమ్మను ఇలలో దేవతగా భావిస్తే.. అమ్మలగన్న అమ్మ ఆదిపరాశక్తిని వేనోళ్ల స్తుతిస్తాం. లక్ష్మి, సరస్వతి, పార్వతీదేవులనే గాక.. పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, పోలేరమ్మ, మరిడమ్మ, ముత్యాలమ్మ.. ఇలా అమ్మవారి వివిధ రూపాలను పూజిస్తాం. అంతేకాదు.. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను త్యజించిన వారిని సైతం దేవతలుగా కొలవడం మన సంస్కృతి. అలా ఆరాధనలు అందుకుంటున్న దేవతలే తల్లీ కుమార్తెలైన సమ్మక్క, సారలమ్మలు.

స్తుతించాకే రచించారు..

జ్ఞానప్రదాయిని సరస్వతీదేవి ఆవిర్భవించిన విశిష్ట దినాన్నే శ్రీపంచమి, వసంత పంచమి, మదన పంచమి పేర్లతో పిలుచుకుంటాం. అమ్మ ప్రణవ రూపాన్ని- 'మల్లె, మంచు, చంద్రబింబం, ముత్యాల్లా స్వచ్ఛమైన తెల్లని వస్త్రాలు ధరించి వీణాపాణిగా, తెల్ల తామరపై ఆసీనురాలైన ఓ సరస్వతీదేవీ! మా అజ్ఞానాన్ని తొలగించి మమ్ము రక్షించు' అంటూ పూజించారు. 'చందన, కర్పూర పరిమళాలతో వెలుగొందుతూ సూర్యుడిలా ప్రకాశించే మహిమగల తల్లీ మమ్ము అనుగ్రహించు' అన్నాడు భక్తకవి పోతన. ఇలా ఎందరో కవులు సరస్వతీమాతను ప్రార్థించిన మీదటే తమ కావ్యాలను కొనసాగించారు. 'అమ్మా! నీ పాద రేణువే అజ్ఞాన అంధకారాన్ని పోగొట్టగలదు. అది మందబుద్ధులకు జ్ఞానమనే మకరందాన్ని జాలువార్చే ప్రవాహం. లేమితో కుంగిపోయేవారికి సకల సంపదలనూ ప్రసాదించే చింతామణుల శ్రేణి' అని కీర్తించారు ఆదిశంకరాచార్యులు సౌందర్యలహరిలో. నన్నయ సరస్వతీదేవి స్తుతితోనే భారతాన్ని ఆంధ్రీకరించారు. జ్ఞానానికి ప్రతీక అయిన సరస్వతీమాతను ఎవరు ప్రార్థించినా ఆ అమ్మ కటాక్ష వీక్షణాల కోసమే.

పరిపూర్ణత సిద్ధించింది..

పురాణాల్లో సరస్వతి ఆవిర్భావాన్ని గురించిన ప్రస్తావన ఉంది. 'బ్రహ్మ వైవర్త పురాణం' ప్రకారం బ్రహ్మ సృష్టి ఆరంభించినప్పుడు.. పంచభూతాలు, జీవరాశులు ఉన్నాయి కానీ అందులో సమన్వయం కరవైంది. శబ్ద మాధుర్యం, పదాల్లో స్పష్టత లోపించాయి. జ్ఞానమార్గం కనిపించలేదు. ఇవన్నీ బ్రహ్మదేవుడికి అస్తవ్యస్తంగా అనిపించాయి. 'సృష్టికి రూపం ఇచ్చాను కానీ ఆ సృష్టిలో ఆత్మ లోపించింది. జ్ఞానం లేని సృష్టి శూన్యమే కదా' అని చింతించాడు. పరిస్థితిని సరిదిద్దేందుకు బ్రహ్మదేవుడు తపస్సు ఆరంభించాడు. అప్పుడు ఆయన ముఖం నుంచి ఒక దివ్య తేజస్సు ఉద్భవించి.. క్రమంగా రూపం దాల్చింది. శ్వేతాంబరధారిణిగా, వీణాధరిగా, కమలవాసినిగా చేతిలో వీణ, పుస్తకం, అక్షమాలతో.. ప్రశాంత వదనంతో ఒక మూర్తి ప్రత్యక్షమై.. 'నువ్వు సృష్టించిన లోకానికి అర్థాన్ని ఇచ్చేందుకు అవతరించాను' అంది. ఆ దేవతే వాణి, వాగ్దేవి అయిన సరస్వతి. ఆ దేవి అనుగ్రహంతోనే అక్షరాలు, వేదాలు, సంగీత సాహిత్యాది కళలు ఉద్భవించాయి. మాటకు స్వరం, స్వరానికి సౌందర్యం, జ్ఞానానికి మార్గం కనిపించడంతో పరిపూర్ణత సిద్ధించింది. బ్రహ్మ సృష్టించిన రూపాలకు సరస్వతీదేవి ప్రాణం పోసింది. అందువల్లే మాఘ శుక్ల పంచమి విద్యారంభానికి, కళలు అభ్యసించడానికి ఉత్తమ దినమని చెబుతారు. తెలుగు రాష్ట్రాల్లోనే గాక బెంగాల్, అసోం, ఒడిశా, త్రిపుర, కర్ణాటకల్లోనూ వసంత పంచమికి చాలా ప్రాముఖ్యత ఇస్తారు. కవులు తమ గ్రంథాలను, విద్యాసాధనాలను దేవి ఎదుట ఉంచి.. గంధపుష్పాదులతో అర్చిస్తారు. మన పురాణాలు సరస్వతీమాతను దేవతగానే కాకుండా నదిగానూ వర్ణించాయి. జ్ఞానానికి, పవిత్రతకు ప్రతీక అయిన సరస్వతీనది ఇప్పుడు అంతర్వాహిని మాత్రమే. ఉత్తరాయణం ప్రారంభమైన తర్వాత ప్రకృతిలో మార్పులు మొదలవుతాయి. ఆ మార్పులకు అనువైన స్వాగతోపచారాలు చేసే పర్వదినం వసంతపంచమి. ప్రకృతికి నవ చైతన్యాన్ని తీసుకొచ్చేది వసంత రుతువు. ప్రకృతి అనుకూలత, కృషి ఫలితం కలగలిపి ఈ వసంతాన్ని చదువులు, కళల ఆరాధనకు ప్రతీకగా, ఆశల రుతువుగా మారుస్తుంది. వసంత పంచమిని వసంత రుతువుకు సంకేతంగా భావిస్తాం. చల్లటి వాతావరణంతో ప్రకృతి కళకళలాడుతుంది. ఈ కాలం ఎందరో కవులకు, కథకులకు కవితా వస్తువు. వసంత పంచమి ఒక పండుగ మాత్రమే కాదు, జీవితాన్ని సృజనాత్మకంగా, సానుకూలంగా మలచుకోమని ప్రకృతి మనకు ఇచ్చే సందేశం. సకల కళలకు అధిదేవత, వేదవాణి అయిన ఆ విధాత రాణిని పూజించడం ద్వారా లౌకిక, అలౌకిక జ్ఞానం సంప్రాప్తిస్తుంది. జ్ఞానం కొరవడితే.. జీవితం చీకటిమయమౌతుంది. అలాంటి అజ్ఞానాన్ని తొలగించి మనకు సన్మార్గాన్ని చూపేది సరస్వతీ తత్వమే. ఆ దేవి తత్వాన్ని మనలో మేల్కొలిపే శుభదినం వసంత పంచమి. ఈ పర్వదినాన మనలో జ్ఞానజ్యోతిని వెలిగించే వాగ్దేవికి అక్షరాంజలి ఘటిద్దాం!

– గంటి ఉషాబాల

కనిపించే దైవం సూర్యనారాయణుడు!

ఉదయం లేవగానే సూర్యుడికి నమస్కరిస్తాం. ఆ కాంతికిరణాలే లేకుంటే అంతటా అంధకారమే. అన్నీ అనర్థాలే. నేలతల్లి పచ్చగా ఉందంటే, జీవరాశుల మనుగడ నిరాఘాటంగా సాగుతోందంటే అది సూర్యభగవానుడి వల్లే. ఈ సత్యాన్ని ఆధునిక విజ్ఞానశాస్త్రం సైతం కాదనలేకపోయింది. విదేశీయులకు సూర్యుడు ఒక గ్రహం మాత్రమే. మనకు నారాయణుడి ప్రతిరూపం. ఆ ప్రత్యక్ష దైవం జయంతి రథసప్తమి.

వేదకాలం నుంచి సూర్యారాధన ఉంది. మాఘ శుద్ధ సప్తమి సూర్యభగవానుడు పుట్టిన రోజు. ఈరోజు చేసే సూర్యారాధన అనంత పుణ్య ఫలాలను ఇస్తుంది. ఈ రోజు అంతరిక్షంలో గ్రహ, నక్షత్రాల అమరిక రథాన్ని పోలి ఉంటుంది. అందుకే ఈ రోజును రథసప్తమి అంటారు. ఏడు గుర్రాలు పూన్చిన రథంపై తన గమనాన్ని సాగిస్తాడు సూర్యుడు.

సూర్యుడి తల్లి అదితి, తండ్రి కశ్యప మహర్షి. అందుకే ఆయనకు ఆదిత్యుడు, కశ్యపాత్మజుడు అనే పేర్లున్నాయి. వైవస్వత మన్వంతరం రథసప్తమినాడే మొదలైందన్నది పురాణోక్తి. సూర్యుడికి వివస్వతుడనే మరో పేరుంది. అంటే ఎన్నటికీ తన ప్రకాశాన్ని కోల్పోడని అర్థం. సత్య వ్రతుడనే రాజు తపస్సు చేసి సూర్యుణ్ణి మెప్పించాడు. తర్వాత ఆయనకు-సంజ్ఞాదేవికి వైవస్వత మనువుగా జన్మించాడు. ఆయనను శ్రాద్ధదేవుడిగా పూజిస్తారు. అందుకే రథసప్తమి నాడు పితృదేవతలకు తర్పణాలు విడిచే ఆచారం మొదలైంది.

సూర్యుడు ఉత్తరాయణం దిశగా పయనించడాన్ని సూచిస్తుంది రథసప్తమి. ఈ కదలిక శీతాకాలపు చలికి ముగింపు, వసంతకాలపు వెచ్చదనానికి ఆరంభం. జ్యోతిష శాస్త్రం ప్రకారం.. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన తర్వాత తన పయనాన్ని వేగవంతం చేసుకునే రోజు. సూర్యుడి రథంలోని సప్త అశ్వాలు వారంలోని ఏడు రోజులకు, ఇంద్రధనుస్సులోని ఏడు రంగులకు ప్రతీక.

వ్యాధుల నుంచి విముక్తి: రథసప్తమి నాడు సూర్యభగవానుణ్ణి ఆరాధించినట్లయితే.. దేహంలో ధాతువులు లోపించడం వల్ల వచ్చే రోగాలు, కళ్ల, గొంతు-ముక్కు-చెవి సమస్యలు, జ్వరాలు, తల, మెదడు, ఊపిరితిత్తులు, గుండె సంబంధ అనారోగ్యాలు, అజీర్ణం, మొలలు తదితర ఇబ్బందులు, రక్తంలో ఏర్పడే దోషాలు, వెన్ను, ఎముకలు, మర్మావయవాలకు సంబంధించిన అనారోగ్యాలు నయమవుతాయని సూర్యపురాణం పేర్కొంది.

దేవతలు సైతం పూజించారు!: పౌరాణిక కథలను అనుసరించి.. శ్రీకృష్ణుడి పుత్రుడైన సాంబునికి శాపవశాత్తూ కుష్ఠు వ్యాధి సోకింది. అతడు రథసప్తమి నాడు సూర్యుణ్ణి ఆరాధించి రోగవిముక్తుడయ్యాడు. కోణార్క్‌లో సూర్య దేవాలయాన్ని నిర్మించి సూర్యారాధనకు శ్రీకారం చుట్టాడు. నంది అనుమతి లేకుండా పరమశివుణ్ణి దర్శించాలని ప్రయత్నించిన ఇంద్రుడికి దేహమంతా గాయాలయ్యాయి. రథసప్తమి నాడు సూర్యుణ్ణి ఆరాధిస్తే ఫలితం ఉంటుందని నంది తెలియజేయగా.. అలాగే చేసి ఉపశమనం పొందాడు. అరసవిల్లిలో సూర్యదేవాలయాన్ని నిర్మించాడు. సూర్యుడు తన భక్తుడైన సత్రాజిత్తుకు శమంతకమణిని ప్రసాదించింది, ధర్మరాజు సూర్యుణ్ణి ఆరాధించి అక్షయపాత్ర పొందింది, యాజ్ఞవల్క్య మహర్షి సూర్యుడి నుంచి వేదజ్ఞానాన్ని పొందింది రథసప్తమి పుణ్యదినానే.

పాపాలన్నీ హరిస్తాయి..: ఇతర దేవుళ్లను మనం దర్శించలేం. సూర్యుడు మాత్రం ప్రతి నిత్యం కనిపిస్తాడు. తన కరుణా కటాక్షాలను ప్రసరింపచేస్తాడు. ఆ ప్రత్యక్షనారాయణుడికి నమస్కరించుకుంటే చాలు మనసు ప్రశాంతంగా ఉంటుంది. సూర్యనమస్కారాలు చేస్తే ఆయురారోగ్యాలను ప్రసాదిస్తాడు. ఆదిత్యహృదయం పఠిస్తే అష్ట ఐశ్వర్యాలను సిద్ధింపజేస్తాడు. పవనసుతుడు హనుమంతుడు సూర్యభగవానుడి పద్ధ శిష్యరికం చేసి.. వేదోపనిషత్తుల్లో పాండిత్యం గడించాడని పురాణాలు తెలియజేస్తున్నాయి. భాస్కరుడి ఘనత అంతటిది. అలాంటి సూర్యుణ్ణి రథసప్తమి పుణ్యదినాన పూజిస్తే తెలిసీ తెలియక చేసిన పాపాలన్నీ హరిస్తాయన్నది ఆర్యోక్తి.

పత్ర స్నానం..

ఆంతర్యం: మన పండుగలన్నింటిలో శాస్త్రీయత ఇమిడి ఉంటుంది. రథసప్తమి కూడా అంతే. ఈ రోజు వీలైతే నదిలో.. అలా అవకాశం లేకుంటే ఇంట్లోనే తూర్పు దిశగా తిరిగి.. తల, భుజాలు, మోచేతులు, అరచేతుల్లో జిల్లేడు పత్రాలు ధరించాలి. 'సప్త సప్త మహా సప్త.. సప్తద్వీపా వసుంధర.. సప్తార్క పూర్ణమాదాయ.. సప్తమీ రథసప్తమీ..' అని మూడుసార్లు స్మరించి.. స్నానం చేయాలి. సూర్యుడికి జిల్లేడు అంటే అత్యంత ప్రీతి. జిల్లేడును అర్క అంటారు. సూర్యుడి పేర్లలో ఇదొకటి. ఇవి పాపాలను, వ్యాధులను నశింపజేస్తాయని విశ్వసిస్తారు. జిల్లేడు ఆకులు దొరకని ప్రాంతాల్లో రేగు ఆకులను ధరిస్తారు. ఇంకొన్ని ప్రాంతాల్లో మూడు దళాలు కలిగిన చిక్కుడాకులను ధరించి.. 'ప్రాతః కాలే పరబ్రహ్మం, మధ్యాహ్నం తు మహేశ్వరః సాయంకాలే స్వయం విష్ణుః' శ్లోకాన్ని పఠిస్తూ స్నానం చేస్తారు. జిల్లేడు, రేగు, చిక్కుడు పత్రాలకు రథసప్తమి ముందు రోజు నుంచి మూడు రోజుల వరకూ విశేష సూర్యశక్తి లభిస్తుంది. ఆ శక్తి మనకు ప్రాప్తించాలన్నదే ఈ విశిష్ట దినాన ఆ పత్రాలతో స్నానమాచరించడంలోని ఆంతర్యం.

ఎలా పూజించాలంటే..: రథసప్తమి రోజున నాలుగు చిక్కుడు కాయలను పుల్లలతో గుచ్చి చతురస్ర ఆకారంలో రథాన్ని చేయాలి. వాకిట్లో రథం ముగ్గు వేసి కుంకుమ దిద్దాలి. రాళ్లతో పొయ్యి ఏర్పాటుచేసి మట్టికుండలో పాయసం, పొంగలి చేసి చిక్కుడాకుల్లో నైవేద్యంగా సమర్పించాలి. సూర్యుడికి నివేదించి.. ప్రసాదం స్వీకరించాలి. ఇంట్లో సూర్యుడి చిత్రపటాన్ని పూలతో అలంకరించి పూజించాలి. సూర్య స్తోత్రం, ఆదిత్య హృదయం, సూర్యాష్టకం పఠించాలి. ఈ రోజు సూర్య నమస్కారాలు చేయడం మరింత మంచిది. ఈ రోజున చేసే దానధర్మాలు అధిక పుణ్యాన్నిస్తాయి. అనారోగ్యంతో బాధపడేవారు రథసప్తమి రోజున చిక్కుడుకాయలతో చేసిన రథాన్ని సూర్యునికి సమర్పిస్తే ఆరోగ్యం కుదుటపడుతుందని భక్తులు విశ్వసిస్తారు.

– డా. జయదేవ్ చల్లా

జనవరి 22 వినాయక జయంతి

ఈరోజు కూడా చంద్రుణ్ణి చూడకూడదు!

మాఘ శుక్ల చతుర్థి వినాయకుడి జన్మదినం. ఇది తిల్కుంద్ చతుర్థి, వరద్ చతుర్థి పేర్లతోనూ ప్రసిద్ధం. ఈ రోజు మహారాష్ట్ర, గోవా తదితర ప్రాంతాల్లో ఘనంగా వేడుక నిర్వహిస్తారు. భాద్రపద మాసంలో వినాయక చవితి చేసుకున్నట్టే మాఘ మాసం శుక్ల చతుర్థినాడు వినాయకుడి జన్మదినం చేసుకుంటారు.

ఉత్తరప్రదేశ్‌లో వినాయక జయంతిని తిలో చౌత్, సకత్ చౌతీస్ అని కూడా అంటారు. వినాయక చవితి వలెనే మాఘ శుక్ల చతుర్థి నాడు కూడా చంద్రుణ్ణి చూడకూడదన్న ఆచారం ఉంది. ఒకవేళ చూసినట్లయితే.. ఉపవాసం పాటించాలి. అలా చేస్తే అపవాదుల నుంచి విముక్తి పొందుతారని దేవరుషి నారదుడు సూచించినట్లుగా పౌరాణిక కథనం తెలియజేస్తోంది. వినాయక జయంతి నాడు.. ఉదయమే శరీరానికి నువ్వుల పిండితో నలుగు పెట్టుకొని నువ్వులు కలిపిన నీటితో స్నానం చేయాలి. పసుపు, సింధూర పొడి లేదా ఆవపేడ.. వీటిలో ఏదో ఒకదానితో వినాయకుడి ప్రతిమను శంఖాకార రూపంలో తయారుచేసి పూజిస్తారు. నువ్వులతో చేసిన ప్రత్యేక వంటకాన్ని వినాయకుడికి నైవేద్యంగా సమర్పించి, భక్తులకు ప్రసాదంగా ఇస్తారు. ఈ రోజు ఉపవాసం పాటించడం శ్రేష్ఠమన్నది పురాణ వచనం. నాలుగో రోజున గణేశుడి ప్రతిమను నీటిలో నిమజ్జనం చేస్తారు. సంతానం కోరుకునే దంపతులు ఈ రోజున వినాయకుణ్ణి పూజిస్తారు.

అరణ్య దేవతల అమర గాథ

జనవరి 28 - 31
సమ్మక్క సారలమ్మ జాతర

గిరిజనుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు తమ జీవితాలను పణంగా పెట్టి, ప్రాణాలను తృణప్రాయంగా భావించిన సమ్మక్క సారలమ్మలు దైవాంశ సంభూతులుగా పూజలందుకుంటున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు కొద్దిపాటి తేడాలతో చాలా కథనాలున్నాయి.

గిరిజనుల్లో కొందరు కథకులుంటారు. తమ చరిత్ర, వీర గాథలు, పరిపాలనా తీరు, ఒకనాటి విశేషాలు, వాటిలోని అంతర్లీన విషయాలను పాటల రూపంలో కథలుగా చెబుతారు. అందరికీ అర్థమయ్యేలా గానం చేస్తారు. వారు చెప్పిన సమ్మక్క చరిత్ర ప్రకారం.. కోయ తెగకు చెందిన రాజ దంపతుల ఐదుగురు సంతానంలో పెద్ద కూతురు సమ్మక్క. ఆదిశక్తి అంశతో పుట్టిన ఆమె బాల్యం నుంచి ధైర్య సాహసాలు కలిగి ఉండేది. సమ్మక్కకు యుక్తవయసు వచ్చాక.. పగిడిద్దరాజుతో వివాహం జరిపించాడు తండ్రి. వివాహానంతరం ఆతడు నదికి ఆవలనున్న అటవీ ప్రాంతంలో రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆ దంపతుల సంతానం జంపన్న, సారలమ్మలు. సమ్మక్క పెంపకంలో కూతురు సారలమ్మ కూడా ధైర్యవంతురాలిగా పెరిగింది. పగిడిద్దరాజు ఏర్పాటు చేసుకున్న రాజ్యం నాటి కాకతీయ ప్రభువైన ప్రతాపరుద్రుడి అధీనంలో ఉండేది. కరువు కాటకాల వల్ల శిస్తులు కట్టలేకపోవడంతో కాకతీయ సైన్యం ఆ రాజ్యంపై దాడి చేసింది. ఆ సైనికులు కాకతీయ సైన్యం ధాటికి తాళలేకపోవడం గమనించిన సమ్మక్క తన కూతురు సారలమ్మతో సమరంలో పాల్గొని శక్తియుక్తులతో పోరాడింది. విజయోత్సవంతో భర్తతో కలిసి చిలుకలగుట్టకు చేరింది. యుద్ధంలో తల్లీ కూతుళ్లు సాధించిన విజయానికి గుర్తుగా ఆ వంశీయులు జాతర నిర్వహించారు.

ఇవీ విశేషాలు:

● మేడారం జాతరలో సమ్మక్క, సారలమ్మలకు రాతి విగ్రహాలు లేదా మట్టి ప్రతిమలు ఉండవు. దేవతల ఆవాసంగా భావించే పీఠం (గద్దె) వద్ద పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ అమ్మవార్ల ప్రాతినిధ్యాలను ఉంచుతారు. ● శతాబ్దాల చరిత్ర గల ఈ జాతరను రెండేళ్లకోసారి నిర్వహిస్తారు. వంశ పారంపర్య గిరిజనులే పూజారులు. ● ఇది దక్షిణాది కుంభమేళాగా, అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందింది. ● మేడారం జాతరకు తెలుగు వారితోపాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తారు.

వెదురుకర్రగా ఆవిర్భవించింది..: ప్రచారంలో ఉన్న ఒక కథనాన్ని అనుసరించి.. 12వ శతాబ్దంలో జగిత్యాల ప్రాంతంలోని పొలవాస అటవీ క్షేత్రానికి నాయకుడు గిరిజన తెగకు చెందిన మేడరాజుకు అడవిలో ఒక శిశువు దొరికింది. సంతానం లేని అతడు అమ్మవారి ప్రసాదంగా భావించి సమ్మక్క అని పేరు పెట్టి పెంచుకున్నాడు. ఆమెకు పగిడిద్దరాజుతో వివాహం జరిగింది. వీరి సంతానం సారలమ్మ, నాగులమ్మ, జంపన్నలు. ప్రతాపరుద్రుడు రాజ్య కాంక్షతో పొలవాస మీద దండెత్తగా.. ఆ సైన్యం ధాటికి తాళలేని గిరిజనులు మేడారానికి తరలివెళ్లారు. మామ అయిన మేడరాజుకు, పగిడిద్దరాజు ఆశ్రయం ఇచ్చాడు. అది రాజధిక్కారంగా భావించి ప్రతాపరుద్రుడు మేడారంపై మెరుపుదాడి చేశాడు. పగిడిద్దరాజు, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవిందరాజు యుద్ధంలో మరణించారు. వారి మరణాన్ని, సైనికుల పరాజయాన్ని తట్టుకోలేక జంపన్న సంపెంగ వాగులో దూకి ఆత్మార్పణ చేసుకున్నాడు. నాటి నుంచి అది 'జంపన్నవాగు'గా ప్రసిద్ధమైంది.

ఇంత జరిగినా.. సమ్మక్క, సారలమ్మలు కదనరంగం వదిలివెళ్లక ధైర్యంగా పోరాడసాగారు. వారిని నేరుగా ఎదుర్కోవడం అసాధ్యమనుకున్న శత్రువులు వెనుక నుంచి దాడిచేశారు. దాంతో సారలమ్మ వీరమరణం పొందింది. కత్తిపోట్లతో నెత్తురోడుతూ సమ్మక్క చిలకలగుట్టకు వెళ్లి.. అక్కడ అదృశ్యమైంది. అక్కడి నాగమల్లి చెట్టు కింద కుంకుమభరిణెలో తన జీవశక్తిని నిక్షిప్తం చేసి వెదురుకర్రగా ఆవిర్భవించింది.

ఇదీ విధానం..: తొలిరోజు సాయంత్రం సారలమ్మను కన్నెపల్లి గ్రామం నుంచి గద్దెమీదికి తీసుకొస్తారు. మళ్లీ జాతర పరకు ఆమె కన్నెపల్లిలో ఉండే దేవాలయంలో ఉంటుంది. అదే రోజు పగిడిద్దరాజును పూనుగొండ్ల (గుట్టపై చింతచెట్టు కింద గుడి) నుంచి గద్దె వద్దకు తీసుకొస్తారు. రెండోరోజు సాయంత్రం ప్రభుత్వ లాంఛనాలతో పూజారులు సమ్మక్కను తీసుకొచ్చేందుకు అడవిలోకి వెళ్తారు. కుంకుమ భరిణెలో సమ్మక్కను మేళతాళాలతో గద్దె వద్దకు తెచ్చి ప్రతిష్ఠ చేస్తారు. ఆ సాయంత్రం తొలి పూజ పూజారులు చేస్తారు. ఆపై ఇతరులను పూజకు అనుమతిస్తారు. మూడోరోజు సాయంత్రం వరకు జాతర సాగుతుంది. నాలుగోరోజు కార్యక్రమాన్ని 'తిరుగువారం' (దేవతల వన ప్రవేశం) అంటారు. అదే రోజున జాతర ముగిసిందని పూజారులు ప్రకటిస్తారు. అనంతరం పగిడిద్ద రాజును పూనుగుండ్లకు, సారలమ్మను కన్నెపల్లికి, సమ్మక్కను గుట్టమీద గుహలోకి సాగనంపుతారు.

బెల్లం బంగారమైంది..: జాతరలో భక్తులు బెల్లాన్ని బంగారంగా పిలుస్తూ అమ్మవార్లకు నివేదిస్తారు. దీని వెనుక ఏళ్ల చరిత్ర ఉంది. భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు. ఎడ్లబండ్ల మీద ప్రయాణించి ఇక్కడికి చేరుకుని, వారం పది రోజులు ఉండేవారు. ఆకలి వేస్తే బెల్లం పానకం లాంటివి తీసుకునేవారు. బెల్లం త్వరగా శక్తినిచ్చే ఆహారం. అలా వెంట తెచ్చుకున్న బెల్లాన్నే సమ్మక్క సారలమ్మలకు నివేదించడం ప్రారంభమైందని చెబుతారు. కాలక్రమేణా బెల్లాన్ని బంగారంగా పిలవడం మొదలైంది. సమ్మక్క సారలమ్మ గద్దెల నుంచి చిటికెడైనా బెల్లాన్ని ప్రసాదంగా తెచ్చుకుంటారు.

– కె.వి.ఎస్.ఎస్.శారద

కందస్వామి ఆలయం.. నల్లరంగు తిరునీర్ ప్రసాదం!

తమిళనాడు రాష్ట్రంలో కాళీపట్టి కందస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధమైంది. ఇది నామక్కల్, తిరుచెంగోడే వెళ్లే మార్గంలో ఉంది. మూడు శతాబ్దాల నాటి ఈ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని లక్ష్మణ గౌండర్ నిర్మింపజేశారు. ఇక్కడ ప్రసాదంగా ఇచ్చే నల్లరంగు తిరునీర్ ఈ ఆలయ ప్రత్యేకత. ఇది చెరుకు పొట్టుతో తయారవుతుంది. తిరునీర్ చేసేందుకు భక్తులు తమ పొలాల్లోని చెరుకును ఆలయానికి ఇస్తామని ఏడాది ముందే ప్రతిజ్ఞ చేస్తారు. అలా రైతులు చెరుకును కాల్చగా వచ్చే బూడిదను శుద్ధిచేసి తీసుకొస్తారు. ఈ సమయంలో వారు పూర్తి ఉపవాసం ఉంటారు. ఈ బూడిదను స్వామి చెంత ఉంచి, పూజించి పవిత్రజలం తయారుచేస్తారు. ఈ పవిత్ర జలాన్ని సేవిస్తే దీర్ఘకాలిక వ్యాధులు సైతం నయమవుతాయని, అవివాహితులు ఈ ఆలయాన్ని సందర్శించి, దీపం వెలిగిస్తే పెళ్లవుతుందని విశ్వసిస్తారు.

పళనికి వెళ్లలేని భక్తులు కందస్వామి ఆలయాన్ని దర్శించి ఆనందిస్తారు. ఆలయానికి ఎదురుగా లక్ష్మణ గౌండర్ సమాధిని కూడా భక్తులు దర్శించి నమస్కరించుకుంటారు. కందస్వామి ఆలయంలో చిత్రతేరు, వినాయక తేరు పేర్లతో ఉన్న రథాలను విశేషంగా అలంకరిస్తారు. ఇక్కడ ప్రతి మాసం మంగళవారాల్లో జరిగే దీపోత్సవం కనుల పండుగగా ఉంటుంది. ప్రతి సంవత్సరం తైపూసం పండుగను ఇక్కడ శోభాయమానంగా నిర్వహిస్తారు. ఆ రోజున ఇక్కడ జరిగే పశువుల సంత అంగరంగ వైభవంగా ఉంటుంది. దేశంలోనే అతి పెద్దదైన ఈ వేడుక ఈసారి ఫిబ్రవరి 1న జరగనుంది. అలాగ

ఈనాడు సినిమా

కుమార్తెగా కృతి ప్రియురాలిగా రాశి

ఒకరు హిందీ సినిమాలో... మరొకరు తెలుగు సినిమాలో... ఈ ఇద్దరు కథానాయికలూ అరుదైన అవకాశాల్ని సొంతం చేసుకొన్నట్టు తెలుస్తోంది. అటు బాలీవుడ్‌లోనూ, ఇటు టాలీవుడ్‌లోనూ ఈ ఇద్దరు కథానాయికలు చేయనున్న సినిమాలు చర్చనీయాంశంగా మారాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత అగ్ర కథానాయకుడు చిరంజీవి, దర్శకుడు బాబీ కలిసి మరో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. కూతురు సెంటిమెంట్ ప్రధానంగా సాగే కథతో ఈ చిత్రం రూపొందనున్నట్టు సమాచారం. ఇందులో కూతురు పాత్ర కోసం కృతిశెట్టి ఎంపిక దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈ సినిమాలోనే మలయాళ స్టార్ మమ్ముట్టి కూడా ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. దక్షిణాదితోపాటు అటు హిందీలోనూ అప్పుడప్పుడూ అవకాశాల్ని అందుకుంటున్న రాశీఖన్నాకి అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించే అవకాశం సొంతమైనట్టు సమాచారం. తెలుగులో విజయవంతమైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాని హిందీలో అక్షయ్ కుమార్ కథానాయకుడిగా రీమేక్ చేస్తున్నారు. ఇందులో భార్య పాత్రలో విద్యాబాలన్ నటిస్తుండగా, ప్రియురాలి పాత్రలో రాశీఖన్నా నటించనున్నట్టు సమాచారం. తెలుగులో మీనాక్షి చౌదరి చేసిన పాత్ర రాశి సొంతమైందన్న మాట. మొదట మీనాక్షి పేరునే పరిశీలించిన చిత్రబృందం, ఆ తర్వాత ఆ పాత్ర కోసం రాశిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.

చెప్పిన సమయానికే

విడుదల విషయంలో ఈసారి వాయిదాలేమీ ఉండవనే సంకేతాల్నిచ్చింది 'వారణాసి' బృందం. ముందు ప్రకటించినట్టుగానే 2027లోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు బుధవారం సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించింది. మహేశ్‌బాబు కథానాయకుడిగా, ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. కె.ఎల్. నారాయణ, ఎస్.ఎస్.కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రని పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా పనులు ప్రణాళిక మేరకు పక్కాగా సాగుతున్నట్టు తెలుస్తోంది. భారీ హంగులు, అత్యున్నతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందే రాజమౌళి సినిమాలు అనుకున్న సమయానికి విడుదల కావు. ఈసారి మాత్రం అలా జరగకుండా పక్కాగా 2027లో చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. భారీ బడ్జెట్‌తో అంతర్జాతీయ స్థాయిలో 'వారణాసి' చిత్రం రూపొందుతోంది.

కొన్నిసార్లు మన అనుకున్న వ్యక్తుల నుంచి వచ్చే విమర్శల్ని ఎదుర్కొవడానికి కూడా సిద్ధంగా ఉండాలని అంటోంది అందాల తార మాళవిక మోహనన్. భాషతో సంబంధం లేకుండా వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తుందీ భామ. ఇటీవలే ప్రభాస్‌తో కలిసి 'రాజాసాబ్'తో ప్రేక్షకుల్ని పలకరించిన ఈమె.. త్వరలో 'సర్దార్ 2'తో సందడి చేయడానికి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక.. చిత్రపరిశ్రమలో తన కెరీర్ తొలినాళ్లు, ఫ్యాషన్ గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

మాళవిక మోహనన్

ఒకే శైలికి పరిమితం కాను

"చిన్నప్పటి నుంచే క్రీడలలో చాలా చురుకుగా ఉండేదాన్ని. అథ్లెట్‌ని నేను. అందుకేనేమో నా శరీరం ఏ పనికైనా సులభంగా అలవాటు పడుతుంది. కొందరు కేవలం పేరు కోసమే ఏదైనా ఫ్యాషన్ లేదా ట్రెండ్‌ను అనుసరించడానికి ప్రయత్నిస్తారు. కానీ అలా చేస్తే దీర్ఘ కాలం దాన్ని కొనసాగించలేరనేది నా అభిప్రాయం. ఇక ఫ్యాషన్ విషయానికొస్తే.. ఒకే శైలికి పరిమితం కాను. ఇండియా లాంటి గొప్ప దేశంలో పెరిగినప్పుడు రకరకాల దుస్తులను చూస్తాం. నేను చిన్నప్పటి నుంచి మా అమ్మ చేనేత చీరలు కట్టుకోవడం చూస్తూ పెరిగాను. నా దృష్టిలో ఫ్యాషన్ అంటే చీరలు కట్టుకొని నుదుటిపై ఎర్రటి బొట్టు.. కళ్లకు కాటుక, పువ్వులు పెట్టుకోవడమే. మన సంస్కృతికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తా.

నా దృష్టిలో ఫ్యాషన్ అంటే అదే!

"నేను చాలా అదృష్టవంతురాల్ని. ఎందుకంటే వివిధ జానర్లు, పలు పరిశ్రమల్లోని అగ్రహీరోలు, ఉత్తమ దర్శకులతో పనిచేసే అవకాశం లభిస్తోంది. ఇటీవలే మోహన్‌లాల్‌తో కలిసి 'హృదయపూర్వం' అనే సినిమా చేశా. ఆ తర్వాత ప్రభాస్‌తో 'రాజాసాబ్'లో పనిచేయడం పూర్తిగా భిన్నమైన అనుభవం. తమిళంలో ధనుష్, రజినీకాంత్ తదితరులతో పనిచేశా. పలు భాషలు మాట్లాడతాను. ఇది నటిగా నాకు గొప్ప సమయమని భావిస్తున్నా. ఎందుకంటే ఓటీటీ, సోషల్ మీడియా పెరుగుదల కారణంగా పరిశ్రమల మధ్య సరిహద్దులు పూర్తిగా తగ్గిపోయాయి. మీరు ఎక్కడైనా సినిమా చేయవచ్చు. అది మంచి చిత్రమయితే ప్రచారం లేకపోయిన ప్రేక్షకులకు చేరుతుంది. పాన్ ఇండియా స్థాయిలో ఆడుతుంది. అందుకే ఇకపై ఒకే పరిశ్రమకు పరిమితం కావాలనుకోవట్లేదు. నాకు విభిన్న సంస్కృతులలో పనిచేయడమంటే ఆసక్తి".

వాళ్లను లెక్కచేయను

"నటీనటులుగా కెరీర్ ప్రారంభించినప్పుడు ఇక్కడ ఎదుర్కోబోయే వాటికి ముందుగానే సిద్ధంగా ఉండాలి. ఎందుకంటే ఇది బహిరంగ వృత్తి. ప్రతి ఒక్కరూ మీ రూపం నుంచి నటన, మాట్లాడడం, నడిచే విధానం వరకూ ఇలా ఏ విషయం గురించైనా మాట్లాడొచ్చని అనుకుంటారు. ఇక్కడ అందరికీ తమ అభిప్రాయాన్ని చెప్పే హక్కు ఉందని భావిస్తారు. రోజులు గడుస్తున్న కొద్దీ దీనికి అలవాటు పడి.. విమర్శలను పట్టించుకోకుండా ఉంటారు. వీటన్నింటికీ సిద్ధంగా ఉంటేనే చిత్రపరిశ్రమలో ఎదుగుతాం. కారణం లేకుండా ట్రోలింగ్ చేసే వాళ్లను కూడా లెక్కచేయను. అలాగే సినిమాలతో సంబంధం లేకుండా నాకు ఇష్టమైన పనులు.. అంటే ప్రయాణం చేయడం, ఫొటోగ్రఫీ లాంటి వాటి కోసం సమయం కేటాయిస్తాను".

వీలైనంత వైవిధ్యం

"నేను ముంబయిలో ఎక్కువగా బాలీవుడ్ సినిమాలు చూస్తూ పెరిగా. మా ఇంట్లో కూడా సినిమా వాతావరణమే ఉంటుంది. మాది మలయాళీ ఫ్యామిలీ కాబట్టి.. ఆ సినిమాలు కూడా నాకు దగ్గరే. అందుకేనేమో నటిగా వివిధ జానర్లలో నటించడాన్ని ఆస్వాదిస్తా. నేను ఎంచుకునే పాత్రలు, పనిచేసే దర్శకుల విషయంలో వీలైనంత వైవిధ్యం ఉండేలా ప్రయత్నిస్తా. అందుకే నా సినిమాలన్నీ ఒకదానికొకటి పూర్తిగా భిన్నంగా ఉంటాయి".

భయపెట్టే 'హనీ'

నవీన్‌చంద్ర

నవీన్‌చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రధారులుగా... కరుణకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'హనీ'. రవి పీట్ల, ప్రవీణ్‌కుమార్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నిజజీవిత సంఘటనల ప్రేరణతో మూఢ నమ్మకాల నేపథ్యంలో సాగే కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. బుధవారం టీజర్‌ని విడుదల చేశారు. ఒక మార్మిక ప్రపంచాన్ని ఆవిష్కరించిన అనుభూతిని పంచింది టీజర్. "ఇప్పటివరకూ వచ్చిన హారర్ చిత్రాలకి పూర్తి భిన్నంగా, డార్క్ సైకలాజికల్ అంశాలతో 'హనీ'ని తెరకెక్కిస్తున్నారు దర్శకుడు కరుణకుమార్. టీజర్‌లోని ప్రతి ఫ్రేమ్ ఏదో రహస్యం దాగుందనే భావన కలిగిస్తోంది. నవీన్‌చంద్ర లుక్, ఆయన నటనతోపాటు దివి, దివ్యపిళ్లై, రాజా రవీంద్ర పాత్రలు కూడా కొత్తగా ఉంటాయి. ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం సామాజికాంశాల్ని స్పృశిస్తూనే, ప్రేక్షకుల్ని భయపెడుతుంద"ని సినీ వర్గాలు తెలిపాయి. జయన్ని, జయశ్రీ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అజయ్ అరసాడ, ఛాయాగ్రహణం: నగేశ్ బన్నెల్, కూర్పు: మార్తాండ్ కె.వెంకటేశ్.

'ఆత్రేయపురం బ్రదర్స్' మధ్య పోటీ



సన్నీ, రాజీవ్ కనకాల, గవిరెడ్డి, వశిష్ఠ

వీళ్ల మధ్య పోటీ ఎంతో మధురంగా ఉంటుందని ఊరిస్తూ 'ఆత్రేయపురం బ్రదర్స్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు రాజేశ్ జగన్నాథం. ఆయన దర్శకత్వంలో... రాజీవ్ కనకాల, గవిరెడ్డి, సన్నీ పత్సా ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రమిది. ఏ స్వీట్ వైవల్రీ... అనేది ఉపశీర్షిక. రఘు బాబు, గీత్ సాయిని, నేహా పఠాన్, సిద్ధార్థ్ గొల్లపూడి ఇతర పాత్రధారులు. వీఎస్‌కే సంజీవ్, వంగపల్లి సందీప్, వంగపల్లి సంకీర్త్, ప్రవీణ్ గద్దె, రాజేశ్ గద్దె, రాకేశ్ గద్దె నిర్మాతలు. బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వశిష్ఠ క్లాప్‌నివ్వగా, విజయ్ కనకమేడల కెమెరా స్విచ్చాన్ చేశారు. అనుదీప్ గౌరవ దర్శకత్వం వహించారు. ప్రవీణ్ కండ్రేగుల, ఆదిత్య హాసన్ చిత్రబృందానికి స్క్రిప్ట్‌ని అందజేశారు.

ఏఆర్ రెహమాన్ ఇతరుల క్రెడిట్‌ను లాక్కునే వ్యక్తి కాదు: రామ్‌గోపాల్‌వర్మ

ఏఆర్ రెహమాన్ గొప్ప స్వరకర్త అని అన్నారు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ఆస్కార్ పురస్కారాన్ని సొంతం చేసుకున్న 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాలోని 'జయహో' పాటను స్వరపరిచింది ఏఆర్ రెహమాన్ కాదని, గాయకుడు సుఖ్వీందర్ సింగ్ అంటూ గతంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రస్తుతం రామ్‌గోపాల్ వర్మ చేసిన వ్యాఖ్యలు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాను గతంలో చేసిన ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల వేదికగా స్పందిస్తూ ఓ పోస్ట్ పెట్టారు రామ్‌గోపాల్ వర్మ. "జయహో పాట విషయంలో నా మాటలని తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. నా దృష్టిలో ఏఆర్ రెహమాన్ నేను కలిసిన వారిలోకెల్లా గొప్ప స్వరకర్త. మంచి మనిషి. ఆయన ఇతరుల క్రెడిట్‌ను లాక్కునే వ్యక్తి కాదు ఆయన. ఈ నెగిటివిటీకి ఇంతటితో ముగింపు పలకాలని ఆశిస్తున్నా" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

అప్పటి వరకూ తలదించుకొనే పనిచేస్తా!

తన పనితో ప్రభావం చూపానని భావించే రోజు వరకూ తలదించుకొని కష్టపడి పనిచేస్తూనే ఉంటానని అంటోంది యువ కథానాయిక సారా అర్జున్. బాలనటిగా పలు చిత్రాలతో ఇప్పటికే సుపరిచితమైన ఈ తార.. ఇటీవలే 'ధురంధర్'తో తొలిసారి కథానాయికగా తెరపై మెరిసింది. ఇందులో రణ్‌వీర్‌సింగ్ సరసన కనిపించి.. తన నటనకు గాను ప్రశంసలు అందుకుందీమె. ఈ జోరులోనే త్వరలో 'యుఫోరియా' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించనుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న సారా మాట్లాడుతూ.. "కెరీర్‌లో ఇంకా నేను ప్రారంభ దశలోనే ఉన్నా. అందుకే నా నటనతో ప్రేక్షకులపై ప్రభావం చూపించాలని మాత్రమే కోరుకుంటున్నా. అది ఎలా అనేది నా చేతుల్లో లేదు. నా వృత్తితోనే గుర్తింపు పొందాలనుకుంటున్నా. ఎంచుకునే ప్రతి ప్రాజెక్ట్‌లోనూ మార్పును చూడను. మనం రోజూ పరిణితి చెందుతూనే ఉంటాం. కాబట్టి మార్పు కూడా రోజూ జరుగుతూనే ఉంటుంద"ని చెప్పుకొచ్చింది.

భగ భగ మండే నిప్పులా

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ కథానాయకులుగా... అక్కి విశ్వనాథరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మైనా పీస్'. మూన్‌లైట్ డ్రీమ్స్ సంస్థ నిర్మిస్తోంది. కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేశ్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు. యాక్షన్, థ్రిల్, హాస్య ప్రధానంగా రూపొందుతున్న చిత్రమిది. బుధవారం ఇందులోని భగ భగ మండే నిప్పులా... అంటూ సాగే పాటని విడుదల చేశారు. దేశభక్తి రగిలించే ఈ పాటని కార్తీక్ స్వరపరచగా, రెహమాన్ సాహిత్యం సమకూర్చారు. కాలభైరవ ఆలపించారు. ఫిబ్రవరి నెలాఖరులో చిత్ర విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్టు స్పష్టం చేశాయి.

రోమియోతోనే ఆటలా?

"ప్రేమ అనేది మనిద్దరి మీద పడిన ఓ శాపం" అంటూ తన బాధను ప్రియుడితో చెప్పుకొని భావోద్వేగానికి గురవుతోంది త్రిప్తి దిమ్రీ. మరి ఆమె ప్రేమను శాపంలా ఎందుకు భావిస్తుందో తెలియాలంటే 'ఓ రోమియో' సినిమా చూడాల్సిందే. బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్, త్రిప్తి జంటగా నటిస్తున్న చిత్రమిది. విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం ఈ సినిమా ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. 'రోమియోతో ఆటలాడకండి.. శరీరం నుంచి ఆత్మను వేరు చేస్తాడు' అనే వ్యాఖ్యను జోడించింది. ఇందులో యాక్షన్ అవతారంలో ప్రత్యర్థులను పరుగులు పెట్టిస్తూ ఆకట్టుకుంటున్నారు షాహిద్. ఆయన ప్రియురాలిగా త్రిప్తి కనిపించనుంది. విక్రాంత్ మాస్సే, తమన్నా, దిశా పటానీ, నానా పటేకర్, అవినాశ్ తివారీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 13న థియేటర్లలోకి రానుంది.

గాయనిగా రవీనా టాండన్ కుమార్తె

'శ్రీనివాస మంగాపురం' సినిమాతో త్వరలో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించడానికి సిద్ధమవుతోంది రవీనా టాండన్ కుమార్తె, యువకథానాయిక రషా థడానీ. ఇప్పుడామె గాయనిగా మరో కొత్త పాత్రలోకి అడుగు పెట్టింది. రషా, 'ముంజ్య' ఫేమ్ అభయ్ వర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'లైకే లైకా'. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాకు సౌరభ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. "ప్రేమ.. నమ్మకం.. బాధ" అంటూ ఇటీవలే విడుదలైన పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచాయి. తాజాగా ఈ చిత్రం నుంచి 'చాప్ తిలక్' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేసింది చిత్రబృందం. ఈ గీతాన్ని రషానే స్వయంగా ఆలపించడం విశేషం. ఈ ప్రేమకథా చిత్రం ఈ వేసవిలో విడుదల కానున్నట్లు ఇటీవలే చిత్ర వర్గాలు ప్రకటించాయి. భావన తల్వార్, రాఘవ్ గుప్తా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

ట్రోల్స్ నన్ను ప్రభావితం చేయవు

– వరుణ్ ధావన్

సామాజిక మధ్యమాలలో చేసే వ్యాఖ్యలు తనను ప్రభావితం చేయవంటున్నారు బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్. ఆయన సన్నీ డేఓల్, దిల్జిత్ దోసాంజ్, అహాన్ శెట్టి నటించిన చిత్రం 'బార్డర్ 2'. ఈ సినిమా నుంచి ఇటీవల 'ఘర్ కబ్ ఆవోగే' అనే గీతం విడుదలైంది. ఈ పాటలో వరుణ్ తన నటనకుగానూ నెట్టింట ట్రోలింగ్‌కు గురవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్ర ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వరుణ్ మాట్లాడుతూ.. "ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. నాకు ఏ మాత్రం పట్టింపులేని విషయాలివి. ఇండస్ట్రీలో ఇలాంటి వాటి కోసం నేను పనిచేయట్లేదు. దేనికోసమనేది తర్వాత నా పనే చెప్తుంది. ఈ శుక్రవారం మీరు కూడా తెలుసుకుంటారు. నేను సినిమాను నమ్ముతాను. మంచి సినిమా తీశామా లేదా అన్నదే నాకు ముఖ్యం. బాక్సాఫీస్ కలెక్షన్ల గురించి నేను ఆందోళన పడను. ఈ సినిమాకు నా వంతు కష్టపడ్డాను. చిత్రీకరణ చాలా సరదాగా సాగింది. నేను ఈ పాత్ర చేయలేకపోవచ్చు అని అందరూ అనుకున్నారు. కానీ, నేను చేశాను"అని అన్నారు. టీ సిరీస్, జేపీ ఫిల్మ్స్ నిర్మించిన 'బోర్డర్ 2' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో పరమ్ వీర్, సోనమ్ బజ్వా, అన్య సింగ్ తదితరులు నటిస్తున్నారు.

బంగారం వేటకు స్వాగతం

'మాయసభ'

"మీరు ఏదైనా దాచాలనుకుంటే.. దాన్ని ప్రపంచం ముందు బయటపెట్టండి.. అప్పుడే దాన్ని ఎవరూ చూడరు. పదిసార్లు ఆ విషయం గురించి మాట్లాడినా ఎవరూ వినరు" అంటూ 'మాయసభ: ది హాల్ ఆఫ్ ఇల్యూజన్' ప్రపంచంలోకి స్వాగతం పలికారు దర్శకుడు రాహి అనిల్ బార్వే. ఆయన దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో జావేద్ జాఫేరి ప్రధాన పాత్రలో నటించారు. ఈ నెల 30న థియేటర్లలోకి రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇన్‌స్టా వేదికగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. 'బంగారం వేటకు స్వాగతం. రహస్యం.. భ్రమలతో కూడిన ఓ కొత్త ప్రపంచం ఆవిష్కృతమవుతోంద'నే వ్యాఖ్యను జోడించింది. 'నాకు తెలియకుండా నా రాజ్యంలో ఏదీ జరగదు', 'పరమేశ్వర్ ఈ థియేటర్‌లో బంగారం అంతా దాచి, అది ఎక్కడ పెట్టాడో మర్చిపోయాడని ప్రజలు అంటున్నారు" లాంటి సంభాషణలతో ఆసక్తికరంగా సాగుతోందీ ట్రైలర్. ఓ దర్శకుడి జీవితం ఆధారంగా దీన్ని తీర్చిదిద్దినట్లు ట్రైలర్‌తో స్పష్టమవుతోంది. వీణా జామ్కర్, దీపక్ దామ్లే తదితరులు కీలక పాత్రలు పోషించారు.

'పురుషన్'

మంచి భర్తగా మారాలంటే ఏడాది సమయం!

తలైవర్ 173 చిత్రానికి సుందర్.సి ని దర్శకుడిగా ప్రకటించిన తర్వాత పలు కారణాల వల్ల ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. తదుపరిగా నటుడు విశాల్‌తో కలిసి తన కొత్త చిత్రాన్ని ప్రకటించారు. ఈ సినిమా టైటిల్‌ని 'పురుషన్'గా వెల్లడిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ప్రోమోని పంచుకున్నారు. ఈ సినిమాలో తమన్నా భాటియా కథానాయికగా నటిస్తుండగా యోగిబాబు కీలకపాత్ర పోషిస్తున్నారు. "ఒక వ్యక్తి అనేక పాత్రలతో.. ఒకేసారి టీ, న్యాయం రెండింటినీ అందించేలా ఇక్కడ ఉన్నాడు!"అంటూ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. "మంచి భర్తగా మారాలంటే.. అతను ఏడాది భర్త అయి ఉండాలి" "మీ భర్త ఒక దుర్మార్గుడు.. నువ్వొక అమాయకురాలివి" అంటూ యోగిబాబు సరదా సంభాషణలతో సాగుతున్న ఈ టైటిల్ ప్రోమోలో హీరోహీరోయిన్లు భార్యభర్తల పాత్రల్లో ఆకట్టుకుంటున్నారు. యాక్షన్ కామెడీ నేపథ్యంలో ఈ సినిమాని రూపొందుతున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

(c) eenadu

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,210 కోట్లు



ఈనాడు - హైదరాబాద్

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఏకీకృత ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.8,726.8 కోట్ల ఆదాయం, రూ.1,210 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈపీఎస్ రూ.14.53గా నమోదైంది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.8,358.6 కోట్లు, నికర లాభం రూ.1,413 కోట్లుగా ఉన్నాయి. దీంతో పోలిస్తే ఈసారి ఆదాయం 4.4 శాతం పెరిగింది. నికర లాభం 14 శాతం క్షీణించింది.

బ్రాండెడ్ ఔషధాల మార్కెట్లో బలమైన వృద్ధి నమోదైనప్పటికీ, అమెరికాలో లెనాలిడోమైడ్ విక్రయాలు తగ్గడం, కొత్త లేబర్ కోడ్ నిబంధనల వల్ల ఏర్పడిన అదనపు ఖర్చుల కారణంగా నికర లాభంలో క్షీణత నమోదైనట్లు కంపెనీ పేర్కొంది.

'2025-26 మూడో త్రైమాసికంలో మా వృద్ధికి బ్రాండెడ్ వ్యాపారాల్లో కొనసాగుతున్న జోరు అనుకూలంగా నిలిచింది. విదేశీ మారక ద్రవ్య విలువలు మద్దతుగా నిలిచాయి. ఇది లెనాలిడోమైడ్ విక్రయాల తగ్గుదల ప్రభావాన్ని భర్తీ చేసింది. మా వాటాదారులకు దీర్ఘకాలిక విలువను సృష్టించేందుకు మా భవిష్యత్తు వ్యూహాలను అమలు చేయడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించాం' అని ఫలితాల సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ సహ ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ అన్నారు.

తొమ్మిది నెలల కాలంలో

ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరు మధ్య కాలంలో డాక్టర్ రెడ్డీస్ రూ.26,077 కోట్ల ఆదాయంపై రూ.4,065 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే 9 నెలల కాలంలో ఆదాయం రూ.24,047 కోట్లు, నికర లాభం రూ.4,060 కోట్లుగా ఉంది.

ప్రాంతాల వారీగా

డిసెంబరు త్రైమాసికంలో ఉత్తర అమెరికా ఆదాయాలు 12 శాతం తగ్గి, రూ.2,964 కోట్లకు పరిమితమయ్యాయి. ఐరోపా ఆదాయాల్లో 20 శాతం వృద్ధి కనిపించింది. ఇక్కడి నుంచి రూ.1,448 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. జర్మనీ, బ్రిటన్, ఇతర దేశాల్లో కొత్త ఉత్పత్తుల విడుదల దీనికి దోహదం చేసింది. మన దేశంలో అమ్మకాలు 19% వృద్ధితో రూ.1,603 కోట్లకు చేరాయి. కొత్త బ్రాండ్ల విడుదల, ఇటీవల కొనుగోలు చేసిన స్టుజెరాన్ బ్రాండ్ విక్రయాలు ఈ వృద్ధికి కారణమయ్యాయి. ఇతర వర్ధమాన దేశాల్లో 32 శాతం వృద్ధితో రూ.1,896 కోట్ల ఆదాయం లభించింది.

✦ భారత్‌లో హెపటైటిస్-ఇ నివారణకు హెవాక్సిన్ టీకాను విడుదల చేసింది. డయాబెటిస్ చికిత్సకు వాడే సెమాగ్లుటైడ్ సూదిమందుకు భారత్‌లో మార్కెటింగ్ అనుమతి లభించింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2045 నాటికి సున్నా కర్బన ఉద్గారాల స్థాయిని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ వెల్లడించింది.

విశాఖ ప్లాంటులో..

భారత్, కెనడా సహా 87 దేశాల్లో ఈ ఏడాది మొదలు పెట్టి దశల వారీగా సెమాగ్లుటైడ్ ఆవిష్కరణకు కంపెనీ రంగం సిద్ధం చేస్తోంది. భారత్‌లో తయారీ, మార్కెటింగ్‌కు సీడీఎస్‌సీఓ నుంచి అనుమతులూ లభించాయి. విశాఖపట్నంలోని ప్లాంటులో ఏటా 1.2 కోట్ల ఇంజెక్షన్ల తయారీని చేపట్టనున్నట్లు కంపెనీ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయిలీ పేర్కొన్నారు. భవిష్యత్‌లో 5 కోట్ల ఇంజెక్షన్ల తయారీకి చేర్చనున్నట్లు వివరించారు.

ముంబయికి విస్తరించిన మైహోం

బెంగళూరు, చెన్నైలోనూ ప్రాజెక్టులు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన స్థిరాస్తి సంస్థ మైహోం కన్‌స్ట్రక్షన్స్ ఇతర నగరాలకూ విస్తరణ ప్రణాళికలను చేపట్టింది. ఇందులో భాగంగా ముంబయి, బెంగళూరు, చెన్నై మార్కెట్లోకి ప్రవేశించింది. హైదరాబాద్ వెలుపల భారీ విస్తరణను అధికారికంగా ప్రకటించింది. ఇందుకోసం రూ.4,100 కోట్ల మూలధనాన్ని కేటాయించినట్లు మైహోం గ్రూప్ కన్‌స్ట్రక్షన్స్ సీఈఓ అభిషేక్ కపూర్ తెలిపారు. ఈ 3 నగరాల్లో కొత్తగా చేపట్టిన, భాగస్వామ్యం కుదుర్చుకున్న ప్రాజెక్టుల ద్వారా భారీ ఎత్తున నిర్మాణాలు చేపట్టబోతోంది. వీటి ద్వారా రూ.37,500 కోట్ల విలువైన స్థిరాస్తి సంపద(జీడీవీ) సృష్టించాలని సంస్థ భావిస్తోంది.

ఎటర్నల్ ఎండీ, సీఈఓ దీపిందర్ రాజీనామా

దిల్లీ: ఎటర్నల్ ఎండీ, సీఈఓ పదవి నుంచి దీపిందర్ గోయల్ వైదొలగనున్నారు. ఆయన రాజీనామాకు బోర్డు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం బ్లింకిట్‌కు సీఈఓగా ఉన్న అల్విందర్ సింగ్ ధిండ్సాను ఎటర్నల్‌కు సీఈఓగా నియమించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఫిబ్రవరి 1 నుంచి ధిండ్సా నియామకం అమల్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది. దీపిందర్ గోయల్‌ను ఐదేళ్ల కాలానికి బోర్డు వైస్‌ఛైర్మన్, డైరెక్టరుగా నియమించేందుకు బోర్డు సిఫారసు చేసింది. కొత్త ఆలోచనల అమలుకు, వైస్‌ఛైర్మన్ బాధ్యతల వైపు మారేందుకు ప్రస్తుత పదవి నుంచి వైదొలుగుతున్నట్లు వాటాదార్లకు రాసిన లేఖలో గోయల్ తెలిపారు.

ఇండిగోకు ఆర్థిక మోత

- రూ. 2,000 కోట్ల ప్రభావం పడొచ్చు
- విమాన సర్వీసుల రద్దు నేపథ్యం

దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో, గత నెలలో వేల సంఖ్యలో విమాన సర్వీసులను రద్దు చేయడం వల్ల చోటుచేసుకున్న పరిణామాలతో.. ఆ సంస్థపై సుమారు రూ.2,000 కోట్ల ప్రభావం పడొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇందులో చాలా వరకు నేడు వెలువడే డిసెంబరు త్రైమాసిక ఫలితాల్లో కనిపిస్తుందని, మిగతాది జనవరి- మార్చి త్రైమాసికంలో ప్రతిబింబించొచ్చని ఆ వర్గాలు అంటున్నాయి.

ఈ రూపాల్లో..

- టికెట్ల రిఫండ్
- ప్రయాణికులకు పరిహారం
- గుడ్‌విల్ గెశ్చర్స్ ఓచర్లకు
- నియంత్రణ సంస్థల జరిమానా
- బ్యాంక్ గ్యారెంటీ
- హోటల్ వసతుల ఖర్చులు
- క్యాబ్స్, బస్సుల ఏర్పాటు
- ప్రయాణికుల బ్యాగేజీల కొరియర్ డెలివరీకి కలిపి ఇండిగోపై ఇంత ప్రభావం పడొచ్చని ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి.

అత్యధికంగా దీనికే..

అత్యధిక వ్యయ భారం ఇండిగో ప్రకటించిన 'గెశ్చర్ ఆఫ్ కేర్' వల్లే పడనుంది. డిసెంబరు 3- 5 తేదీల మధ్య రద్దయిన విమాన సర్వీసులు, 3 గంటలకు మించి సర్వీస్ ఆలస్యమైన ప్రయాణికులకు ఒక్కొక్కరికి రూ.10,000 విలువైన ఓచర్లను ఇండిగో ఇవ్వనుంది. ఇందుకు సుమారు రూ.500-1000 కోట్ల శ్రేణిలో ఇండిగో ఖర్చు చేయాల్సి రావొచ్చని అంచనా.

పవేవి.. ఎంతెంత..

- భారీగా సర్వీసుల రద్దుతో విమానాశ్రయాల్లో నిరీక్షిస్తూ ఉండిపోయిన 3,00,000 మందికి పైగా ప్రయాణికులకు పౌర విమానయాన నిబంధనలకు అనుగుణంగా రూ.10,000 వరకు పరిహారాన్ని ఇండిగో చెల్లించాల్సి ఉంటుంది.
- విమాన సర్వీసుల రద్దు అయిన ప్రయాణికులకు రూ.827 కోట్లను టికెట్ రిఫండ్ కింద ఇచ్చింది. ఇది ప్రయాణికులు చెల్లించిందే అయినా, సర్వీసుల రద్దు రూపేణ సంస్థకు ఆదాయం తగ్గినట్లే.
- విమాన సర్వీసుల రద్దు ప్రభావిత ప్రయాణికుల కోసం 9,500 హోటల్ గదులను బుక్ చేయడంతో పాటు.. సుమారు 10,000 క్యాబ్‌లు, బస్సులను వారి కోసం ఏర్పాటు చేసింది.

డీజీసీఏ ఈనెల 17న ఇండిగోపై రూ.22.2 కోట్ల జరిమానా విధించింది. రూ.50 కోట్లకు బ్యాంక్ గ్యారెంటీ సమర్పించాల్సిందిగా ఆదేశించింది.

- ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ (ఎఫ్‌డీటీఎల్) నిబంధనలకు తగ్గట్లుగా అదనపు సిబ్బందిని నియమించుకోవాల్సి ఉండటంతో ఉద్యోగుల వ్యయాలూ పెరుగుతాయి.
- ఫిబ్రవరి 10 వరకు ఇండిగో విమాన సర్వీసుల్లో 10% కోత డీజీసీఏ విధించడం, డిసెంబరు తొలివారంలో వేల సంఖ్యలో సర్వీసుల రద్దు వల్ల ఇండిగోకు భారీగానే ఆదాయ నష్టం ఉంటుంది. ఈ కారణంగా 2025-26లో సంస్థ ఎబిటా మార్జిన్‌పై 290 బేసిస్ పాయింట్లు, ఆదాయంపై 6.2% ప్రభావం ఉంటుందని ఆనంద్ రాఠీ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ విశ్లేషకుడు శోభిత్ సింగాల్ అంచనా వేస్తున్నారు.

కార్యకలాపాలు సాధారణ స్థితికి: డీజీసీఏ

నిరంతర పర్యవేక్షణ, దిద్దుబాటు చర్యల వల్ల ఇండిగో కార్యకలాపాలు తిరిగి సాధారణ స్థితికి వచ్చాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా ప్రస్తుతం తగినంత మంది పైలట్లు ఇండిగో వద్ద ఉన్నారని పేర్కొంది. 'ఇండిగో సిబ్బందికి రోస్టర్ పద్ధతి అమలు, పైలట్ల లభ్యత, ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ (ఎఫ్‌డీటీఎల్) నిబంధనల పాటింపును పర్యవేక్షిస్తున్నామ'ని డీజీసీఏ తెలిపింది. 2026 ఫిబ్రవరి 10 తర్వాత తమ కార్యకలాపాల్లో అంతరాయం ఉండబోదని, విమాన సర్వీసుల రద్దు లాంటివి చోటుచేసుకోవని ఈనెల 19న జరిగిన సమీక్షా సమావేశంలో ఇండిగో హామీ ఇచ్చినట్లు డీజీసీఏ తెలిపింది. 'ఫిబ్రవరి 10 తర్వాత తమ కార్యకలాపాలకు 2,280 మంది పైలట్లు అవసరం పడొచ్చని మేం అంచనా వేయగా.. 2,400 మంది ఉన్నారని, ఫస్ట్ ఆఫీసర్స్ సంఖ్య కూడా మా అంచనా అయిన 2,050 కంటే ఎక్కువగా 2,240 మంది ఉన్నార'ని ఇండిగో తెలిపినట్లు డీజీసీఏ వివరించింది.

రోజుకు 2,100– 2,200 సర్వీసులు

డిసెంబరు 9 నుంచి ఇండిగో కార్యకలాపాలు కుదుటపడుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విమాన సర్వీసుల సంఖ్యను స్థిరంగా పెంచుకుంటూ వచ్చింది. ప్రస్తుతం రోజుకు 2,100-2,200 విమాన సర్వీసులను నడుపుతోంది. ప్రతి మూడు రోజులకు 10 లక్షల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తోంది.

- ఈనాడు వాణిజ్య విభాగం

3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

దావోస్: వచ్చే కొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ధీమా వ్యక్తం చేశారు. 2028 లేదా అంతకంటే ముందే ఇది జరిగే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థికవేత్త గీతా గోపినాథ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాల్లో జరిగిన కార్యక్రమంలో వైష్ణవ్ మాట్లాడుతూ, ప్రపంచంలో పేరుకుపోయిన రుణాలు ఏం అవుతాయనేది ప్రశ్న అని, వాటి ప్రభావం భారత్‌పై ఏ విధంగా ఉంటుందో చూడాలన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చినట్లు పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల్లో ప్రజా పెట్టుబడులు, ప్రజలు అభివృద్ధి చెందడం, తయారీ, ఆవిష్కరణలు, సరళీకరణ వంటి నాలుగు స్తంభాలపై వీటిని చేపట్టినట్లు వివరించారు. ఫలితంగా 6-8 శాతం వాస్తవిక వృద్ధి, 2-4 శాతం ద్రవ్యోల్బణం సాధ్యమైనట్లు స్పష్టం చేశారు.

✦ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవడం భారత్‌కు సవాలు కాదని, తలసరి ఆదాయాన్ని అధిక స్థాయిలకు పెంచడమే అసలు సవాలని గోపినాథ్ తెలిపారు.

హైదరాబాద్‌లో ఏఐ ఇంజినీర్లకు గిరాకీ

లింక్డ్‌ఇన్ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగ మార్కెట్లో వేగంగా వృద్ధి చెందుతున్న వాటిలో 'ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఇంజినీర్' మొదటి స్థానంలో నిలిచింది. హైదరాబాద్ ఉద్యోగ మార్కెట్‌పై ప్రముఖ సామాజిక వేదిక లింక్డ్‌ఇన్ విడుదల చేసిన 'జాబ్స్ ఆన్ ది రైజ్ 2026' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది.

✦ 2026లో దాదాపు 72 శాతం మంది వృత్తి నిపుణులు కొత్త ఉద్యోగాల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

✦ సాంకేతికత వేగంగా మారుతుండటంతో, తమ నైపుణ్యాలు సరిపోతాయా లేదా అనే ఆందోళన 38 శాతం మందిలో ఉంది. తీవ్రమైన పోటీలో ఎలా నెగ్గుకురావాలనే భయం మరో 37 శాతం మందిలో వ్యక్తమవుతోంది.

హైదరాబాద్ ఇప్పుడు కేవలం ఐటీ హబ్ మాత్రమే కాదని, పలు రంగాలు ఇక్కడకు వస్తున్నాయని లింక్డ్‌ఇన్ కెరీర్ ఎక్స్‌పర్ట్ నిరాజిత బెనర్జీ అన్నారు. ఏఐ పరిజ్ఞానాన్ని జోడించి, ప్రాజెక్టుల్లో ఫలితాలను చూపించే వారికే ఎక్కువ అవకాశాలుంటున్నాయని తెలిపారు.

లింక్డ్‌ఇన్ ప్రకారం హైదరాబాద్‌లో గిరాకీ ఉన్న ఉద్యోగాలు..

✦ ఏఐ ఇంజినీరింగ్ ✦ మార్కెటింగ్ స్ట్రాటజిస్ట్ ✦ సొల్యూషన్స్ అనలిస్ట్ ✦ వీపీ-బిజినెస్ స్ట్రాటజీ ✦ హెచ్‌ఆర్ రిప్రజెంటేటివ్ ✦ వీపీ-బిజినెస్ డెవలప్‌మెంట్ ✦ ఇంటీరియర్ డిజైన్ కన్సల్టెంట్ ✦ మెషిన్ లెర్నింగ్ రీసెర్చర్ ✦ హెడ్-సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ ✦ అడ్వర్టైజింగ్ సేల్స్ డైరెక్టర్.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
హెచ్‌పీసీఎల్	4,072.49	3,022.90	1,24,000	1,19,000
అనంత్ రాజ్	144.23	110.37	660.38	543.97
యూటీఐ ఏఎంసీ	121	151	518	420
బజాజ్ కన్జూమర్	46.37	25.31	311.38	---
దాల్మియా భారత్	128	66	3,506	---
కెనరా హెచ్‌ఎన్‌బీసీ	27.65	29.32	4,272.53	1,540
టాటా కమ్యూనికేషన్స్	365.28	235.96	6,188.97	5,798.07
ధనలక్ష్మి బ్యాంక్	23.88	19.85	456	377

ఇ-కామర్స్‌లో నకిలీ పురుగు మందు ఉత్పత్తులు!

- నిబంధనలు కఠినతరం చేయండి
- ప్రభుత్వాన్ని కోరిన పరిశ్రమ

దిల్లీ: పంటల రక్షణ కోసం ఉత్పత్తులను విక్రయించే ఇ-కామర్స్ సంస్థలకు నిబంధనలను కఠినతరం చేయాలని ప్రభుత్వాన్ని పురుగుమందుల పరిశ్రమ బుధవారం కోరింది. ప్రస్తుతం చేస్తున్న ప్రాథమిక తనిఖీలు సరిపోవని, రైతులకు నకిలీ ఉత్పత్తులు చేరకుండా నిరోధించడానికి ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరి చేయాలని సూచించింది. ఉత్పత్తుల నాణ్యత, సరఫరా వ్యవస్థలో లోపాలపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో 1968 ఇన్‌సెక్టిసైడ్స్ చట్టం కింద ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలను జారీ చేయాలని పరిశ్రమ సంఘం క్రాప్‌లైఫ్ ఇండియా పేర్కొంది. ఆన్‌లైన్ అమ్మకాలను నియంత్రించడానికి, పురుగుమందుల నిర్వహణ బిల్లు ముసాయిదాలో నిబంధనలు చేర్చాలని తెలిపింది.

'భారత్‌లో డిజిటలీకరణ పెరుగుతుండటంతో ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగం అధికమైంది. పురుగుమందులు అనేది నియంత్రిత పరిశ్రమ.. మొత్తం సరఫరా వ్యవస్థ నియంత్రణ సంస్థల నియమావళిని పాటించాలి' అని క్రాప్‌లైఫ్ ఇండియా ఛైర్మన్ అంకుర్ అగర్వాల్ స్పష్టం చేశారు. ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల్లో పంట రక్షణ ఉత్పత్తుల విక్రయాలపై జరిగిన జాతీయ సదస్సు సందర్భంగా ఆయన మాట్లాడారు.

✦ వ్యవసాయ మంత్రిత్వ శాఖలో కమిషనర్‌గా ఉన్న పీకే సింగ్ మాట్లాడుతూ, ప్రమాదకరమైన వ్యవసాయ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించేటపుడు విక్రేతల జీఎస్‌టీ పత్రాలు వంటి ప్రాథమిక తనిఖీలు సరిపోవన్నారు. బలమైన నాణ్యత హామీ, ఉత్పత్తుల ఆచూకీ తెలుసుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు.

✦ రూ.26,000 కోట్ల దేశీయ విలువైన పురుగుమందుల మార్కెట్‌లో ఆన్‌లైన్ విక్రయాల వాటా 1 శాతం కంటే తక్కువేనని, అయితే 2021లో ఆన్‌లైన్ విక్రయాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన తర్వాత ఇ-కామర్స్ సంస్థలపై ఇవి కనిపించడం పెరిగిందని అగర్వాల్ తెలిపారు.

రష్యా చమురు కొనుగోలును భారత్ ఆపేసింది

అమెరికా వాణిజ్య మంత్రి

దావోస్: రష్యా చమురును కొనుగోలు చేసే దేశాలపై 25 శాతం సుంకాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన తర్వాత ఆ దేశం నుంచి చమురు కొనుగోలును భారత్ ఆపేసిందని అమెరికా వాణిజ్య మంత్రి స్కాంట్ బెసెంట్ తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు 25 శాతంతో కలిపి మొత్తంగా భారత్‌పై 50 శాతం సుంకాలను ట్రంప్ విధించిన సంగతి తెలిసిందే. 'రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా చమునూ కొనడాన్ని భారత్ ప్రారంభించింది. అయితే ట్రంప్ ఎప్పుడైతే 25% సుంకాలను విధించారో... అప్పటి నుంచి రష్యా చమురు కొనుగోలును తగ్గించుకుంటూ వచ్చిన భారత్, ప్రస్తుతం మొత్తానికి ఆపేసిందని ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ బెసెంట్ చెప్పారు. మరోవైపు ఐరోపా కూడా రష్యా చమురును కొనుగోలు చేయడమే కాకుండా, ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా రష్యా చేస్తున్న యుద్ధానికి నిధులను కూడా అందిస్తున్నట్లు తమకు తెలుస్తోందని బెసెంట్ ఆరోపించారు.

మూడో రోజూ నష్టాలే

సెన్సెక్స్ ▼ 271 81910 | నిఫ్టీ ▼ 75 25158

82,000 దిగువకు సెన్సెక్స్

సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, బలహీన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ మదుపర్లు వరుసగా విక్రయాలకు దిగడం మార్కెట్లపై ప్రభావం చూపాయి. రూపాయి బలహీనపడటంతో ఆర్థిక, బ్యాంక్, వినియోగ షేర్లలో అమ్మకాలు తలెత్తడం కూడా సూచీల నష్టాలకు కారణమయ్యాయి. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 1 శాతం తగ్గి 64.27 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ సూచీ నష్టపోగా.. దక్షిణ కొరియా, షాంఘై, హాంకాంగ్ సూచీలు లాభపడ్డాయి. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి.

✦ బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.73 లక్షల కోట్లు తగ్గి, రూ.454.09 లక్షల కోట్ల (4.96 లక్షల కోట్ల డాలర్లకు పరిమితమైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 81,794.65 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,180.47 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 81,124.45 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సూచీ, తర్వాత లాభాల్లోకి వచ్చింది. 82,407.05 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. మళ్లీ నష్టాల్లోకి జారుకుని చివరకు 270.84 పాయింట్ల నష్టంతో 81,909.63 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 75 పాయింట్లు తగ్గి 25,157.50 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,300.95-24,919.80 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 16 నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 1.96%, ట్రెంట్ 1.78%, బీఈఎల్ 1.59%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.18%, ఎల్ అండ్ టీ 1.07%, ఎస్‌బీఐ 0.87%, మారుతీ సుజుకీ 0.71%, యాక్సిస్ బ్యాంక్ 0.68%, ఏషియన్ పెయింట్స్ 0.55% చొప్పున తగ్గాయి. ఎటర్నల్ 4.98%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.57%, ఇండిగో 1.37%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.75%, అదానీ పోర్ట్స్ 0.7%, పవర్‌గ్రిడ్ 0.57%, టెక్ మహీంద్రా 0.52% మేర లాభపడ్డాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే మన్నికైన వినిమయ వస్తువులు, పీఎస్‌యూ బ్యాంక్, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్, భారీ యంత్ర పరికరాలు, పారిశ్రామిక, ప్రైవేటు బ్యాంక్‌ల సూచీలు డీలా పడ్డాయి. బీఎస్‌ఈ కమొడిటీస్, ఇంధన, లోహ, చమురు-గ్యాస్, సేవల రంగాలు రాణించాయి. బీఎస్‌ఈలో 1,317 షేర్లు పానుకూలంగా, 2,968 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 120 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

✦ **అమేగీ మీడియా ల్యాబ్స్** స్టాక్ మార్కెట్‌లో బలహీనంగా నమోదైంది. ఇష్యూ ధర రూ.361తో పోలిస్తే 12.18 శాతం నష్టంతో రూ.317 వద్ద నమోదైంది. చివరకు కోలుకొని 3.6 శాతం నష్టంతో రూ.348 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.7,528.60 కోట్లుగా నమోదైంది.

✦ నికర లాభం 69 శాతం తగ్గడంతో, **షాపర్స్ స్టాప్** షేరు బీఎస్‌ఈలో 6.14 శాతం నష్టపోయి రూ.341.90 వద్ద ముగిసింది.

✦ ఎల్ అండ్ టీ డిజిటల్ మౌలిక సదుపాయాల విభాగమైన **ఎల్ అండ్ టీ వ్యోమా**, బుధవారం నవీ ముంబయిలోని మహాపేలో 40 మెగావాట్ల గ్రీన్, ఏఐ రెడీ డేటా సెంటర్‌కు భూమి పూజ చేసింది. నగరంలో ప్రణాళికబద్ధమైన 100 మెగావాట్ల క్యాంపస్ మొదటి దశను ఇది సూచిస్తుంది.

✦ **స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** (సిడ్బీ)కి రూ.5,000 కోట్ల ఈక్విటీ మద్దతు అందించేందుకు బుధవారం ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మరిన్ని రుణాలు పచ్చే అవకాశం పెరగనుంది.

✦ ఔషధ తయారీ సంస్థ లుపిన్ అనుబంధ సంస్థ **లుపిన్ అట్లాంటిస్ హోల్డింగ్స్ ఎస్‌ఏ (ఎల్‌ఏహెచ్ ఎస్‌ఏ)** మధుమేహం, బరువు నిర్వహణ మందుల కోసం **గాలెనికమ్ హెల్త్**తో లైసెన్స్, సరఫరా ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిపింది.

✦ మన దేశంలో తొలి స్వదేశీ వాణిజ్య భూ పరిశీలన ఉపగ్రహ కూటమిని నిర్మించడానికి బెంగళూరుకు చెందిన పిక్సెల్ నేతృత్వంలోని కన్సార్టియం **'అర్లైడ్ ఆర్బిట్స్'** బెంగళూరులోని **ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్)**తో ఒప్పందంపై సంతకం చేసింది.

✦ కొన్ని ఆహార పదార్థల ధరలు పెరగడంతో.. 2025 డిసెంబరులో వ్యవసాయ, గ్రామీణ కార్మికుల రిటెయిల్ ద్రవ్యోల్బణం నవంబరుతో పోలిస్తే వరుసగా 0.04 శాతం, 0.11 శాతం మేర స్వల్పంగా పెరిగాయి.

✦ 6 గిగాహెర్ట్జ్ బ్యాండ్‌లోని తక్కువ ఫ్రీక్వెన్సీ పరిధిలో 500 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌కు లైసెన్సింగ్ అవసరాన్ని రద్దు చేస్తూ **టెలికాం విభాగం (డాట్)** నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ చర్య దేశంలోని వై-ఫై సేవలను ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు.



సాగర్ సిమెంట్స్ ఆదాయం రూ.591 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సాగర్ సిమెంట్స్ రూ.591 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. దీనిపై రూ.64.10 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.564 కోట్లు, నికర నష్టం రూ.54.45 కోట్లుగా ఉన్నాయి. మొత్తం 9 నెలల కాలానికిగాను ఆదాయం రూ.1,863 కోట్లు, నికర నష్టం రూ.100.78 కోట్లుగా ఉన్నాయి. దాచేపల్లిలోని ఆంధ్రా సిమెంట్స్ ప్లాంటులో ఆగస్టు 2026 నాటికి సిమెంటు సామర్థ్యాన్ని ఇప్పుడున్న 2.25 మి.టన్నుల నుంచి 3 మి.టన్నులకు పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకొంది. రుతుపవనాలు దీర్ఘకాలం కొనసాగడం, పండగల నేపథ్యంలో గిరాకీ తక్కువగానే ఉన్నప్పటికీ, త్రైమాసికం చివరి నాటికి క్రమంగా మెరుగుపడిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి వివరించారు. సామర్థ్యం పెంపు, ఖర్చుల నియంత్రణపై దృష్టి సారించినట్లు తెలిపారు.

అదానీ గ్రూప్ రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు

దావోస్: మహారాష్ట్రలో దీర్ఘకాలంలో 66 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.6 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సమావేశాల్లో అదానీ గ్రూప్ ప్రకటించింది. ఆ రాష్ట్ర మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధి వ్యూహంలో భాగంగా ఈ పెట్టుబడులు ఉంటాయని సంకేతాలిచ్చింది. విమానయానం, శుద్ధ ఇంధనం, పట్టణ పునరాభివృద్ధి, డిజిటల్ మౌలిక సదుపాయాలు, అధునాతన తయారీ వంటి రంగాల్లో ఈ పెట్టుబడులు ఉండనున్నాయి.

ఈనాడు బిజినెస్

బ్యాంక్ ఆఫ్ ఇండియా లాభం రూ.2,705 కోట్లు

**ది

ప్రాక్టీస్ బిట్స్

1. భారతదేశంలో రబీకాలంలో గోధుమ దిగుబడి తగ్గే అవకాశమున్న ప్రధాన వాతావరణ సమస్య?
1) ఆమ్ల వర్షాలు 2) అతివృష్టి
3) గ్లోబల్ వార్మింగ్ 4) 1, 3
2. స్టోన్ లెప్రసీకి కారణమయ్యే ప్రధానమైన వాయువు ఏది?
1) నైట్రస్ ఆక్సైడ్ 2) కార్బన్ డయాక్సైడ్

బయాలజీ

3) సల్ఫర్ డయాక్సైడ్ 4) కార్బన్ మోనాక్సైడ్
3. ప్రపంచ ఓజోన్ దినోత్సవం?
1) సెప్టెంబరు 16 2) నవంబరు 16
3) మార్చి 16 4) డిసెంబరు 16
4. క్షీరదాల మలంలో ఉండే శుద్ధ జలనాణ్యత సూచికగా దేన్ని పేర్కొంటారు?
1) బ్యాక్టీరియా 2) శిలీంధ్రం
3) ప్రోటోజోవా 4) వైరస్
5. చమురు శుద్ధి కర్మాగారాల నుంచి వచ్చే విషపూరిత రసాయనాల గుర్తింపునకు కారణమయ్యేది?
1) ఆర్సినిక్ 2) సీసం
3) ఫ్లోరైడ్ 4) వైవన్నీ
6. వాహనాల్లో వాడే ఇంధనాలు సరిగ్గా మండించకపోవడం వల్ల విడుదలయ్యే విషపూరిత వాయువు?
1) సల్ఫర్ డయాక్సైడ్
2) కార్బన్ డయాక్సైడ్
3) నైట్రస్ ఆక్సైడ్
4) కార్బన్ మోనాక్సైడ్

సమాధానాలు
1-3; 2-3; 3-1; 4-1; 5-4; 6-4.

దరఖాస్తు చేశారా?
డీఆర్‌డీవో - డీఆర్‌డీఎల్ హైదరాబాద్‌లో ఐటీఐ అప్రెంటీస్ ఖాళీలు
చివరి తేదీ: 29.01.2026
సమీర్‌లో 147 ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉద్యోగాలు
చివరి తేదీ: 25.01.2026

సమాఖ్య వ్యవస్థలో విశిష్ట సమన్వయ కర్త!

పరిపాలనాపరమైన సమాఖ్యగా ఉన్న దేశంలో జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం తమ పరిధిలో పరిపాలన కొనసాగిస్తాయి. కేంద్ర ప్రతినిధిగా, రాష్ట్రంలో రాజ్యాంగపరమైన అధిపతిగా గవర్నర్ ప్రధాన భూమిక పోషిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనాపరమైన ఆదేశాలు, నియామకాలన్నీ గవర్నర్ పేరు మీదే జరుగుతాయి. సమాఖ్య వ్యవస్థలో కీలకంగా, కేంద్ర-రాష్ట్రాల మధ్య సమన్వయకర్తగా ఉండే గవర్నర్ పదవికి ఉన్న విశిష్టత, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక రక్షణలు, విధులు, అధికారాల గురించి పోటీ పరీక్షార్థులకు సమగ్ర పరిజ్ఞానం ఉండాలి. గవర్నర్ నియామకం నుంచి అధికార పరిధి వరకు రాజ్యాంగంలో ఉన్న నిబంధనలు, సంబంధిత సుప్రీంకోర్టు తీర్పులు, దేశంలో రాజకీయ మార్పులకు అనుగుణంగా గవర్నర్ వ్యవస్థపై చర్చకు తావిచ్చిన సందర్భాలనూ తెలుసుకోవాలి.



గవర్నర్

రాజ్యాంగ నిర్మాతలు గవర్నర్ వ్యవస్థను 'భారత ప్రభుత్వ చట్టం, 1935' నుంచి గ్రహించారు. గవర్నర్‌ను రాష్ట్రపతి నియమించే విధానాన్ని 'కెనడా' రాజ్యాంగం నుంచి తీసుకున్నారు. రాజ్యాంగంలో VI వ భాగంలో ఆర్టికల్ 153 నుంచి 167 మధ్య రాష్ట్ర కార్యనిర్వాహక వ్యవస్థ గురించి ఉంటుంది. రాష్ట్ర కార్యనిర్వాహక వ్యవస్థలో గవర్నర్, ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర మంత్రి మండలి, అడ్వకేట్ జనరల్ అంతర్భాగం.

ఆర్టికల్ 153: ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నర్ ఉంటారు. 7వ రాజ్యాంగ సవరణ చట్టం, 1956 ప్రకారం రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు ఒకే వ్యక్తి గవర్నర్‌గా వ్యవహరించవచ్చు.

ఆర్టికల్ 154: గవర్నర్ రాష్ట్రాధినేత, రాష్ట్ర ప్రథమ పౌరుడు. రాష్ట్ర ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా వ్యవహరిస్తారు. రాజ్యాంగం ద్వారా తనకు సంక్రమించిన అధికారాలను గవర్నర్ స్వయంగా లేదా తన కిందిస్థాయి అధికారుల ద్వారా నిర్వహిస్తారు.

ఆర్టికల్ 155: గవర్నర్ నియామకం విషయంలో రాజ్యాంగ నిర్మాతలు కెనడా రాజ్యాంగ నమూనాను అనుసరించారు. దీని ప్రకారం ప్రధాని నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ సిఫార్సుల మేరకు గవర్నర్‌ను రాష్ట్రపతి నియమిస్తారు.

రాజ్యాంగ సభలో చర్చ: ముసాయిదా రాజ్యాంగంపై చర్చ సందర్భంలో గవర్నర్‌ను నియమించాలా? లేదా ఎన్నుకోవాలా? అనే అంశంపై విస్తృత చర్చ జరిగింది. గవర్నర్‌ను ఓటర్లే ప్రత్యక్షంగా ఎన్నుకోవాలని రాజ్యాంగ సభ సలహాదారుడైన బెనగళ నరసింగరావు ప్రతిపాదించారు. అయితే రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడైన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గవర్నర్‌ను నియమించే పద్ధతినే బలపరచి, దానినే కొనసాగించాలని పేర్కొనడంతో రాజ్యాంగ సభ గవర్నర్‌ను నియమించే పద్ధతికి ఆమోదం తెలిపింది.


బి.ఆర్.అంబేడ్కర్

జనరల్ స్టడీస్ ఇండియన్ పాలిటీ

గవర్నర్ వ్యవస్థ - సర్కారియా కమిషన్ సిఫార్సులు

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గవర్నర్‌లను నియమించే సందర్భంలో కొన్ని సూచనలను అనుసరించాలని రంజిత్ సింగ్ సర్కారియా కమిషన్ సిఫార్సు చేసింది. ❖ విశిష్ట వ్యక్తిత్వం, ఏదైనా రంగంలో ప్రావీణ్యం ఉన్న వారిని గవర్నర్‌గా నియమించాలి. ❖ ఒక వ్యక్తిని తన సొంత రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించకూడదు. ❖ మైనారిటీ వర్గాలకు చెందిన వ్యక్తులను గవర్నర్‌గా నియమించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. ❖ క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నవారిని గవర్నర్‌గా నియమించకూడదు. ❖ గవర్నర్‌ను నియమించే ముందు సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించాలి. ❖ వివాదాస్పదం కాని వ్యక్తులను మాత్రమే గవర్నర్‌గా నియమించాలి.

రంజిత్ సింగ్ సర్కారియా

ఆర్టికల్ 156: గవర్నర్ పదవీకాలం ఐదేళ్లు. కానీ రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకే గవర్నర్ పదవిలో కొనసాగుతారు. రాష్ట్రపతి ఎప్పుడైనా గవర్నర్‌ను పదవి నుంచి తొలగించవచ్చు లేదా వేరే రాష్ట్రానికి బదిలీ చేయవచ్చు. పదవీకాలం ముగియక ముందే గవర్నర్ రాజీనామాను రాష్ట్రపతికి సమర్పించవచ్చు. గవర్నర్ పదవికి ఆకస్మికంగా ఖాళీ ఏర్పడితే సంబంధిత రాష్ట్రహైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తాత్కాలిక గవర్నర్‌గా వ్యవహరిస్తారు. ❖ కేంద్రంలో ప్రభుత్వం మారినప్పుడల్లా గవర్నర్లను మారుస్తూ వారిని రాజకీయ పావులుగా ఉపయోగించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ❖ 1989లో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం 17 రాష్ట్రాల గవర్నర్లను పదవుల నుంచి తొలగించింది. ❖ 1991లో పి.వి.నరసింహారావు ప్రభుత్వం 14 రాష్ట్రాల గవర్నర్లను తొలగించింది. ❖ 1998లో అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వం 13 రాష్ట్రాల గవర్నర్లను తొలగించింది. ❖ 2004లో డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వం 12 రాష్ట్రాల్లో ఉన్న గవర్నర్లను తప్పించింది.

విశ్వనాథ్ ప్రతాప్ సింగ్

గవర్నర్ పదవి - సుప్రీంకోర్టు తీర్పులు

బీపీ.సింఘాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు: కేంద్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతి సందర్భంలోనూ గవర్నర్లను మార్చకూడదని సుప్రీంకోర్టు పేర్కొంది. సరైన కారణాలు చూపకుండా పదవి నుంచి తప్పించకూడదని తీర్పు ఇచ్చింది.

రఘుకుల తిలక్ వర్సెస్ హర్‌గోవింద్ కేసు: 'గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కారు. కేంద్ర ప్రభుత్వం గవర్నర్ ఉద్యోగాలను ఇచ్చే సంస్థ కాదు. గవర్నర్లు రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర అధిపతులు' అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

సూర్యనారాయణ్ చౌదరి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు: గవర్నర్‌ను తొలగించడానికి సంబంధించిన నియమ నిబంధనలను రాజ్యాంగంలో పేర్కొనలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం తన విచక్షణ మేరకు రాష్ట్రపతి ద్వారా గవర్నర్‌ను పదవి నుంచి తొలగిస్తోంది. రాష్ట్రపతి అభీష్ట సూత్రాన్ని న్యాయస్థానంలో సవాలు చేయడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొంది.

జీతభత్యాలు రాజ్యాంగంలోని 2వ షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా గవర్నర్‌కు జీతభత్యాలు చెల్లిస్తారు. గవర్నర్ జీతభత్యాలు, ఇతర సౌకర్యాలను పార్లమెంటు చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. ప్రస్తుతం గవర్నర్‌కు నెలకు రూ.3,50,000/- వేతనం రాష్ట్ర సంఘటిత నిధి నుంచి అందుతుంది. ◆ ఒక వ్యక్తి రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరిస్తే అతడి జీతభత్యాలను సంబంధిత రాష్ట్రాలు చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్రాలు ఏ నిష్పత్తిలో చెల్లించాలో రాష్ట్రపతి నిర్ణయిస్తారు.
గవర్నర్ నివాసం: లోక్‌భవన్ (గతంలో రాజ్‌భవన్)

ఆర్టికల్ 157: గవర్నర్‌గా నియమితులయ్యే వ్యక్తికి కొన్ని నిర్దిష్ట అర్హతలు ఉండాలి. ◆ భారతీయ పౌరుడై ఉండాలి. ◆ 35 సంవత్సరాలు నిండి ఉండాలి. ◆ దివాళాకోరై ఉండకూడదు.

ఆర్టికల్ 158: గవర్నర్ జీతభత్యాలు, నివాసం, షరతుల గురించి వివరిస్తుంది.
షరతులు: ◆ పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలో సభ్యుడై ఉండకూడదు. ఒక వేళ చట్టసభలో సభ్యత్వం ఉంటే గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తేదీ నుంచి చట్టసభలో సభ్యత్వాన్ని కోల్పోతారు. ◆ ఎలాంటి లాభదాయక పదవి నిర్వహించకూడదు.

ఆర్టికల్ 159: గవర్నర్‌గా నియమితులైన వ్యక్తి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో 'రాజ్యాంగాన్ని, చట్టాన్ని గౌరవించి పరిరక్షిస్తాను. రాజ్యాంగ విలువలకు లోబడి నా విధులను నిర్వహిస్తాను. ఎలాంటి రాగ ద్వేషాలకు లోనుకాకుండా నా పదవీ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తాను' అని ప్రమాణస్వీకారం చేస్తారు.

రచయిత: బంగారు సత్యనారాయణ

TENTH Social Studies — Power Sharing

1. **What are the different forms of power sharing in modern democracies? Give an example of each of these.**

A: i) Horizontal power sharing - Power shared among different organs of government. **8 Marks**
e.g.: Legislature-Executive-Judiciary in India.
ii) Vertical power sharing - Power shared among central, state, and local governments.
e.g.: Union-State-Panchayat.
iii) Community power sharing - Power shared among different social or religious groups.
e.g.: Belgium giving equal seats to Dutch and French groups.
iv) Political party power sharing - Power shared among different political parties.
e.g.: Coalition government.

2. **State one prudential reason and one moral reason for power sharing with an example from the Indian context.**

A: **i) Prudential reason:** Power sharing reduces conflict and keeps the country united. **e.g.:** In India power shared between centre and states according to Constitution. It reduces conflicts.
ii) Moral reason: Power sharing respects different groups and treats everyone fairly.
e.g.: India giving minorities equal rights.
iii) It avoids domination of one group.
iv) It builds trust among communities.
v) It gives voice to all people.
vi) It protects weaker groups.
vii) It creates peace in society.
viii) It supports democracy.

Final Exams-2026 IMPORTANT Q&A

3. **Evaluate the power sharing system in India.**

A: i) India shares power between central, state, and local bodies.
ii) India gives independent powers to courts.
iii) India protects minority rights.
iv) India has free and fair elections.
v) India allows many political parties.
vi) India practices secularism, no priority for any religion.
vii) India avoids concentration of power.
viii) India maintains unity in diversity.

For more IMP Q & A

Writer: KSV Krishna Reddy

భవిష్యత్తు యుద్ధాలకు భైరవ్ సిద్ధం!

భవిష్యత్తు యుద్ధరీతులకు తగినట్లుగా భారత్ అత్యాధునిక డ్రోన్‌లను నడిపే లక్ష మంది సాంకేతిక నిపుణులతో ప్రత్యేక దళాన్ని సిద్ధం చేసింది. ప్రఖ్యాత సోమనాథ్ ఆలయంపై వెయ్యేళ్ల క్రితం గజనీ దండయాత్రకు ఎదురు నిలిచిన యోధుల స్మారకంగా శౌర్య యాత్ర సాగింది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మార్షల్స్ ఆర్ట్స్‌లో ఉన్న ప్రావీణ్యానికి గుర్తింపుగా విశిష్ట పురస్కారం దక్కింది. ఆపదలో ఉన్న మహిళలు, పిల్లలకు వేగంగా సాయం అందించే ప్రత్యేక బృందాలతో కూడిన 'అక్కా పడే' కార్యక్రమాన్ని కర్ణాటక ప్రారంభించింది. భగవాన్ స్వామినారాయణగా ప్రసిద్ధి చెందిన పద్దెనిమిదో శతాబ్దపు ఆధ్యాత్మిక గురువు నీలకంఠ వర్ణి కాంస్య విగ్రహాన్ని దక్షిణాఫ్రికాలో ఆవిష్కరించారు. అస్సాం నుంచి అడవి గేదెలు, మధ్యప్రదేశ్ నుంచి మొసళ్లను పరస్పరం మార్చుకునేలా ఆ రెండు రాష్ట్రాలు ఒప్పందం చేసుకున్నాయి. పోటీ పరీక్షల కోణంలో ప్రాధాన్యం ఉన్న ఇలాంటి స్థానిక, జాతీయ, అంతర్జాతీయ అంశాలను, వర్తమాన సంఘటనలను అభ్యర్థులు తెలుసుకోవాలి. ఇటీవల వార్తల్లో నిలిచిన వ్యక్తులు, పరిణామాలు, ప్రకటనలు, నివేదికలు, వివిధ క్రీడాటోర్నీల విజేతలు, విదేశీ వ్యవహారాల్లోని విశేషాలనూ గుర్తుంచుకోవాలి.

మాదిరి ప్రశ్నలు

1. ఆస్ట్రేలియాకు చెందిన 'న్యూ సౌత్ వేల్స్ సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం పొందిన భారత సంతతికి చెందిన గణిత శాస్త్రవేత్త ఎవరు?
1) కీర్తి చరణ్ 2) అరుణ్ జోషి
3) నళినీ జోషి 4) గౌతమి జోషి


నళినీ జోషి

నోట్: ఈ అవార్డుకు ఎంపికైన తొలి గణిత శాస్త్రవేత్త నళినీ జోషి.

2. టాటా స్టీల్ బ్లిట్జ్ చెస్-2026కు సంబంధించి సరైంది?
ఎ) అమెరికాకు చెందిన వెస్లీసో ఈ టైటిల్ విజేతగా నిలిచాడు.
బి) మహిళల విభాగంలో విజేత అమెరికాకు చెందిన కరిస్సాయిప్.
సి) అర్జున్ ఇరిగేశి కాంస్య పతకం సాధించాడు.
డి) మహిళల విభాగంలో వంతిక అగర్వాల్ రజతం సాధించింది.
1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, సి, డి
3. టాటాస్టీల్ ర్యాపిడ్ చెస్ టోర్నీలో రెండోసారి ఛాంపియన్‌గా నిలిచింది ఎవరు?
1) అర్జున్ ఇరిగేశి 2) నిహాల్ సరీన్
3) డి. గుకేష్ 4) విదిత్ గుజరాతి
4. ఇటీవల భారత్ పర్యటనకు వచ్చిన జర్మనీ ఛాన్సెలర్ ఎవరు?
1) జాన్ వాడేపల్ 2) అలెగ్జాండర్ డోబ్రిన్ట్
3) లార్స్ క్లింగ్‌బిల్ 4) ఫెడ్రిక్ మెర్జ్
5. 'లెప్టో బ్రాచియం జాతి' కప్పలను ఇటీవల దిల్లీ విశ్వవిద్యాలయం, హార్వర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఏ రాష్ట్రంలో కనుక్కున్నారు?

1) మిజోరాం
2) అరుణాచల్ ప్రదేశ్
3) అస్సాం 4) మణిపుర్

నోట్: ★ ఈ జాతికి చెందిన కప్పలు 39 ఉండగా, వాటిలో భారత్‌లో 4 ఉన్నాయి.
★ సన్నగా కాగితంలా ఉండే ఫ్లీటెడ్ ఇంక్‌క్యాప్ పుట్టగొడుగులను అరుణాచల్ ప్రదేశ్‌లో మొదటిసారిగా గుర్తించారు.

6. **Akka pade** అనే మహిళల రక్షణ కార్యక్రమం ప్రారంభించిన రాష్ట్రం?
1) రాజస్థాన్ 2) కర్ణాటక
3) గుజరాత్ 4) మణిపుర్
7. కింది వాటిలో సరైంది?
ఎ) భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కొత్త మస్కట్‌కు ఉదయ్ అనే పేరు పెట్టారు.
బి) ఈ మస్కట్‌ను కేరళలోని త్రిసూర్‌కు చెందిన అరుణ్ గోకుల్ రూపొందించారు.
సి) ఈ పేరును మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన రియాజైన్ పెట్టారు.
డి) యూఐడీఏఐ ఛైర్మన్ నీల్‌కాంత్ మిశ్రా.
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) బి, సి 4) ఎ, బి, సి, డి
8. ఇటీవల మరణించిన మాధవ్ గాడ్గిల్ ప్రముఖ ..? (2026, జనవరి 8న మరణించారు)
1) వ్యవసాయ శాస్త్రవేత్త 2) పర్యావరణవేత్త
3) రాజకీయ నాయకుడు 4) గాయకుడు

నోట్: ★ పశ్చిమ కనుమల పరిరక్షణకు కృషి చేశారు.
★ 1981లో పద్మశ్రీ అందుకున్నారు.
★ 2006లో పద్మభూషణ్ వచ్చింది.
★ యూఎన్ఓ ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డు 2024 అందుకున్నారు.

9. 18వ శతాబ్దపు యోగి, ఆధ్యాత్మిక గురువు నీలకంఠ వర్ణి 42 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఇటీవల ఏ దేశంలో ప్రతిష్ఠించారు?



1) కెనడా 2) అమెరికా
3) దక్షిణాఫ్రికా 4) జర్మనీ
10. భారత్, ఏ దేశం మధ్య పోస్టల్, ఎక్స్‌ప్రెస్, లాజిస్టిక్స్ సేవలకు సంబంధించి ఒప్పందం జరిగింది?
1) జపాన్ 2) జర్మనీ 3) కెనడా 4) అమెరికా
11. భారతదేశం, ఇటలీ మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి కృషి చేసిన ఎవరికి ఇటలీ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన నైట్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఇటలీ' వచ్చింది?
1) నళినీ జోషి
2) వివేక్ చంద్ సెహగల్
3) అరవింద్ రాయ్
4) శ్రీనివాస్ డెంపో
12. 'హిస్టరీ దట్ ఇండియా ఇగ్నోర్డ్' పుస్తక రచయిత?
1) ప్రేమ్ ప్రకాశ్ 2) సంతోష్ కుమార్
3) రాధాకృష్ణ మాథుర్
4) అరుణ్‌లాల్
13. 2026, జనవరి 12 యూత్ డే థీమ్?
1) ఇగ్నైట్ ద సెల్ఫ్, ఇంపాక్ట్ ద వరల్డ్
2) యూత్ ఫర్ ఎ సస్టైనబుల్ ఫ్యూచర్
3) వికసిత్ యువ - వికసిత్ భారత్
4) ఇంటర్‌జనరేషనల్ సాలిడరిటీ క్రియేటింగ్ ఎ వరల్డ్ ఫర్ ఆల్ ఏజెస్
14. ఇటీవల ఏ రాష్ట్రాల మధ్య వన్యప్రాణుల మార్పిడి ఒప్పందం జరిగింది?
1) మణిపుర్ - రాజస్థాన్ 2) రాజస్థాన్ - అస్సాం
3) అస్సాం - మధ్యప్రదేశ్ 4) కేరళ - అస్సాం

నోట్: ★ అస్సాం 50 అడవి గేదెలు, రెండు ఖడ్గమృగాలు, 3 కింగ్ కోబ్రాలను మధ్యప్రదేశ్‌కు ఇస్తుంది.
★ మధ్యప్రదేశ్ 2 పులులు, 6 మొసళ్లను అస్సాంకు ఇస్తుంది.

15. ఇటీవల భారత ప్రభుత్వం 2026 చివరి నాటికి బాల్యవివాహాల రేటును ఎంత శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది?
1) 5% 2) 4% 3) 10% 4) 1%

నోట్: 2030 నాటికి బాల్యవివాహ రహిత భారత్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది.

16. వ్యవసాయ వ్యర్థాలైన వరిగడ్డి మొదలైనవాటిని ఉపయోగించి పర్యావరణ అనుకూల రోడ్లు నిర్మించే బయో-బిట్యుమెన్ వాణిజ్య ఉత్పత్తిలో ప్రపంచంలోనే మొదటి దేశంగా గుర్తింపు పొందింది?
1) కెనడా 2) ఇండియా 3) రష్యా 4) అమెరికా
17. భారతదేశంలో దృష్టి లోపం ఉన్నవారి కోసం ప్రత్యేకంగా మొదటి రాష్ట్ర స్థాయి బ్రెయిలీ లైబ్రరీ 2026, జనవరి 4న ఎక్కడ ప్రారంభించారు?
1) హైదరాబాద్ 2) ముంబయి
3) దిల్లీ 4) లఖ్‌నవూ

నోట్: ★ ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో డాక్టర్ శకుంతల మిశ్రా జాతీయ పునరావాస విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశారు.
★ సమ్మిళిత విద్య కోసం, 4000 కంటే ఎక్కువ బ్రెయిలీ పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి.

కరెంట్ అఫైర్స్

18. 'ఫిఫ్ట్ డాన్' పురస్కారంతో సోగొబుడో కన్‌రికై సంస్థ ఇటీవల ఎవరిని గౌరవించింది?
1) రామ్‌చరణ్ 2) జూనియర్ ఎన్టీఆర్
3) పవన్ కల్యాణ్ 4) చిరంజీవి

నోట్: ★ గోల్డెన్ డ్రాగన్ సంస్థ పవన్ కల్యాణ్‌కు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే విశిష్ట బిరుదును కూడా అందించింది.

19. డేమ్ హుడ్ అవార్డు పచ్చిన బ్రిటిష్ ఇండియన్ నటి ఎవరు?
1) దేవ్ పటేల్ 2) రిజ్ అహ్మద్
3) సంజీవ్ భాస్కర్ 4) మీరా సియాల్
20. అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డ్ ఛైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు?
1) ఎ.కె. బాలసుబ్రహ్మణియన్
2) ఎం. రఘునాథన్
3) కె. అరవింద్ కిరణ్ 4) ఆర్. మధుసూదన్‌రావు
21. కిందివాటిలో సరైంది?

ఎ) సోమనాథ్ ఆలయంపై గజనీ మహమ్మద్ దండయాత్ర చేసి 2026, జనవరి నాటికి 1000 ఏళ్లు పూర్తయ్యాయి.
బి) సోమనాథ్ ఆలయం రాజస్థాన్‌లో ఉంది.
బి) 2026, జనవరి 11న సోమనాథ్ ఆలయాన్ని కాపాడుకుంటూ ప్రాణాలు అర్పించిన అసంఖ్యాక యోధులను గౌరవించేందుకు నిర్వహించే ఉత్సవ ఊరేగింపు శౌర్యయాత్రలో మోదీ పాల్గొన్నారు.
డి) 1026లో గజనీ మహమ్మద్ సోమనాథ్ ఆలయంపై దండయాత్ర చేశాడు.
1) ఎ, సి, డి 2) ఎ, బి, సి, డి
3) బి, సి, డి 4) ఎ, బి, డి

నోట్: సోమనాథ్ ఆలయం గుజరాత్ రాష్ట్రంలో ఉంది.

22. భారత ఆర్మీ ఏ పేరుతో లక్ష మంది డ్రోన్ సైనికులతో ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసింది?
1) గౌర 2) శౌర 3) భైరవ్ 4) కిశాన్
23. ఇటీవల జీఐ ట్యాగ్ పొందిన నాగౌరి అశ్వగంధ అనే ఉత్పత్తి ఏ రాష్ట్రానికి చెందింది?

1) గుజరాత్
2) రాజస్థాన్
3) హరియాణా
4) కేరళ

నోట్: నాగౌరి అశ్వగంధ అనేది నాగౌర్ ప్రాంతంలో పెరిగిన అధిక - నాణ్యత, శక్తిమంతమైన వేర్లున్న ఔషధ మూలిక.

24. భారత ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యం, ఎన్నికల నిర్వహణపై జనవరి 21, 22, 23లలో అంతర్జాతీయ సదస్సు ఎక్కడ నిర్వహిస్తోంది?
1) ముంబయి 2) చెన్నై
3) దిల్లీ 4) హైదరాబాద్
25. ప్రపంచంలోనే అతిపెద్ద, దాదాపు పూర్తిగా విద్యుదీకరించిన రైల్వే నెట్‌వర్క్ ఉన్న దేశం?
1) ఇండియా 2) జర్మనీ
3) కెనడా 4) స్పెయిన్

నోట్: 2025 చివరి నాటికి బ్రాడ్‌గేజ్ వ్యవస్థలో 99.2% విద్యుదీకరించింది.

26. 2013-2014 ఆర్థిక సంవత్సరంలో 95.79 లక్షల టన్నులున్న చేపల ఉత్పత్తి 2024-25కు ఎన్ని లక్షల టన్నులకు చేరింది?
1) 189.68 2) 197.75
3) 160.48 4) 132.68
27. జాతీయ దర్యాప్తు సంస్థ డైరెక్టర్ జనరల్‌గా ఎవరు నియమితులయ్యారు?
1) రాకేశ్ అగర్వాల్ 2) కమల్ అగర్వాల్
3) భరత్ ప్రవీణ్ 4) శేఖర్ కమల్
28. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని ఏ టైగర్ రిజర్వ్ పేరును డాక్టర్ విష్ణు శ్రీధర్ వాకంకర్ (ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త) గా పెట్టారు?
1) మాధవ్ 2) వీరాంగన దుర్గావతి
3) రతపాణి 4) కన్హ

నోట్: బీం బెట్కా రాక్ షెల్టర్లను కనుక్కున్న ప్రఖ్యాత పురాతన శాస్త్రవేత్త డాక్టర్ విష్ణు శ్రీధర్ వాకంకర్

రచయిత: జి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు
1-3; 2-2; 3-2; 4-4; 5-2; 6-2; 7-4; 8-2; 9-3; 10-2; 11-4; 12-1; 13-1; 14-3; 15-3; 16-2; 17-4; 18-3; 19-4; 20-1; 21-1; 22-3; 23-2; 24-3; 25-1; 26-2; 27-1; 28-3.

(c) eenadu

ఈనాడు ప్రతిభ
e-mail: support@epratibha.net
17
గురువారం జనవరి 22, 2026

పర్యావరణానికి కలిగే నష్టం కారణంగా ప్రాణులు సహా ప్రకృతి వనరుల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. వాతావరణ మార్పులు, జీవవైవిధ్య నష్టం, భూగర్భ జలాలు తగ్గిపోవడం, అధిక ఉష్ణోగ్రతలు మొదలైనవన్నీ ఇందులో భాగమే. మనిషి భౌతిక అవసరాలు తీరుస్తూ ప్రగతికి కారణమవుతోన్న వనరుల అతి వినియోగం కారణంగా అవి త్వరగా క్షీణించడంతోపాటు వాతావరణం కలుషితమవుతోంది. మానవ కార్యకలాపాలే దీనికి మూలంగా ఉన్నాయి. ప్రాణుల మనుగడకు ముప్పుగా పరిణమించిన పర్యావరణ క్షీణతను అరికట్టేందుకు ప్రపంచ దేశాలు ఏకమై వివిధ పరిష్కార మార్గాలు సూచించాయి. మన దేశంలోనూ ప్రభుత్వాలు పర్యావరణ అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు చేపట్టాయి. వీటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.



సమగ్ర వ్యూహంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం!

భారత ఆర్థిక సమస్యలు - పర్యావరణ క్షీణత పరిష్కార చర్యలు

సహస్రాభివృద్ధి లక్ష్యాలు *(Millennium Development Goals)*

తీవ్ర పేదరికం నుంచి ప్రజలకు విముక్తి కల్పించే లక్ష్యంతో 2000, సెప్టెంబరులో ప్రపంచంలోని 189 దేశాలు ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో మిలీనియం డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపాయి. ఇందులో 2015 నాటికి 8 సహస్రాబ్ది లక్ష్యాలను సాధించాలని నిర్దేశించాయి. ఈ ఒప్పందంపై భారత్ కూడా సంతకం చేసింది. ఈ లక్ష్యాల్లో ఏడోది 'పర్యావరణ సుస్థిరతను సాధించడం'.

లక్ష్యాలు: సుస్థిరాభివృద్ధి సూత్రాలను దేశ విధానాలు, కార్యక్రమాలతో సమ్మిళితం చేయడం.

- సురక్షితమైన తాగునీరు, పారిశుద్ధ్యం పొందలేని జనాభా వాటాను 2015 నాటికి సగానికి తగ్గించడం.
- 1990లో రక్షిత తాగునీటిని పొందనివారు 31.8% కాగా, 2011-12 నాటికి వారి సంఖ్య 9.4 శాతానికి చేరింది. ఈ విషయంలో భారత్ ప్రగతి సాధించింది. కానీ పారిశుద్ధ్య వసతుల కల్పనలో విఫలమైంది.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (2015 - 30)

యూఎన్ఓ సహస్రాభివృద్ధి లక్ష్యాల కాలపరిధి 2015, డిసెంబరు 31తో ముగిసింది. దానికి కొనసాగింపుగా ఐక్యరాజ్య సమితి 2015 సెప్టెంబరు 15న శిఖరాగ్ర సమావేశం నిర్వహించింది. ఇందులో భూగోళాన్ని పరిరక్షించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించి, వాటి అమలుకు పూనుకున్నారు. 2030 నాటికి వాటిని సాధించాలని తీర్మానించారు. వీటినే అజెండా 2030 అని పిలుస్తారు. ఇందులో మొత్తం 17 లక్ష్యాలు, 169 ఉపలక్ష్యాలు ఉన్నాయి. 2016 జనవరి నుంచి ప్రారంభించి 2030 డిసెంబరు నాటికి వీటిని సాధించాలనేది ఉద్దేశం.

☛ ఈ లక్ష్యాల్లో పర్యావరణ భద్రతకు సంబంధించినవి అయిదు ఉన్నాయి. అవి:

1. **6వ లక్ష్యం:** పరిశుభ్రమైన నీరు, పారిశుద్ధ్యం
2. **7వ లక్ష్యం:** అందుబాటు ధరల్లో శుద్ధ ఇంధనాలు అందించడం
3. **13వ లక్ష్యం:** పర్యావరణ మార్పు, దాని ప్రభావంపై సత్వర చర్యలు
4. **14వ లక్ష్యం:** సముద్రాలు, జలవనరుల సంరక్షణ
5. **15వ లక్ష్యం:** అడవులు, ఇతర ఆవరణ వ్యవస్థలను పరిరక్షించడం, భూక్షీణతను, జీవవైవిధ్య నష్టాన్ని ఆరికట్టడం

భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలు

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం ఇండియన్ ఎకానమీ

పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. వాటిలో ముఖ్యమైన వాటిని పరిశీలిస్తే..

భారతదేశంలో వాతావరణ చర్య - పంచామృతం (Panchamrit of India's climate action): మన దేశంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు పంచామృతాలు అనే అయిదు లక్ష్యాలను ప్రభుత్వం ప్రకటించింది. అవి:

- 2030 నాటికి కర్బన ఉద్గారాలను ఒక బిలియన్ టన్నులకు తగ్గించడం.
- 2030 నాటికి ఆర్థిక వ్యవస్థలో కార్బన్ తీవ్రతను 45 శాతం కంటే తక్కువకు తీసుకురావడం.
- 2030 నాటికి మన శక్తి అవసరాల్లో 50 శాతం పునరుత్పాదక వనరుల నుంచి రాబట్టడం.
- 2030 నాటికి 500 గిగావాట్స్ శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని సృష్టించడం
- 2070 నాటికి ఉద్గారాలను నికరంగా సున్నాకు తగ్గించడం (Achieve net - zero emissions by 2070)

నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్: దీన్ని 2023లో ప్రారంభించారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, ఎగుమతికి ప్రపంచ కేంద్రంగా భారతదేశాన్ని మార్చడం దీని లక్ష్యం 2030 నాటికి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి వార్షిక సామర్థ్యం 5 మిలియన్ మెట్రిక్ టన్నులుగా కేంద్రం నిర్దేశించింది. రూ.8 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు, 6 లక్షల ఉద్యోగాల సృష్టి, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం ఇందులోని ముఖ్యాంశాలు.

✦ అదే విధంగా శిలాజ ఇంధనాల దిగుమతిని రూ.లక్ష కోట్లకు పైగా తగ్గించడం ఇందులో మరొక ముఖ్య భాగం.

సాధించిన పురోగతి: 2024-25లో భారతదేశం రికార్డు స్థాయిలో 29.52 గిగావాట్స్ పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని నమోదు చేసింది. 2025 జూన్ 3 నాటికి మొత్తం స్థాపిత సామర్థ్యం 223.6 గిగావాట్స్‌కి పెరిగింది. 2023-24లో ఇది 198.75 గిగావాట్స్‌గా ఉంది. 2030 నాటికి 500 గిగావాట్స్ శిలాజేతర ఇంధన లక్ష్యం వైపు పురోగతిని ఇది సూచిస్తుంది.

✦ భారతదేశ సౌరశక్తి స్థాపిత సామర్థ్యం 2014 మార్చి 31 నాటికి 2.82 గిగావాట్స్ ఉండగా 2025 జూన్ 3 నాటికి అది 107.9 గిగావాట్స్‌కి పెరిగింది.

✦ పవన శక్తి ద్వారా పొందే విద్యుత్ సామర్థ్యం 2014 మార్చిలో 21.04 గిగావాట్స్ ఉండగా 2025 జూన్ 3 నాటికి 51.05 గిగావాట్స్‌కి చేరింది.

✦ 2014లో అణువిద్యుత్ సామర్థ్యం 4.78 గిగావాట్స్ ఉండగా 2025 జూన్ 3 నాటికి 8.78 గిగావాట్స్‌కి పెరిగింది.

ప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజ్‌లీ యోజన (Pradhan Mantri Surya Ghar: Muft Bijli Yojana): ప్రధాని నరేంద్ర మోదీ 2024 ఫిబ్రవరి 15న దీన్ని ప్రారంభించారు. దేశంలోని గృహాలకు ఉచిత విద్యుత్ అందించడం దీని ప్రధాన లక్ష్యం.

✦ ప్రభుత్వానికి విద్యుత్ ఖర్చులు తగ్గించడం, పునరుత్పాదక శక్తి వనరుల వినియోగాన్ని పెంచడం, కర్బన ఉద్గారాలను పరిమితం చేయడం, ప్రపంచంలోనే అతిపెద్ద దేశీయ రూఫ్‌టాప్ (Rooftop) సోలార్ ద్వారా తక్కువ ఆదాయ కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చడం మొదలైనవాటిపై ఈ పథకం ప్రధానంగా దృష్టి సారించింది.

✦ ఈ పథకం ద్వారా 2025 ఏప్రిల్ నాటికి 11.88 లక్షల గృహాలకు రూఫ్‌టాప్ సోలార్‌ను అందించారు.

పీఎం - కుసుమ్ పథకం (Pradhan Mantri Kisan Urja Suraksha Evam Utthan Mahabhiyan Yojana): దీన్ని 2019 మార్చిలో ప్రారంభించారు. సౌరశక్తితో నడిచే నీటిపారుదల వ్యవస్థలకు మద్దతు ఇవ్వడం ద్వారా వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించడం దీని లక్ష్యం.

✦ సౌర పంపులను ఏర్పాటు చేసుకునే రైతులకు 30 నుంచి 50 శాతం కేంద్ర సబ్సిడీ లభిస్తుంది.

✦ ఈ పథకం ద్వారా రానున్న కాలంలో 49 లక్షల వ్యవసాయ పంపులను సోలరైజేషన్ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ఉజాల పథకం (Unnat Jyoti by Affordable LEDs for All - UJALA): దీన్ని ప్రధాని నరేంద్ర మోదీ 2015, జనవరి 5న ప్రారంభించారు. దీని ద్వారా ఎల్ఈడీ బల్బులు - ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్‌లను పంపిణీ చేస్తారు.

✦ ప్రారంభంలో ఈ పథకాన్ని డొమెస్టిక్ ఎఫిషియెంట్ లైటింగ్ ప్రోగ్రాం (డీఈఎల్‌పీ) అని పిలిచేవారు. దీని అమలు ద్వారా విద్యుత్ చార్జీల్లో తగ్గుదల నమోదైంది. లక్షల మందికి స్థిరమైన లైటింగ్ అందుబాటులోకి వచ్చింది.

✦ ఉజాల పథకం కింద దేశవ్యాప్తంగా 2025, జనవరి 6 నాటికి 36.87 కోట్ల ఎల్ఈడీ బల్బులను పంపిణీ చేశారు. ఏడాదికి సుమారు 47,883 మిలియన్ కిలోవాట్‌ల విద్యుత్‌తోపాటు వార్షిక ఖర్చు రూ.19,153 కోట్లు ఆదా అయ్యింది. కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాల్లో భారీ తగ్గుదల నమోదైంది.

కార్బన్ న్యూట్రల్ పంచాయత్: కార్బన్ ఉద్గారాలను నికర సున్నా స్థాయికి తీసుకురావడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీలకు ఇచ్చే అవార్డు ఇది. 2023 నుంచి పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ దీన్ని అందిస్తోంది. ప్రస్తుతం ఈ అవార్డు క్లైమేట్ యాక్షన్ స్పెషల్ పంచాయతీ అవార్డు (సీఏఎస్‌సీఏ)లో భాగంగా ఉంది.

✦ చెట్ల పెంపకం, సౌరశక్తి వినియోగం, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ లాంటి స్థిర పద్ధతుల ద్వారా కార్బన్ ఉద్గారాలను సున్నా స్థాయికి తెచ్చిన భారతీయ గ్రామాలకు ఇది గుర్తింపు ఇస్తుంది.

✦ మహారాష్ట్రలోని బేలా గ్రామం 2024 విజేతగా నిలవగా కేరళలోని మీనండగి 2023లో పురస్కారం పొందింది.

ఏక్ పెడ్ మా కే నామ్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఏక్ పెడ్ మా కే నామ్ ప్రచారాన్ని ప్రారంభించారు. పౌరుల్లో పర్యావరణ రక్షణ పట్ల బాధ్యతను రేకెత్తించడం దీని ప్రధాన ఉద్దేశం.

✦ 2024 జూన్ 5న దిల్లీలోని బుద్ధ జయంతి పార్క్‌లో రావి చెట్టును నాటడం ద్వారా మోదీ దీన్ని ప్రారంభించారు.

నమామి గంగే మిషన్: కాలుష్యానికి గురవుతోన్న గంగా నదిని పరిరక్షించే ఉద్దేశంతో ప్రభుత్వం 2014లో నమామి గంగే కార్యక్రమాన్ని ప్రారంభించింది.

✦ ఈ కార్యక్రమం ద్వారా రూ.40,481 కోట్లతో 494 ప్రాజెక్టులు చేపట్టారు. వాటిలో 135 కార్యరూపం దాల్చాయి.

రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

898 Word of the Day

Debase

Telugu meaning: తక్కువ చేయడం, కించపరచడం

English meaning: The word debase (డిబేస్) is a verb that means to reduce the quality, value, or moral standard of something or someone.

Synonyms: Degrade, Lower

Antonyms: Elevate, Improve

Usage: **1.** The use of vulgar language in TV shows can debase the quality of public discourse.

2. Short-term profits should not debase ethical standards in business practices.

Current Affairs

Vajja Srinivasa Rao was sworn in as the Chief Information Commissioner of the Andhra Pradesh State Information Commission on 20 January 2026. Paravada Simhachalam Naidu, Vanteru Ravi Babu, Adenna Gajula and Sarath Chandra Kalyan Chakravarthy Vattikuti took oath as Information Commissioners. Chief Secretary K Vijayanand administered the oath of office.

All the new commissioners would hold office for a term of three years or until they attain the age of 65 years, whichever is earlier.

Brand Finance released its annual 'IT Services 25 (2025)' rankings recently. Accenture continued to maintain its position as the world's most valuable IT services brand for the eighth consecutive year, with a 2 percent increase in brand value to $42.3 billion in 2026. India's Tata Consultancy Services (TCS) and Infosys retained their position as the second and third most valued IT services brand.

The Ministry of Environment, Forest and Climate Change has issued a notification declaring Kumbhalgarh Wildlife Sanctuary, located in the Aravalli mountain range, as an Eco-Sensitive Zone. The ministry said that the declaration of the Zone will not only help conserve the area's flora and fauna but will also support indigenous communities living in and around the sanctuary.

India will host the AI Impact Summit from 16th to 20th February 2026 in New Delhi. The summit will be the first global AI summit to be hosted in the Global South. It will bring together global leaders, technology companies and experts to showcase and deliberate on the transformative potential of AI across governance, innovation, and sustainable development.

For more Current Affairs: Scan QR code

రాజకీయ పార్టీలు

ప్రజాస్వామ్య ప్రక్రియలో రాజకీయ పార్టీలు అత్యంత కీలకమైనవి. ఇవి ప్రజలను ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేయడంతోపాటు రాజకీయ చైతన్యం కలిగించి, ఎన్నికల ప్రక్రియను సులభతరం చేస్తాయి. విభిన్న భావజాలాలు, ఆసక్తులు, ప్రజల ఆకాంక్షలకు ఇవి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఓటర్లను సమీకరించడం, విధానాలు రూపొందించడం, ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా పనిచేసేలా చూడటంలో రాజకీయ పార్టీలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. పోటీ పరీక్షల నేపథ్యంలో రాజకీయ పార్టీల గురించి ముఖ్య సమాచారం తెలుసుకుందాం..!

రాజకీయ పార్టీ అంటే?

జాతి ప్రయోజనాలను పెంపొందించే లక్ష్యంతో ఒకే రకమైన రాజకీయ దృక్పథాలు కలిగి, రాజ్యాంగబద్ధంగా అధికారాన్ని సాధించేందుకు కృషి చేసే కొంతమంది వ్యక్తుల సముదాయాన్ని రాజకీయ పార్టీగా పేర్కొంటారు.

❖ మన దేశంలో రాజకీయ పార్టీలు రాజ్యాంగబద్ధమైనవి కావు. రాజ్యాంగంలోని 19వ భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కుల్లోని ఆర్టికల్ 19(1)(c) ప్రకారం.. సంఘాలు లేదా అసోసియేషన్లు అనే అంశాన్ని ఆధారంగా చేసుకుని పౌరులు రాజకీయ పార్టీలను స్థాపించుకోవచ్చు.

స్టడీ జోన్ గుర్తింపు తొలగింపు..

రాజకీయ పార్టీల నమోదుకు సంబంధించిన మార్గదర్శకాల ప్రకారం, ఒక పార్టీ వరుసగా ఆరేళ్లు ఎన్నికల్లో పోటీ చేయకపోతే దాన్ని నమోదిత పార్టీల జాబితా నుంచి తొలగిస్తారు.

❖ 2025 ఆగస్టు, సెప్టెంబరులో ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా 808 పార్టీలను రద్దు చేసింది. ఈ పార్టీలేవీ రిజిస్టర్డ్ అడ్రస్‌లో లేకపోవడం, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకపోవడంతో వీటిని నమోదిత రాజకీయ పార్టీల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొంది.

రాజకీయ పార్టీల గుర్తింపు, వర్గీకరణ, ఈ అంశంపై గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

ఉపరితల రసాయనశాస్త్రం

ఉపరితలాలు లేదా అంతర్‌తలాల వద్ద జరిగే దృగ్విషయాలను అధ్యయనం చేసే శాస్త్రమే 'ఉపరితల రసాయనశాస్త్రం' (Surface Chemistry). ఒక పదార్థం వేరొక ద్రవం లేదా ఘనపదార్థం అంతర్భాగాల్లోకి చొచ్చుకుపోకుండా ఉపరితలంపైనే ఉండటాన్ని 'అధిశోషణం' అంటారు. వాయువుల్లో భౌతిక, రసాయనిక అధిశోషణం జరుగుతుంది. వీటి తీవ్రతను ప్రభావితం చేసే అంశాలపై పోటీపరీక్షార్థులు అవగాహన ఏర్పర్చుకోవాలి.



వాయువుల అధిశోషణ తీవ్రతను ప్రభావితం చేసే అంశాలు

- అధిశోషకం ఉపరితల వైశాల్యం
- అధిశోషితం (వాయు) స్వభావం
- వాయువు పీడనం
- ఉష్ణోగ్రత

అధిశోషణం అనువర్తనాలు

- వాయు ముసుగు
- తేమను నియంత్రించడం
- జడవాయువుల మిశ్రమాన్ని వేరుచేయడం
- అధిక శూన్యస్థితిని ఏర్పర్చడం
- వ్యాధులను నయం చేసే ప్రక్రియ

అధిశోషణ క్రమం, ఫ్రాయిండ్లిష్ అధిశోషణ సమోష్ణరేఖ, ఫ్రాయిండ్లిష్ సమీకరణం, ద్రావణాల నుంచి అధిశోషణం - ఇమిడి ఉన్న సూత్రాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Management Trainee Posts

Ushodaya Publications, Publishers of Eenadu, Hyderabad, invites applications for Management Trainees. Eligible candidates can apply online before 29 January 2026.

Apprentice Posts

Indian Oil Corporation Limited (IOCL) is inviting online applications from eligible candidates for Technician, Graduate, and Trade (Technical/Non-Technical Trades) apprenticeship training in its Western Region under the Marketing Division. The total number of posts is 405. The last date for submission of online applications is 31 January 2026.

Non-Teaching Posts

The Indian Institute of Information Technology, Design and Manufacturing (IIITDM) Kurnool is inviting applications for various non-faculty posts. The total number of posts is 16. The application fee is Rs.500. Eligible candidates can apply online before 24 January 2026.

Did You Apply..?

Today (January 22) is the last date for the following Jobs

☛ 220 Assistant Professor Jobs in APMSRB - MSRB Andhra Pradesh. ***Eligibility:*** MD/ MS/ DNB/ DM/ MCh.

☛ Assistant Professor Jobs at Rashtriya Raksha University. ***Eligibility:*** PG/ MPhil/ PhD.

☛ 110 Graduate Engineer Trainee Posts in NALCO. ***Eligibility:*** BE, B.Tech.

For more information and other notifications - scan QR code

Verification of Truth of The Statement

Directions (Qs. 1 - 25): *In the following questions choose the best alternative as the answer.*

1. Atmosphere always has....
A) Oxygen B) Air C) Germs
D) Moisture E) Dust

2. A train always has....
A) Engine B) Rails
C) Driver D) Guard
E) Passengers

3. Which one of the following is always found in 'Bravery'?
A) Courage B) Experience
C) Power D) Knowledge
E) Wisdom

4. Which of the following an animal always has?
A) Lungs B) Skin C) Mind
D) Heart E) Life

5. A race always has...
A) Referee B) Spectators
C) Rivals D) Prize
E) Victory

6. Which of the following a 'Drama' must have?
A) Actors B) Story C) Sets
D) Director E) Spectators.

7. A book always has....
A) Chapters B) Pages
C) Contents D) Pictures
E) Illustrations

8. A mirror always...
A) Reflects B) Retracts
C) Distorts D) Refracts
E) Reveals the truth

9. A factory always has...
A) Electricity B) Chimney
C) Workers D) Files
E) Sellers

10. A clock always has...
A) Battery B) Numbers
C) Alarm D) Needles
E) Frame

11. A car always has ....
A) Driver B) Wheels
C) Dicky D) Bumper
E) Bonnet

12. A river always has ....
A) Delta B) Tributaries
C) Boats D) Banks
E) Fishes

13. A tree always has which of the following?
A) Branches B) Leaves
C) Roots D) Fruits
E) Shadow

Bank Exams

Reasoning

14. A jail always has ...
A) Bars B) Jailor
C) Lawyer D) Locks
E) Prisoners

15. A camera always has ....
A) Lens B) Reels
C) Flash D) Photograph
E) Stand

16. An oasis always has ....
A) Travelers B) Water
C) Sand D) Camels
E) Forests

17. A hospital always has ....
A) Nurse B) Room
C) Telephone D) Doctor
E) Bed

18. A bulb always has ....
A) Filament B) Light
C) Glass D) Current
E) Argon

19. A scenery always has ....
A) Paints B) Mountains
C) Rivers D) Composition
E) Painter

20. A school always has ...
A) Principal B) Building
C) Library D) Teacher
E) Classes

21. A pen always has ...
A) Tube B) Cap
C) Ink D) Holder
E) Nib

22. A cupboard always has ...
A) Clothes B) Shelf
C) Door D) Bolt
E) Lock

23. Which of the following is always with bargain?
A) Sumptuousness B) Triviality
C) Exchange D) Eloquence
E) Profit

24. The dead have no ...
A) Sensation B) Heart-beats
C) Bones D) Breathing
E) Movement

25. A newspaper always has
A) Advertisement
B) News C) Editor
D) Paper E) Date

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

(c) eenadu



"బ్యాంకు పరీక్షలకు సిద్ధం కావడం ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగం లభిస్తే ఆర్థిక స్థిరత్వం, నెలనెలా జీతం, పదోన్నతులు, ఉద్యోగ భద్రత దక్కుతాయి. మీ ప్రస్తుత వయసు బ్యాంకు పరీక్షల సన్నద్ధత కోసం సరిపోతుంది. అగ్రికల్చర్ నేపథ్యం ఉన్న విద్యార్థులకు బ్యాంకుల్లో అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టులు ప్రత్యేకంగా ఉంటాయి. నాబార్డ్ లాంటి సంస్థల్లోనూ కొన్ని ఉద్యోగాలు లభిస్తాయి. రైతు రుణాలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు లాంటి రంగాల్లో అగ్రికల్చర్ విద్య ఉపయోగపడుతుంది. అయితే బ్యాంకు పరీక్షలు తీవ్రమైన పోటీతో కూడుకున్నవి కావడంతో, నిరంతర సాధన, సమయ పాలన, మానసిక ధైర్యం అవసరం."

రెండిటిలో ఏది మేలు?

బీఎస్సీ అగ్రికల్చర్ ఆనర్స్ కోర్సు పూర్తిచేశాను. నా వయసు 24 ఏళ్లు. ఇప్పుడు ఎమ్మెస్సీ సోషల్ సైన్సెస్ కోర్సులో చేరితే బాగుంటుందా? బ్యాంకు పరీక్షలకు సిద్ధమైతే మంచిదా? - కె.విజయ్

■ బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసుకున్న తర్వాత మీరు తీసుకునే నిర్ణయం భవిష్యత్తు జీవితాన్ని ఆర్థికంగా, వృత్తిపరంగా ప్రభావితం చేస్తుంది. ఎమ్మెస్సీ (సోషల్ సైన్సెస్) చదవడం లేదా బ్యాంకు పరీక్షలకు సిద్ధం కావడం అనే రెండు మార్గాలూ సరైనవే. ఫలితాలు మాత్రం భిన్నంగా ఉంటాయి.

◗ ఎమ్మెస్సీ (సోషల్ సైన్సెస్) అకడమిక్ ప్రోగ్రాం. దీని ద్వారా సమాజం, ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి విధానాలు, ప్రజా విధానాలు లాంటి అంశాలపై అవగాహన లభిస్తుంది. ఈ కోర్సు పూర్తిచేసిన తర్వాత నెట్/సెట్ అర్హత సాధించి, పీహెచ్‌డీ చేస్తే కళాశాలలు, యూనివర్సిటీల్లో అధ్యాపకుడిగా స్థిరపడే అవకాశాలు ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థలు, పాలసీ థింక్ ట్యాంకులు, ప్రభుత్వ ప్రాజెక్టులు లాంటి వాటిలో కూడా ఉపాధి అవకాశాలు ఉంటాయి. అయితే, ఈ మార్గంలో ఫలితాలు పొందడానికి చాలా సమయం పడుతుంది. దీర్ఘకాల సన్నద్ధత, నిరంతర చదువు, పోటీ పరీక్షలపై పట్టుదల అవసరం. చదువు మీద నిజమైన ఆసక్తి లేకుండా ఈ మార్గంలోకి వెళితే సరైన ఉపాధి అవకాశాలు పొందలేకపోయే ప్రమాదమూ ఉంది.

◗ బీఎస్సీ అగ్రికల్చర్‌కు బ్యాంకింగ్ రంగానికి దగ్గరగా ఉంటుంది. అగ్రికల్చర్ విద్య ద్వారా వచ్చిన పరిజ్ఞానం బ్యాంకు ఉద్యోగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపయోగపడుతుంది. ఒకసారి బ్యాంకు ఉద్యోగం పొందిన తర్వాత అవసరమైతే ఉన్నత చదువులు కొనసాగించే అవకాశం ఉంటుంది. కానీ ఎమ్మెస్సీ (సోషల్ సైన్సెస్) మార్గంలోకి వెళ్తే, మధ్యలో నిర్ణయం మార్చుకోవడం కష్టం అవుతుంది. అందుకే నిర్ణయం తీసుకునే ముందు ఈ అంశాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. త్వరిత ఉపాధి, కుటుంబ బాధ్యతలు ప్రధానంగా ఉన్నవారికి బ్యాంకు పరీక్షలకు సిద్ధం కావడం ఉత్తమ మార్గం. చదువు, పరిశోధన, బోధన రంగాలపై ఆసక్తి ఉన్నవారు మాత్రం ఎమ్మెస్సీ (సోషల్ సైన్సెస్) వైపు వెళ్లవచ్చు. ఇంకా స్పష్టత లేకపోతే, ముందుగా రెండేళ్లు బ్యాంకు పరీక్షలకు ప్రయత్నించి, ఆ తర్వాత ఎమ్మెస్సీ చేయవచ్చు. సరైన ఆలోచన, క్రమశిక్షణలతో ముందుకు సాగితే ఏ మార్గం ఎంచుకున్నా విజయం సాధించడం సాధ్యమే.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్), హైదరాబాద్.. ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ కెపాసిటీ బిల్డింగ్ కన్సల్టెంట్, బిల్డింగ్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సీనియర్ కెపాసిటీ బిల్డింగ్ కన్సల్టెంట్: 10
- కెపాసిటీ బిల్డింగ్ కన్సల్టెంట్: 88

అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పని అనుభవం ఉండాలి. **వయసు:** 31.12.2025 నాటికి 50 ఏళ్లు మించకూడదు. **వేతన శ్రేణి:** నెలకు రూ.60,000 - 75,000. **దరఖాస్తు ఫీజు:** రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు. **ఎంపిక:** ఇంటర్వ్యూతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 29.01.2026
వెబ్‌సైట్: http://career.nirdpr.in//

ఇన్‌స్ట్రుమెంటేషన్ లిమిటెడ్‌లో

ఇన్‌స్ట్రుమెంటేషన్ లిమిటెడ్, పాలక్కాడ్.. ఏడాది కాలానికి గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు కోరుతోంది.

- గ్రాడ్యుయేట్(బీటెక్/బీఈ) అప్రెంటిస్: 37
- డిప్లొమా అప్రెంటిస్: 44

విభాగాలు: మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, సివిల్.
అర్హత: సంబంధిత విభాగాల్లో డిప్లొమా, బీఈ/బీటెక్ ఉండాలి. **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,300; డిప్లొమా అప్రెంటిస్‌కు 10,900. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
చిరునామా: ఆఫ్‌లైన్ దరఖాస్తులను.. మేనేజర్, ఇన్‌స్ట్రుమెంటేషన్ లిమిటెడ్, కంజికోడ్ వెస్ట్, పాలక్కాడ్‌కు పంపాలి.
పోస్టు ద్వారా దరఖాస్తులు స్వీకరించడానికి చివరి తేదీ: 09-02-2026.
వెబ్‌సైట్: https://ilpgt.com/index.html

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ).. రెగ్యులర్ ప్రాతిపదికన 323 అసిస్టెంట్ కోచ్ పోస్టులను భర్తీచేయనుంది. స్పోర్ట్స్ కోచింగ్ కోర్సులతో దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, కోచింగ్ ఎబిలిటీ టెస్ట్‌లతో నియామకాలుంటాయి.

కోచ్ కొలువుల్లో చేరతారా?

స్విమ్మింగ్, అథ్లెటిక్స్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, కెనోయింగ్, జుడో, రోవింగ్, షూటింగ్, బాక్సింగ్, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, తైక్వాండో, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫీల్డ్‌హాకీ, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, ఊషు క్రీడా విభాగాల్లో ఈ ఖాళీలు ఉన్నాయి. వీటికి ఎంపికైనవారు నెలకు రూ.35,400 మూలవేతనం పొందుతారు. అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, టీఏ.. మొదలైనవి ఉంటాయి.

పరీక్ష ఇలా

ఆన్‌లైన్‌లో 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. వ్యవధి రెండు గంటలు. ప్రశ్నపత్రంలో మూడు సెక్షన్లు ఉంటాయి. స్పోర్ట్స్-స్పెసిఫిక్ నాలెడ్జ్ నుంచి 65 ప్రశ్నలు, స్పోర్ట్స్ సైన్స్ నుంచి 25 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్, ఆప్టిట్యూడ్‌ల నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు.

- సీబీటీకి 60 శాతం, సీఏటీకి 40 శాతం వెయిటేజీ ఉంటుంది. సీబీటీలో అర్హత పొందినవారిని పోస్టుకు ముగ్గురు చొప్పున కోచింగ్ ఎబిలిటీ టెస్టుకు ఎంపిక చేస్తారు.
- సీబీటీ సిలబస్, కోచింగ్ ఎబిలిటీ టెస్టు వివరాలను ప్రకటనలో స్పష్టంగా తెలియజేశారు. సీబీటీ, సీఏటీ తేదీలు, పరీక్ష కేంద్రం సమాచారాన్ని అభ్యర్థులకు తర్వాత తెలియజేస్తారు.

సన్నద్ధత

- సిలబస్‌లోని అంశాలను బాగా చదివితే సరిపోతుంది. ఇందుకోసం పీజీ పాఠ్యపుస్తకాలు ఉపయోగపడతాయి.
- ప్రతీ క్రీడా విభాగంలోనూ కోచింగ్ ఎబిలిటీ టెస్టుకు ఎలా సన్నద్ధమవ్వాలో వివరంగా తెలియజేశారు. వీటిని అనుసరిస్తే విజయవంతం కావచ్చు.

వివరాలు

అర్హత: ఎమ్మెస్సీ(స్పోర్ట్స్ కోచింగ్) లేదా స్పోర్ట్స్ కోచింగ్‌లో పీజీ డిప్లొమా.
వయసు: 01.02.2026 నాటికి 30 సంవత్సరాలు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.2500. ఎస్సీ, ఎస్టీ, మహిళలు, మాజీ సైనికోద్యోగులకు రూ.2000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.02.2026
వెబ్‌సైట్: https://www.sportsauthorityofindia.nic.in/

కెరియర్ ఉన్నతికి అభ్యాసమే ఆయుధం!

కార్పొరేట్ కొలువులు దక్కాలని ఎక్కువ మంది యువత కలలు కంటారు. ఉద్యోగంలో చేరిన వెంటనే పదోన్నతులూ, అధిక ప్యాకేజీలపై దృష్టి సారిస్తారు. ఈ రెండూ సొంతం కావాలంటే కొన్ని విషయాలపైన దృష్టి సారించాలి. కార్పొరేట్ కెరియర్‌లో తొలుత కొన్నేళ్లూ నేర్చుకునే దశ. ఈ వ్యవధిలో ఉద్యోగి దృక్పథం సంస్థలో ఎదుగుదలని నిర్ణయిస్తుంది. విద్యార్థి దశలోనే ఈ విషయాలపై అవగాహన పెంచుకుంటే కార్పొరేట్ కెరియర్‌లో రాణించడం సులువవుతుంది.

ప్రకాష్, అనిల్ ఇద్దరూ ప్రతిష్ఠాత్మక బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చదువుకున్నారు. ఒక అంకుర సంస్థలో ట్రెయినీలుగా చేరారు. వీరిలో అనిల్ విలాసవంతమైన జీవితం కావాలని కోరుకునేవాడు. అంకుర సంస్థలో వచ్చే జీతంతో ఆశించిన స్థాయి జీవితాన్ని అనుభవించలేనని భావించాడు. ఏ పని కేటాయించినా 'తీసుకునే జీతానికి ఈ పనే ఎక్కువ' అనుకునేవాడు. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి ఆసక్తి చూపలేదు. అధిక ప్యాకేజీ ఆఫర్ చేసిన మరో సంస్థకు మారాడు.

ప్రకాష్ మాత్రం అంకుర సంస్థలో నేర్చుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని భావించాడు. సీనియర్స్ నుంచి అదనపు పనిని స్వచ్ఛందంగా తీసుకున్నాడు. నేర్చుకోవడమే ధ్యేయంగా నైపుణ్యాలు మెరుగుపరుచుకున్నాడు. ఆ అంకుర సంస్థలోనే కొనసాగాడు. ఐదేళ్లు తిరిగే సరికల్లా ఆ అంకురం ప్రపంచ స్థాయి సంస్థగా రూపొందింది. ప్రకాష్ సీఈవోగా అత్యున్నత పదవినీ చేపట్టాడు. తగిన నైపుణ్యాలు పెంచుకోకపోవడంతో ప్రతి సంస్థలోనూ అనిల్ విఫలమయ్యాడు. చివరికి ట్రెయినీగా మొదలుపెట్టిన అంకుర సంస్థలోనే మేనేజరుగా చేరాడు. ఒకే దగ్గర చదువు పూర్తిచేసుకుని, ఒకే సంస్థలో చేరిన ఇద్దరిలో ఒకరు సీఈవోగా మారితే, మరొకరు మేనేజర్ స్థాయికి పరిమితమయ్యారు. కార్పొరేట్ సంస్థల్లో కెరియర్ ఒక సుదీర్ఘ ప్రయాణం. ఇందులో రెండు దశలు ముఖ్యమైనవి. మొదటిది అభ్యాస దశ, రెండోది ఆర్జన దశ. అభ్యాసాన్ని నిర్లక్ష్యం చేస్తే రెండోది దక్కదు. అందువల్ల కెరియర్ ప్రారంభంలో కొత్త విషయాలు నేర్చుకోవడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి.

అభ్యాస దశ

కాలేజీలు డిగ్రీలు సాధించేలా చేస్తాయి. కార్పొరేట్ కంపెనీలు ఉద్యోగంతో పాటు వికాసాన్నీ కలిగిస్తాయి. ఉద్యోగంలో చేరిన తొలి రెండు మూడేళ్లూ నేర్చుకునే దశ. ఇది మీరు మరింత ఉన్నతంగా రూపొందడానికి ఒక అవకాశం కల్పిస్తుంది. ఈ దశలో పని భారం ఎక్కువ, ప్రశంసలు తక్కువగా ఉంటాయి. ఈ కాలంలో ఎదురయ్యే విమర్శలు, ఉద్యోగిగా మీరు దృఢపడటానికి ఉపయోగపడతాయి.

ఉద్యోగంలో చేరిన మొదటి ఏడాదిని విద్యార్థి జీవితానికి కొనసాగింపుగా భావించండి. అధ్యయనాన్ని ఆపకండి. కాలేజీలు విజ్ఞానాన్ని అందిస్తాయి. వ్యాపార సంస్థలు ఆచరణాత్మకంగా ఎలా పని చేయవచ్చో తెలిసేలా చేస్తాయి. మనోవైఖరి, నేర్చుకునే సామర్థ్యం, వేగం, సమస్యలను ఎదుర్కొనే సమర్థత, బాధ్యతలను స్వీకరించే స్వభావం యువ ఉద్యోగుల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. కాలేజీ పుస్తకాల సిలబస్‌లో ఈ విషయాలేవీ ఉండవు. అలాగే వ్యాపార సంస్థల శిక్షణలోనూ నేర్పరు.

ఆర్జన దశ

ఉద్యోగంలో అనుభవం సంపాదించి, చేస్తున్న పనిపై పూర్తి నియంత్రణ వచ్చినపుడు సమస్యలను స్వయంగా పరిష్కరించగలిగే సామర్థ్యం సొంతమవుతుంది. సంస్థ లక్ష్య సాధనకు విలువ చేకూర్చగలరన్న నమ్మకం యాజమాన్యానికి కలిగితే మీరు ఆర్జన దశలోకి అడుగు పెట్టేందుకు అర్హత సాధించినట్లే. ఈ దశలో అవకాశాలు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయి. కార్పొరేట్ ఉద్యోగంలో మొదటి దశ.. ప్రతిభను నిరూపించుకోవడానికీ, ఆలోచనా విధానాన్ని నిర్మించుకునేందుకూ సరైన సమయం. ఇక్కడ ఎదురయ్యే విమర్శలను వ్యక్తిగతంగా తీసుకోకుండా పాఠాలుగా మార్చుకోండి. ప్రతి పనిలోనూ నేర్చుకునే అవకాశం ఉందని గుర్తుంచుకోండి. సానుకూల దృక్పథం అలవర్చుకోండి.

నేర్చుకోవడమే ధ్యేయం

భావన సాధారణ డిగ్రీ పూర్తిచేసుకుని, ఒక బహుళ జాతి సంస్థలో ట్రెయినీగా చేరింది. రోజువారీ సమావేశాల్లో పరిశీలించిన అంశాలు శ్రద్ధగా రాసుకునేది. వాటిని సమీక్షించుకుని నైపుణ్యాలు, పని పద్ధతులను సరిచేసుకునేది. బృందంలోనూ, సంస్థలోనూ ఆమెను ఎవరూ గుర్తించేవారు కాదు. అయితే ఒక ప్రాజెక్ట్ అమలులో తలెత్తిన కఠిన సమస్యను ఆమె సులభంగా పరిష్కరించి, అందరి దృష్టినీ ఆకర్షించింది. సమస్యను ఆమె పరిష్కరించిన విధానాన్ని యాజమాన్యం మెచ్చుకుంది. ఆమె నైపుణ్యాన్ని గుర్తించి, ఆకర్షణీయమైన వేతన ప్యాకేజీతో పాటు పదోన్నతి కల్పించింది.

సాధారణ గ్రాడ్యుయేట్ అయిన భావన ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదిగింది. శిక్షణ కాలంలో పూర్తి సమయాన్నీ, వనరులనూ నైపుణ్యాభివృద్ధికి వినియోగించుకోవాలి. ప్రతి అంశాన్నీ శ్రద్ధగా నేర్చుకునే ఉద్యోగులకు ఉన్నత స్థాయి పదవులూ, సౌకర్యాలూ సహజంగా వస్తాయి. ఉద్యోగుల ఆలోచనా విధానాన్నీ, సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యాన్నీ, మనోవైఖరినీ సంస్థలు పరిశీలిస్తాయి.

అత్యంత తెలివైన ఉద్యోగులతో పోలిస్తే, అత్యంత సూక్ష్మంగా నేర్చుకునే వైఖరి ఉన్నవారే కార్పొరేట్ ప్రపంచంలో వేగంగా ఎదుగుతారు. అందుకే కెరియర్ ఉన్నతికి ఎంతో ముఖ్యమైన అభ్యాసాన్ని నిరంతరం కొనసాగించాలి.

– దొరైరాజ్
సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ఎన్‌సీపీఓఆర్‌లో

నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రిసెర్చ్ (ఎన్‌సీపీఓఆర్), గోవా ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్టు సైంటిస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. ● ప్రాజెక్ట్ సైంటిస్ట్-I - 06
అర్హత: డిగ్రీ/ పీజీ (కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, జియో సైన్సెస్ లేదా మెరైన్ సైన్సెస్) 60 శాతం మార్కులతో పాటు పని అనుభవం ఉండాలి. **వేతనం:** నెలకు రూ.56,000.
ఇంటర్వ్యూ తేదీ: 02.02.2026
వేదిక: ఎన్‌సీపీఓఆర్ కాంప్లెక్స్, వాస్కోడిగామా, గోవా-403 804. **వెబ్‌సైట్:** ncpor.res.in/recruitment

రిసెర్చ్ సైంటిస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), దిల్లీ.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్ - I (మెడికల్) - 01
- ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్ - I (నాన్-మెడికల్) - 01
- ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ - III - 01
- ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ - I - 01
- ప్రాజెక్ట్ నర్స్ - III - 01

అర్హత: పోస్టు ప్రకారం సంబంధిత విభాగంలో డిగ్రీ/ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీవీఎస్‌సీతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ/ దివ్యాంగులకు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది. **ఎంపిక:** ఇంటర్వ్యూతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.02.2026. **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in

మంచి అలవాట్లతో.. మేటి భవిత

పాత ఆలోచనలు, అలవాట్లు వదిలించుకోవడం కష్టమే. అయితే వాటిని వదిలేసినప్పుడే నిజమైన మార్పు మొదలవుతుంది. మనకు తెలియకుండానే మనలో ఏర్పడే రోజువారీ అలవాట్లే కాలక్రమేణా పెద్ద మార్పులకు కారణమవుతాయని, లక్ష్యాలతో పాటు అలవాట్లూ ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు.

✦ "నాకు ఈ సబ్జెక్టు రాదు", "నేను లీడర్‌ని కాలేను", "పరీక్షల్లో మంచి మార్కులు సాధించలేను" లాంటి ఆలోచనలు విద్యార్థులను వెనక్కి లాగుతుంటాయి. అందువల్ల నాకు రాదు, నా వల్ల కాదు అనే భావనలను మనసులోంచి తీసేయాలి. ప్రయత్నిస్తే కచ్చితంగా నేర్చుకోగలను అనే నమ్మకం ఉండాలి. ఒకరోజు చదవకపోయినా నిరుత్సాహపడకుండా మరుసటి రోజు మళ్లీ మొదలుపెట్టాలి. ప్రతి రోజూ ఎంతో కొంత సమయం చదవడానికి కేటాయించడాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలి.

✦ చదవడం పూర్తయిన తర్వాత మర్చిపోకుండా ఉండటానికి పునశ్చరణ చేసుకోవాలి. నేర్చుకున్న విషయాన్ని సొంత మాటల్లో రాయడం వల్ల అవగాహన పెరుగుతుంది. అలాగే వారంలో ఒక రోజైనా కష్టమైన ప్రశ్నలు, సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

✦ కొన్నిసార్లు లక్ష్యం ప్రకారం కేటాయించుకున్న పూర్తి సమయాన్ని చదవడానికి కేటాయించలేకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో నిరుత్సాహానికి లోనుకాకుండా.. ఉన్న సమయాన్ని ఉపయోగించుకోవడంపై దృష్టి సారించాలి. చదివే వ్యవధిని నెమ్మదిగా పెంచుకోవాలి. దీంతో కొద్ది రోజుల్లోనే మెరుగుపడి, మీరు నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం చదవడం సాధ్యమవుతుంది.

✦ బాగా చదువుకోవాలంటే మానసిక ప్రశాంతత ఎంతో ముఖ్యం. ప్రతి రోజూ నిర్ణీత వేళల్లో నిద్ర పోవడమూ ప్రధానమే. ఫోన్ చూడటానికి ప్రత్యేకంగా కొంత సమయం కేటాయించుకుని, దానికే పరిమితం కావాలి. దీంతో ఎలాంటి అవాంతరాలూ లేకుండా చదువుకోవడానికి వీలవుతుంది. చదువుకునే సమయంలో ఫోన్ అందుబాటులో లేకుండా చూసుకోవడమే మంచిది.

✦ ఆరోగ్యం ఎంతో ప్రధానం. పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పండ్లు, కూరగాయలు, పప్పులు, పాలు, గుడ్లు లాంటివి ఎక్కువగా తీసుకోవాలి. జంక్‌ఫుడ్, చిప్స్, కూల్‌డ్రింక్స్ ఇవన్నీ తగ్గించాలి. ఆరోగ్యంగా ఉంటేనే కోరుకున్న విధంగా చదువూ కొనసాగుతుంది.

✦ రోజూ కొద్దిసేపు వ్యాయామం చేయాలి. నడవడం, యోగా, ఆటలు శరీరానికి చాలా మంచివి. వీటితో మానసికంగానూ మెరుగుపడవచ్చు. అలా అని చెప్పి ఒకేసారి ఎక్కువగా చేయకూడదు. నిర్ణీత వ్యవధుల్లో క్రమం తప్పకుండా చేస్తూ ఉండాలి. ఇలా కొన్నాళ్లు కొనసాగిస్తే ఇదే ఒక అలవాటుగా మారుతుంది.

✦ వారానికి లేదా నెలకొకసారి అయినా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి. రోజుకు కనీసం 20 నిమిషాలు చదవాలి. ఆసక్తి ఉన్న పుస్తకాలు ఎంచుకుని చదవడాన్ని నిరంతరం కొనసాగించాలి. పఠనం ఎన్నో నైపుణ్యాలను పెంచుతుంది.

కొత్త సంవత్సరంలో దాదాపు విద్యార్థులంతా ఎన్నో లక్ష్యాలు పెట్టుకుంటారు. బాగా చదవాలి, మంచి మార్కులు పొందాలి, వ్యాయామం చేయాలి, ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి, నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి... ఇలా ఎన్నో అనుకుంటారు. వీటిని జనవరి ప్రారంభంలో విజయవంతంగా అమలుచేస్తారు కూడా. ఆ తర్వాతే నెమ్మదిగా దారి తప్పుతారు. అలా జరగకుండా ఉండాలంటే?

కొత్త సంవత్సర సంకల్పాలు మంచివే. అయితే మన రోజువారీ అలవాట్లు, ఆలోచనా విధానం అంతకంటే ముఖ్యమైనవి. ఈ మార్పులతోనే జీవితం మారుతుంది. అవసరం లేనివి నెమ్మదిగా వదిలించుకుని, సరైన అలవాట్లను నిర్మించుకోవడమే నిజమైన విజయానికి పునాది అవుతుంది. తీర్మానాలు కొద్ది రోజులే ప్రభావం చూపుతాయి. కానీ అలవాట్లు జీవితాంతం ఉపయోగపడతాయి. సరైన అలవాట్లతో ఈ ఏడాదిని తీర్చిదిద్దుకుంటే అనుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగుతారు. చిన్న చిన్న అలవాట్లే భవిష్యత్తులో ఎంతో ఉన్నతి, పరిణతికి దారిచూపుతాయి.

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో మోషన్ గ్రాఫిక్స్

సంస్థ: ఇన్వెస్ట్4ఎడ్యు ప్రై.లి.
నైపుణ్యాలు: ఆడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: జనవరి 28
https://tinyurl.com/3nuhp6d2

సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్

సంస్థ: ఇన్ఫోగ్రోత్ ప్రై.లి.
నైపుణ్యాలు: డిజిటల్ మార్కెటింగ్,
స్టైపెండ్: రూ.9,000-10,000 గూగుల్ యాడ్‌వర్డ్స్, అనలిటిక్స్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 13
https://tinyurl.com/4tbruyur

ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్

సంస్థ: రిజ్‌అప్ ల్యాబ్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: అకౌంటింగ్, అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్, బ్యాంక్ రీకన్‌సిలియేషన్, డేటా అనాలిసిస్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఫైనాన్షియల్ రిపోర్టింగ్, ఎంఎస్-ఎక్సెల్, రిపోర్ట్ జనరేషన్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.9,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 13
https://tinyurl.com/3a7wsnfz

మొబైల్ యాప్ డెవలప్‌మెంట్

సంస్థ: జిప్‌ఇన్‌టెల్లా ప్రై.లి.
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, ఫైర్‌బేస్, ఫ్లట్టర్, ఐఓఎస్, కాట్లిన్, రియాక్ట్, రియాక్ట్ నేటివ్, స్విఫ్ట్
స్టైపెండ్: రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 11
https://tinyurl.com/m2sbcuvn

వీడియో ఎడిటింగ్/ మేకింగ్

సంస్థ: మై3 డిజిటల్
నైపుణ్యాలు: ఆడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, ఫైనల్ కట్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియోగ్రఫీ, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.6,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 12
https://tinyurl.com/7b4ppe3d

విజయవాడలో ఏఐ ఏజెంట్ డెవలప్‌మెంట్

సంస్థ: ఏఐటెక్‌చెయిన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: లాంగ్‌చెయిన్, ఎల్ఎల్ఎం ఎవల్యూషన్, ఫైతాన్, ఫైతాన్ లైబ్రరీస్
స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: జనవరి 30
https://tinyurl.com/4j65z9bb

(c) eenadu

ఐక్యరాజ్యసమితే ట్రంప్ లక్ష్యమా..?

అంతర్జాతీయ సంస్థలంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తొలి నుంచే చిన్న చూపే. ఆయన రెండోసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తర్వాత దాదాపు 61 అంతర్జాతీయ సంస్థల నుంచి ఏకపక్షంగా వైదొలిగారు. ఇందులో ఐక్యరాజ్యసమితికి(ఐరాస) చెందిన ఎన్నో కీలక విభాగాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు ఏకంగా గాజా శాంతి మండలి పేరుతో ఐరాస స్థానంలో ఆయన ఓ కొత్త సంస్థను తీసుకురానున్నారన్న చర్చ.. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో కలవరం రేపుతోంది.

ఇజ్రాయెల్-హమాస్ మధ్య ట్రంప్ కుదిర్చిన 20 సూత్రాల కాల్పుల విరమణ ఒప్పందంలోని భాగమే గాజా శాంతి మండలి ఏర్పాటు. దీని ప్రధాన ఉద్దేశం.. గాజా పునర్నిర్మాణాన్ని, పాలనను పర్యవేక్షించడం. ఈ మండలికి ట్రంప్ ఛైర్మన్. ఆ హోదాలో ఆయన కొంత మంది సభ్యులను మాత్రమే నియమిస్తారని తొలుత అంతా భావించారు. కానీ ఇప్పటివరకు ఆయన దాదాపు 58 దేశాధినేతలకు ఆహ్వానాలు పంపారు. ఇందులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహా పలు దేశాల అధినేతలు ఉన్నారు. గాజాకు సంబంధించిన అంశంపై ఇంత మందికి ఆయన ఆహ్వానాలు పంపడం చర్చనీయాంశమవుతోంది. దీనికి తోడు ఇటీవల ట్రంప్ ప్రకటనల సారాంశాన్ని పరిశీలిస్తే.. ఇది గాజాకు పరిమితమైన మండలి కాదన్న విషయం స్పష్టమవుతోంది. తాజాగా ఆయన మాట్లాడుతూ..''ఐరాస ఎంతో చేయాల్సి ఉందన్నది నా భావన. అలా చేసుంటే ఈ శాంతి మండలి అవసరమే ఉండేది కాదు. ఐరాస గురించి మీకు తెలిసిందే. నేను చాలా యుద్ధాలను ఆపాను. ఒక్కదాంట్లోనూ ఆ సంస్థ నాకు సాయం చేయలేదు'' అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో ట్రంప్ తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పారు. అమెరికా అధికారులు కూడా గాజా శాంతి మండలి పరిధి విస్తృతంగా ఉంటుందన్న సంకేతాలను ఇస్తున్నారు. హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్.. తనకు ట్రంప్ పంపిన ఆహ్వానాన్ని వెబ్‌సైట్‌లో పెట్టారు. అందులో అంతర్జాతీయ ఘర్షణల పరిష్కారంలోనూ శాంతి మండలి కీలక పాత్ర పోషించనుందన్న విషయం స్పష్టంగా ఉంది.

ఐరోపాలోనే విభేదాలు

ట్రంప్ ఆహ్వానానికి ఇప్పటివరకు ఇజ్రాయెల్, పాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, మొరాకో, వియత్నాం, కజఖ్‌స్థాన్, హంగరీ, అర్జెంటీనా, బెలారస్ తదితర దేశాలు సానుకూలంగా స్పందించాయి. అయితే చాలా దేశాలు ట్రంప్ ప్రతిపాదనపై అనుమానాలు వ్యక్తంచేస్తున్నాయి. నాటోలోని అమెరికా మిత్రదేశాలే ఈ ప్రతిపాదనను శంకిస్తున్నాయి. ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నామని నార్వే, స్వీడన్ స్పష్టం చేశాయి. గాజా శాంతి ప్రణాళికను సమర్థిస్తామని చెప్పిన ఆ దేశాలు ఐక్యరాజ్యసమితి స్థానాన్ని భర్తీ చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తం చేశాయి. ఫ్రాన్స్ కూడా ట్రంప్ ప్రతిపాదనపై సానుకూలంగా లేదు. శాంతి మండలి వెనక ఉద్దేశాలు సరిగా లేవని ఆ దేశ అధ్యక్షుడు మెక్రాన్ భావిస్తున్నారు. విధివిధానాలు గాజాను దాటి ఉన్నాయని అనుమానిస్తున్నారు.

చైనా, రష్యా అంగీకరిస్తాయా..

ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయంగా మరో సంస్థను.. అదీ ట్రంప్ ఛైర్మన్‌గా ఓ మండలిని చైనా, రష్యా అంగీకరించే పరిస్థితులు లేవు. అందుకే ఈ అంశంపై రష్యా ఆచితూచి స్పందిస్తోంది తమ అధ్యక్షుడు పుతిన్‌కు ఆహ్వానం అందిందని, ప్రతిపాదనపై అధ్యయనం చేస్తున్నామని తెలిపింది. చాలా అంశాలపై తమకు సందేహాలు ఉన్నాయని. వాటిపై ట్రంప్ యంత్రాంగం వివరణ తీసుకుంటామని కూడా మాస్కో పేర్కొనడం గమనార్హం. చైనా అయితే ఇంకా ఘాటుగానే స్పందించింది. ట్రంప్ ప్రతిపాదిస్తున్న మండలిలో చేరే అంశంపై తమకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని పేర్కొంది. అదే సమయంలో ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు ఎలా ఉన్నా.. తాము ఐరాసనే అంతర్జాతీయ సంస్థగా గుర్తిస్తామని పేర్కొంది. భారత్ కూడా ఈ అంశం సున్నితమైందిగా భావిస్తోంది. అన్ని కోణాల్లోనూ చర్చించి తుది నిర్ణయానికి రావాలనుకుంటోంది. అందుకే ఇంకా నిర్ణయాన్ని ప్రకటించలేదు.

- నేషనల్ డెస్క్

ట్రంప్ బెదిరింపులు

ఈయూ సమగ్రతకు ముప్పే

- ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు కోస్టా వ్యాఖ్య

బ్రస్సెల్స్: గ్రీన్‌లాండ్‌పై అమెరికా బెదిరింపులు.. ఐరోపా భద్రతకు, సమగ్రతకు, విలువలకు ముప్పేనని ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్‌కు మద్దతిచ్చే దేశాలపై అదనపు సుంకాలను విధిస్తామని ఆయన ప్రకటించడం సవాలేనని వ్యాఖ్యానించారు. బుధవారం ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్‌లో జరిగిన ఈయూ చట్టసభ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో గురువారం ఈయూ అత్యవసర సమావేశం జరగనున్న నేపథ్యంలో కోస్టా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'ట్రాన్స్ అట్లాంటిక్ సంబంధాలపై ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలు.. ఈయూ భద్రత, సమగ్రత, విలువలకు పరీక్షగా నిలుస్తున్నాయి. అంతర్జాతీయ చట్ట నిబంధనలు, ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వం అంశాల్లో ఈయూ నేతలు కలిసికట్టుగా ఉన్నారు. గతంలో ఉక్రెయిన్ విషయంలో ఎలా వ్యవహరించామో ప్రస్తుతం గ్రీన్‌లాండ్ విషయంలోనూ అలాగే ఉంటాం. డెన్మార్క్, గ్రీన్‌లాండే ఆ దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయి' అని కోస్టా పేర్కొన్నారు.

ఏడో చమురు నౌకను జప్తుచేసిన అమెరికా దళాలు

వాషింగ్టన్: వెనెజువెలాతో ముడిపడి ఉన్న మరో చమురు నౌకను అమెరికా సైనిక బలగాలు జప్తు చేశాయి. ఆ దేశ చమురుపై నియంత్రణ కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఇప్పటి వరకు ఆరు నౌకల్ని ఇలా నియంత్రణలోకి తీసుకోగా ఇది ఏడోది. ట్రంప్ ఆదేశాలను ధిక్కరించి తిరుగుతుండటంతో ఎం.వి.సగిట్టా అనే నౌకను మంగళవారం జప్తు చేసినట్లు అమెరికా సైన్యం తెలిపింది. ఈ నౌక లైబీరియా జెండాతో ఉంది. హాంకాంగ్‌లోని ఒక కంపెనీ దీనికి యజమాని అని రిజిస్ట్రేషన్ వివరాలు చెబుతున్నాయి. వెనెజువెలా నుంచి ఈ నౌక చమురు తీసుకువచ్చిందని అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ నెల 3న వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను బందీగా తీసుకువెళ్లినప్పటినుంచి ఆ దేశ చమురు ఉత్పత్తిపై ట్రంప్ యంత్రాంగం పట్టుబిగిస్తూ వస్తోంది. చమురు శుద్ధి, ప్రపంచ దేశాలకు సరఫరాపైనా ఆంక్షలు విధించింది. వెనెజువెలా నుంచి ఐదు కోట్ల బ్యారెళ్ల చమురును తాము విక్రయిస్తామని ట్రంప్ తాజాగా ప్రకటించారు. బహిరంగ మార్కెట్లో దానిని అమ్మడం ద్వారా చమురు ధరల్ని గణనీయంగా కిందికి తీసుకువస్తున్నామని చెప్పారు.

మరో 37 మంది నేరగాళ్లను అమెరికాకు అప్పగించిన మెక్సికో

మెక్సికో సిటీ: మాదక ద్రవ్యాల ముఠాలకు చెందిన మరో 37 మందిని అమెరికాకు పంపించినట్లు మెక్సికో రక్షణమంత్రి ఒమర్ గార్సియా తెలిపారు. సరిహద్దు ద్వారా డ్రగ్స్ అక్రమ రవాణాకు కళ్లెం వేయాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి పస్తున్న తీవ్ర ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ ప్రకటన చేశారు. డ్రగ్స్ ముఠాల్లో ఉన్న వీరంతా కరుడుగట్టిన నేరగాళ్లని, దేశ భద్రతకు ముప్పుగా పరిణమించారని తెలిపారు. ఇప్పటివరకు 92 మందిని ఇలా అమెరికాకు పంపించినట్లు వివరించారు. కళ్లకు గంతలు కట్టి, చేతులకు బేడీలు వేసిన ఖైదీలను భారీ భద్రత మధ్య సైనిక విమానంలో మెక్సికో నుంచి తరలించారు.

మహారాజా ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

- పట్టాలపై ఇనుప రాడ్లు

ఇంటర్నెట్ డెస్క్: భారత్‌లో అత్యంత విలాసవంతమైన మహారాజా ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. ఈ రైలు మంగళవారం అర్ధరాత్రి జైపుర్ నుంచి సవాయి మాధోపుర్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యంలో పట్టాలపై ఉన్న ఇనుప రాడ్లను పైలట్ గుర్తించారు. వెంటనే ఎమర్జెన్సీ బ్రేక్‌లు వేసి రైలు ఆపారు. రైల్వే అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దాదాపు 5 అడుగుల పొడవు ఉన్న ఇనుప రాడ్లను గుర్తించారు. వీటిని దుండగులు ఉద్దేశపూర్వకంగానే పట్టాలపై పెట్టి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనాస్థలంలో జాగిలాల సాయంతో తనిఖీలు చేపట్టారు. ఈ ఘటన కారణంగా రైలు దాదాపు అరగంట పాటు నిలిచిపోయింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు. ఈ రైల్లో ఎక్కువ మంది విదేశీ ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఇరాన్ మృతులు 3,117

- అధికారిక టీవీ ఛానల్ ప్రకటన

దుబాయ్: ఇరాన్‌లో ఇటీవల జరిగిన నిరసనల్లో మృతిచెందిన వారి సంఖ్యను దేశ ప్రభుత్వ టీవీ ఛానల్ బుధవారం అధికారికంగా ప్రకటించింది. మొత్తం 3,117 మంది నిరసనకారులు మరణించారని తేల్చింది. అమరుల ఫౌండేషన్ అందించిన గణాంకాల ప్రాతిపదికన ఈ సంఖ్యను తెలియజేసింది. మృతుల్లో 2,427 మంది సాధారణ పౌరులు, భద్రతా సిబ్బంది ఉన్నారని పేర్కొంది. మిగిలిన వారు ఎవరన్నది అధికారిక ఛానల్ వెల్లడించలేదు. అయితే ప్రదర్శనకారులపై ప్రభుత్వం సాగించిన దమనకాండ 4,560 మంది ప్రాణాల్ని బలిగొందని అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ న్యూస్ ఏజెన్సీ తాజాగా ప్రకటించింది.

షింజో అబె హంతకుడికి జీవిత ఖైదు

టోక్యో: జపాన్ మాజీ ప్రధాని షింజో అబె హంతకుడు యమాగామి తెత్సుయా(45)కు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. బుధవారం విచారణ అనంతరం నరా జిల్లా కోర్టు అతడికి పెరోల్ లేని జీవిత ఖైదును విధించింది. 2022లో నరా నగరంలోని ఓ వీధిలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న అబెపై తెత్సుయా తుపాకీతో కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం పారిపోతున్న అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అబె హత్య జరిగిన మూడున్నరేళ్లకు హంతకుడికి శిక్ష పడటం గమనార్హం.

యమాగామి తెత్సుయా

సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల్లో యూపీఐ సేవలు!

దిల్లీ: దేశంలోని అన్ని సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం భారత పురావస్తు సర్వే సంస్థ (ఏఎస్ఐ)తో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుబంధ సంస్థ ఎన్‌బీఎస్ఎల్ చర్చలు జరుపుతోంది. ప్రస్తుతం ఏఎస్ఐ పోర్టల్ ద్వారా సందర్శకులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఆఫ్‌లైన్‌లో నేరుగా నగదు ద్వారానే టికెట్ల విక్రయాలు జరుగుతున్నాయి. డిజిటల్ పేమెంట్లు అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆయా ప్రాంతాల్లో టికెట్ కౌంటర్ల వద్ద డిజిటల్ సేవలను తీసుకురానున్నట్లు ఎన్‌బీఎస్ఎల్ ఎండీ, సీఈఓ నటరాజన్ తెలిపారు. పర్యాటకులకు సులభంగా ఉండేలా క్యూఆర్ కోడ్‌లనూ అమర్చుతామన్నారు.

అయోధ్య రామాలయ ట్రస్టు అధ్యక్షుడికి తీవ్ర అస్వస్థత

అయోధ్య: అయోధ్య రామాలయ ట్రస్టు అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్(87) అతిసార వ్యాధితో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వైద్యుల సూచన మేరకు ఆయన్ను ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చినట్లు సన్నిహితులు వెల్లడించారు. డయేరియా సంబంధిత సమస్యలతో ఇబ్బందిపడుతూ 36 గంటలుగా నృత్య గోపాల్ దాస్ ఎలాంటి ఆహారం తీసుకోవడం లేదని వ్యక్తిగత వైద్యుడు ఎస్‌కే పాండ్ తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయన్ను లఖ్‌నవూలోని మేదాంత ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించినట్లు తెలిసింది.

సర్కారు నుంచి జవాబు కోరండి

- ప్రజలకు రాహుల్‌గాంధీ పిలుపు

దిల్లీ: అత్యాశ ఒక మహమ్మారిలా దేశ వ్యాప్తమైందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం వాపోయారు. పట్టణ ప్రాంతాల్లో వ్యాప్తి చెందిన క్షీణత ఈ మహమ్మారి కారణంగా తలెత్తిన భయంకర పరిస్థితి అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలు జవాబుదారీతనం డిమాండ్ చేయాలని ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. దిల్లీలో ముబారక్‌పుర్ డాబాస్ ప్రాంతంలోని శర్మ ఎన్‌క్లేవ్‌లో మురుగునీరు పొంగిపొర్లుతుండటంపై ఒక జర్నలిస్టు రూపొందించిన వీడియోను ఆయన తన పోస్టుకు జతచేశారు. "ప్రతి భారతీయుడి జీవితం ఇలాగే దుర్భర నరకంగా మారింది. వ్యవస్థ అధికారంలో ఉన్నవారికి అమ్ముడుపోయింది. వ్యవస్థలో ప్రతి ఒక్కరూ మరొకరిని ప్రశంసిస్తూ అంతిమంగా ప్రజల్ని తొక్కుతున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం డిమాండ్ చేయకుంటే ప్రభుత్వ వైఫల్యాల మురుగు ప్రతి గడపకూ చేరుతుందని రాహుల్ తెలిపారు.

నేడు ఎంజీ నరేగాపై జాతీయ సదస్సు

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో సవరణలు చేయడం ద్వారా ప్రభుత్వం ప్రజల హక్కును కబళిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన ఉపాధి హామీ కూలీలతో తాము గురువారం దిల్లీలో బహిరంగ సంవాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలు ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తారన్నారు.

కాంగ్రెస్ జిల్లాల అధ్యక్షుల శిక్షణలో రాహుల్

కురుక్షేత్ర: హరియాణా, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ జిల్లాల అధ్యక్షులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని బుధవారం పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లాల అధ్యక్షుల కుటుంబ సభ్యులతో ఆయన ముచ్చటించారు. 'సంఘఠన్ సృజన్ అభియాన్'లో భాగంగా ఈ నెల 13 నుంచి 22 వరకూ ఇక్కడ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుల కోసం హరియాణాలోని కురుక్షేత్రలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

ఓటరుగా చేర్చకుంటే తీవ్ర పరిణామాలు

- జాబితాల సవరణ కసరత్తుపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: ప్రత్యేక సమగ్ర సవరణ జాబితాలో ఓటరుగా పేరు చేర్చకుంటే ఆ వ్యక్తులు సమాజపరంగా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఏ సంస్థకూ ప్రశ్నించలేని అధికారమంటూ ఉండదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తుపై ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం తుది విచారణ జరిగింది. ఈసీ తరపున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది విస్తృత స్థాయిలో వాదనలు వినిపించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని నిబంధనల ప్రకారమే సర్ కసరత్తును నిర్వహించాలా, ఆ పరిధిని అతిక్రమించే అధికారం ఈసీకి ఉంటుందా అనే అంశంపై ధర్మాసనం ముందు తీవ్ర సంవాదం జరిగింది. ఓటరు జాబితాలో చోటు దక్కని పౌరులు...సమాజంలో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21, 21(2), 21(3)లలోని నిబంధనలు, వాటి ప్రకారం ఈసీ అధికారాల పరిధిపై న్యాయమూర్తులు ప్రశ్నలు సంధించారు. గురువారం కూడా విచారణ జరగనుంది.

ప్రజాస్వామ్యం బలోపేతానికి అదే కీలకం: సీఈసీ

దిల్లీ: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కసరత్తుపై విపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యం బలోపేతానికి లోపరహితమైన ఓటర్ల జాబితాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. దిల్లీలో బుధవారం ఎన్నికల నిర్వహణ సంస్థల అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. బిహార్‌లో గత ఏడాది విస్తృత సవరణ కసరత్తు అనంతరం రూపొందించిన ఓటర్ల జాబితాపై ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని తెలిపారు. రెండు దశాబ్దాల్లో నిర్వహించిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కచోట కూడా రీపోల్ జరపాల్సిన అవసరం రాలేదని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కూడా ప్రసంగించారు. 70 దేశాలకు చెందిన 100 మంది ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.

నేపాల్ ఎన్నికల బరిలో నలుగురు మాజీ ప్రధానులు

కాఠ్‌మాండూ: నేపాల్‌లో మార్చి 5వ తేదీన జరగనున్న ఎన్నికల్లో మళ్లీ వృద్ధ నాయకులే బరిలో దిగారు. ఏకంగా నలుగురు మాజీ ప్రధాన మంత్రులు పోటీపడుతున్నారు. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యూనిఫైడ్ మార్క్సిస్ట్-లెనినిస్ట్) తరపున 74 ఏళ్ల కేపీ శర్మ ఓలి, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్ సెంటర్) తరపున మరో మాజీ ప్రధాని, 71 ఏళ్ల పుష్ప కుమార్ దహల్ ప్రచండ బరిలో దిగారు. మరో ఇద్దరు మాజీ ప్రధానులైన 72 ఏళ్ల మాధవ్ కుమార్ నేపాల్ (నేపాలీ కమ్యూనిస్టు పార్టీ), 71 ఏళ్ల బాబూరామ్ భట్టారాయ్ (ప్రగతిశీల్ లోక్‌తాంత్రిక్ పార్టీ) పోటీ చేస్తున్నారు. నేపాల్‌లో ఇంకా ఇద్దరు మాజీ ప్రధానులున్నారు. వారిలో నేపాలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడైన ఝలానాథ్ ఖానల్ స్వచ్ఛందంగా పోటీ నుంచి తప్పుకోగా, నేపాలీ కాంగ్రెస్ నాయకుడైన షేర్ బహదూర్ దేవ్‌బా పోటీ చేయాలనుకున్నా పార్టీలోని యువ నాయకులు వ్యతిరేకించడంతో మిన్నకుండిపోయారు. బరిలో దిగాలని ఉవ్విళ్లూరిన దేవ్‌బా భార్య ఆర్జూ రాణా కూడా పోటీకి దూరంగా ఉండిపోయారు. మాజీ ప్రధానులే కాదు.. మాజీ మేయర్లూ ఈసారి రంగంలో ఉన్నారు. వారిలో చెప్పుకోదగిన నేత కాఠ్‌మాండూ మాజీ మేయర్ బాలేంద్ర షా బాలెన్. నేపాల్ పార్లమెంటులో 275 సీట్లుంటే వాటిలో 165 సీట్లకు ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతిలో, మిగిలిన 110 సీట్లకు దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో పోలింగ్ జరుగుతుంది.

వాయు కాలుష్యం నియంత్రణపై కార్యాచరణ ప్రణాళిక ఇవ్వండి

- కేంద్రం, దిల్లీ ప్రభుత్వాలకు 4 వారాల గడువు విధించిన సుప్రీంకోర్టు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రంగా స్పందించింది. కాలుష్య కోరల్లో చిక్కుకున్న దిల్లీకి ఊపిరి పోయడానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇందులో భాగంగా కేంద్రంతో పాటు దిల్లీ ప్రభుత్వానికి స్పష్టమైన గడువు విధించింది. వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) సూచించిన సిఫార్సులను ఎలా అమలు చేస్తారో చెబుతూ, రాబోయే 4 వారాల్లోగా సమగ్రమైన కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కాలుష్య నివారణ చర్యల విషయంలో ఇకపై ఎలాంటి సాకులు, అభ్యంతరాలు వినేది లేదని తేల్చి చెప్పింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీతో కూడిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో గాలి నాణ్యత రోజురోజుకూ దిగజారుతుండటంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. దీనిని అరికట్టడానికి దీర్ఘకాలిక చర్యలు అవసరమని స్పష్టం చేసింది. ఈ కేసులో సీఏక్యూఎం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. దిల్లీలో కాలుష్యం తగ్గించడానికి సీఏక్యూఏ మొత్తం 15 దీర్ఘకాలిక చర్యలను సిఫార్సు చేసిందని తెలిపారు. 'ఈ చర్యలు చాలా ముఖ్యమైనవి. వీటిని అమలు చేయడంలో ఎలాంటి జాప్యం జరగకూడదు' అని ధర్మాసనం పేర్కొంది. 'కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలను దశలవారీగా రోడ్ల నుంచి తొలగించాలి. పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) విధానాన్ని మరింత బలోపేతం చేయాలి. రైలు రవాణా వ్యవస్థను, మెట్రో నెట్‌వర్క్‌ను విస్తరించాలి. ఎలక్ట్రిక్ వాహనాల పాలసీని సవరించి, వాటి వాడకాన్ని పెంచాలి' తదితర సిఫార్సులను సీఏక్యూఎం చేసింది.

నేర విచారణ మధ్యలో మీడియాకు సమాచారం..

సముచిత విధానం రూపొందించండి

- రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: ఓ నేరానికి సంబంధించిన విచారణ కొనసాగుతుండగా దానిపై మీడియాకు సమాచారం అందించడంపై సముచిత విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు కోరింది. ఈ అంశంపై సీనియర్ న్యాయవాది రూపొందించిన మ్యానువల్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. విచారణ కొనసాగుతున్న సమయంలో పోలీసులు మీడియా సమావేశాలు నిర్వహించి నేరాన్ని గురించిన సమాచారం తెలియజేస్తున్న తీరుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతూ జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. పోలీసులు అనుసరించాల్సిన విధివిధానాలపై ఎంతో శ్రమకోర్చి సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ మ్యానువల్ రూపొందించారని కోర్టు ఇటీవల వెలువరించిన ఆదేశాల్లో పేర్కొంది. అయితే ఈ మ్యానువల్‌ను అమలు పరచడంపై రాష్ట్రాలు ఆసక్తి చూపడం లేదని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. తన ఆదేశం కాపీ అందుకున్న మూడు నెలల్లో తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్రాలను ఆదేశించింది. మ్యానువల్‌ను రెండు వారాల్లోగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని న్యాయస్థానం తన రిజిస్ట్రీ కార్యాలయాన్ని నిర్దేశించింది.

అదనపు ప్రత్యేక కోర్టులతో న్యాయవ్యవస్థ బలోపేతం: సుప్రీంకోర్టు

దిల్లీ: దేశంలో అదనపు ప్రత్యేక ట్రయల్ కోర్టుల ఏర్పాటుతో న్యాయవ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దీనివల్ల క్రిమినల్ కేసుల్లో సత్వర విచారణ కోరుతూ కానీ, బెయిల్ వంటి ఉపశమనాల కోసం కానీ నిందితులు సర్వోన్నత న్యాయస్థానానికి రావాల్సిన అవసరం ఉండదని పేర్కొంది. ఐసిస్‌తో సంబంధాలు ఉన్నాయంటూ ఓ వ్యక్తిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) 2021లో నమోదు చేసిన కేసు రోజువారీ విచారణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని ఈ నెల 6న కేంద్రం, దిల్లీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. దీనిపై పురోగతి ఏమిటంటూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీతో కూడిన ధర్మాసనం బుధవారం అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిని ప్రశ్నించింది. ఫిబ్రవరి 10వ తేదీకల్లా ఏ విషయమూ తెలియజేయాలని స్పష్టం చేసింది. అదే రోజు ఈ కేసు విచారణను చేపట్టనున్నట్లు పేర్కొంది.



3న తెరుచుకోనున్న అమృత్‌ఉద్యాన్

దిల్లీ: రాష్ట్రపతి భవన్‌లోని అతి సుందరమైన 'అమృత్ ఉద్యాన్' ప్రజల సందర్శనార్థం ఫిబ్రవరి 3న తెరుచుకోనుంది. మార్చి 31 వరకు సందర్శనకు అందుబాటులో ఉంటుందని రాష్ట్రపతి భవన్ బుధవారం వెల్లడించింది. రాష్ట్రపతి భవన్‌కు సమీపంలో ఉండే గేట్ నంబరు 35 ద్వారా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఇవ్వనున్నారు. ఉద్యానవనం నిర్వహణ నిమిత్తం అన్ని సోమవారాలు సెలవు ఉంటుంది. మార్చి 4న హోలీ సందర్భంగా సెలవు ప్రకటించారు. అమృత్ ఉద్యానవనాన్ని సందర్శించాల

లోక్‌భవన్‌లో త్రిపుర, మణిపుర్, మేఘాలయ అవతరణ వేడుకలు

ఈనాడు, అమరావతి: త్రిపుర, మణిపుర్, మేఘాలయ అవతరణ వేడుకలను బుధవారం విజయవాడలోని లోక్‌భవన్‌లో నిర్వహించారు. 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్'లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొని మాట్లాడారు. ఈశాన్య భారతదేశం ఒక ముఖ్యమైన భాగమని, పర్యాటక రంగానికి ప్రసిద్ధి చెందిందని గవర్నర్ తెలిపారు. మణిపుర్, త్రిపుర, మేఘాలయ అందమైన రాష్ట్రాలని చెప్పారు. అంతకుముందు ఆయా రాష్ట్రాల గవర్నర్ల వీడియో సందేశాలను ప్రదర్శించారు. విజయవాడ పరిసరాల్లోని విద్యాసంస్థల్లో చదువుకుంటున్న త్రిపుర, మేఘాలయ, మణిపుర్‌లకు చెందిన విద్యార్థులు నృత్య ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము, సంయుక్త కార్యదర్శి పీఎస్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

విద్యుత్ టారిఫ్‌పై నేడు, రేపు ఏపీఈఆర్‌సీ బహిరంగ విచారణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) 2026-27 ఆర్థిక సంవత్సరానికి దాఖలుచేసిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికలపై రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) గురు, శుక్రవారాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తోంది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే సమావేశంలో ప్రజాసంఘాలు, భాగస్వామ్య సంస్థలు, ప్రజల నుంచి అభిప్రాయాలను కమిషన్ సేకరించనుంది. సమావేశంలో పాల్గొనేందుకు ఇప్పటికే పలువురు పేర్లు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్నారు. వర్చువల్‌గా పాల్గొనేవారి కోసం అధికారులు వివిధ కార్యాలయాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశారు. విచారణలో పాల్గొన్నవారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు.. డిస్కంల ప్రతిపాదనలను పరిశీలించి 2026-27లో అమలయ్యే విద్యుత్ టారిఫ్‌ను కమిషన్ నిర్ణయించనుంది. ఇప్పటికే తొలివిడత తిరుపతిలో విచారణను కమిషన్ పూర్తిచేసింది. ఈ నెల 27న కర్నూలులో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుంది.

ఇనుప ఖనిజ అన్వేషణ లైసెన్సుకు 7 బిడ్లు

ఈనాడు, అమరావతి: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలోని సాధు కొండ పరిధిలో ఇనుప ఖనిజ అన్వేషణకు కాంపోజిట్ లైసెన్సు మంజూరుకు పిలిచిన టెండర్లలో 7 సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. ఆ ప్రాంతంలో 9 చ.కి.మీ. మేర కాంపోజిట్ లైసెన్స్ కోసం గనుల శాఖ ఈ-టెండర్లు ఆహ్వానించింది. ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ), జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ, పలు ఉత్తరాది సంస్థలు బిడ్లు దాఖలు చేసిన వాటిలో ఉన్నాయి. వీటి సాంకేతిక అర్హత పరిశీలించి, కొద్ది రోజుల్లో టెండర్లు ఖరారు చేస్తామని గనుల శాఖ అధికారులు తెలిపారు. కాంపోజిట్ లైసెన్స్ పొందిన సంస్థ అక్కడ మూడేళ్లలో బోర్లు వేసి ఏయే ప్రాంతంలో, ఎంత మేర ఖనిజం ఉందనేది తేల్చాలి. ఆ తర్వాత ఖనిజం లభ్యత ఉన్న ప్రాంతంలో మాత్రమే లీజు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకు అటవీ సహా అన్ని రకాల అనుమతులు లైసెన్స్ పొందిన సంస్థే తెచ్చుకోవాల్సి ఉంటుంది.

పశువుల ఆరోగ్యం, వ్యాధుల నియంత్రణకు రూ.4.94 కోట్లు

ఈనాడు, అమరావతి: పశువుల ఆరోగ్యం-వ్యాధుల నియంత్రణ కార్యక్రమం(ఎల్‌హెచ్-డీసీపీ) కింద రూ.4.94 కోట్ల విడుదలకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతినిచ్చింది. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులను నిర్దేశిత పథకానికి మాత్రమే వినియోగించాలని, ఇతర అవసరాలకు మళ్లించరాదని స్పష్టం చేశారు.

వ్యాధుల నిర్ధారణ కిట్ల ధరల ఖరారు

ఈనాడు, అమరావతి: పశు వ్యాధుల నిర్ధారణ కిట్ల సరఫరాకు పిలిచిన టెండర్లలో ఖరారు చేసిన ధరలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 27 రకాల వస్తువులను సరఫరా చేసేందుకు ఎల్-1గా నిలిచిన సంస్థలతో పశు సంవర్ధక శాఖ అవగాహన ఒప్పందం చేసుకునేందుకు అనుమతించింది. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెలాఖరు లేదా ఫిబ్రవరి తొలివారంలో ఈ ఒప్పందం జరగనుంది. ఆ వెంటనే కిట్లు క్షేత్రస్థాయిలో పశువైద్యశాలల్లో అందుబాటులోకి రానున్నాయి.

కుక్కల సంహారం.. వివాదం సుప్రీంకోర్టుకు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలో సింబయాసిస్ యూనివర్సిటీ, పరిసర ప్రాంతాల్లో ఒకే రోజు 40 కుక్కలను చంపిన సంఘటనలో జోక్యం చేసుకోలేమంటూ ఆ రాష్ట్ర హైకోర్టు స్పష్టం చేసింది. శునకాలకు సంబంధించిన అంశాన్ని సుప్రీంకోర్టు విచారిస్తున్నందున ఈ పిటిషన్‌ను అక్కడికి బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. కుక్కల మృతి ఘటనలో బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని న్యాయవాది వి.రిషిహాస్‌రెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. కుక్కలను చంపినట్లు ఆధారాలు ఏమున్నాయి? పత్రికలు, సామాజిక మాధ్యమాల్లోనివి కాకుండా యూనివర్సిటీ విద్యార్థులు అఫిడవిట్ ఇస్తారా? అంటూ ప్రశ్నించింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టుకు బదిలీ చేస్తున్నామంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

భయంతో షేర్లను అమ్మేస్తున్నారా?

స్టాక్ మార్కెట్ పతనమైనప్పుడు భయంతో షేర్లను అమ్మేసేవారు అసలు ఇన్వెస్టర్లే కాదు. కంపెనీల స్థితిగతులను పూర్తిగా అధ్యయనం చేశాకే ఆయా షేర్లను కొనుగోలు చేసినవారు మార్కెట్ ఒడిదుడుకుల్లో ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉంటారు. వీలుంటే తక్కువ ధరకు మరికొన్ని షేర్లను తమ ఖాతాలో జమ చేసుకుంటారు. దీర్ఘకాలంలో వారు చక్కటి రాబడి అందుకుంటారు.

– వీటర్ లించ్, ఇన్వెస్టర్

డ్వాక్రా సంఘాలకు వైకాపా మకిలి

- 2019-24 మధ్య 318 బోగస్ సంఘాల సృష్టి
- అప్పట్లో కొన్ని బయటపడినా పట్టించుకోని వైనం
- రూ.38 కోట్ల దుర్వినియోగం
- తాజాగా ప్రభుత్వ తనిఖీలో వెలుగులోకి

ఈనాడు, అమరావతి: మహిళలకు ఆర్థిక స్వావలంబనలో దేశానికే తలమానికంగా నిలిచిన డ్వాక్రా సంఘాలకు వైకాపా ప్రభుత్వం మకిలి అంటించింది. అప్పట్లో సభ్యులకు తెలియకుండా వారి పేర్లతో బోగస్ సంఘాలు సృష్టించి బ్యాంకు లింకేజీ రుణాల్లో కొందరు రూ.కోట్లు దండుకున్నారు. ఇలా 2019-24 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 318 బోగస్ సంఘాలు ఏర్పాటు చేసి రూ.38 కోట్లు కాజేసినట్లు తాజాగా ప్రభుత్వ తనిఖీలో బయటపడింది. అనకాపల్లి, ప్రకాశం, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తిరుపతి జిల్లాల్లో ఈ తరహా సంఘాలు ఎక్కువగా నమోదయ్యాయని అధికారులు గుర్తించారు. వీటి ఏర్పాటు గురించి అప్పటి వైకాపా సర్కారు దృష్టికి వెళ్లినా పట్టించుకోలేదు. అవినీతి తంతు యథేచ్ఛగా కొనసాగింది. కూటమి అధికారంలోకి వచ్చాక డ్వాక్రా సంఘాల్లోని మహిళలెవరూ ఆందోళన చెందకుండా పొదుపు సంఘాల పరపతి పెరిగేలా పారదర్శక విధానాన్ని తీసుకొచ్చింది.

వేర్వేరు ప్రాంతాలకు చెందిన మహిళలు సభ్యులుగా..

బోగస్ సంఘాల ఏర్పాటులో బ్యాంకు అధికారులతో పాటు స్థానికంగా ఉన్న యూనిమేటర్,'వెలుగు' సిబ్బంది చేతులు కలిపి వ్యవహారాన్ని నడిపించారని తేలింది.

- వేర్వేరు గ్రామాలు, మండలాలకు చెందిన డ్వాక్రా మహిళల ఆధార్‌కార్డులను సేకరించి పది మంది చొప్పున బోగస్ సంఘంగా ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు.
- సంఘాలకు రెగ్యులర్‌గా రుణాలు మంజూరయ్యే సమయంలోనే ఒకటి కంటే ఎక్కువగా ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు తీసుకున్నారు. వాటిని బోగస్ సంఘాల ఏర్పాటుకు వినియోగించారు.
- తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా రూ.10 వేలు, రూ.5 వేల వరకు బ్యాంకుల నుంచి ఇప్పిస్తామని చెప్పి కొందరి నుంచి ఆధార్‌కార్డులు సేకరించి వాటితో కొన్నిచోట్ల బోగస్ సంఘాలు ఏర్పాటు చేశారు.
- కొన్నిచోట్ల ఒక బ్యాంకులో ఉండే గ్రూప్‌లోని సభ్యులకు తెలియకుండా మరో బ్యాంకులో అదే గ్రూప్ పేరుతో రుణాన్ని తీసుకుని సొంత ఖాతాల్లోకి మళ్లించారు.
- డేటా బేస్‌లో ఆ వివరాలు నమోదు కాకుండా జాగ్రత్తపడ్డారు.బోగస్ గ్రూప్‌ల పేరుతో రుణాలు పొందినా...అవి ఎన్‌పీఏలు కాకుండా రెండు, మూడు నెలలకు కొంత చెల్లిస్తూ నెట్టుకొస్తున్నవీ ఉన్నాయి.
- అనుమానం రాకుండా గ్రామాల్లోని సభ్యురాళ్ల పేరుతో పట్టణాల్లో బోగస్ సంఘాలు ఏర్పాటు చేశారు.
- కొన్ని చోట్ల మొత్తం సంఘాన్ని సృష్టించకుండా అప్పటికే ఉన్న సంఘంలో ఇద్దరు, ముగ్గురి పేర్లను చేర్చి బ్యాంకుల నుంచి అక్రమంగా రుణాలు పొందారు.
- ఇలా అప్పట్లో అక్రమంగా రుణాలు పొందిన వారి నుంచి రికవరీకి సెర్ప్ అధికారులు చర్యలు చేపట్టారు.

యూనిక్ ఐడీ నంబర్ ఆధారంగానే రుణ మంజూరు..

కేంద్ర మార్గదర్శకాల ప్రకారం బ్యాంకుల నుంచి రుణం తీసుకునే ప్రతి సంఘానికీ జాతీయ జీవనోపాధుల కార్యక్రమం(ఎన్ఆర్ఎల్ఎం) కింద జారీ చేసే యూనిక్ ఐడీ నంబర్ ఉండాలి. ఆ సంఘంలోని ప్రతి సభ్యురాలికీ ప్రత్యేక ఐడీ నంబర్‌ను ఇస్తారు. ఈ నంబర్ కేటాయింపు లేకుండానే గతంలో సంఘాలను ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేశారు. ఇక్కడే బోగస్ సంఘాలకు బీజం పడింది. దీన్ని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రతి ఎస్‌హెచ్‌జీకి ఒక యూనిక్ ఐడీ నంబర్ కేటాయింపు తప్పనిసరి చేసింది. సభ్యురాళ్లకు కూడా వారి ఐడీ నంబర్ ఆధారంగానే రుణాలు మంజూరు చేయాలని స్పష్టం చేసింది. ఫలితంగా ఏ సభ్యురాలు ఎంత రుణం తీసుకున్నారనే వివరాలు ఆ సంఘంలోని మిగతా సభ్యులకు తెలియనుంది. ఈ రుణ మంజూరు డిజిటల్ మైక్రోక్రెడిట్ ప్లాన్‌లో నమోదు చేయాలని ఆదేశించింది.

రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి దిశానిర్దేశం చేసేలా 'కృషి రోడ్ మ్యాప్'

కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ అధికారుల సమావేశంలో చర్చ

ఈనాడు, అమరావతి: వచ్చే మూడేళ్లలో 6 లక్షల హెక్టార్ల విస్తీర్ణాన్ని అదనంగా ఉద్యాన పంటల సాగులోకి తీసుకురానున్నట్లు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ వివరించారు. రైతు ఆదాయ పెంపు, విలువ జోడింపు లక్ష్యంగా వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక మార్పులు చేపడుతున్నట్లు తెలిపారు. మంగళగిరిలోని వ్యవసాయశాఖ డైరెక్టరేట్‌లో బుధవారం 'కృషి రోడ్ మ్యాప్'పై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్‌కుమార్ అగర్వాల్, ఐకార్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఉద్యాన) డాక్టర్ సంజయ్‌కుమార్ సింగ్, వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలాని సమూన్, పలువురు కేంద్ర, రాష్ట్ర అధికారులు దీనికి హాజరయ్యారు. స్థూల విలువ జోడింపులో 15శాతం వృద్ధి సాధన లక్ష్యంగా అమలు చేస్తున్న కార్యక్రమాల్ని రాజశేఖర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కేంద్ర అధికారులకు వివరించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి దిశానిర్దేశం చేసేలా కృషి రోడ్ మ్యాప్‌ను రూపొందించామన్నారు. ఏపీకి కేంద్రం నుంచి అన్ని విధాల సహకారం అందుతుందని.. విలువ ఆధారిత పంటల సాగుతోపాటు కేంద్ర, రాష్ట్రాల సమన్వయం ఎంతో కీలకమని సంజయ్‌కుమార్ అగర్వాల్ ఈ సందర్భంగా చెప్పారు. కేంద్ర బృందం గురువారం ఏలూరు జిల్లాలో పర్యటించనుంది.

ప్రజల భాగస్వామ్యంతోనే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు

- విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైకాపా కుట్ర
- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలోని నీరుకొండలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి ట్రస్ట్ ద్వారా విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొస్తున్నారని తెలిపారు. ప్రజాధనాన్ని ఎక్కడా దుర్వినియోగం చేయడం లేదని వెల్లడించారు. ఫేక్ ఎకౌంట్ల ద్వారా కుల, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైకాపా కుట్రపూరిత రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. జగన్ మాదిరిగా ప్రచార యావ కోసం రూ.వేల కోట్లు దుర్వినియోగం చేయడం కూటమి ప్రభుత్వంలో ఉండదని తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. 'బడుగు బలహీనవర్గాల కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్. ఆయన విగ్రహాన్ని ప్రజల భాగస్వామ్యంతోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది' అని మంత్రి తెలిపారు. వైకాపా హయాంలో పట్టాదారు పాస్‌పుస్తకాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, సర్వే రాళ్లు, విద్యార్థులకు ఇచ్చే స్కూల్ బ్యాగ్‌లపై తన ఫొటో పెట్టుకున్న ఘనుడు జగన్. ప్రభుత్వ కార్యాలయాలనైనా వైకాపా రంగులు వేయించారు. ఐదేళ్లలో ఎన్నో అక్రమాలు జరిగాయి. ఒక్కొక్కటిగా అవి వెలుగు చూస్తున్నాయి. త్వరలో మరికొందరు గజదొంగల వివరాలు బయటకు రానున్నాయి. వీరందరి విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని వివరించారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధికి చిరునామాగా ఏపీ

20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్

ఈనాడు, దిల్లీ: డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చిరునామాగా మారుతోందని 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. భాజపా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ నబీన్‌ను దిల్లీలో బుధవారం ఆయన కలిసి అభినందించారు. అనంతరం ఏపీభవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా సహకరిస్తోందని, దానివల్ల ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. గత 18 నెలల్లో రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు రావడం శుభసూచకమన్నారు. ప్రస్తుతం దావోస్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. 2019-24 మధ్యకాలంలో పెట్టుబడులు అంటే అనధికారిక మద్యం వ్యాపారం కోసం జగన్ చుట్టూ ఉన్న కోటరీ చేసిన నిర్వాకాలు, భూ ఆక్రమణలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారం తప్పితే మరోటి కనిపించేది కాదని విమర్శించారు.

నితిన్ నబీన్‌కు అభినందనలు తెలుపుతున్న లంకా దినకర్

దేశంలో అంతర్గత జల రవాణాకు ప్రోత్సాహం

- దృష్టి పెట్టిన కేంద్రం
- 23న కేరళలో ఐడబ్ల్యూడీసీ సమావేశం
- ఏపీ ప్రాజెక్టులపై చర్చ

ఈనాడు, అమరావతి: అంతర్గత జల రవాణాలో (ఐడబ్ల్యూటీ) సాధించిన అభివృద్ధి.. భవిష్యత్తు లక్ష్యాలను సమీక్షించేందుకు ఈ నెల 23న కేరళలోని కొచ్చిలో ఇన్‌లాండ్ వాటర్‌వేస్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఐడబ్ల్యూడీసీ) మూడో సమావేశాన్ని నిర్వహిస్తోంది. అంతర్గత జల రవాణా రంగం సామర్థ్యం, ప్రయోజనాలను అంచనా వేయడంతో పాటు.. భవిష్యత్తు వృద్ధి, విస్తరణకు సంబంధించి స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సమావేశంలో రూపొందించనున్నారు. దీని కోసం వివిధ రాష్ట్రాల్లో అంతర్గత జల రవాణా అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులు చర్చిస్తారు. ఐడబ్ల్యూటీ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసేలా ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. పట్టణ జల రవాణా వ్యవస్థ నిర్మాణం, సరకు రవాణా సామర్థ్యాన్ని పెంచడం, ప్రయాణికుల కోసం హరిత నౌకల ఏర్పాటు, నదీ క్రూయిజ్ పర్యాటకాన్ని అభివృద్ధి చేయడం వంటి అంశాలపై ఐడబ్ల్యూడీసీ 3.0లో సెషన్లు నిర్వహిస్తోంది. సమావేశంలో కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, సహాయ మంత్రి శంతను ఠాకూర్ పాల్గొంటారు. రాష్ట్రం తరపున మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతారు.

ఏటా 145 మిలియన్ టన్నుల సరకు రవాణా

దేశంలో అంతర్గత జలమార్గాల ద్వారా ఏటా సుమారు 145 మిలియన్ టన్నుల సరకు రవాణా జరుగుతోంది. రోడ్డు, రైలు రవాణాపై ఒత్తిడి తగ్గించేందుకు జలవాహక్ పథకం కింద సరకు, ప్రయాణికుల రవాణాను కేంద్రం ప్రోత్సహిస్తోంది. 'జల్ సమృద్ధి' పథకం కింద ప్రైవేటు ఆపరేటర్లను కేంద్రం ప్రోత్సహిస్తోంది.

- రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నదుల ద్వారా అంతర్గత సరకు రవాణా గణనీయంగా పెరిగింది. తక్కువ దూరంలో కార్గో కార్యకలాపాల కోసం ముక్త్యాల, హరిశ్చంద్రపురం దగ్గర టెర్మినల్స్‌ను అభివృద్ధి చేస్తోంది. రాష్ట్రంలోని గోదావరిలో క్రూయిజ్ పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ఆరు చోట్ల పంటులను ఏర్పాటు చేస్తోంది. ఏపీలో అంతర్గత జల రవాణా, పర్యాటక అభివృద్ధిపై ఐడబ్ల్యూడీసీ 3.0 దృష్టి పెట్టనుంది.

అంతరిక్ష విజ్ఞానంతో ప్రపంచ సంక్షేమం

- భారతీయ తొలి వ్యోమగామి రాకేశ్ శర్మ

ఈనాడు, హైదరాబాద్: అంతరిక్ష విజ్ఞానం, సాంకేతికత.. ప్రపంచ సంక్షేమం, సుస్థిరాభివృద్ధి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి శక్తిమంతమైన సాధనాలుగా ఉపయోగ పడతాయని భారతీయ తొలి వ్యోమగామి రాకేశ్ శర్మ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) 84వ వ్యవస్థాపక దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజయ్యారు. 'భూగ్రహంపై మానవ నాగరికత ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై ప్రసంగించారు. ప్రకృతితో కలిసి జీవించే భారతీయ పురాతన వారసత్వాన్ని గుర్తు చేస్తూ.. ప్రపంచమంతా ఒకే కుటుంబం అనే తత్వమే సైన్స్, అంతరిక్ష అన్వేషణకు మార్గదర్శకం కావాలన్నారు. 'భూమి ప్రతి ఒక్కరి అవసరాలను తీర్చగలదు.. కానీ ఎవరి దురాశను సంతృప్తి పరచలేదు' అన్న మహాత్మాగాంధీ మాటలను గుర్తు చేశారు. డాక్టర్ విక్రం సారాభాయి వంటి దార్శనికుల దూరదృష్టిని ప్రస్తావిస్తూ.. అంతరిక్ష సాంకేతికత అనేది టెలి మెడిసిన్, టెలి ఎడ్యుకేషన్ వంటి సేవల ద్వారా సామాన్యుడికి చేరువ కావాలని ఆకాంక్షించారు. ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్ మాట్లాడుతూ.. రాకేశ్ శర్మ అంతరిక్షం నుంచి పలికిన 'సారే జహాసే అచ్ఛా.. హిందుస్థాన్ హమారా' అనే మాటలు ఇప్పటికీ తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు.

ఏపీపై ఒత్తిడి తెచ్చేలా..!

- పునర్విభజనకు ముందు చేపట్టిన ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల కోసం ఒప్పించేలా చర్చించాలని నిర్ణయం
- తెలంగాణ నీటిపారుదల శాఖ కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: పునర్విభజనకు ముందు రాష్ట్రంలోని ప్రాజెక్టులకు నాటి ప్రభుత్వం ఇచ్చిన నీటి కేటాయింపులకు ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉండేలా ఒత్తిడి తేవాలని తెలంగాణ నీటిపారుదల శాఖ కసరత్తు ప్రారంభించింది. పునర్విభజన తర్వాత రాష్ట్రంలో పెరిగిన సామర్థ్యం మేరకు నీటి కేటాయింపుల్ని ట్రైబ్యునల్ నిర్ణయిస్తుందని, పునర్విభజనకు ముందు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన నీటి కేటాయింపులకు మాత్రం ఏపీ అంగీకారం తెలిపేలా ఒత్తిడి తేవాలని నిర్ణయించినట్లు తెలిసింది. రెండు రాష్ట్రాలకు మధ్య జలవనరులకు సంబంధించిన అంశాలపై కేంద్ర జలసంఘం ఛైర్మన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ మొదటి సమావేశం ఈ నెల 30న జరగనుంది. ఈ సమావేశం.. ఎజెండా ఖరారుకే పరిమితమయ్యే అవకాశం ఉన్నా, పునర్విభజనకు ముందు జీవోలు ఇచ్చి.. చేసిన కేటాయింపుల విషయంలో మొదట ఓ అంగీకారానికి రాగలిగితే పాలమూరు-రంగారెడ్డితో సహా కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవచ్చనే అభిప్రాయంతో ప్రభుత్వం ఉందని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి.

పునర్విభజనకు ముందు దేనికి ఎన్ని టీఎంసీలంటే...

పునర్విభజనకు ముందు కల్వకుర్తిని 25 టీఎంసీలు, నెట్టెంపాడు 22 టీఎంసీలు, ఎస్.ఎల్.బి.సి. 30 టీఎంసీలు, కోయిల్‌సాగర్‌ని 3.9 టీఎంసీలతో చేపట్టారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జూరాల నుంచి నీటిని తీసుకొనేలా 70 టీఎంసీలతో, కొడంగల్ ఎత్తిపోతలను 7.1 టీఎంసీలతో, డిండి ఎత్తిపోతలను 30 టీఎంసీలతో చేపట్టేందుకు పునర్విభజనకు ముందే అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పునర్విభజనకు ముందు పనులు చేపట్టిన, ఉత్తర్వులిచ్చిన ప్రాజెక్టుల సామర్థ్యం 188 టీఎంసీలు. తర్వాత వీటి సామర్థ్యం 304 టీఎంసీల వరకు పెరిగింది. మొదట 188 టీఎంసీలపై ఆంధ్రప్రదేశ్ సానుకూలత వ్యక్తం చేస్తే, తర్వాత పెరిగిన సామర్థ్యం మేరకు కేటాయింపుల గురించి ట్రైబ్యునల్‌లో తేల్చుకోవచ్చని నీటిపారుదల శాఖ వర్గాలు తెలియజేస్తున్నాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి వద్ద జరిగిన సమావేశంలో కూడా ఇదే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఎస్.ఎల్.బి.సి. మినహా మిగిలిన ప్రాజెక్టులకు ఇన్వెస్టిగేషన్‌కు మాత్రమే నాడు జీవోలు ఇచ్చారని ఏపీ పేర్కొంటోంది. దీని ప్రకారం 81 టీఎంసీల సామర్థ్యం గల ప్రాజెక్టులు మాత్రమే ఉంటాయి. ఇందులో కోయిల్‌సాగర్‌కు బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపులున్నందున, 77 టీఎంసీల గురించి మాత్రమే ఏపీ మాట్లాడుతోందని నీటిపారుదల శాఖ వర్గాలు వివరిస్తున్నాయి. అయితే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రధాన లక్ష్యంగా ఒత్తిడి చేయాలనే ఆలోచనతో తెలంగాణ ఉన్నట్లు తెలుస్తోంది.

ఏపీలో కూడా...: ఆంధ్రప్రదేశ్‌లో హంద్రీనీవా, గాలేరు-నగరి, వెలిగొండ, తెలుగుగంగ ప్రాజెక్టులకు కేటాయింపులు లేవు. వీటి సామర్థ్యం 150.5 టీఎంసీలు. తెలుగుగంగకు బ్రిజేష్ ట్రైబ్యునల్ 25 టీఎంసీలు కేటాయించినా, ఈ తీర్పు అమలులోకి రాలేదు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల వాదనలు వింటున్న ట్రైబ్యునల్ ముందు ఈ అంశం కూడా ఉంది.

వైకాపా హయాంలో తిరుపతి ఇన్‌ఛార్జ్ పీడీ అధికార దుర్వినియోగం

- తెదేపా గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ పీడీగా ఉన్న సీవీ శ్రీనివాస్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుకూలంగా వ్యవహరించి ఉపాధి హామీ నిధులను పక్కదారి పట్టించారని అదే జిల్లా చిట్టమూరుకు చెందిన వెంకటేశ్ ఆరోపించారు. అప్పట్లో జగనన్న కాలనీల్లో చదును పనులు చేయకుండానే చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టించి పెద్దిరెడ్డి అనుచరులకు సుమారు రూ.60 కోట్లు కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని తెదేపా నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, గౌడ సంక్షేమ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి వినతులు స్వీకరించారు.

- యువగళం పాదయాత్రలో పాల్గొన్నందుకు కక్ష పెంచుకుని వైకాపా నాయకుడు, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వర్గీయులు దాడి చేశారని, దీనిపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కర్నూలు జిల్లా రుద్రవరం గ